www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

గురువారం | 8-2-2018 | పేజీలు: 20 + 16 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 209 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి ఉ. 10.13 తదుపరి నవమి; నక్షత్రం: విశాఖ మ. 2.19 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా. 6.45-8.31; దుర్ముహూర్తం: ఉ. 10.36-11.22, మ.3.09-3.54; అమృతఘడియలు: తె. 5.24 మొదలు; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.11 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

పార్లమెంటు తలుపులు మూసి

విభజించారు

దేశాన్ని విడగొట్టినట్టే ఆంధ్రప్రదేశ్‌ను ముక్కలు చేశారు

రాజకీయ స్వార్థంతో, ఎన్నికల కోసం హడావుడిగా విభజన

- సీమాంధ్రుల మనోభావాలను పట్టించుకోలేదు
- తెలంగాణ ఏర్పాటుకు మేమూ మద్దతిచ్చాం
- తెలంగాణ అభివృద్ధినీ మేం ఆశిస్తున్నాం
- ఏపీకి మాత్రం అన్యాయం జరిగింది
- కాంగ్రెస్ రాజకీయాల వల్లే ఇలా జరిగింది
- ఆంధ్రులను అవమానించడం దానికి అలవాటు
- ఆ ఆగ్రహాగ్ని నుంచే తెలుగుదేశం పార్టీ పుట్టింది
- దళిత నేత అంజయ్యను రాజీవ్ అవమానించారు
- నీలం సంజీవరెడ్డికి వెన్నుపోటు పొడిచారు
- పీవీ నరసింహారావుకు మర్యాదే ఇవ్వలేదు
- నిప్పులు చెరిగిన ప్రధాని నరేంద్ర మోదీ





న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ వేదికగా చెలరేగిపోయారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారన్న ఏపీ నేతల ఆరోపణలపై సవాధానమిచ్చారు. రాష్ట్రవిభజన జరిగిన తీరే సరిగా లేదని.. దేశాన్ని ముక్కలు చేసినట్టే కాంగ్రెస్ పార్టీ హడవుడిగా, ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. పార్లమెంటు తలుపులు మూసి ఏపీని విభజించిందని నిప్పులు చెరిగారు. తెలంగాణ అభివృద్ధిని కోరుకుంటున్నామంటూనే.. తెలంగాణ ఇచ్చిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం లోక్‌సభలో మోదీ ప్రసంగించారు. "ఎన్నికల్లో లబ్ధి కోసం.. హడావుడిగా.. పార్లమెంటు తలుపులు మూసి విభజించారు. అప్పుడు సభ ఆర్డర్‌లో లేదు. ఆంధ్ర ప్రజల మనోభావాలను పట్టించుకోకుండా తెలంగాణ ఏర్పాటు చేసిన పక్షాల్లో మేమూ ఉన్నాం. తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తున్న పార్టీల్లోనూ మేం ఉన్నాం. కానీ, ఆనాడు కేవలం ఎన్నికల దృష్టితో రాష్ట్ర

మిగతా 14వ పేజీలో...

కాంగ్రెస్-ముక్త్ భారత్‌ను గాంధీజీ కోరుకున్నారు 14

- మీరు నాటిన విషమే ప్రజల్ని పీడిస్తోంది.. మీ దోపిడీకి సాక్ష్యాలున్నాయ్
- పటేల్ ప్రధాని అయి ఉంటే కశ్మీర్ మొత్తం దక్కేది.. మేం లక్ష్యసాధకులం
- మీరు ఎమర్జెన్సీ విధించారు.. మేం నవభారతాన్ని నిర్మిస్తున్నాం: మోదీ



ఊరు మొత్తాన్ని తాకట్టు పెట్టారంటూ 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాన్ని ఆసక్తిగా చదువుతున్న కొత్వాల్‌గూడ గ్రామస్థులు

మాల్యాకు తమ్ముడు..

మాయదారి జెనా!

ఖరీదైన కార్లు.. చార్టర్డ్ విమానాలు

అత్యంత విలాసవంతమైన జీవితం

ఊరు తాకట్టుపెట్టిన సౌమిత్ వైభోగం

'ఆంధ్రజ్యోతి' కథనంతో ఉలిక్కిపడ్డ కొత్వాల్‌గూడ



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)

ఇంటి ముందు ఫెరారీ, బెంట్లీ, జాగ్వార్, ఆడి, బెంజ్... లాంటి కార్లు! తరచుగా విదేశీ పర్యటనలు!! చార్టర్డ్ విమానాలు.. హెలికాప్టర్లలో ప్రయాణాలు! సినీ రాజకీయ ప్రముఖులతో పరిచయాలు!! మామూలు మనుషులు కలలో కూడా కనలేనంత విలాసవంతమైన జీవితం! లిక్కర్

మిగతా 12వ పేజీలో...

నెట్‌లో 2 పేపర్లే

- పరీక్ష విధానంలో మార్పులు
- చాయిస్ తీసుకునే చాన్స్ లేదు
- అన్ని ప్రశ్నలకూ మార్కుల గణన 14

మే 23, 24న ఐసెట్

- ఆన్‌లైన్ విధానంలోనే పరీక్షలు 2

రెపో రేట్లు యథాతథం

- తగ్గింపునకు ఆర్‌బీఐ ససేమిరా
- వడ్డీ రేట్లు తగ్గటం కష్టం 9

మరో 14 వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు 8

- ఈజేహెచ్ఎస్ సీఈవో పద్మ

కాంగ్రెస్.. థర్డ్ గ్రేడ్ లోఫర్ పార్టీ

- నరహంతక నీచ చరిత్ర ఆ పార్టీకి ఉంది
- రాహుల్ గాంధీ పప్పు.. ఉత్తమ్ దద్దమ్మ
- కేసీఆర్‌తో పోల్చుకునే స్థాయి ఉత్తమ్‌కు లేదు
- ఆయన శిఖండి రాజకీయం చేస్తున్నారు
- మెదడుంటే ఎన్ని కొలువులిచ్చారో చెప్పాలి
- రాజకీయ సన్యాసం సవాల్‌కు నేను సిద్ధమే
- ఉత్తమ్‌కు దమ్ముంటే ముందుకు రావాలి
- నేను బచ్చానైతే రాహుల్ కూడా బచ్చాయే
- సిరిసిల్లను వీడాల్సిన అవసరం నాకేంటి?
- జాతీయ పార్టీల్లేవు... అన్నీ ప్రాంతీయ పార్టీలే
- లక్ష్మణ్, కిషన్ నియోజకవర్గాలు దాటి రారు

ఇంత దారుణమైన బడ్జెట్‌ను చూడలేదు

- తెలంగాణకు అన్నివిధాలా మొండిచేయి
- కేంద్ర మంత్రులను ఆహ్వానిస్తూనే ఉన్నాం
- కేంద్రానికి ఎక్కువ మర్యాదే ఇస్తున్నాం
- పథకాలను పొగిడి పోవడమే తప్ప
- తెలంగాణకు నిధులు ఇవ్వడమే లేదు
- మోదీ 'ప్రేమ'ను తిరిగి ఇచ్చేందుకు
- రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు

విలేకరులతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 70 సీట్లు వస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న సవాల్‌కు తాను ఎప్పుడూ సిద్ధంగానే ఉంటానని మంత్రి కేటీఆర్ అన్నారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన సవాల్‌ను స్వీకరించకుండా కుటుంబాల వెనుక దాక్కొని శిఖండి రాజకీయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్‌తో పోల్చుకునే స్థాయి ఉత్తమ్‌కు లేదన్నారు. కాంగ్రెస్.. ఓ థర్డ్ గ్రేడ్ లోఫర్ పార్టీ అని, ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్.. పప్పు అని ఆరోపించారు. రాహుల్ నాయకత్వంలో పనిచేస్తున్న ఉత్తమ్.. దద్దమ్మ అని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ దారుణంగా ఉందని, దానిపై బీజేపీ ఎంపీలే

మిగతా 11వ పేజీలో...



 2

ముద్దుకృష్ణమ నాయుడు

కన్నుమూత

- జ్వరానికి చికిత్స పొందుతూ తుది శ్వాస
- స్వగ్రామానికి భౌతిక కాయం తరలింపు
- ఏపీ సీఎం దిగ్భ్రాంతి, ప్రముఖుల నివాళి
- నేడు చిత్తూరు జిల్లాలో అంత్యక్రియలు



వరంగల్ మార్కెట్లో ఆరబెట్టిన పత్తి

పత్తి రైతు

కంట్లో తడి!

తేమ 15% మించితే కొనుగోలు బంద్

- వ్యాపారుల కొత్త నిబంధన
- కాదని కొంటే.. 30వేలు జరిమానా
- సహకరించే అడ్తీదారులకు 11వేలు
- తెలియక మార్కెట్‌కు తెస్తున్న రైతులు
- కొనకపోవడంతో అక్కడే ఆరబోత

వరంగల్ అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పత్తి రైతుకు కొత్త చిక్కు వచ్చింది! తేమ శాతం ఎక్కువగా ఉందంటూ వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేశారు! తేమ 15 శాతం కంటే ఎక్కువ ఉంటే కొనేది లేదని వ్యాపారులు తేల్చి చెబుతున్నారు. దీంతో రైతులు అష్టకష్టాలు పడి తెచ్చిన

మిగతా 8వ పేజీలో...



ప్రజాబలంలో టీఆర్ఎస్‌దే ఆధిక్యం

- కుమారుణ్ని ప్రమోట్ చేస్తున్న కేసీఆర్
- కాంగ్రెస్ ప్రజా విశ్వాసం పొందలేదు
- బలహీనపడిన వామపక్షాల ఐక్యత
- ప్రతికూలతలోనూ మన బలం అలాగే
- సీపీఎం రాజకీయ నివేదికలో వెల్లడి
- రాష్ట్ర కార్యదర్శిగా మళ్లీ తమ్మినేని
- 60 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పాటు

నల్లగొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రజాబలంలో ప్రస్తుతం అన్ని పార్టీల కన్నా టీఆర్ఎస్ ఆధిక్యంలో ఉందని సీపీఎం తన రాజకీయ, నిర్మాణ ముసాయిదాలో పేర్కొంది. సీఎం కేసీఆర్ తన కుమారుడు కేటీఆర్‌ను రాజకీయ వారసుడిగా ప్రమోట్ చేసుకునే

మిగతా 5వ పేజీలో...



శివుని విల్లు విరవడమంటే?

పరంజ్యోతి



రుద్రుడు అనే పదానికి ఏడ్పించువాడు అని ముఖ్యమైన అర్థం. 'రోదయతి ఇతి రుద్రః' అన్నారు. మనిషి తన సుఖమంతా ఏవో వస్తువులపై ఆధారపడిందని వాటికోసం వెంపర్లాడుతుంటాడు. అవి దొరికితే సంతోషిస్తాం, దొరకనప్పుడు బాధపడతాం. ఇది వస్తువుల తప్పు కాదు. మన మనసు, ఇంద్రియాల కోరికల వల్లనే ఆ వస్తువులను కోరుకుంటాం. మనిషిని ఏడిపించేవి మనసు, ఇంద్రియాలేనని బృహదారణ్యక ఉపనిషత్తు చెబుతుంది. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, వీటన్నింటికీ అధిపతి మనసు. ఈ పదకొండింటినీ కలిపి ఏకాదశ రుద్రులు అన్నారు. వీటికి సుఖం కలిగితే మనిషి సంతోషంగా ఉంటాడు లేకుంటే రోదిస్తుంటాడు. ముసలితనంలో ఇంద్రియాలు క్షీణించినప్పుడు అవే మనల్ని ఏడ్పిస్తుంటాయి. ఈ రుద్రులు.. అంటే ఇంద్రియాలు, మనసు ప్రశాంతంగా ఉన్న రూపమే శాంతరూపం లేదా శివస్వరూపం. అలజడి చెందిన మనసు, కోరికలతో పీడింపబడే ఇంద్రియాలు ఉంటే అది ఘోరరూపం. అందుకే రుద్రుడికి ఘోర, అఘోర (శాంత) అనే రెండు రూపాలున్నట్టు రుద్రంలో చూస్తాం. 'నీ ఘోర రూపాన్ని వెనక్కు మళ్లించు, శివ స్వరూపాన్ని చూపించు' అని ప్రార్థిస్తాం. వైదిక సాహిత్యంలో మనసును విల్లుతో పోల్చారు. ఇంద్రియాలే బాణాలు. నీ వింటికి ఉన్న వింటి నారిని సడలించి నీ బాణాల్ని పక్కనపెట్టు అని ప్రార్థిస్తాం. మనసును, ఇంద్రియాల్ని మంచిమార్గంలో పెట్టాలని కోరుకుంటూ చేసే ప్రార్థన ఇది. రాముడు తన వివాహానికి ముందు శివుని విల్లు విరిచాడంటే మనసును, ఇంద్రియాల్ని జయించాడని వేదాంతపరమైన అర్థం. శివుడు కూడా మన్మథుణ్ణి దగ్ధం చేసిన తర్వాత.. అంటే కామాన్ని జయించిన తర్వాతనే పార్వతిని పెళ్లి చేసుకోవడం గమనించాలి. వివాహం కేవలం కామంతో కూడిన సంబంధం కాదనీ ఒక పవిత్రమైన ఒడంబడిక అని దీని అంతరార్థం.

-కె.అరవిందరావు

తెలుగులోనే జీవోలను విడుదల చేయండి

▸ ప్రభుత్వ కార్యదర్శులకు సీఎస్ ఆదేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఉపయోగపడే ముఖ్యమైన ప్రభుత్వ ఉత్తర్వులను ఆంగ్లంతో పాటు తెలుగులోనూ జారీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్య కార్యదర్శులను సీఎస్ జోషి ఆదేశించారు. అందుకు అనువాద శాఖ సాయం తీసుకోవాలని ఆయన నిర్దేశించారు. సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా, వారికి మెరుగైన ఫలితాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలువుతున్న తీరు గురించి జోషి ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు.

మే 23, 24 తేదీల్లో ఐసెట్

▸ ఆన్‌లైన్ విధానంలోనే పరీక్షలు

▸ ఏప్రిల్ 30 వరకు దరఖాస్తుకు చివరి తేదీ

▸ జూన్ 6న ఫలితాలు.. 'ఉర్దూ' లోనూ పరీక్షలు

కేయూ క్యాంపస్(కాళోజీ జంక్షన్), ఫిబ్రవరి 7: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే తెలంగాణ ఐసెట్ -2018ని మే 23, 24 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి తెలిపారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో ఐసెట్ కన్వీనర్ నిర్వహణ కమిటీ సమావేశంలో జరిగింది. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 22న ఐసెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని, మార్చి 6 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఏప్రిల్ 30 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే 5 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, మే 23, 24 తేదీల్లో మూడు సెషన్స్‌లో ఆన్‌లైన్‌లో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉర్దూ మీడియంలోనూ ఐసెట్ నిర్వహించనున్నటు వివరించారు. ఈసారి పరీక్షలకు సుమారు 80 మంది హాజరయ్యే ఆస్కారం ఉందని ఆయన తెలిపారు. సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ, ఐసెట్ చైర్మన్, కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సాయన్న, ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

16 నుంచి 'సినీ' సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు

▸ 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ నిర్మాత డీ రామానాయుడి 18 వర్ధంతి సందర్భంగా ఈనెల 16 నుంచి రెండు రోజుల పాటు సినీ పరిశ్రమ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ రాజా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు రమణాచారిని ఆహ్వానించేందుకు బుధవారం ఆయన సచివాలయానికి వచ్చారు. అనంతరం శివాజీ మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో నాటక రంగం నుంచి సినీరంగానికి వచ్చి స్థిరపడిన నటులు సత్కరిస్తున్నట్లు వివరించారు.

ముద్దు కృష్ణమ కన్నుమూత

తిరుపతి/అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ ముద్దు కృష్ణమ నాయుడు కన్ను మూశారు. గత నాలుగు రోజులుగా తీవ్రమైన డెంగీ జ్వరంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన... మంగళవారం అర్ధ రాత్రి దాటాక 2 గంటల సమయంలో తుది శ్వాస వదిలారు. బుధవారం మధ్యాహ్నం 12.35 గంటలకు ముద్దుకృష్ణమ భౌతిక కాయాన్ని ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి తిరుపతి విమానాశ్రయానికి తరలించారు. అక్కడి నుంచి ఆయన స్వగ్రామమైన చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకట్రామాపురానికి రోడ్డు మార్గంలో తీసుకెళ్లారు. ముద్దు కృష్ణమ కన్నుమూతపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకట్రామపురం వెళ్లి... ముద్దు కృష్ణమ భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు. "ముద్దు కృష్ణమ మృతిని జీర్ణించుకోలేకపోతున్నాను. ఆయన లేని లోటు తీర్చలేనిది" అని తెలిపారు. 'ఆయన నా సహచరుడు. నిరంతరం ప్రజల కోసం పరితపించాడు. ఏగంట తీరిక దొరికినా పది మందితో కలవడం, మాట్లాడడం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఆయన నైజం. తన నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తల ఇళ్లలో ఎలాంటి కార్యక్రమం జరిగినా, సందర్భం ఏదైనా వారి ఇంటికి వెళ్లి పలకరించేవారు. అభివృద్ధి పట్ల ఎనలేని ఆసక్తి కనబరిచేవారు' అంటూ చంద్రబాబు కొనియాడారు. ముద్దుకృష్ణమ భౌతికకాయంపై పుష్పగుచ్ఛంతో పాటు టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమ నాయుడు ఏడాదిన్నర క్రితం గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. ఆ సమయంలో కూడా ఆయన ఎక్కువ రోజులు విశ్రాంతి తీసుకోలేదని, స్వల్ప వ్యవధిలోనే మళ్లీ ప్రజా జీవనంలోకి రావడం వల్ల రెండో సారి గుండెపోటు రావడానికి కారణమైందని జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం సహా ఇటీవల ప్రారంభమైన దళిత తేజం కార్యక్రమంలో సైతం పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఆయనకు జ్వరం వచ్చి ఉంటుందని భావిస్తున్నారు.





గాలి ముద్దు కృష్ణమ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న టీడీపీ టీఎస్ నేతలు

మంత్రులు, నేతల నివాళులు..

నమ్మిన సిద్ధాంతాన్ని ఏనాడూ వదులుకోని నాయకుడు ముద్దుకృష్ణమ అని ఏపీ ఉప ముఖ్యమంత్రులు కేఈ కృష్ణమూర్తి, చినరాజప్పల నివాళులర్పించారు. ఏపీ, తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కళా వెంకట్రావు ఎల్ రమణ, ఏపీ మంత్రులుప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

స్పీకర్, మండలి చైర్మన్ సంతాపం

ఓ ఎమ్మెల్సీగా శాసనమండలిలో ముద్దుకృష్ణమ ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపించారని, ఆయన మృతి తీరని లోటని శాసనమండలి చైర్మన్ ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముద్దుకృష్ణమ మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని, తామంతా ఒకేసారి రాజకీయాల్లోకి వచ్చామని స్పీకర్ కోడెల శివప్రసాదరావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎమ్మెల్సీలు పయ్యావుల కేశవ్, టీడీ జనార్దన్‌రావు, గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ ఎల్వీఎస్ఆర్‌కే ప్రసాద్‌లు ముద్దుకృష్ణమ మృతి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు.





ముద్దుకృష్ణమకు నివాళులర్పించేందుకు తరలివచ్చిన అభిమానులు; ముద్దుకృష్ణమ కుమారులను ఓదారుస్తున్న చంద్రబాబు

నేడు అంత్యక్రియలు

ముద్దుకృష్ణమ భౌతికకాయానికి వెంకట్రామాపురంలో గురువారం మధ్యాహ్నం పూర్తి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. కాగా, ముద్దుకృష్ణమ ఇకలేరన్న సమాచారంతో ఆయన స్వస్థలమైన వెంకట్రామాపురం అభిమానులతో పోటెత్తింది.

ముద్దుకృష్ణమ మృతిని.. జీర్ణించుకోలేకపోతున్నా!

▸ ఆయన లేనిలోటు పూడ్చలేనిది.. సీఎం చంద్రబాబు ఘననివాళి

తిరుపతి/అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): "ముద్దుకృష్ణమ నాయుడి మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. ఆయన లేనిలోటు ఎవ్వరూ పూడ్చలేనిది. ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా నిజమైన నివాళి తెలుపుదాం" అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. డెంగీ జ్వరంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో మంగళవారం అర్ధరాత్రి ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం 12.35 గంటలకు ముద్దుకృష్ణమ భౌతిక కాయాన్ని విమానంలో హైదరాబాద్ నుంచి తిరుపతి విమానాశ్రయానికి తరలించారు. విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు ముద్దుకృష్ణమ స్వగ్రామమైన చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకట్రామాపురానికి ఆయన భౌతికకాయాన్ని రోడ్డుమార్గాన అంబులెన్సులో తీసుకువచ్చారు. సీఎం చంద్రబాబు, ఇతర మంత్రులు వెంకట్రామాపురం చేరుకొని ముద్దుకృష్ణమకు నివాళులర్పించారు.

టీటీడీపీ నేతలతో ముద్దుకృష్ణమ అనుబంధం

▸ ఎన్టీఆర్ భవన్‌లో ఘన నివాళి.. గవర్నర్ నరసింహన్ దిగ్భ్రాంతి

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత కూడా దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు తెలంగాణ టీడీపీ నేతలతో ప్రత్యేక అనుబంధం కొనసాగించారు. గడిచిన నాలుగేళ్లలో ఆయన దాదాపు ప్రతి నెలా నాలుగైదు సార్లు ఎన్టీఆర్‌భవన్‌కు వచ్చి రాష్ట్రపార్టీ నాయకులతో మాట్లాడి వెళ్లి పోయేవారు. ఆయన ఆప్యాయత.. ఆత్మీయత మరచిపోలేం.. అని తెలంగాణ టీడీపీ నేతలు నివాళులర్పించారు. గత ఆరు నెలలుగా తరచూ హైదరాబాద్ వచ్చిన ముద్దుకృష్ణమ పార్టీకోసం తాము చేస్తున్న కృషిని ప్రశంసించేవారని తెలంగాణ టీడీపీ అధ్యక్షులు ఎల్.రమణ గుర్తు చేసుకున్నారు. కాగా, మంగళవారం అర్ధరాత్రి కన్నుమూసిన ముద్దుకృష్ణమ భౌతికకాయానికి మాజీ సీఎం ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి, టీఆర్ఎస్ నేతలు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, టీడీపీ-టీఎస్ నాయకులు ఎల్.రమణ, నామా నాగేశ్వరరావు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, మండవ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు జానారెడ్డి, రేవంత్‌రెడ్డి, ఎన్టీఆర్ తనయులు హరికృష్ణ, రామకృష్ణ, సినీనటులు చలపతిరావు, లక్ష్మీపార్వతి తదితరులు కేర్ ఆసుపత్రికి వెళ్లి ముద్దుకృష్ణమ భౌతికకాయానికి నివాళులర్పించారు. గాలి ముద్దుకృష్ణమ హఠాన్మరణం పట్ల గవర్నర్ నరసింహన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, ముద్దుకృష్ణమ నాయుడు కుటుంబాన్ని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు బుధవారం మధ్యాహ్నం ఫోనుచేసి పరామర్శించారు.



భూదాన్ పోచంపల్లిలో చేనేత కార్మికుడితో మాట్లాడుతున్న గవర్నర్

'పోచంపల్లి ఇక్కత్' అంతర్జాతీయంగా పేరొందాలి

▸ భూదాన్ పోచంపల్లి చేనేత మగ్గాలను సందర్శించిన గవర్నర్

భూదాన్ పోచంపల్లి/చౌటుప్పల్, ఫిబ్రవరి 7: పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ వచ్చేట్లు చేనేత ఉత్పత్తిదారులు ప్రయత్నించాలని, చేనేతల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా కృషి చేస్తానని గవర్నర్ నరసింహన్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం కనుముకుల గ్రామ శివారులోని పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు, పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్‌తో పాటు చేనేత మగ్గాలను గవర్నర్ సందర్శించారు. అనంతరం జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ వికాస్ కౌశల్య యోజన పథకం కింద నిర్వహిస్తున్న వివిధ శిక్షణా తరగతులను పరిశీలించారు. రూరల్ టూరిజం సెంటర్‌లో చేనేత సమభావన మహిళా సంఘాలు, చేనేత నాయకులు, కార్మికులతో సమీక్ష నిర్వహించారు. చేనేత కార్మికులకు నెలకు రూ.15- రూ.20 వేలు అందేట్లు చూడాలని గవర్నర్ అన్నారు. చేనేతలకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించేందుకు ప్రయత్నిస్తానన్నారు. చేనేత కార్మికులకు జియోట్యాగ్ నెంబర్ కల్పించేలా ప్రయత్నిస్తానన్నారు. నిఫ్ట్ విద్యార్థులను పోచంపల్లికి తీసుకొచ్చి చేనేతలో డిజైన్లపై శిక్షణ ఇప్పించాలని అధికారులకు సూచించారు. గ్రామీణ నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్న స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రామానందతీర్థ గ్రామీణ సంస్థ ఆవరణలో గవర్నర్ సతీమణి విమలానరసింహన్‌తో కలిసి తులసి మొక్కను నాటారు. చేనేత వస్త్రాలకు గవర్నర్ నరసింహన్, ఆయన సతీమణి విమలానరసింహన్, కుటుంబ సభ్యులు ఫిదా అయ్యారు. కనుముకులలోని హ్యాండ్లూమ్ పార్క్‌లో కొన్ని పట్టు చీరలు, వస్త్రాలను కొనుగోలు చేశారు.

గ్రామసభ నిర్వహించాకే భూసేకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):సిద్దిపేట జిల్లాలో కొండపోచమ్మ సాగర్ రిజర్వాయరు నిర్మాణం కోసం గ్రామసభ నిర్వహించకుండా భూములను సేకరించడం సరికాదని హైకోర్టు తెలిపింది. భూసేకరణ అధికారి జారీచేసిన డిక్లరేషన్(తుది జాబితా)ను న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి బుధవారం కొట్టివేశారు. గ్రామసభ నిర్వహించి, ప్రజల అభ్యంతరాలపై నిర్ణయం తీసుకున్న తర్వాతే భూసేకరణ ప్రక్రియను కొనసాగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. గ్రామసభ నిర్వహించకుండానే భూసేకరణను చేపట్టడాన్ని సవాల్ చేస్తూ ప్రవీణ్‌కుమార్, మరో 30 మంది రైతులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి ఈ ఆదేశాలు జారీచేశారు.

అనవసర విషయాలు అడగడం స్వేచ్ఛను హరించడమే



ఆర్డర్.. ఆర్డర్

నేరస్థుల సమగ్ర సర్వే పేరుతో మీ న్యాయవాది ఎవరు? అప్పు ఇచ్చిన వడ్డీ వ్యాపారి ఎవరు? ఉంపుడుగత్తె ఎవరు అంటూ అనవసర విషయాలు అడగడం వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయవాది వివరాలు చెప్పాలని కోరడం న్యాయవాదుల చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. సకల నేరస్థుల సర్వేను సవాల్ చేస్తూ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు సీ బద్రీనాథ్‌యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఏవీ శేషసాయి బుధవారం విచారించారు. మారేడుపల్లి ఎస్‌హెచ్‌వో బద్రీనాథ్‌ను ఇటీవల బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లి ఫోటోలు, వేలిముద్రలు ఇతర వివరాలు తీసుకున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది రఘునాథ్ కోర్టుకు చెప్పారు. న్యాయవాది, వడ్డీ వ్యాపారి, ఉంపుడుగత్తె తదితర వివరాలు ఇవ్వాలని ఎస్‌హెచ్‌వో, ఉత్తర మండలం డీసీపీ వేధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ జీపీ, న్యాయాధికారులను సంప్రదించి ఉంటే ఇలాంటి అనవసర వివరాలు అడిగే వారు కాదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించారు.

షఫీక్ కస్టడీ కోసం సీఐడీ పిటిషన్

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడు కేసులో నిందితుడయిన లష్కరే తాయిబా ఉగ్రవాది మహ్మద్ షఫీక్ ముజహర్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ దర్యాప్తు అధికారులు నాంపల్లి కోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. 16 ఏళ్లుగా అజ్ఞాతంలోఉన్న షఫీక్ నుంచి ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం సేకరించాలని, అందుకు 4 రోజులు కస్టడీకి అప్పగించాల్సిందిగా వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. దోహాలో షఫీక్‌ను ఇంటర్‌పోల్ అదుపులోకి తీసుకుని సీఐడీకి అప్పగించింది. సోమవారం అతడిని నాంపల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

వెరిజాన్ ఉద్యోగుల వ్యాజ్యం

అకారణంగా తమను విధుల నుంచి తొలగించారంటూ హైదరాబాద్‌లోని వెరిజాన్ డేటా సర్వీసెస్ కంపెనీకి చెందిన ఎన్.బాలశ్రీధర్ సహా 51 మంది హైకోర్టును ఆశ్రయించారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలని, కార్మిక శాఖ అధికారులను ఆదేశించాలని వారు పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యాన్ని న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు బుధవారం విచారించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి...వివరాలు సమర్పించాలని కార్మిక శాఖ తరపు న్యాయవాదిని ఆదేశించారు.

రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

▸ అన్ని కళాశాలల్లో పేరు నమోదుకు అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లోనూ ఓటర్ల జాబితాలో పేరు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించనుంది. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 9న రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనుంది. ఇందులో పేర్లను నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం బుధవారం ఒక ప్రకటనలో కోరింది. జనవరి-1, 2018 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపింది. ఈ నెల 11న (ఆదివారం) రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నామని వివరించింది. ఇప్పటికే ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది.

ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్

ముసాయిదా జాబితా ప్రకటన	జనవరి 23
అభ్యంతరాల స్వీకరణ	జనవరి 23 నుంచి ఫిబ్రవరి 14
స్పెషల్ క్యాంపెయిన్ తేదీ	ఫిబ్రవరి 11
అభ్యంతరాల పరిష్కారం	మార్చి 5 వరకు
అప్‌డేషన్ ప్రక్రియ పూర్తి	మార్చి 15
తుది జాబితా ముద్రణ	మార్చి 22
తుది జాబితా ప్రకటన	మార్చి 24

10న ఏపీకి హైకోర్టు బిల్డింగ్ కమిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు విభజన దిశగా మరో అడుగు పడింది. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో హైకోర్టు విభజనకు మూడు వేర్వేరు కమిటీలు వేసిన సంగతి తెలిసిందే. ఏపీ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయనున్న నూతన హైకోర్టుకు సంబంధించి తాత్కాలిక భవనాల పరిశీలనకు నియమించిన బిల్డింగ్ కమిటీ ఈ నెల 10,11 తేదీల్లో (శని, ఆదివారం) రాష్ట్రంలో పర్యటించనుంది.

లోకం తీరు




వాళ్లు తలుపులు మూసి విభజించారు సరే... నాలుగేళ్లు తలుపులు తెరిచి మనం మాత్రం ఏమి చేశామని అడుగుతున్నారు సార్...!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	13.0	30.6
రామగుండం	18.0	30.6
హైదరాబాద్	15.9	30.0
సంగారెడ్డి	17.0	29.0
వరంగల్	18.6	29.1

శ్రీవారి దర్శనానికి 10గంటలు

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సుమారుగా ఉంది. దాదాపు 65వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి 10గంటలు, దివ్యదర్శనానికి సుమారు 2గంటల సమయం పడుతోంది. శుక్రవారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో గురువారం లాటరీ ద్వారా జారీచేసే కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25, వస్త్రాలంకరణ:3, అభిషేకం:10టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి.



రాజకీయ ఆశల్లేవు

రాజకీయాల్లోకి రాను గాక రాను. గతంలో ఓ సారి ఇదే చెప్పా. నా దేశం సురక్షితంగా ఉండాలనేదే నా ఆకాంక్ష. అంతే తప్ప రాజకీయంగా ఎలాంటి ఆశల్లేవు. దేశానికే నా జీవితం అంకితం. రాజకీయాల్లోకి వచ్చేది లేదని భీష్మ ప్రతిజ్ఞ చేస్తున్నా.

- యోగా గురు బాబా రాందేవ్



ముస్లింలు ఇక్కడెందుకుంటున్నారు?

ముస్లింలు భారత్‌లో నివసించకూడదు. వారి జనాభా ఆధారంగా దేశాన్ని విభజించారు. అలాంటప్పుడు వారిక్కడెందుకు ఉంటున్నారు? వారికి ప్రత్యేక దేశం ఏర్పాటు చేశారు కదా? ముస్లింలు పాకిస్థాన్ లేదా బంగ్లాదేశ్ వెళ్లిపోవాలి.

- బీజేపీ ఎంపీ వినయ్ కటియార్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.77.71	పాత ధర 69.77
కొత్త ధర రూ.77.70	కొత్త ధర 69.70
తగ్గుదల : 1 పైస	తగ్గుదల: 7 పైసలు



బాల్డ్ హెడ్‌పై బోల్డు హెయిర్

టోక్యో, ఫిబ్రవరి 6: బట్టతలపై జుత్తును మొలిపించే కొత్త విధానాన్ని జపాన్ సైంటిస్టులు అభివృద్ధి చేశారు. తమ కొత్త థెరపీతో రికార్డు స్థాయిలో జుత్తు తిరిగి పెరుగుతుందని చెబుతున్నారు. ఇందులో భాగంగా కుదుళ్ల నుంచి జుత్తును పెరిగేలాజేసే రెండు రకాల కణాలను సిలికాన్ కంటైనర్లలో ప్రవేశపెడతారు. ఈ ప్రక్రియ ద్వారా కొద్ది రోజుల్లోనే 5 వేల వెంట్రుకలను మొలిపించామని జపాన్‌లోని యొకహామా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ జంజీ ఫుకుడా తెలిపారు. ప్రస్తుతం ఎలుకలపై పరిశోధనలు జరుగుతున్నాయి. మరో ఐదేళ్లలో మనుషులపై కూడా పరీక్షలు జరుగుతాయి. బట్టతల ఉన్నవారితోబాటు.. క్యాన్సర్ కారణంగా జుత్తును కోల్పోయిన రోగులకు తమ టెక్నాలజీ ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పరిశోధనలకు డై మిథైల్ పోలిసిలోక్సేన్ అనే సిలికాన్ ఉపయోగిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో చేసే ఆయిల్ ఫ్రైలలో దీనిని ఉపయోగిస్తారని ప్రచారం జరుగుతోంది. 'నా జుత్తు పెరగాలంటే రోజూ ఎన్ని ఫ్రైస్ తినాలని అడుగుతున్నారు. ఇది బాధాకరం. ఫ్రైస్ తింటే జుత్తు పెరగదు' అని ఫుకుడా వ్యాఖ్యానించారు. మరో పదేళ్లలో తమ పరిశోధనలు పూర్తై.. బట్టతల సమస్య తీర్చే అత్యాధునిక చికిత్స అందరికీ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు.



గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ

మేడారంలో తిరుగు వారం పండుగ

మేడారం, ఫిబ్రవరి 7 : జయశంకర్ జిల్లా, తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం తిరుగువారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. కన్నెపల్లిలోని సారలమ్మ, మేడారంలోని సమ్మక్కతల్లి దేవాలయాలను పూజారులు శుభ్రపరిచి పూజా సామగ్రిని శుద్ధిచేయగా ముత్తయిదువులు ముగ్గులు వేశారు. పూజారులు కుటుంబసమేతంగా నూతన వస్త్రాలు ధరించి వనదేవతలకు పూలు, పండ్లు, కొబ్బరి కాయలు, బెల్లం(బంగారం), పసుపు, కుంకుమ, బలి మొక్కులకై మేకలతో డోలువాయిద్యాల నడుమ దేవాలయాలకు చేరుకున్నారు. వనదేవతలకు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సమ్మక్క పూజారులు చిలుకలగుట్టకు చేరుకుని తల్లీ చల్లగా చూడాలని, ఏమైనా పొరపాట్లు జరిగితే క్షమించని వేడుకున్నారు. ఈతరుణంలో ఎదుర్కోళ్ల వద్ద మొక్కుకుని గద్దెలకు చేరుకుని దేవతల గద్దెలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సమ్మక్క పూజారులు సిద్దబోయిన మునీందర్, అరుణ్, స్వామి, వసంతరావు, మల్లెల ముత్తయ్య, కొక్కెర కృష్ణయ్య, పూర్ణచందర్, జనార్ధన్, సారలమ్మ పూజారులు కాక సారయ్య, కిరణ్, వెంకన్న, భుజంగరావు, సోలెం వెంకన్న, గొంది లక్ష్మయ్యతోపాటు వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



భృంగి వాహనంపై ఊరేగుతున్న మల్లన్న

భృంగి వాహనంపై మల్లన్న

శ్రీశైలం, ఫిబ్రవరి 7: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీశైల మల్లికార్జున స్వామి భ్రమరాంబ సమేతుడై భృంగి భుజస్కందాలపై ఊరేగాడు. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు నుంచి వాహనసేవలు, గ్రామోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో భృంగి వాహనాన్ని వివిధ రకాల సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అధిష్ఠింపజేసి ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక అర్చనలు, హారతి పూజలు నిర్వహించారు. తదుపరి క్షేత్రమాడ వీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నంది మండపం వరకు.. తిరిగి అక్కడి నుంచి వీరభద్రస్వామి ఆలయం దాకా కొనసాగింది.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

కారేపల్లి/మహాముత్తారం, ఫిబ్రవరి 7: అప్పుల బాధతో బుధవారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం కొత్తూరు తండాకు చెందిన సపవత్ సర్వన్ (44) ఆరెకరాల్లో పత్తి, మిర్చి సాగు కోసం అప్పులు చేసి రెండు సార్లు బోర్లు వేయించాడు. నీరు పడకపోవడం, పంటలు ఎండిపోతుండటంతో మనోవేదన చెందాడు. రూ.4లక్షల అప్పులు తీర్చే మార్గంలేక బుధవారం పొలంలో పురుగు మందు తాగాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం జీలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కౌలు రైతు పోలం రజిత(26) దంపతులు మూడేళ్లుగా మూడు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. వరుసగా వేసిన పత్తి పంటతో నష్టం వచ్చి రూ. 3 లక్షలు అప్పు కావడంతో మనస్తాపం చెందిన రజిత పురుగు మందు తాగింది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

గుడిహత్నూర్, ఫిబ్రవరి 7: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మేకలగండె వద్ద మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఆదిలాబాద్‌కు చెందిన సయ్యద్ అహ్మద్ తన భార్య, కుమారుడు, కూతురుతో కలిసి నిర్మల్ నుంచి కారులో ఆదిలాబాద్‌కు వెళ్తుండగా, జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వారి వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సయ్యద్ అహ్మద్(42), కుమారుడు సయ్యద్ ఉమర్(12), కారు డ్రైవర్ బిలాల్ బిన్ అబ్దుల్లా(25) అక్కడికక్కడే మృతి చెందారు. భార్య ఫర్హానా బేగం, కూతురు సయ్యద్ మైహదియాలకు తీవ్ర గాయాలయ్యాయి.

కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్
- కమీషన్ల కోసమే పథకాలు: దామోదర
- మోదీ అవకాశవాది: పొంగులేటి
- ఓట్లను తొలగిస్తున్న కేసీఆర్: శశిధర్‌రెడ్డి



నిరుద్యోగ చైతన్య యాత్రలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులెవరికీ ఉద్యోగాలు రాలేదని.. కేసీఆర్ కుటుంబంలోని నలుగురికి మాత్రమే ఉద్యోగాలొచ్చాయని, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరుద్యోగ చైతన్య యాత్రను బుధవారం ప్రారంభించారు. అలంపూర్ నుంచి అదిలాబాద్ వరకు ఈ యాత్ర కొనసాగనుంది. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన మూడున్నర సంవత్సరాల్లో కేవలం 6 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని అన్నారు. మిషన్ భగీరథ, కాకతీయ, కాళేశ్వరం రీ డిజైనింగ్ పేరుతో కమీషన్లకు కక్కుర్తి పడ్డారని మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బ గ్రామంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికలలో టీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన 30 అంశాల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో ప్రసంగించిన ప్రధాని మోదీ తీరు పచ్చి అవకాశవాదాన్ని తలపిస్తోందని శాసన మండలి కాంగ్రెస్ ఉపనేత పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు. పార్లమెంటు తలుపులు మూసేసి ఆంధ్రప్రదేశ్ విభజన చేశారని ప్రధాని స్థాయిలో ఉన్న వ్యక్తి నిస్సిగ్గుగా అనడం శోచనీయమన్నారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పాల్పడుతున్న ఎన్నికల అక్రమాలపై ఎన్నికల కమిషన్‌తో పాటు సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి శశిధర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం కాంగ్రెస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.

దళితుల నిధులపై శ్వేతపత్రం ఇవ్వాలి: వంగపల్లి

రాంనగర్/హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): దళితుల సంక్షేమం కోసం ప్రభుత్వం గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.10 వేల కోట్ల ఖర్చుపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని టీఎమ్మార్పీఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ డిమాండ్ చేశారు. దళితుల అభివృద్ధికి నిధులను ఖర్చు చేయడంలో ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు 9న అన్ని దళిత సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం విద్యానగర్‌లోని టీఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ దళితుల పట్ల గత ప్రభుత్వాలు పాటించిన పద్ధతులనే ఈ ప్రభుత్వం పాటిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు కేటాయించిన రూ.10 వేల కోట్లలో కనీసం 10 శాతం కూడా దళితులకు ఖర్చు చేయడంలో సంబంధిత శాఖ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు.

'హత్తిఘాట్'పై కదలిక

- మంత్రి హరీశ్ ఓఎస్డీ సందర్శన

ఫిబ్రవరి 7, ఆదిలాబాద్ (ఆంధ్రజ్యోతి): లోయర్‌పెన్‌గంగా ప్రాజెక్టులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల్లో నిర్మిస్తున్న హత్తిఘాట్ పంప్‌హౌస్ పనులపై 5న ఆంధ్రజ్యోతి మెయిన్‌లో ప్రచురితమైన "గడువులోగా హత్తిఘాట్ గగనమే" అనే వార్త కథనానికి మంత్రి హరీశ్‌రావ్ స్పందించారు. మంత్రి ఆదేశం మేరకు బుధవారం ఆయన ఓఎస్డీ శ్రీధర్‌రావ్‌దేశ్‌పాండే, టెక్నికల్ అడ్వయిజర్ విజయ్ ప్రకాష్‌లు హత్తిఘాట్ పంప్ హౌస్ పనులను పరిశీలించారు. జూన్ నాటికి పనులు పూర్తిచేసి ఆయకట్టుకు సాగునీరు అందించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. అలాగే కోర్టా-చనకా బ్యారేజీతో పాటు కాలువల పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్లకు సూచించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపుల్లో ఎలాంటి ఆలస్యం చేయకూడదన్నారు.

బీసీలకు 50 % రిజర్వేషన్లు: జాజుల డిమాండ్

కవాడిగూడ/హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లును ప్రవేశపెట్టి 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్ లేకపోవడం వల్ల జనాభా దామాషా ప్రకారం వాటా దక్కడం లేదని, తద్వారా అన్ని రంగాల్లో వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం దోమలగూడలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 50 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 31 జిల్లాల్లో విస్తృత స్థాయి సభలు, మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ నెల 11న హైదరాబాద్‌లో, 16న నిజామాబాద్ బోధన్‌లో, 18న వనపర్తి జిల్లా కొత్తకోటలో బీసీ మహాసభలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు.

పోలీసుల అదుపులో 'ఎన్డీ' దళ నేత ఐలయ్య

మహబూబాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాయలవర్గం మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి, మహబూబాబాద్ డివిజన్ దళ కమాండర్ బండారి ఐలయ్య అలియాస్ వీరన్న, దళ సభ్యుడు శ్రీను అలియాస్ భీముడు జిల్లా పోలీసులకు పట్టుబడ్డట్లు తెలిసింది. బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన ఐలయ్య న్యూడెమోక్రసీలో చీలిక తర్వాత దాదాపు ఐదేళ్లుగా అజ్ఞాత జీవితం గడుపుతున్నారు. బుధవారం మధ్యాహ్నం బయ్యారం మండలం ములపోచారం ప్రాంతంలో పోలీసులు దళకమాండర్ బండారి ఐలన్నతో పాటు సభ్యుడు శ్రీనును అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని పార్టీవర్గాలు ప్రకటిస్తున్నప్పటికి పోలీసులు ధ్రువీకరించడం లేదు.

రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు వ్యవహారం మరో బోఫోర్స్‌గా మారి భారతీయ జనతాపార్టీని, మరీ ముఖ్యంగా ప్రధానమంత్రి మోదీని చుట్టుముడుతుందా? అన్న అనుమానం మరింత బలపడుతున్నది. ఒక్కో యుద్ధవిమానాన్ని ఎంతకు కొంటున్నారంటూ కాంగ్రెస్ సభ్యుడొకరు పార్లమెంటులో ప్రశ్నించినప్పుడు, భారత్–ఫ్రాన్స్ ఒప్పందం ప్రకారం ఈ వివరాలు చెప్పకూడదని రక్షణమంత్రి నిర్మలాసీతారామన్ తేల్చేయడం పెను వివాదాన్ని సృష్టించింది. గుజరాత్ ఎన్నికల ప్రచార సందర్భంగా ఈ ఒప్పందంపై అలవోకగా ఓ విమర్శవిసిరిన రాహుల్ గాంధీ ఇప్పుడు నేరుగా మోదీ మీద విరుచుకుపడుతున్నారు. నమ్మకస్తుడైన ఓ వ్యక్తి ద్వారా మోదీ స్వయంగా కుదిర్చిన ఈ ఒప్పందాన్ని ఒక భారీ కుంభకోణంగా కాంగ్రెస్ అభివర్ణిస్తున్నది. పారదర్శకతకు పెద్దపీట వేస్తామనీ, అవినీతికి ఆమడదూరంలో ఉంటామనీ చెబుతున్న మోదీ ప్రభుత్వానికి ఈ ఒప్పందం విషమపరీక్ష పెడుతున్నది. మధ్యవర్తి ఎవరన్న వివరం రాహుల్ స్పష్టంగా చెప్పకున్నా, తన ట్వీట్‌లో 'రిలయబుల్ బడ్డీ' అన్న మాటతో అతడెవరో గుర్తుచేశారు. మోదీ హయాంలో కుదుర్చుకున్న కొత్త ఒప్పందంతో అధికంగా లాభపడుతున్నది అనిల్ అంబానీ అన్నది కాంగ్రెస్ చేస్తున్న వాదన. గత ఏడాది నవంబరులో విమర్శ చేసినప్పుడే, ప్రభుత్వ సంస్థ హిందూస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్‌ను మోదీ ఒప్పందం నుంచి తప్పించి, దానిస్థానంలోకి రక్షణరంగంలో ఏమాత్రం అనుభవంలేని ఓ వ్యాపారవేత్తను తెచ్చారంటూ విమర్శ చేశారు. మోదీ పారదర్శక పాలనలో ఆయన డిగ్రీ పట్టా నుంచి రాఫెల్ వరకూ అన్నీ రహస్యమే అంటూ రాహుల్ విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో, ధర వివరాలను దాచడం ప్రభుత్వంపై అనవసరమైన అనుమానాలను పెంచుతుందనడంలో సందేహం లేదు. రక్షణరంగానికి చెందిన ఈ తరహా భారీ ఒప్పందాల్లో ఎంత పారదర్శకత పాటించినా, ఏవో అనుమానాలు, విమర్శలు రేగక పోని స్థితి సహజంగానే ఉంటుంది. అటువంటిది, మోదీ ప్రభుత్వం ధర రహస్యమని ఒకటికిపది అంటూనే, కాంగ్రెస్ గతంలో కుదుర్చుకున్న ఒప్పందం కంటే తమది సర్వవిధాలా మెరుగైనదని చెప్పుకుంటున్న మాత్రాన అనుమానాలు తీరిపోవు. ఇదే వాదనతో ప్రభుత్వం ఎప్పటినుంచో విపక్షాలపై ఎదురుదాడిచేస్తున్నది. మూడునెలల క్రితం వైమానికదళ ప్రధానాధికారి స్వయంగా విలేకరుల

రాఫెల్ రచ్చ!

సమావేశాన్ని ఏర్పాటు చేసి రాఫెల్ యుద్ధవిమానం ఎంత శక్తిమంతమైనదో, ఉన్నతమైనదో మనంగా వివరించారు. రాఫెల్ గొప్పదే కావచ్చును, యూపీఏ ప్రభుత్వం అందుకే 126 విమానాల కొనుగోలుకు సిద్ధపడిఉండవచ్చు. కానీ, ఆ ఒప్పందాన్ని నిరసించి, విమర్శించి చివరకు దానిని రద్దుచేసి, తిరిగి అత్యవసరం పేరిట 36 విమానాలను కొనుగోలు చేస్తున్నవారిపై తాముచెల్లిస్తున్న దెంతో ఎంతో చెప్పవలసిన నైతిక బాధ్యత ఉన్నది. బోఫోర్స్ వివాదం కూడా ప్రధానంగా నాణ్యతపైన కాక, సొమ్ములు చేతులు మారాయన్న దానిపైనే. కాంగ్రెస్ అవినీతితో ప్రజలు విసిగివేసారిపోయి ఉన్నస్థితిలో గత ఒప్పందం రద్దులో మోదీ మంచితనమూ, యశ్వంత్ సిన్హా వంటివారి విమర్శల్లో రాజకీయమూ కనిపించిందే తప్ప ఎవరికీ అనుమానాలు రేగలేదు. కానీ, గతంలో బోఫోర్స్, రాఫెల్ విషయంలో బీజేపీ పోషించిన పాత్రను ఇప్పుడు కాంగ్రెస్ పోషిస్తున్నది. అంతర్జాతీయస్థాయిలో ఏళ్ళతరబడి పోటీదారులను వడకట్టి, ఎట్టకేలకు కుదిరిన ఒక ఒప్పందాన్ని క్షణాల్లో రద్దుచేసి, స్వల్పకాలంలోనే అదే సంస్థతో కొత్త ఒప్పందాన్ని తయారుచేసుకున్నప్పుడు అందులో ఏవో దురుద్దేశాలు, ఆశ్రిత పక్షపాతాలు ఉన్నాయని విపక్షం విమర్శించడం, ప్రజల్లో అనుమానాలు రేకెత్తడం సహజం.

ధర రహస్యమని నిర్మలా సీతారామన్ అంటున్నప్పటికీ, గత ఏడాది ఇదే పార్లమెంటులో రక్షణశాఖ సహాయమంత్రి ఒక ప్రకటనలో ఆ వివరాలు కూడా చెప్పారు. ఒప్పందం అట్టహాసం అప్పుడే జరిగింది, అటువంటి నిబంధనే లేదో తెలియదు కానీ, రక్షణమంత్రి ప్రకటన అనవసరపు రాద్ధాంతాన్ని రేపింది. గత ఒప్పందం దండుగమారిదనీ, కొత్త ఒప్పందం కారణంగా 16శాతం రేటు తగ్గిందని బీజేపీ ఎప్పటినుంచో అంటున్నది. అది నిజమే కావచ్చును, దేశ రక్షణను కాంగ్రెస్ రాజకీయం చేస్తోందనీ వచ్చు. కానీ, 126 విమానాల్లో 18 మాత్రమే సిద్ధంగా ఉన్నవి కొని, మిగతావన్నీ హిందూస్థాన్ ఎయిరోనాటిక్స్‌కు టెక్నాలజీ బదలాయింపు ద్వారా దేశీయంగా తయారుచేయాలన్న గత ఒప్పందాన్ని కాదని, రక్షణరంగంలో ఏమాత్రం అనుభవం లేని 'అడాగ్' సంస్థను జాయింట్ వెంచర్ పేరిట అనూహ్యంగా ముందుకు తెచ్చినప్పుడు అన్ని వివరాలూ ప్రజలకు చెప్పడం ప్రభుత్వ బాధ్యత. మోదీ ఫ్రాన్స్ పర్యటనకు రెండు వారాల ముందే ఈ కొత్త ఒప్పందం గురించి అప్పటి రక్షణమంత్రి పారికర్‌కు కూడా తెలిసిందనీ, భద్రతావ్యవహారాల కేబినెట్ సమావేశంలో చర్చించడం, అనుమతి తీసుకోవడం వంటి పద్ధతులేమీ పాటించకుండా మోదీ స్వయంగా ఈ వ్యవహారం చక్కబెట్టారన్న విమర్శలు గతంలోనే వచ్చాయి. ఒక ప్రభుత్వ సంస్థతో జరగాల్సిన టెక్నాలజీ బదలాయింపు స్థానంలో, ఒక ప్రైవేటు సంస్థకు ఆఫ్‌సెట్ కాంట్రాక్టు పేరిట వేలకోట్లు లబ్ధిచేకూర్చేందుకే ఈ ఒప్పందం కుదిరిందన్న విమర్శలకు ప్రభుత్వం పారదర్శకంగా అన్ని వివరాలు చెప్పనంత కాలం విమర్శలు రేగుతూనే ఉంటాయి.

కుల వివక్షపై ఎవరు పోరాడాలి?

కుల అస్తిత్వ రాజకీయాలు కుల వివక్షను రూపుమాపుతాయా? ఇతర వెనుకబడినవర్గాల (ఓబీసీ)కు విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలన్న మండల్ కమిషన్ సిఫారసును అమలుపరచాలని 1990లో వి.పి. సింగ్ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో దేశ రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసే ఒక కీలక శక్తిగా కుల ప్రాధాన్యం సంతరించుకున్నది. లాల్ కృష్ణ అద్వానీ రథయాత్ర, రామ్ జన్మభూమి ఉద్యమాన్ని ఎదుర్కొనేందుకై మండల్ కమిషన్ సిఫారసులను అమలుపరచడానికి వి.పి. సింగ్ పూనుకున్నారు. మండల్ వెర్సెస్ కమండల్ రాజకీయాలతో ఆనాడు దేశమంతా అట్టుడికిపోయింది. రిజర్వేషన్ల లబ్ధి పొందడానికి దేశ యువ జనులు ఆరాటపడ్డారు. స్వతంత్ర భారతదేశంలో మున్నెన్నడూ లేనివిధంగా ప్రజలలో కులపరమైన స్పృహ పెంపొందింది.

కుల ప్రాతిపదికన రిజర్వేషన్లను పొందుతూ సామాజిక వివక్షల గురించి ఫిర్యాదు చేసే అర్హత ఎవరికీ లేదు. కులపరంగా ప్రయోజనాలను పొందడానికి ప్రయత్నించని వారే సమాజంలో సాంఘిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడే నైతిక హక్కును కలిగివుంటారు.

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ మొదటి నుంచీ కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన ఇలా రాశారు: 'హిందూ సమాజమనేది ఒక మిథ్య. అది కొన్ని కులాల సమాహారం. ప్రతి కులమూ తన అస్తిత్వానికే ప్రాధాన్యమిస్తుంది. సొంత మనుగడ గురించి ఆలోచిస్తుంది. మీ సామాజిక హోదాను పెంపొందించుకోలేనిపక్షంలో మీరు సాధించే ప్రగతి చాలా స్వల్పం.' 1956 అక్టోబర్‌లో డాక్టర్ అంబేద్కర్ తన లక్షలాది అనుయాయులతో కలసి బౌద్ధమతాన్ని స్వీకరించారు. బౌద్ధ మతాంతరీకరణ ద్వారా పీడిత ప్రజలైన అస్పృశ్యులు తమ సామాజిక కళంకం నుంచి విముక్తులవుతారని అంబేడ్కర్ భావించారు. అయితే ఆయన ఆశించిన విధంగా జరగలేదు. దళితులు ఎప్పటిలాగానే వివక్షకు గురవుతూ వస్తున్నారు. బౌద్ధంలో చేరినవారి సామాజిక హోదా ఏ విధంగానూ పెరగలేదు. బౌద్ధ–దళితులుగా మాత్రమే వారు పరిగణన పొందుతున్నారు. అగ్రవర్ణ హిందువులు వారిని సామాజికంగా తమతో సమానులుగా అంగీకరించడానికి ససేమిరా అంటున్నారు.

మధ్యయుగాలలో ప్రారంభమైన పరదా ఆచారం ఇప్పటికీ, ముఖ్యంగా ఉత్తర భారతావని మహిళల్లో కొనసాగుతూనే ఉన్నది. ఈ ఆచారాన్ని గాంధీ తీవ్రంగా వ్యతిరేకించేవారు. హిందూ గృహిణుల బానిసత్వానికి పరదా ఒక చిహ్నమని అదొక దుర్మార్గ ఆచారమని ఆయన విమర్శించేవారు. ముస్లిం స్త్రీలు బురఖా ధరించే సంప్రదాయాన్ని కూడా ఆయన వ్యతిరేకించే వారు. పురుషులకు ఉన్నట్టుగానే స్త్రీలకు కూడా సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండాలని గాంధీజీ గట్టిగా అభిప్రాయ పడేవారు. స్వేచ్ఛ లేని పక్షంలో స్త్రీలు తమకుతాముగా ఎదగలేరని ఆయన భావించారు. జవహర్‌లాల్ నెహ్రూ తన 'భారత దర్శనం' గ్రంథంలో ఇలా రాశారు: 'భారతీయ మహిళలు ప్రగతిశీల సామాజిక జీవనాన్ని సాధించుకోవాలంటే అనాగరిక పరదా, బురఖా ఆచారాలకు వారు స్వస్తి చెప్పవలసివున్నది'. ఇప్పుడు కుల వ్యవస్థ బలహీన పడడానికి బదులు సమాజాన్ని మరింతగా ప్రభావితం చేస్తోంది. ప్రజా వ్యవహారాలలో కుల ప్రమేయం బాగా పెరిగిపోయింది. రాజకీయ నాయకులు ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యమివ్వడమే ఇందుకు నిదర్శనం.

పుట్టుక ఒక యాదృచ్ఛిక విషయం. తమ తల్లితండ్రులను ఎంపిక చేసుకొనే స్వాతంత్ర్యం మానవుడికి కాదుకదా ఏ జీవికీ లేదు, ఉండదు. మరి అటువంటప్పుడు కుల ప్రాతిపదికన వివక్ష చూపడం ఎందుకు? ఒక వ్యక్తి పట్ల, అతను జన్మించిన కులం ఆధారంగా వివక్ష ప్రదర్శించడమనేది మానసికంగా ఎదగనితనానికి, అపరిణత ఆలోచనలకు నిదర్శనం. సరైన విద్యాశిక్షణ కొరవడడాన్ని కూడా అది సూచిస్తుంది. కులం కాకుండా ప్రవర్తన ఆధారంగానే ఎవరినైనా అంచనా వేయాలి. గౌరవించాలి. లేదా దుయ్యబట్టాలి.

దక్షిణ భారతావనిలో రామస్వామినాయకర్ నడిపిన బ్రాహ్మణ వ్యతిరేక ద్రావిడ ఉద్యమ ప్రభావంతో క్రిందిస్థాయి కులాలవారు సంస్కృతీకరణ ప్రక్రియ ద్వారా సమాజంలో తమ హోదాను ఉన్నతీకరించుకున్నారు. అగ్రకులాల వారిని అన్ని విధాలుగా అనుకరించడం ద్వారా వారు గొప్ప పురోగతిని సాధించగలిగారు. అయినప్పటికీ వారు కుల వివక్షను తప్పించుకోలేక పోతున్నారు. తమిళనాడులో ఇప్పటికీ కుల అంతరాలు గతంలో వలే చాలా తీవ్రంగానే ఉన్నాయి. పెరియార్ భావజాలాన్ని ద్రావిడ రాజకీయ పక్షాలు ఆదరిస్తున్నప్పటికీ కుల అంతరాలు తొలగిపోవడం లేదు. కులాంతర వివాహాలు సైతం కుల నిర్మూలనకు తోడ్పడడం లేదు. కులాంతర వివాహం చేసుకున్న దంపతులు తమ కుల అస్తిత్వాలను పూర్తిగా అధిగమించలేకపోతున్నారు. స్వకులంపై అభిమానాలు, ఇతర కులాలపై దురభిమానాలను తమ సహచరి/ సహచరునిపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నారు. విరుద్ధ కులాలకు చెందిన యువతీయువకులు ప్రేమించుకుని వివాహం చేసుకోవడానికి తల్లి తండ్రుల నుంచి, తమ తమ కుల సమాజాల నుంచి ఆమోదం పొందలేకపోతున్నారు. 'కుటుంబ గౌరవం' పేరిట పలువురు హత్యలకు గురవుతున్నారు. 'ఖాప్ పంచాయత్‌లు' నైతిక పోలీసింగ్ విధులను నిర్వహిస్తున్నాయి. తద్వారా అసహ్యకరమైన కులాచారాలను, కట్టుబాట్లను నిరంకుశంగా అమలుపరుస్తున్నాయి.

సమాజ వ్యవహారాలపై కుల ప్రభావాన్ని తగ్గించేందుకు విద్యా సంస్థల అడ్మిషన్ల ప్రక్రియలో మార్పులు ప్రవేశపెట్టడం కీలకం. అడ్మిషన్ల ఫారాలలో అభ్యర్థి కులాన్ని పేర్కొనడానికి ఉద్దేశించిన కాలమ్ ఉండకూడదు. నిబంధనను పూర్తిగా తీసివేయాలి. అలాగే ఉద్యోగ అభ్యర్థుల కులాన్ని తెలుసుకొనే విధానానికి స్వస్తిచెప్పాలి. కుల ప్రమేయంలేని వాతావరణంలో మన బాలలు పెరిగేందుకు ఇటువంటి మార్పులను తప్పక ప్రవేశపెట్ట వలసివున్నది. రిజర్వేషన్ల విధానం వల్ల మన సమాజంలో కుల వ్యవస్థ మరింతగా సుదృఢమవుతోంది. రిజర్వేషన్ల లబ్ధి పొందేందుకు ప్రజలు ఆరాటపడుతున్నంతవరకు కుల వ్యవస్థను నిర్మూలించడం అసాధ్యం. కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు పొందుతూ సామాజిక వివక్షల గురించి ఫిర్యాదు చేసే అర్హత ఎవరికీ లేదు. కుల పరంగా ప్రయోజనాలు పొందడానికి ప్రయత్నించని వారే సమాజంలో సాంఘిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడేందుకు నైతిక హక్కు కలిగివుంటారు.

■ జి.రామచంద్రం
ముంబై విశ్వవిద్యాలయ రాజనీతి శాస్త్ర ఆచార్యులు

బహుజన బాంధవుడు

క్రాంతి సంగ్రామ పరిషత్ వ్యవస్థాపకుడు, బహుజన ఉద్యమ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు, అణగారిన వర్గాల అభ్యున్నతికై అహర్నిశలు కృషిచేస్తూ ప్రజల మన్ననలు పొందిన మహానాయకుడు వై. శంకర్ గత నెల 31న నాందేడు ప్రభుత్వాసుపత్రిలో తుది శ్వాస విడిచారు.

సంగారెడ్డి జిల్లాలో సదాశివపేట గ్రామంలో 1962 అక్టోబర్ 20న శంకర్ జన్మించారు. తల్లి సరస్వతమ్మ, తండ్రి కీ.శే. డాక్టర్ వెంకటకృష్ణ. ఈ దంపతులకు శంకర్ మూడవ సంతానం. ఆర్య సమాజ్ సంప్రదాయాలను పాటించే మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన శంకర్ చిన్నప్పటి నుండే పేదల ఉద్ధరణకు పాటుపడ్డారు. సదాశివపేటలో పాఠశాల, సంగారెడ్డిలో ఇంటర్, హైదరాబాద్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. హైదరాబాదులోని మంగల్‌హాట్‌లో తమ్ముళ్ళతో ఉంటూ ట్యూషన్స్ చెప్పుతూ, ఖైరతాబాదులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బి.ఎస్సీ చేశారు. ఈ కళాశాల విద్యాభ్యాసం సమయంలో ఎన్.సి.సి. ట్రైనింగ్‌లో చురుకుగా పాల్గొని బెస్ట్ క్యాడెట్‌గా జాతీయ పరేడ్ (ఢిల్లీ)లో పాల్గొన్నారు. నిజాం కాలేజీలో ఎం.ఎస్.సి. (కెమిస్ట్రీ) చేస్తూ విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఆ తరువాత ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో ఎల్.ఎల్.బి., ఓ.యు. ఆర్ట్స్ కాలేజీలో బిసిజె పూర్తి చేసే క్రమంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, బహుజన మైనార్టీ విద్యార్థి హక్కులకై పోరాడారు. అదే క్రమంలో క్రాంతి సంగ్రామ పరిషత్ అనే బహుజన విద్యార్థి ప్రజాస్వామ్య ఉద్యమ ఆర్గనైజేషన్‌ను స్థాపించారు. 1987లో ఎన్.టి.ఆర్. ప్రభుత్వం బి.సి.లకు 25 నుంచి 44 శాతానికి పెంచిన రిజర్వేషన్స్ పరిరక్షణకై సమ సంగ్రామ పరిషత్‌ను స్థాపించి పోరాడుతూ అన్ని వర్గాల ప్రజల, రాజకీయ నాయకుల ప్రశంసలను అందుకున్నారు. బహుజన విద్యార్థి ఐక్యతకు అవసరమైన సాధించి పోరాడే క్రమంలో దానికి కావాల్సిన సిద్ధాంత భూమికను శంకర్ ఆవిష్కరించారు. అదే సమయంలోను అన్ని విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ (జె.ఎ.సి.) కూడా ఆయన నిర్మించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో శంకర్ ఒకరు. బొజ్జా తారకం, సుందరయ్య యాదవ్, బి.ఎస్.ఎ. స్వామి, నారగోని వెంకటయ్య తదితరులతో కలిసి 1989 నుంచి 2018 వరకు ముప్పది సంవత్సరాలు ఆ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారు. జాతీయనాయకుడు కాన్షీరాంకు అత్యంత సన్నిహితుడుగా, నమ్మకస్తుడుగా తొమ్మిది సంవత్సరాలు ఉమ్మడి రాష్ట్ర బి.ఎస్.పి. అధ్యక్షులుగా ఆయన పనిచేశారు. ఎందరో ఎన్నో కారణాలతో పార్టీని వదిలి వెళ్ళినా శంకర్ గౌడ్ మాత్రం తుది వరకు పార్టీకే జీవితాన్ని త్యాగం చేశారు.


నివాళి
వై. శంకర్
20.10.1962 – 30.1.2018

ఓపికగా చిరునవ్వుతో, పట్టుదలతో ప్రతి సమస్యను పరిష్కరించే తత్వం శంకర్‌కే స్వంతం. శంకర్‌ది మచ్చలేని వ్యక్తిత్వం, మృదుభాషి, స్నేహశీలి, బడుగు, బలహీన వర్గాల హక్కులకై అవిశ్రాంతంగా పోరాడే క్రమంలో అన్ని కులాల, వర్గాల, ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని అధికారుల ప్రశంసలు పొందుతూ ఇతర విద్యార్థి సంఘాలకు ఆదర్శంగా నిలిచారు. ప్రత్యర్థులు కూడా ఆయన కార్యదీక్షతను, వ్యక్తిత్వాన్ని కొనియాడేవారు. కొన ఊపిరివరకు బహుజన వాదమే ఊపిరిగా జీవించిన ఉదాత్తుడు శంకర్.

■ క్రాంతి సంగ్రామ పరిషత్,
బహుజన సమాజ్ పార్టీ సహచరులు

(నేడు ఉదయం 11గం.లకు రూం.నెం.57, ఆర్ట్స్ కాలేజీ, ఉస్మానియా యూనివర్సిటీ నందు వై.శంకర్ సంస్మరణ సభ)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య బీమా విధానంగా చెప్పుకొంటున్న 'ఆయుష్మాన్ భారత్' పథకం నిజానికి ఇప్పటికే ఉన్న 'జాతీయ ఆరోగ్య బీమా' పథకానికి పూసిన పైపూత. కేవలం 2వేల కోట్ల రూపాయలే కేటాయించడాన్ని బట్టి ఈ పథకంపై పాలకుల చిత్తశుద్ధి ఏమిటో తేటతెల్లమవుతోంది.



'ఆరోగ్య' భరోసా లేని ఆర్థికం!

ఎప్పటిలాగే ఆర్భాటపు ప్రకటనలతో, అసత్య వివరాలతో వివిధ రంగాల వ్యయాల అంచనాను ప్రభుత్వం ప్రజల ముందుంచింది. వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ని అస్తవ్యస్తంగా ఈ దేశం మీద రుద్దినాక మొదటిదీ, రాబోయే లోక్ సభ ఎన్నికల ముందు పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టబడిన చివరిదీ అయిన ఈ బడ్జెట్ నిజానికి ఏ ప్రత్యేకతా లేకుండా ఒక తతంగంలా ముగిసింది. ఈ బడ్జెట్ రైతుల సంక్షేమానికి పెట్టపీట వేస్తుందనీ, పేద ప్రజల పాలిట కల్పవృక్షమనీ ధ్వనించేలా ప్రగల్భాలు పలకడంలో మాత్రం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఏమాత్రం వెనుకంజ వేయలేదు. కానీ వాస్తవంలో పేదలకు అచ్ఛేదిన్ ఎప్పుడూ భవిష్యత్తులోనే ఉంటాయని మరోసారి అందరికీ అర్థమయ్యేలా చేశారు.

స్థూల ఆర్థిక వ్యవస్థపై వ్యాఖ్యానిస్తూ, ఈ దేశంలో పొదుపు, మదుపు తగ్గుముఖం పట్టడంపై ఆందోళన వ్యక్తం చేసిన కేంద్రప్రభుత్వం దానికి పెద్దనోట్ల రద్దు, అత్యుత్సాహపు జీఎస్టీ అమలు, ఎఫ్ఆర్డీఏ చట్టం వంటి అసంబద్ధ ప్రతిపాదనలు ముఖ్య కారణమని అంగీకరించేందుకు సిద్ధంగా లేదు. గతంలో ప్రపంచ ఆర్థిక పురోగతి మందగమనంలో ఉన్నా మనదేశం మాత్రం అద్భుతమైన ప్రగతిపథంలో పయనిస్తున్నదని గప్పాలు కొట్టిన ఆర్థిక మంత్రి, ఇప్పుడు ప్రపంచ ఆర్థిక ప్రగతి ఊర్ధ్వముఖంలో ఉన్నా భారతదేశపు పరిస్థితి ఎందుకు దిగజారుతోందో వివరించలేదు. పెద్దనోట్ల రద్దు వల్ల జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) తగ్గవచ్చని హెచ్చరించిన పాపానికి ప్రసిద్ధ ఆర్థికవేత్తలని ఎగతాళి చేసినవారే, జీఎస్టీ వలన మన జీడీపీకి కనీసంగా రెండు శాతం వృద్ధి జోడవుతుందని ప్రచారం చేసినవారే ఇప్పుడు మన ఆర్థిక వ్యవస్థ కోలుకొంటున్నదని అంటున్నారు. మరి దీన్నిబట్టి గతంలో మన ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని ఉంది అని పరోక్షంగా ఒప్పుకున్నట్టే కదా!

బడ్జెట్ ప్రతిపాదించిన ఆదాయ, వ్యయాల వివరాల్లోకి వెళితే.. కేంద్ర ప్రభుత్వ పన్ను వసూళ్ల మొత్తం అంచనాలు 19.11లక్షల కోట్ల రూపాయల నుంచి 22.71 లక్షల కోట్ల రూపాయలకు పెరిగాయి. అంటే పన్ను వసూళ్లలో ఇంచుమించు 19 శాతం వృద్ధి ఉండబోతోంది. అయితే ఇందులో ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నుల వాటా విడివిడిగా చూసినప్పుడు మాత్రం ప్రత్యక్ష పన్నులు 17శాతం వృద్ధినీ, పరోక్ష పన్నులు సుమారు 20శాతం వృద్ధినీ నమోదు చేయనున్నాయని అర్థమౌతుంది. ఈ దేశ జనాభాలో కేవలం 1శాతంగా ఉన్న బడాబాబుల వద్ద 73 శాతం సంపద కొలువుతీరి ఉన్నది. ఈ స్థితిలో అవే తలకిందులు పన్ను విధానాలను అమలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఎందుకంటే ప్రత్యక్ష పన్నులు ఒక వ్యక్తి, సంస్థ తన సంపాదనకు అనుగుణంగా కట్టేవీ, పరోక్ష పన్నులు అంతిమంగా సంపాదనతో సంబంధం లేకుండా జనబాహుళ్యం భరించేవీ కాబట్టి. పోనీ, ఆ ప్రత్యక్ష పన్నులలోనైనా మధ్య తరగతికి ఏమైనా ఊరట లభిస్తోందా అంటే అదీ లేదు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ కార్పొరేట్ పన్ను కేవలం 15 శాతం పెరగనుండగా, వ్యక్తిగత ఆదాయపు పన్ను 20 శాతం పెరగడమే. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వానికి వడ్డీలు, డివిడెండ్లు వంటి పన్నేతర వసూళ్ల రూపంలో వచ్చే ఆదాయం 15 శాతం తగ్గనుండడం సైతం ఆందోళనకర పరిణామమే. ఒక పథకం ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలని నిర్వీర్యం చేస్తూ పోవడమే ఇందుకు ముఖ్య కారణమని చెప్పక తప్పదు.

సరే, ఖర్చుల విషయానికొద్దాం. ఈ అంశంలో ప్రకటనలకీ, కేటాయింపులకీ ఏమాత్రం పొంతన కుదరడం లేదని స్పష్టమవుతోంది. నానాటికీ దిగజారుతున్న రైతుల ఆర్థిక పరిస్థితిపై మొసలి కన్నీరు కార్చిన జైట్లీ, వ్యవసాయోత్పత్తుల కనీస మద్దతు ధరని సాగు ఖర్చులపై 50 శాతమైనా లాభం చేకూరేలా నిర్ణయించనున్నట్టు ప్రకటించారు. పైకి వినసొంపుగా ఉన్నప్పటికీ ఇది సైతం మరొక శుష్క వాగ్దానమేనని భవిషత్తు రుజువు చేయనుంది. ఎందుకంటే, ఖర్చుని నిర్వచించే ప్రస్తుత అశాస్త్రీయ విధానంలో ఏరకమైన మార్పూ లేదు కాబట్టి. ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకునే ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులు, విద్యుత్ వంటి ఏ ఉత్పత్తి అయినా ఆయా ఉత్పత్తిదారుల మదింపు ప్రకారమే ఉత్పత్తి ఖర్చు నిర్ణయించబడుతోంది. ఒక్క వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో మాత్రమే ప్రభుత్వాలు ఖర్చుని, ధరలను ఏకపక్షంగా నిర్ణయిస్తాయి. కనుక ఈ కనీస మద్దతు ధర అనే విధానమే మౌలికంగా దుర్మార్గమైనది. ఎందుకంటే, వ్యవసాయదారుల ఖర్చులన్నీ పూర్తిగా ఈ మదింపులో చేర్చబడవు కాబట్టి. పోనీ ఈ మద్దతు ధర అన్ని వ్యవసాయోత్పత్తులకీ వర్తిస్తుందా అంటే అదీ లేదు. వర్తించే ఉత్పత్తులన్నీ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందా అంటే సమాధానం లేదు. బహుళజాతి కంపెనీల కబంధ హస్తాలలో చిక్కుకున్న విత్తనాల, పురుగుమందుల ధరలు ఆకాశాన్నంటుతుడగా, ఎరువులపై ప్రభుత్వ సబ్సిడీ నానాటికీ తగ్గుతుండగా ఆయా కంపెనీల లాభాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగి, ఆ మేరకు ఉత్పత్తి ఖర్చు పెరిగి రైతులకే మోయలేని భారమవుతోంది. ఈ స్థితిలో, ఉత్పత్తి ఖర్చులు తగ్గించడం, అమ్మకపు ధరలను పెంచడం అనే రెండు పనులనూ ఏకకాలంలో చేపడితే తప్ప సమస్యకు పరిష్కారం లభించదు. కానీ మన పాలకులకు పరిష్కారం మీద కన్నా ప్రచారం మీదే ఎక్కువ ధ్యాస కాబట్టి వారి నుంచి రైతుల అనుకూల నిర్ణయాలను ఆశించలేం. ఒక పక్క వ్యవసాయ రంగపు వృద్ధి రేటు రికార్డు స్థాయిలో మందగమనంలో ఉంటే, కనీసం 19శాతం వృద్ధి రేటు వార్షికంగా సాధిస్తే తప్ప సాకారం కాని 'వ్యవసాయ ఆదాయాల రెట్టింపు' అనే ఊహలో ప్రజలను విహరింపచేస్తూన్నారు. మొత్తం బడ్జెట్ పరిమాణం 14శాతం పెరగగా వ్యవసాయ రంగానికి జరిగిన కేటాయింపులు కేవలం 12శాతం మాత్రమే పెరిగిన వాస్తవాన్ని గమనిస్తే ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా పెద్ద పీట వేయలేదని స్పష్టమవుతోంది.

ఇక ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా విధానంగా చెప్పుకొంటున్న 'ఆయుష్మాన్ భారత్' పథకం యొక్క నిజానిజాలను పరిశీలిస్తే.. అది ఇప్పటికే ఉన్న 'జాతీయ ఆరోగ్య బీమా' పథకానికి పూసిన పైపూత మాత్రమేనని అర్థమవుతుంది. కేవలం 2వేల కోట్ల రూపాయలు మాత్రమే ఈ పథకానికి ప్రకటించారంటే ఈ పథకంపై పాలకులకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తేటతెల్లమవుతోంది.

నిజంగా ఈ బడ్జెట్‌లో మెచ్చుకోదగ్గ విషయం.. వయో వృద్ధులకు వడ్డీ ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని 10వేల నుంచి 50వేలకు పెంచడమే. పెద్ద నోట్ల రద్దు ఫలితంగా తగ్గిన వడ్డీ రేట్ల వల్ల పెన్షనర్లు నష్టపోతున్న మొత్తాన్ని ఇలాగైనా వారికి భర్తీ చేయడం ముదావహం. ఈ ఒక్కటి తప్ప మిగిలిన బడ్జెట్ అంతా ఆ చేత్తో ఇవ్వడం ఈ చేత్తో గుంజుకోవడం అన్న చందానే తయారు చేయబడింది. విద్య, వైద్యం, వ్యవసాయం, శాస్త్రీయ పరిశోధన వంటి కీలక రంగాలపై ప్రకటనలు తప్ప కేటాయింపులు కనపడలేదు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం తీసుకొంటున్న అప్పుల్లో 90 శాతానికి పైగా వడ్డీ చెల్లింపులకే సరిపోతుండడం రాబోయే సంక్షోభాన్ని సూచిస్తోంది. కస్టమ్స్ సుకం తప్ప మిగిలిన పరోక్ష పన్నులన్నీ జీఎస్టీ పరిధిలోకి రావడంతో పన్నులపై విధాన నిర్ణయాలు పార్లమెంటులో కన్నా దాని వెలుపలే ఎక్కువ జరగడం చూస్తుంటే రాబోయే రోజుల్లో ఎన్నో అనామక చర్చల్లో ఒక చర్చగా బడ్జెట్‌పై చర్చ కూడా ఉండే ప్రమాదముంది.

■ రాంపల్లి శశికుమార్
చార్టర్డ్ ఎకౌంటెన్సీ ఉపాధ్యాయులు

బహుముఖ కార్యాచరణే ప్రత్యామ్నాయం

సోవియట్ యూనియన్ పతనం గురించి ఆసక్తికరమైన వివాదాన్ని రంగనాయకమ్మగారు ఈమధ్య ప్రారంభించినారు. మంచిదే. అందులో వారు ప్రస్తుత వామపక్ష భావజాలంలోని పునాదులనూ ప్రశ్నించారు. అదీ అవసరమే. ప్రపంచ రాజకీయాలపై సోవియట్ విప్లవం నాడు ఎంతటి ప్రభావం చూపిందో, దాని పతనమూ నేటికీ అంతటి ప్రభావమూ కల్గి ఉంటూంది. పీడిత మానవాళి సులభంగా స్పష్టంగా ఊహించగల్గిన ఒక 'ఆశాజ్యోతి'వారికి లేకుండా ఆరిపోయింది. పెట్టుబడిదారీ విధానానికి ఒక విశ్వసనీయమైన ప్రత్యామ్నాయం కనుచూపుమేరలో లేకుండా పోయింది.

ఆ పతన కారణాలను విశ్లేషిస్తూ చాలా సాహిత్యమే వెలువడి ఉండవచ్చు. కానీ లోతైనా తాత్త్విక ప్రాతిపదికన నిష్కర్షగా కొంతకాలం నిలువగలిగిన తుది మాట నాబోటి సామాన్యుని వరకు దిగిరాలేదు. పైస్థాయిలోనైనా అట్టిది జరిగిందో లేదో తెలియదు. జరిగేవుంటే అది ఈనాటికీ గోప్యంగా ఉండనవసరం లేదు. ఆమాటకొస్తే అది అందరికీ తెలిస్తేనే వృద్ధి.

పోతే, అట్టి తుదిమాట గాని తత్త్వశాస్త్ర చర్చగాని రాజ్యాధికారం కోసం ఉద్యమాల్లో, 'పోరాటాల్లో' తలమునకలై మునిగిన సామాన్య నాయక శ్రేణి నుంచి ఆశించలేము. అలా చూడగల నాయకులే ఉంటే సోవియట్ యూనియన్ పతనమే చెంది ఉండదు. సామాన్య నాయకుల కాలమంతా అధికారగణ ప్రత్యర్థి భావజాలానికి, ప్రచారానికి, ఎత్తుగడలకు, దాడులకు దీటైన జవాబు ఇవ్వటంలోనే ఖర్చవుతూ ఉంటుంది. "ఫుల్లీ ఎంగేజ్‌డ్ ఇన్ అర్జంట్ ఎఫైర్స్ బట్ నో టైమ్ ఫర్ ఇంపార్టెంట్ అఫైర్స్" అన్నది చలామణిలో ఉన్న ఒక మేనేజిమెంటు జోకు, సూక్తి. (Fully engaged in urgent affairs, but no time for important affairs).

కీలక ప్రజా ఉద్యమాల్లో అగ్రశ్రేణి ఉన్నతులతో ఒక మాదిరి అతిసన్నిహితమూ, అతిదూరమూకాని నమ్మకమైన సంబంధాలున్న మేధావుల్లో, గొప్ప విద్యావంతులైన విశ్రాంత అగ్రశ్రేణి నాయకుల్లో ఆ పని చేయగల్గాలి. అది బహుకష్టంతో కూడుకున్న పని. నిరపేక్షత, నిష్పాక్షికత, కేవల సత్యాన్వేషణపరత, త్యాగబుద్ధి వంటి అనేక సుగుణరాశితో సెంటిమెంట్లకు అతీతంగా జరుగవలసిన కృషి అది.

అంతేకాదు, ఒక్కొక్కప్పుడు, చరిత్ర గొప్ప మలుపు తిరగవలసిన చౌరస్తాలో స్తంభించినప్పుడు, అడ్డగోలుగా మన ఎదుట నిలిచిన సమస్యలతో ఏమాత్రం ప్రత్యక్ష సంబంధం కన్పించని అనూహ్యమైన ప్రాతిపదిక మీద పరిష్కారం దొరకవలసి ఉంటుంది. ఎద్దుబండ్లు, గుర్రపు కోచులు, విపరీత సంఖ్యకు పెరిగిపోయి వాటి సంకుచిత పరిధిలో రవాణా వ్యవస్థను ముందుకు తీసుకుపోవడం అసంభవమైనప్పుడు పరిష్కారం రైలింజన్, ఇంధన చమురు బండ్లలో దొరుకుతుంది. అందుకవసరమైన సృజనాత్మకతను ప్రకృతి మనకు ప్రసాదించి ఉంది. దాని ఉపయోగంలోనే మానవజాతి నేటి స్థాయినందుకొన్నది. అందులోని ఒడిదుడుకులను, కష్టనష్టాలను విజయవంతంగా ఎదుర్కొని దాటుకొంటూ వస్తూన్నది.

ఆ విధమైన పరిష్కారం దొరికేందుకు సమాజమంతటా, ముఖ్యంగా కష్టజీవుల్లోను వారికంటే ఒకమెట్టు పైనున్నవారిలోను సృజనాత్మక స్వభావం వెల్లివిరుస్తూ ఉండాలి. కొత్తదారులు తొక్కగల ధైర్యసాహసాలు, అందులో వైఫల్యాలకు నీరసించక తిరిగి మొదటి నుంచి పైకెక్కేందుకు పూనుకోగల ఉద్యమశీలత, అట్టి వారికి ప్రోద్బలమివ్వకపోతే మానె, కనీసం సహించి గౌరవంగా చూసే ఉదార నీతి వంటి సుగుణాల విత్తనాలు అక్కడక్కడానైనా మొలకెత్తి ఉండాలి. అప్పుడే తీవ్రమైన సామాజిక వైరుధ్యాలనుండి విప్లవాత్మకమైన కొత్త మిణుగురులు విరివిగా బయలుదేరుతాయి. వాటిలో ఒక్కటి అంటుకొంటేచాలు మంటలు మండనారంభిస్తాయి. క్రమంగా ఆ మంటలు దావానలమౌతాయి. ఉన్నత స్వభావం అసంఖ్యాకుల్లో పెంపొందించగల అటువంటి సంస్కరణోద్యమం కావాలి నేడు.



అభ్యుదయం కోరే వారందరిదీ పాలకుల నుంచి అధికారం లాక్కొనే ఏకాగ్రదృష్టి కావడం నేటి చారిత్రకావసరం. మిగిలినవన్నీ మన దృష్టిపథం నుంచి తొలగిపోవాలి. పరస్పర సహకారాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు పెరగాలి. దానికైన ఏ ఒక్కదారీ వదులుకోకూడదు. ఏ దారి వదులుకున్నా అది "చారిత్రక తప్పిదం" అవుతుంది.

అస్తమానం సమాజం కుళ్ళిపోయిందంటూ ఎత్తి చూపినంత మాత్రంచేత–వర్తమానం మీద గుడ్డి వ్యతిరేకత రెచ్చగొట్టుతూ కూర్చొంటే సరిపోదు. దాని నివృత్తికి సామాన్యుడు తన పరిధిలో ఏం చేయగలడో, ఏ సుగుణాలను అలవర్చుకొనగలడో, ఎట్టి నడవడితో వ్యవహరిస్తూ భావిలో గొప్ప విప్లవానికి నేపథ్యంగా ఉండగలడో కూడా చెప్పాలి, నేర్పాలి. నేటి ఆత్మహత్యలకంటే మెరుగైన ప్రత్యామ్నాయమొకటుందని సామాన్యునికి కన్పించాలి. కొత్త సమాజంలో ఉండవలసిన విలువలు, కొత్త ఆదర్శాలు, అనుసరణీయ రోల్ మోడల్స్ కన్పించాలి. ప్రతి వ్యక్తీ తుపాకులకెదురొడ్డి నిలబడేంత సీను సామాన్య పరిస్థితుల్లో ఉండదు. కానీ ప్రతి వ్యక్తీ ఇంతకంటే మేలైన సమాజానికి పునాదిగా మాత్రం ఉపయోగపడగలడు. అప్పుడే విజయం సాధ్యమౌతుంది. స్వాతంత్ర్యానికై పోరాడిన రోజుల్లో నాయకత్వం వహించినవారు ప్రజల్లో అభిమానశీలతను, త్యాగశీలతను, పోరాటపటిమను ఆదర్శాలుగా ప్రోత్సహించారు. అందుకైన అన్ని దారులను పూర్తిగా ఉపయోగించుకొన్నారు. నాటికి వారికది అవసరం.

నేటి పరిపాలకుల అవసరాలు దానికి పూర్తిగా వ్యతిరేకం. నేటికి ఇంకా బలవంతులుగానే ఉన్న అంతర్జాతీయస్థాయి పెట్టుబడిదారులతో మనవారికి సంబంధాలు బాగాచిక్కనై ఉన్నాయి. ఇక్కడ వ్యవసాయం, పరిశ్రమలు, మైనింగ్, ఆయుధాల వ్యాపారాలు, ఉద్యోగాలు వంటి రంగాలలో వారితో ఒక మాదిరి అవగాహన కుదిరి, భాగస్వామ్యం, పంపకాలు ఒక స్థాయి డైనమిక్ ఈక్విలిబ్రియం చేరుకొని ఉన్నాయి. కాని అవి శాశ్వతంగా నిల్చిఉండేవి కావు. ఆ నిలకడ ఉండీ లేని స్థితిలో ఉత్పన్నమయ్యే వైరుధ్యాలను తమకనుకూలంగా మలచుకొని గొప్పగా ఎదిగిపోగలమన్న ధీమాతో నేటి పాలకులు వ్యవహరిస్తున్నారు. అది సహేతుకమో, భ్రమయో ముందు జరగబోయే చరిత్రే తేలుస్తుంది. ఇప్పటికి వారు ఆ ధీమా నిషాలో తమ పెరుగుదలకు అడ్డుపడని సమాజాన్ని నిర్మించుకోవాలని తెగ ఉబలాటపడిపోతున్నారు. దానికి భిన్నంగా ఉండే ఏ చిన్న విషయాన్నీ ఏ మాత్రమూ సహించేపాటి స్థైర్యమూ వారిలో లేదు. అగాధపు టంచున నించున్న వాని భీతిని పోలి ఉంది వారి భయం. అది వారిలో లేని తెగువను పుట్టిస్తూంది. వారి పాలనలో సామాన్యుడు ప్రశ్నించడం, ఆలోచించడం సహించరాని అపచారాలైపోతున్నాయి. జరిగే అన్యాయాలను, సహజంగా జరిగేవిగా, వాటికి పరిష్కారం దైవమే చూపదలచినట్లుగా ప్రబోధాలు విరివిగా ఉంటున్నాయి. "భక్తి" ప్రబోధాలతో, మూలబడిన ఆచారాలను పునరుద్ధరిస్తున్నారు. సమాజంలో ఒకరి బాగుకు మరొకరు ఆటంకమని చూపుతూ, విభజించి పాలించే దుర్నీతి పరాకాష్ఠకు చేరుతున్నది. ఎదిగే అవకాశాలు జారిపోతాయేమోనన్న భయంలో వారేం చేస్తున్నారో వారికి తెలియటం లేదు. సర్వమూ వ్యాపారమయం. సిరి సంపాదనలో ఏ నియమమూ పాటించనక్కరలేని ఒక విశృంఖల పోటీల రేసు. ఇవన్నీ ఒకవేళ కొత్తగా పుట్టుకొచ్చినవేం కావు. నాగరికత పుట్టిన నాటి నుంచి వస్తున్నవే. ఇవి ఉధృతమైన ఒక దశకు చేరుకొన్నాం, అంతే.

ఈ దుష్కర పరిస్థితుల నుంచి సమాజాన్ని ఉద్ధరించబూనినవారు "నువ్వంటే నువ్వ"ని పరస్పరారోపణలు చేసుకోవడం వల్ల ప్రయోజనం లేదు. అభ్యుదయం కోరే వారందరిదీ పాలకుల నుంచి అధికారం లాక్కొనే ఏకాగ్రదృష్టి కావడం నేటి చారిత్రకావసరం. మిగిలినవన్నీ మన దృష్టిపథం నుంచి తొలగిపోవాలి. పరస్పర సహకారాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు పెరగాలి. దానికైన ఏ ఒక్కదారీ వదులుకోకూడదు. ఏ దారి వదులుకున్నా అది "చారిత్రక తప్పిదం" అవుతుంది.

సమాజం దాని వ్యవస్థలు పుట్టిపెరిగి కొనసాగే క్రమంలో మనిషి నిరంతరం అనేకానేక వైరుధ్యాలతో సతమతమౌతుంటాడు. వాటిలో ఒక్కటే, ఒక్కటంటే ఒక్కటే ప్రధానమూ కీలకమూ అయి ఉంటుంది. దాన్ని గుర్తించి, విడిగా చూసి, క్షుణ్ణంగా అర్థం చేసుకొని, పరిష్కరించుటకు సర్వశక్తులూ ఒడ్డిపోరాడే స్ఫూర్తిని, తెగువను సామాన్యుల్లో కలుగజేయాలి. అట్టి చైతన్యాన్ని స్ఫూర్తిని శక్తిని వారికి వ్యగల్గిన నేర్పరులు–మేధావులు, రచయితలు, ఇతర కళాకారులు, వివిధ పార్టీల సంస్థల స్వార్థరహిత కార్యకర్తలు మాత్రమే. వారి ప్రభావంలో ఉద్యమించిన జాతి తన కనుగుణమైన నాయకులనూ సృష్టించుకొంటుంది.

మన ఈ విశ్వం, అందులో భూగోళం, దానిపై జీవజాలం, అందులో మానవ సమాజాలు, వాటి చరిత్రలు బహు విశాలమైనవి, క్లిష్టమైనవి. ఏ ఒక్క సిద్ధాంతమూ, అది ఎంత గొప్పదైనా, వాటిని పరిపూర్ణంగా ఇముడ్చుకొని ఎల్ల కాలం విశదీకరించజాలదు. ప్రగతి ప్రవాహం ఆగదు. కొత్త నీళ్ళు రాకమానవు. పాత సూత్రీకరణల ఆధారంగా కొత్త సూత్రాలు, పాత 'సత్యాల' ఆధారంగా కొత్త 'సత్యా'లను ఆవిష్కరింపజేసుకొంటూనే మానవులు అభివృద్ధి చెందుతూ వచ్చారు. చరిత్ర ఎప్పుడూ దృశ్యాదృశ్యమే. పర్వతారోహకులకు తామెక్కివచ్చిన దారి ఒక్కొక్క లెవెల్లో ఒక్కొక్క రీతిగా కన్పించినట్లుగా ఉంటుంది చరిత్ర. ప్రస్తుతానికి, భావికీ తోడ్పడే వరకే మనం చరిత్రను, గతాన్ని ఉపయోగించుకోవాలి. అదియే గతానికి చరిత్రకి తగిన నివాళి.

నేటి గొప్ప సాంకేతిక అభివృద్ధికీ, దానిపై సామ్రాజ్యవాదులకు ఏర్పడివున్న పట్టుకు అబ్బురపడిపోయి, వారి వెంటక పరుగులు పెట్టడంలో మనకు చరితార్థత దక్కదు. వ్యవసాయ విప్లవపు చరమదశలో పారిశ్రామిక విప్లవం పుట్టి పెరగటం మొదలైంది. ఆ పుట్టుకకోసం ఎన్ని శతాబ్దాలపాటు పునాదిరాళ్ళనొక్కటొక్కటిగా పేర్చుకుంటూ వచ్చింది మానవజాతి! ఎన్ని తరాల కృషి, తెగువతో కూడిన సత్యాన్వేషణ, రక్తతర్పణం, రాపాడితే ఆ ఒక్క మిణుగురు ఇంగ్లాండులో పుట్టింది! అది ఎన్ని దశలు దాటి, ఎన్ని ఘోరాలు తట్టుకొని నేటి గ్లోబల్ స్థితికి చేరుకొన్నది! ఈ గ్లోబల్ స్థితి స్థిరపడి అభివృద్ధిచెందేందుకు ఇంకా ఎన్ని ఘోరాలు జరగవలసి ఉన్నాయో! అట్టి ఘోరాలను వీలైనంత తక్కువ నష్టంతో దాటిపోగల మార్గాలను వెతుక్కొని, ఉద్యమించగల ప్రయత్నంలోనే పండుతుంది, నేటి మనిషికి చరితార్థత.

ప్రవాహంలో కొట్టుకొనిపోయే రీతి path of least resistanceను అనుసరించి ఏవిధంగానైనా సరే బతికుంటే చాలుననుకొంటూ ఎంత నికృష్టస్థితికైనా కుంచించుకొనిపోయి మనుగడ సాగించే స్వభావం మన ప్రజానీకానిది. దాన్ని మార్చి వ్యతిరేకధృవోన్ముఖులను చేసి, పరిస్థితులను స్వశక్తితో మార్చుటకు పూనుకొనేలా చేయడానికి ఎంతటి భగీరథ ప్రయత్నం కావాలి!

■ సాధు సుబ్రహ్మణ్యం శర్మ

ప్రజాబలంలో టీఆర్ఎస్‌దే ఆధిక్యం

(మొదటిపేజీ తరువాయి)

పనిలో ఉన్నారని అభిప్రాయపడింది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్.. నాయకత్వ అనైక్యత కారణంగా ప్రజా విశ్వాసాన్ని పొందలేని స్థితిలో ఉందని, టీడీపీ వలసల కారణంగా బలహీన పడిందని అంచనా వేసింది. బీజేపీ కేంద్రంలోని అధికారంతో రాష్ట్రంలో బలపడే ప్రయత్నం చేస్తున్నా.. ప్రజలు స్పందించడంలేదని పేర్కొంది. ఇక సీపీఎం గత మూడేళ్లలో పెద్దగా పురోగతి సాధించలేకపోయిందని తెలిపింది. అయితే ప్రతికూల పరిస్థితుల్లోనూ తమ బలాన్ని కాపాడుకోగలిగామని అభిప్రాయపడింది. కానీ, సీపీఐ కలిసిరాకపోవడంతో వామపక్షాల ఐక్యత దెబ్బతింటోందని పేర్కొంది. దేశంలో మోదీ పాలన నియంతృత్వంతో సాగుతోందని, అంతర్జాతీయ స్థాయిలో వ్యవస్థీకృత ఆర్థిక సంక్షోభం ఇంకా కొనసాగుతూనే ఉందని తెలిపింది. నల్లగొండలో ఈ నెల 4వ తేదీ నుంచి జరుగుతున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర శాఖ ద్వితీయ మహాసభల్లో భాగంగా గత మూడేళ్లలో పార్టీ నిర్మాణం, అనుబంధ సంఘాల పనితీరు, లోటుపాట్లు, ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, రాష్ట్రంలోని వివిధ పార్టీల బలాబలాలపై పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నివేదిక ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై గత నాలుగు రోజులుగా రంగాల వారీగా చర్చలు జరుగుతున్నాయి. ఆ అంశాలు..

- రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్‌కు తెలంగాణ సెంటిమెంట్ ఇంకా సానుకూలంగా పనిచేస్తోంది. గత ఎన్నికల్లో 34.5 శాతం ఓట్లే వచ్చినా.. అధికారంలోకి వచ్చాక ఇతర పార్టీల నుంచి భారీగా వలసలను ప్రోత్సహించి బలపడింది. అయితే నిర్మాణపరంగా ఇంకా బలహీనంగానే ఉంది. అంతా కేసీఆర్‌పైనే ఆధారపడి ఉంది. వారసుడిగా కొడుకు కేటీఆర్‌ను ఆయన ప్రమోట్ చేస్తున్నారు. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు కుటుంబ పాలన పట్ల అసంతృప్తితో ఉన్నా మళ్లీ అధికారంలోకి వస్తామనే విశ్వాసం ఉన్నంతవరకు అణిగి ఉండే అవకాశమే ఉంది.
- ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్.. ప్రభుత్వ వైఫల్యాలపై దీటుగా వ్యవహరించలేకపోతోంది. గత పాలన, ప్రస్తుత నాయకత్వ అనైక్యత వల్ల ప్రజల విశ్వాసం పొందలేకపోతోంది. అయినా ఇప్పటికీ టీఆర్ఎస్ తర్వాత పెద్ద పార్టీగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా బలమైన నెట్‌వర్క్ ఉంది.
- టీడీపీని ముఖ్య నాయకులంతా వీడడంతో బాగా బలహీన పడింది. అయినప్పటికీ ఆ పార్టీకి ఇప్పటికీ క్షేత్రస్థాయి కేడర్, ఓటింగ్, బీసీల్లో పలుకుబడి ఉంది. కానీ, ఎన్నికల నాటికి పార్టీ మరింత బలహీనపడే అవకాశముంది. వైసీపీ ఇంకా బలహీన పడుతుంది. ఎంఐఎం వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌తోనే కలిసి ఉండే అవకాశముంది. బీజేపీ రాష్ట్రంలో బలపడాలని ప్రయత్నిస్తున్నా ప్రజల్లో మాత్రం ఆశించిన స్పందన లేదు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సీపీఐ కొంత బలహీనపడింది. వామపక్ష ఐక్యతకు మొదట ఉత్సాహంగా కలిసొచ్చిన ఆ పార్టీ.. ఇటీవల కాంగ్రెస్‌తో కలిసి ఓట్లు పొందాలనే ఆలోచిస్తోంది. టీ-మాస్, బీఎల్ఎఫ్‌తో కలిసి రాలేదు. అయినా వారిని ఫ్రంట్‌లోకి తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది.
- సీపీఎం గత మూడేళలో రాష్ట్రంలో ప్రజా పునాది రీత్యా పెద్దగా పురోగతి సాధించలేకపోయింది. పార్టీ సభ్యత్వం పదివేలు తగ్గింది. అయితే మహాజన పాదయాత్ర, టీ-మాస్ కార్యక్రమాలు, బీఎల్ఎఫ్ ఏర్పాటు వంటి వాటితో ప్రతికూల పరిస్థితులను అధిగమించింది. మహాజన పాదయాత్రతో పార్టీకి ఊపువచ్చింది. పలు ప్రాజెక్టుల భూ నిర్వాసితుల తరపున చేసిన పోరాటంతో ప్రజలకు సీపీఎంపై నమ్మకం పెరిగింది.
- అంతర్జాతీయంగా 2008లో ప్రారంభమైన వ్యవస్థీకృత ఆర్థిక సంక్షోభం ఇంకా కొనసాగుతూనే ఉంది. దీనివల్ల దోపిడీ మరింతగా పెరిగి ధనిక, పేద అంతరాలు తీవ్రమవుతున్నాయి.
- దాదాపు నాలుగేళ్ల మోదీ పాలన.. మతవాద, నియంతృత్వ పాలనగా సాగింది. జీఎస్‌టీ, నోట్ల రద్దు లాంటి చర్యలతో ఆర్థిక వ్యవస్థకు అనర్థాలు కలిగాయి. ఆర్ఎస్ఎస్ హిందుత్వ ఎజెండాను అమలు చేసే ప్రయత్నం జరుగుతోంది.
- అంబేద్కర్, పూలే భారతదేశంలో గొప్ప సంఘ సంస్కర్తలు. వారిని పాలకవర్గాలు తమలో కలుపుకోవడానికి, వారి కృషిని వక్రీకరించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆ ప్రమాదం నుంచి వారి ఆశయాలను కాపాడాలి. అయితే వీరి సిద్ధాంతాలకు ఉన్న పరిమితులను పార్టీ నేతలు గమనంలో పెట్టుకోవాలి.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని



నల్లగొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కమిటీ నూతన కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 60 మంది సభ్యులతో తెలంగాణ రాష్ట్ర కమిటీని ఖరారు చేశారు. మరో 9మంది సభ్యులను ఆహ్వానితులుగా, ముగ్గురు సభ్యులను ప్రత్యేక ఆహ్వానితులుగా ఖరారు చేశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మల్లు స్వరాజ్యం, సారంపల్లి మల్లారెడ్డి, రాజారావులను ప్రకటించారు. ఈ నెల 4న ప్రారంభమైన రాష్ట్ర మహాసభలు బుధవారంతో ముగిశాయి.

టీజేఏసీ పార్టీ పనులు ఏజెన్సీకి!

- రెండు నెలలు క్రితమే అప్పగింత
- త్వరలో ఢిల్లీకి బృందం
- పార్టీ కార్యాలయం కోసం వేట

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): టీజేఏసీ ఏర్పాటు చేయబోతున్న కొత్తపార్టీకి సంబంధించిన పనులను ఒక ప్రముఖ ఏజెన్సీకి అప్పగించింది. పార్టీ రిజిస్ట్రేషన్, డాక్యుమెంటేషన్‌తోపాటు కీలకమైన పనులు ఏజెన్సీ ఇప్పటికే కొనసాగిస్తోందని టీజేఏసీ నేతలు తెలిపారు. దాదాపు రెండు నెలలుగా ఏజెన్సీ ప్రతినిధులు పార్టీకి సంబంధించిన పనులని చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ రిజిస్ట్రేషన్‌కి సంబంధించిన వివిధ కార్యాలయాలకు వెళ్లిన సందర్భంలో తమని మీడియాతోపాటు రాజకీయ పార్టీల నేతలు గుర్తించే అవకాశం ఉన్నందునే ఈ నిర్ణయం తీసుకున్నామని టీజేఏసీ నేతలు చెబుతున్నారు. 2నెలలుగా జరుగుతున్న పనులు దాదాపు పూర్తి కావచ్చాయని, త్వరలోనే టీజేఏసీ ప్రతినిధులు లేదా కోదండరాం నేతృత్వంలోని బృందం ఢిల్లీకి వెళ్తుందని తెలిపారు. కొన్ని అంతర్గత సమావేశాలను నిర్వహించేందుకు ఆదర్శ నగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఒక క్వార్టర్‌ని టీజేఏసీ ఉపయోగించుకుంటోంది. ఈ క్వార్టర్ నిజామాబాద్ జిల్లాకి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేకి సంబంధించినదని సమాచారం. టీజేఏసీ కార్యాలయం, కోదండరాం నివాసంలో కాకుండా వేరే చోట ఎక్కడైనా అంతర్గత సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ఈ క్వార్టర్‌ని ఉపయోగించుకుంటున్నామని టీజేఏసీ నేతలు తెలిపారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్‌లో నిర్వహించిన టీజేఏసీ స్టీరింగ్ కమిటీ విస్తృతస్థాయి సమావేశానికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేసుకున్నారు. పార్టీ ఏర్పాటు చేయడం ఖాయమని తేలడంతో కొత్త కార్యాలయం కోసం వెతుకుతున్నామని టీజేఏసీ ముఖ్య నేత ఒకరు తెలిపారు. అప్పటిదాకా తాత్కాలికంగా ఈ క్వార్టర్‌ని వాడుకుంటున్నామని తెలిపారు. కాగా, తెలంగాణ లోక్‌సత్తాకి చెందిన నేతలు కోదండతో సమావేశమయ్యారు. బుధవారం ఆయన నివాసంలో ఈ సమావేశం జరిగిందని టీజేఏసీ నేతలు తెలిపారు. ఒక జాతీయ పార్టీకి చెందిన సీనియర్ నేత.. కోదండతో భేటీ అయ్యారని టీజేఏసీ నేతలు తెలిపారు. అయితే ఆయనెవరో చెప్పేందుకు నిరాకరించారు. తమ పార్టీలో చేరేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని, దీన్ని ముందే బహిర్గతం చేస్తే ఆయన వెనక్కి తగ్గే అవకాశం ఉందన్నారు.

కాంగ్రెస్‌లో ఎన్నికల జోష్!

నియోజకవర్గాల్లో నేతల కార్యక్రమాలు.. నిత్యం ప్రజల్లో ఉండేలా ప్రణాళికలు

- రాష్ట్రస్థాయిలో సమావేశాలు, యాత్రలు
- త్వరలో ప్రారంభం కానున్న బస్సుయాత్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):

- కోదాడ నియోజకవర్గానికి ఎస్సారెస్పీ జలాల కోసం స్థానిక ఎమ్మెల్యే, టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీమణి పద్మావతి పాదయాత్ర. మోతె ఎత్తిపోతల సాధన కమిటీ పేరుతో పాలేరు జలాశయం నుంచి సూర్యాపేట కలెక్టరేట్‌కు వరకు మూడు రోజుల యాత్ర చేపట్టిన ఎమ్మెల్యే.
- మార్నింగ్ వాక్‌ల పేరిట మధిర నియోజకవర్గ ప్రజల సమస్యల్ని విని పరిష్కరించే కార్యక్రమం చేపట్టిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క. కాలువ యాత్ర పేరిట పంట పొలాలకు నీరందుతున్న విధానంపై పరిశీలన.
- నర్సాపూర్ నియోజకవర్గంలోని మంజీర పరివాహక ప్రాంతాల్లో 24 గంటల విద్యుత్తును 9 గంటలకు కుదించడంపై ఆందోళన చేపట్టిన మాజీ మంత్రి సునితా లక్ష్మారెడ్డి. కొల్చారం మండలం చిన ఘనపురం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా, వంటా-వార్పు.
- మహేశ్వరం నియోజకవర్గంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమంలో ప్రజల్లోకి వెళ్తున్న మాజీ హోంశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.
- సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రజలతో ముఖాముఖి పేరిట రోజుకో గ్రామంలో రాత్రి పూట బస చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి.
- భూపాలపల్లిలో పల్లె పల్లెకు కాంగ్రెస్-గడప గడపకు వెంకన్న పేరిట కార్యక్రమం చేపట్టిన మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి.

నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతలు క్రియాశీలమవుతున్న తీరిది. వీరే కాకుండా ఇంకా చాలా మంది నేతలు ఇలాంటి కార్యక్రమాలు రూపొందించుకొని ప్రజల్లోకి వెళ్తున్నారు. ముందస్తు ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయనే సంకేతాలు వస్తుండడం, డిసెంబరులో ఎన్నికలు జరగవచ్చని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ బహిరంగంగానే ప్రకటించడం, అందుకు సిద్ధపడాలని పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడంతో పార్టీలో ఒక్కసారిగా చలనం వచ్చింది. సీనియర్లు వారి నియోజకవర్గాల్లో కార్యక్రమాలు మొదలుపెట్టగా.. ఔత్సాహిక అభ్యర్థులు తమ నియోజకవర్గాల వేట ప్రారంభించారు.

గాంధీభవన్‌లో సందడి..

కొంతకాలంగా బోసిపోయిన గాంధీభవన్.. ఈ మధ్య కళకళలాడుతోంది. అక్కడ పరిస్థితి చూసిన వారికి ఎన్నికలు వచ్చాయా.. అనే భావన కలుగుతోంది. అధిష్ఠానం కూడా నేతలకు టికెట్లపై స్పష్టమైన హామీ ఇవ్వకపోయినా.. ప్రజల్లోకి వెళ్లి పనిచేసుకోవాలని చెబుతోంది. పంజాబ్, గుజరాత్ ఎన్నికల తర్వాత వచ్చిన ఊపుతో కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై దృష్టి సారించడంతోపాటు ఆ రాష్ట్రాల్లోని విధానాలు అమలు చేయడం మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే ఎస్సీ, ఎస్టీ నియోజక వర్గాల్లో ఎల్‌డీఎంఆర్‌సీ (రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో నాయకత్వ బలోపేతం) పేరిట శిక్షణా శిబిరాలను చేపట్టింది. అనంతరం సోషల్ మీడియా ఉపయోగంపై కూడా శిక్షణా శిబిరాన్ని నిర్వహించింది. ప్రస్తుతం శక్తి యాప్ రూపకల్పనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల మంది కాంగ్రెస్ సైనికులను తయారు చేసే పనిలో ఉంటూనే.. మధ్య మధ్యలో భారీ సభలు కూడా నిర్వహిస్తోంది. నల్లగొండలో కాంగ్రెస్ నేత బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య నేపథ్యంలో ఈ నెల 5న భారీ సంతాప సభను నిర్వహించారు. దీనికి పార్టీ నేతలు బేధాభిప్రాయాలు వీడి ఒకే వేదికపైకి వచ్చారు. ఆ మరుసటి రోజే వనపర్తిలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నేతృత్వంలో స్వయం సహాయక బృందాల సమావేశం నిర్వహించారు. నాయకుల్లో ఐక్యతను చాటేందుకు కాంగ్రెస్ త్వరలో బస్సు యాత్ర చేపట్టనుంది. ఇందుకు సంబంధించి సన్నాహాలు చేస్తోంది. ఈ యాత్రలో పాల్గొనేందుకు ఇప్పటివరకు 80 మంది నాయకులు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. రెండు విడతలుగా జరిగే బస్సు యాత్ర ముగిసిన అనంతరం కొందరు నేతలు జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి పాదయాత్రలు కూడా చేయనున్నట్లు సమాచారం.

ప్రభుత్వ కార్యాలయాలు.. అవినీతి అడ్డాలు!

- ప్రజాతంత్ర హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం
- సీపీఎం నేతలు జూలకంటి రంగారెడ్డి, సుదర్శన్



విలేకరులతో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి, సుదర్శన్

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ కార్యాలయాలు అవినీతి అడ్డాలుగా మారాయని, ప్రభుత్వం ప్రజాతంత్ర హక్కులను కాలరాస్తోందని సీపీఎం రాష్ట్ర నాయకులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ ఆరోపించారు. ప్రజలు నిరసన తెలపడాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం తట్టుకోలేకపోతోందని, ఈ చర్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయన్నారు. సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామిక హక్కుల రక్షణ కోసం ప్రజాతంత్రవాదులతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. ఈ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని కోరారు. సిరిసిల్ల జిల్లా నేరెళ ఘటన, మల్లన్నసాగర్ నిర్వాసితుల పోరాటం, భూపాలపల్లిలో ఆదివాసీల గూడెంపై దాడులు ప్రభుత్వ తీరును బట్టబయలు చేస్తున్నాయని పేర్కొన్నారు. మిర్చి రైతులకు బేడీలు వేయడం, రాష్ట్ర రాజధానిలో ర్యాలీలు, సభలకు అనుమతి ఇవ్వకపోవడం సర్కారు అణచివేతకు నిదర్శనమన్నారు. అవినీతికి పాల్పడేవారు ఏ స్థాయిలో ఉన్నా చర్యలు తీసుకుంటానన్న సీఎం కేసీఆర్.. కుంభకోణాల్లో తమ పార్టీ నాయకుల ప్రమేయం ఉన్నా విచారణ జరపకుండా రక్షణ కల్పిస్తున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్ ఎంపీ ఇబ్రహీపట్నంలో 38 ఎకరాల భూమిని, సీఎం కార్యాలయ కార్యదర్శి రూ.587 కోట్ల విలువైన 693 ఎకరాల ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, మరో సీనియర్ నాయకుడు దళితుల అసైన్డ్ భూముల ఆక్రమణకు పాల్పడ్డారని అన్నారు. మిషన్ కాకతీయ, సాదా బైనామా రిజిస్ట్రేషన్లు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో అవినీతి జరిగిందని ఆరోపించారు. వాణిజ్య పన్నుల కుంభకోణంలో 26 మంది అధికారుల ప్రమేయం ఉన్నట్లు రుజువైందన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పదవుల కోసమే కాంగ్రెస్ యాత్ర: కర్నె

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ నేతలు చేపట్టిన నిరుద్యోగ చైతన్యయాత్ర నిరుద్యోగుల కోసం కాదని, పదవులు కాపాడుకోవడానికేనని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఎద్దేవా చేశారు. సీమాంధ్ర ప్రాంతం వారికే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చి.. తెలంగాణ నిరుద్యోగులకు కాంగ్రెస్ ద్రోహం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారం లో ఉన్నప్పుడు 24వేల ఉద్యోగనియామకాలే జరిగాయని, టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 81,739 పోస్టులకు నియామక ప్రక్రియ చేపట్టిందని ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు.

టీపీసీసీ ఓబీసీ సెల్ భేటీ వాయిదా!

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో బీసీల పోరు ఇప్పటికిప్పుడే సమసిపోయేలా కనిపించడం లేదు. బీసీ నేతలంతా ఏకం కావాలని చేస్తున్న ప్రయత్నాలు వారి మధ్య మరింత అగాధాన్ని సృష్టిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 9న (శుక్రవారం) జరగాల్సిన టీపీసీసీ ఓబీసీ సెల్ సమావేశాన్ని వాయిదా వేసుకోవాలని నేతల మీద ఒత్తిడి వచ్చినట్లు తెలిసింది. అయితే నేతలు అందుకు ససేమిరా అనడంతో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఆర్ సీ ఖుంటియా రంగంలోకి దిగినట్లు తెలిసింది. తాను 9న అందుబాటులో ఉండడం లేదనీ, తనకు కూడా సమావేశానికి హాజరుకావాలని ఉందని చెప్పినట్లు తెలిసింది. శివరాత్రి తర్వాత భేటీ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిసింది. అయితే దీనికి కొందరు సీనియర్లు విముఖత వ్యక్తం చేస్తున్నారు. కాగా ఓబీసీ సెల్ ఛైర్మన్ చిత్తరంజన్ మాత్రం సమావేశాన్ని వాయిదా వేయడమే సమంజసంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 16, 17 తేదీల్లో సమావేశం జరుపుతామని, పీసీసీ అధ్యక్షుడితో మాట్లాడి తేదీలు ఖరారు చేసుకుంటామని ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.


కాంగ్రెస్‌తోనే న్యాయం: నేరెళ్ల శారద

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మహిళల ఆర్థికాభివృద్ధి క్షీణించిందని టీపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు నేరెళ్ల శారద ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే ప్రతి మహిళ వద్ద కనీసం రూ. లక్ష ఉండేలా చూస్తామన్నారు. రాహుల్ నాయకత్వంలో మహిళలకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం తమకు ఉందని గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో అన్నారు.

టార్గెట్ ఐఏఎస్

స్వీకరిద్దాం... సివిల్స్ సవాల్

సివిల్స్ యజ్ఞం మొదలైంది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర అఖిల భారత సర్వీస్ అధికారుల ఎంపిక కోసం నిర్వహించే సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ - 2018 కోసం యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజా నోటిఫికేషన్ ద్వారా 24 అఖిల భారత సర్వీసు విభాగాలలో పోస్టులను భర్తీ చేయనుంది. దేశంలో అత్యంత ఆదరణ కలిగిన ఈ పరీక్ష కోసం ఏటా లక్షలాది మంది పోటీపడుతుంటారు. అంతేకాకుండా ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారుల ఎంపిక కోసం కూడా ఇదే పరీక్షను పరిగణనలోకి తీసుకుంటారు. ఇందుకు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్ - 2018 ప్రకటనను కూడా యూపీఎస్సీ వెల్లడించింది. ఈ పరీక్షల్లో విజయం సాధించాలంటే అనుసరించాల్సిన వ్యూహం...



ఖాళీలు 782

సివిల్ సర్వీసెస్‌లో పరీక్షలో ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశలు ఉంటాయి. వీటికి మొత్తం 2025 మార్కులు కేటాయించారు. తొలి దశ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన వారు మెయిన్స్‌కు అర్హత సాధిస్తారు. మెయిన్స్‌లో ఏడు పేపర్లు ఉంటాయి. వీటికి కేటాయించిన మార్కులు 1750. మెయిన్స్ ద్వారా ఇంటర్వ్యూకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూ 275 మార్కులకు ఉంటుంది. ప్రిలిమినరీ పరీక్షను జూన్ 3వ తేదీన, మెయిన్ పరీక్షలను సెప్టెంబరులో నిర్వహించే అవకాశం ఉంది. ముందుగా తొలి దశ ప్రిలిమ్స్‌లో విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహాలను చూద్దాం.

ప్రిలిమ్స్.. రెండు పేపర్లు

- ప్రిలిమ్స్ ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు.. పేపర్ - 1, పేపర్ - 2 ఉంటాయి. వీటికి 400 మార్కులు కేటాయించారు. ప్రిలిమ్స్‌లో నెగిటివ్ మార్కులు కూడా ఉంటాయి.
- పేపర్-2 కేవలం అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో వచ్చిన మార్కులను ర్యాంకు కోసం పరిగణనలోకి తీసుకోరు. అయితే ఇందులో కనీస అర్హత మార్కులను (33 శాతం) సాధించాల్సి ఉంటుంది. అప్పుడే పేపర్ - 1ను మూల్యాంకనం చేస్తారు. కేవలం పేపర్ - 1 ఆధారంగా మాత్రమే మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు.
- పేపర్ - 2: ఇందులో మొత్తం 80 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 2 1/2 మార్కులు. మొత్తం 200 మార్కులు కేటాయించారు. ఈ పేపర్‌లో కాంప్రెహెన్షన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, లాజికల్ రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీతోపాటు 10వ తరగతి స్థాయిలోని బేసిక్ న్యూమరసీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ వంటి అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. ఈ పేపర్ కోసం రోజూ ఐదు మాక్ టెస్ట్‌లను పూర్తిస్థాయిలో ప్రాక్టీస్ చేయాలి. తెలుగు మాధ్యమం అభ్యర్థులు రోజుకు 30 నిమిషాలు ఇంగ్లీష్ కోసం కేటాయించాలి.
- పేపర్ - 1: ఇందులో 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు. మొత్తం 200 మార్కులు కేటాయించారు. ఈ పేపర్‌లో వివిధ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఆయా అంశాలను పరిశీలిద్దాం...

వర్తమాన అంశాలు

జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనల నుంచి ప్రశ్నలు అడుగుతారు. గతంతో పోల్చితే ప్రస్తుతం ఈ విభాగానికి ప్రాధాన్యం పెరిగింది. 2015 వరకు అభ్యర్థులు ఈ విభాగానికి అంతగా ప్రాధాన్యం ఇచ్చేవారు కాదు. కేవలం మెయిన్స్ కోణంలో మాత్రమే ఈ అంశాలను చదివేవారు. అయితే క్రమంగా ప్రిలిమ్స్‌లో ఈ విభాగం నుంచి అడిగే ప్రశ్నల సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2014 ప్రిలిమ్స్‌లో ఈ అంశం నుంచి కేవలం మూడు ప్రశ్నలు మాత్రమే ఇచ్చారు. కానీ 2017లో అత్యధికంగా 80 ప్రశ్నలు వచ్చాయి.

- ప్రస్తుతం ప్రిలిమ్స్ మొత్తం వర్తమాన అంశాల చుట్టూనే తిరుగుతోంది. పాలిటీ, ఎకానమీ, సైన్స్, సంస్కృతి, జాగ్రఫీకి సంబంధించిన అంశాలను అధ్యయనం చేయాలి. అదే సమయంలో ఆయా అంశాలపై సమకాలీనంగా చోటుచేసుకుంటున్న సంఘటనలు, వాటి నేపథ్యంపై కూడా అవగాహన పెంచుకోవాలి.
- గత అనుభవాల ఆధారంగా కేవలం ఈ అంశంపైనే పూర్తిగా దృష్టి సారించడం కూడా అంతమంచిది కాదు. ఎందుకంటే ఈ అంశం నుంచి ఒక్క ప్రశ్న ఇవ్వకుండా కూడా ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాన్ని రూపొందించే అవకాశం కూడా ఉంది. కాబట్టి ఒక్క దానికే మితిమీరిన ప్రాధాన్యం ఇవ్వకుండా అన్ని అంశాలను సమగ్రంగా చదవాలి.

ఏ అభ్యర్థులు ఎలా?

- 2017 మెయిన్స్ ఫలితాల తరవాత చాలా మంది జాగ్రఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్ తదితర సబ్జెక్ట్‌లనుకాకుండా ఆంత్రోపాలజీపై దృష్టి సారించారు. దీనికి ప్రధాన కారణం 2017 మెయిన్స్ ద్వారా ఇంటర్వ్యూకు అర్హత సాధించిన వారిలో అత్యధిక మంది ఆప్షనల్ సబ్జెక్ట్ ఆంత్రోపాలజీ కావడమే. ఢిల్లీలో కూడా ఇదే సరళి కొనసాగింది. కాబట్టి సీనియర్లు (గతంలో సివిల్స్‌కు హాజరై తిరిగి రాస్తున్నవారు) రోజుకు కనీసం ఐదు గంటలు నూతన ఆప్షనల్ సబ్జెక్ట్ కోసం కేటాయించాలి. మిగతా సమయాన్ని ప్రిలిమ్స్‌కు వెచ్చించాలి. గతంలో అర్హత సాధించాం, సులువే అనే ధోరణితో ప్రిలిమ్స్‌ని నిర్లక్ష్యం చేయకుండా మెయిన్స్‌తో సమాంతరంగా ప్రిలిమ్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- జూన్‌లో ప్రిపరేషన్ ప్రారంభించిన అభ్యర్థులు ఆప్షనల్ సబ్జెక్ట్‌ను పక్కనబెట్టి మెయిన్స్ జనరల్ స్టడీస్, ప్రిలిమ్స్ కలిపి చదవాలి. జనరల్ స్టడీస్‌లో కనీసం రోజుకు ఒక్క మెయిన్స్ ప్రశ్ననైనా ప్రాక్టీస్ చేస్తూ ప్రిలిమ్స్ ప్రిపరేషన్ సాగించడం ఉత్తమం.
- కొంత మంది నోటిఫికేషన్ తరవాత ప్రిపరేషన్ ప్రారంభిస్తారు. ఇలాంటివారు ప్రిలిమ్స్ కేంద్రీకృతంగా ప్రిపరేషన్ సాగిస్తూ మెయిన్స్‌పై కూడా అవగాహన పెంచుకునే ప్రయత్నం చేయాలి. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో రెంటిలో ఉమ్మడిగా ఉన్న అంశాలను విశ్లేషించుకుంటూ చదవాలి. తద్వారా మెయిన్స్‌లోని జనరల్ స్టడీస్‌లో 60 శాతం సిలబస్‌ను పూర్తి చేసే ఆస్కారం ఉంటుంది.

భారతదేశ చరిత్ర - జాతీయోద్యమం

ఇందులో విభిన్న కోణాల నుంచి ప్రశ్నలను అడుగుతున్నారు. గత ప్రశ్నపత్రాలను విశ్లేషిస్తే ఈ విషయం తెలుస్తుంది. గతంలో రాజకీయపరమైన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రస్తుతం సామాజిక, సాంస్కృతిక చరిత్రకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. కాబట్టి ఈ అంశాలతోపాటు జాతీయోద్యమంపై కూడా దృష్టి సారించాలి. 2017లో ఈ అంశం నుంచి 14 ప్రశ్నలు అడిగారు. ఈ విభాగం కోసం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, ఎన్ఐఓఎస్ పుస్తకాలు బాగా ఉపయోగపడతాయి.

భారత - ప్రపంచ భూగోళ శాస్త్రం

ఇందులో ఎక్కువగా విభిన్న కోణాల నుంచి ప్రశ్నలను అడుగుతున్నారు. ఈ విభాగంలోని అంశాలను సమకాలీన సంఘటనలతో అన్వయించుకుంటూ చదవాలి. తద్వారా ప్రయోజనం ఉంటుంది. చరిత్ర, జాగ్రఫీ అంశాలు మెయిన్స్ పేపర్-1లో ఉన్నాయి. కాబట్టి మెయిన్స్ దృక్కోణంలో చదివితే మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

ఇండియన్ పాలిటీ - గవర్నెన్స్

భారత రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ, పంచాయతీరాజ్, పబ్లిక్ పాలసీ, హక్కులు, సమస్యలు తదితర అంశాలను సిలబస్‌లో పేర్కొన్నారు. వీటిల్లోని ప్రాథమిక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలి. అంతేకాకుండా ఈ అంశాలను వర్తమాన సంఘటనలకు అన్వయిస్తూ ప్రశ్నలు ఎక్కువగా అడుగుతున్నారు. ఈ విషయాన్ని గమనంలోకి తీసుకొని ప్రిపరేషన్ సాగించాలి. గతేడాది 23 ప్రశ్నలు ఈ విభాగం నుంచి వచ్చాయి. కాబట్టి ఈ అంశాలను వర్తమానికి అన్వయిస్తూ, వాటి వెనుక ఉన్న నేపథ్యాన్ని అవగాహన చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

ఇండియన్ ఎకానమీ

ఆర్థిక సామాజికాభివృద్ధి, సుస్థిరాభివృద్ధి, పేదరికం, డెమోగ్రాఫిక్స్, సాంఘిక సేవా విభాగంలో ప్రాధ్యమాలు తదితర అంశాలను సిలబస్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్ల ద్వారా ఆయా అంశాలపై సమాచారాన్ని సేకరించుకోవాలి. ప్రశ్నలు వర్తమాన సంఘటనల ఆధారంగా ఉంటాయి. కాబట్టి సమకాలీనంతో అన్వయించుకుంటూ చదవాలి. అంతేకాకుండా ఈ అంశాల్లో కొన్నిటిని మెయిన్స్ జనరల్ స్టడీస్ మూడో, రెండో పేపర్‌లో పేర్కొన్నారు. కాబట్టి విశ్లేషణాత్మకంగా చదివితే మెయిన్స్‌కు కూడా ఉపకరిస్తుంది.

ఎన్విరాన్‌మెంట్

2014 నుంచి ఈ విభాగంలో అడిగే ప్రశ్నల సంఖ్య క్రమేణా పెరుగుతూ ఉందనే విషయాన్ని గమనిచాలి. ఒక సందర్భంలో దాదాపు 30 ప్రశ్నలు ఇచ్చారు. కాబట్టి ఈ అంశానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్విరాన్‌మెంట్ ఎకాలజీలో సాధారణ సమస్యలు, బయోడైవర్సిటీ, వాతావరణ మార్పు తదితర అంశాలను సిలబస్‌లో పేర్కొన్నారు. మెయిన్స్ జనరల్ స్టడీస్‌లోని మూడో పేపర్‌లో అంశాలను వీటితో క్రోడీకరించి అధ్యయనం చేయడం మంచిది. తద్వారా ప్రిపరేషన్ సమగ్రంగా ఉంటుంది.

జనరల్ సైన్స్

ఈ విభాగంలో ఎక్కువగా బయాలజీ నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తూ ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉన్న బయాలజీ పుస్తకాలను చదవాలి. తద్వారా ప్రిపరేషన్, ప్రశ్నల సరళిపై అవగాహన ఏర్పడుతుంది. అంతేకాకుండా 9 - 12 తరగతుల్లోని మరికొన్ని అంశాలను అధ్యయనం చేయడం మంచిది. వీటితోపాటు ఫిజిక్స్, కెమిస్ట్రీలలోని ప్రాథమిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి.



డాక్టర్ పి.వి. లక్ష్మయ్య
(డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్)

కటాఫ్ మార్కులు

సిలబస్ మారిన తరవాత జరిగిన ప్రిలిమినరీ పరీక్ష తీరుతెన్నులను, కటాఫ్‌లను పరిగణనలోకి తీసుకొని సన్నాహాలు మొదలుపెట్టడం ప్రయోజనకరం. ఈ క్రమంలో 2016 ప్రిలిమ్స్ కటాఫ్ మార్కులు (2017 ప్రిలిమ్స్ కటాఫ్ మార్కులను వెల్లడించడానికి మరో నాలుగు నెలల సమయం పడుతుంది. 2017 సివిల్స్ తుది ఫలితాల తరవాతే ఇవి అందుబాటులోకి వస్తాయి).

కేటగిరీ	కటాఫ్ (200 మార్కులకు)
జనరల్	116
ఓబీసీ	111
ఎస్సీ	109
ఎస్టీ	97

పరిమితంగా

సివిల్స్ పరీక్షకు హాజరయ్యే విషయంలో యూపీఎస్సీ కొన్ని పరిమితులు విధిస్తుంది. జనరల్ / ఓబీసీ అభ్యర్థులు ఆరుసార్లకు మించి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయడానికి వీల్లేదు. ఎస్సీ, ఎస్టీల విషయంలో పరిమితులు లేవు.

ముఖ్య సమాచారం

- అర్హత: ఏదైనా డిగ్రీ. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: 21 - 32 ఏళ్లు (2018 ఆగస్టు 1 నాటికి).
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 6, 2018.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు (ప్రిలిమ్స్): హైదరాబాద్, వరంగల్, అనంతపురం, విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ.
- వెబ్‌సైట్: http://www.upsc.gov.in/

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్

- మొత్తం ఖాళీలు: **110**
- అర్హత: బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ, అగ్రికల్చర్, ఫారెస్ట్రీ, యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, ఇంజనీరింగ్‌లలో ఏదైనా ఒక సబ్జెక్ట్‌తో డిగ్రీ. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: 21-32 ఏళ్లు (2018 ఆగస్టు 1 నాటికి).
- ఎంపిక: ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశలు ఉంటాయి. తొలి దశ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందినవారు మెయిన్స్‌కు అర్హత సాధిస్తారు. మెయిన్స్ ద్వారా ఇంటర్వ్యూకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ సర్వీస్, సివిల్స్ కోసం ప్రిలిమ్స్ పరీక్ష ఒకటే. కాబట్టి ఫారెస్ట్ సర్వీస్ అభ్యర్థులు ప్రిలిమ్స్‌కు హాజరు కావాలి. సివిల్స్ ప్రిలిమ్స్ నిబంధనలే దీనికీ వర్తిస్తాయి. ఇందులో కూడా పేపర్-2లో కనీస అర్హత మార్కులను (33 శాతం) సాధించాల్సి ఉంటుంది. అప్పుడే పేపర్ - 1ను మూల్యాంకనం చేస్తారు. ప్రిలిమ్స్‌లో నెగెటివ్ మార్కులు కూడా ఉంటాయి.
- పేపర్-1 ఆధారంగా మాత్రమే మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మెయిన్స్‌లో ఆరు పేపర్లు ఉంటాయి. పేపర్ - 1 జనరల్ ఇంగ్లీష్, పేపర్-2 జనరల్ స్టడీస్ కాగా మిగతా పేపర్ - 3,4,5,6 ఆప్షనల్ సబ్జెక్ట్‌లు. మెయిన్ పరీక్షలను డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం ఉంది. ఈ దశకు మొత్తం 1400 మార్కులు కేటాయించారు. మెయిన్స్ ఆధారంగా తుది దశ ఇంటర్వ్యూకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు 300 మార్కులు ఉంటాయి.

జాబ్ కార్నర్

ఎన్‌బిసిసి ఇండియా లిమిటెడ్

ఎన్‌బిసిసి ఇండియా లిమిటెడ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **145**
- పోస్టులు: జనరల్ మేనేజర్ (సివిల్) 2, అడిషనల్ జనరల్ మేనేజర్ (సివిల్ 5, లా 1, ఫైనాన్స్ 1), డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్ 10, ఫైనాన్స్ 6), ప్రాజెక్ట్ మేనేజర్(సివిల్) 16, మేనేజర్ (ఫైనాన్స్ 4, ఇన్వెస్టర్ రిలేషన్స్ 1, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ 1), డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్) 19, డిప్యూటీ మేనేజర్ (ఫైనాన్స్ 5, ఆర్కిటెక్ట్ & ప్లానింగ్ 1), సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ (సివిల్ 20, ఎలక్ట్రికల్ 4, ఐటి 2), సీనియర్ ఎగ్జిక్యూటివ్ (ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్) 1, అసిస్టెంట్ మేనేజర్ (కంపెనీ సెక్రటరీ 2, ఫైనాన్స్ 4, హెచ్‌ఆర్‌ఎం 4, ఇన్వెస్టర్ రిలేషన్స్ 1), మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఫైనాన్స్) 4, ఎగ్జిక్యూటివ్ (గ్రాఫిక్/ క్రియేటివ్ డిజైనర్) 1, జూనియర్ ఇంజనీర్ (సివిల్ 20, ఎలక్ట్రికల్ 3, ఐటి 2, మెకానికల్ 1), సీనియర్ స్టెనోగ్రాఫర్ 1, ఆఫీస్ అసిస్టెంట్ 3
- వెబ్‌సైట్: www.nbccindia.com



హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్

హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్ఎల్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: **7**. పోస్టులు: సీనియర్ మేనేజర్ (సెక్యూరిటీ) 1, మెడికల్ ఆఫీసర్ (6)
- అర్హత: మేనేజర్ పోస్టుకు డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు డిఫెన్స్/ బిఎస్‌ఎఫ్/ సిఐఎస్‌ఎఫ్/ పారామిలిటరీ దళాల్లో పనిచేసి ఉండాలి. మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఎంబిబిఎస్ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో పీజీ/ డిప్లొమా చేసి ఉండాలి.
- వయసు: సీనియర్ మేనేజర్‌కు 42 ఏళ్లు, మెడికల్ ఆఫీసర్‌కు 61 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు ఫీజు: రూ.100
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 6
- వెబ్‌సైట్: www.hslvizag.in

చిత్తరంజన్ కేన్సర్ ఇనిస్టిట్యూట్

చిత్తరంజన్ నేషనల్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: **22**
- పోస్టులు: సీనియర్ రెసిడెంట్ 6, జూనియర్ రెసిడెంట్ 16
- వయసు: సీనియర్ రెసిడెంట్ పోస్టులకు 33 ఏళ్లు, జూనియర్ రెసిడెంట్ పోస్టులకు 30 ఏళ్లు మించరాదు
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 28
- వెబ్‌సైట్: www.cnci.org.in

ఇండియన్ బ్యాంక్

ఇండియన్ బ్యాంక్ - స్పోర్ట్స్ కోటా కింద క్లర్క్/ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

- ఖాళీలు: **21**
- స్పోర్ట్స్ వారీ ఖాళీలు: బాస్కెట్ బాల్ 6, క్రికెట్ 7, వాలీబాల్ 5, హాకీ 3
- వయసు: 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.
- అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. రంజీ/ దులీప్ ట్రోఫీల కోసం ఆడినవారు, జాతీయ/ రాష్ట్ర స్థాయిలో జూనియర్/ సీనియర్ కేటగిరీల్లో ఆడినవారు దరఖాస్తు చేసుకోవచ్చు
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 3
- వెబ్‌సైట్: www.indianbank.in/

ఎయిమ్స్ నుంచి.. ఎంబీబీఎస్

దేశంలోని ప్రఖ్యాత వైద్య విద్యా విజ్ఞాన సంస్థల్లో ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఒకటి. ఉత్తమ ఫ్యాకల్టీ, అత్యుత్తమ మౌలిక వసతులు, ఉన్నత ప్రమాణాలతో కూడిన ఎంబీబీఎస్ కోర్సును అతి స్వల్ప ఖర్చుతో పూర్తి చేయాలనుకునే వారికి చక్కని వేదిక ఎయిమ్స్. 2018-19 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశానికి ఎయిమ్స్ ప్రకటనను జారీ చేసింది. దీనికి సంబంధించిన వివరాలను చూద్దాం..

గతంలో ఎయిమ్స్‌కు ఏడు క్యాంపస్‌లు మాత్రమే ఉండేవి. ఇప్పుడు అదనంగా మరో రెండు క్యాంపస్‌లు చేరాయి. దీంతో ఎయిమ్స్‌కు దేశవ్యాప్తంగా ఉన్న క్యాంపస్‌ల సంఖ్య 9కి పెరిగింది. వీటిల్లో 807 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొదటి సారిగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఎయిమ్స్‌లో కూడా ప్రవేశాలను నిర్వహిస్తున్నారు.

క్యాంపస్	సీట్ల సంఖ్య
ఎయిమ్స్ - న్యూఢిల్లీ	107
ఎయిమ్స్ - రాయ్‌పూర్	100
ఎయిమ్స్ - గుంటూరు (మంగళగిరి)	50
ఎయిమ్స్ - రుషికేశ్	100
ఎయిమ్స్ - భోపాల్	100
ఎయిమ్స్ - పాట్నా	100
ఎయిమ్స్ - జోధ్‌పూర్	100
ఎయిమ్స్ - నాగ్‌పూర్	50
ఎయిమ్స్ - భువనేశ్వర్	100

- గుంటూరు క్యాంపస్‌ను తాత్కాలికంగా విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో, ఎయిమ్స్- నాగ్‌పూర్ క్యాంపస్‌ను తాత్కాలికంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ - నాగ్‌పూర్‌లో ఏర్పాటు చేశారు. న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో ఏడు సీట్లను విదేశీయులకు కేటాయించారు.
- **అర్హత:** 60 శాతం మార్కులతో (ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులకు 50 శాతం) 12వ తరగతి / తత్సమానం (ఇంగ్లీష్, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లతో). చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** 17 ఏళ్లు (2018 డిసెంబరు 31 నాటికి)
- **ప్రవేశం ఇలా:** రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఇందుకు దేశ వ్యాప్తంగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో రాత పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్ష మే 26, 27 తేదీల్లో రెండు షిఫ్టులుగా ఉంటుంది. రాత పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో జరుగుతుంది. ఇందులో ఐదు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లీష్ /హిందీ భాషల్లో మాత్రమే ఉంటుంది. సమాధానాలను గుర్తించడానికి 210 నిమిషాలు కేటాయిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. నెగిటివ్ మార్కులు ఉంటాయి. ప్రతి తప్పునకు 1/3 వంతు మార్కు కోత విధిస్తారు.



విభాగం	మార్కులు
ఫిజిక్స్	60
కెమిస్ట్రీ	60
బయాలజీ	60
జనరల్ నాలెడ్జ్	10
ఆప్టిట్యూడ్ అండ్ లాజికల్ థింకింగ్	10

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 5, 2018.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, చీరాల, గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, విజయనగరం, రాజమండ్రి.
- ఫలితాల వెల్లడి: జూన్ 18, 2018.
- వెబ్‌సైట్: www.aiimsexams.org

రిఫరెన్స్ బుక్స్

Physics

- Concepts of Physics by HC Verma
- Problems in General Physics- I.E. Irodov
- Concept of Competition Physics - Agarwals
- Objective Physics for Medical Entrance Exam

Chemistry

- Organic Chemistry by Paul Bruice
- Physical Chemistry by O.P. Tandon
- Organic Chemistry by Morrison Boyd
- Inorganic Chemistry by J.D. Lee

Biology

- Objective Biology by Dinesh
- Prakash Objective Biology
- Trueman's Biology- Volume 1 and 2
- AC Dutta for Botany (Oxford)
- MTG's General Knowledge, Aptitude and Logical Thinking for AIIMS



సోషల్ మీడియా విస్తరిస్తున్న కొద్దీ సమాచారం వరదలా వచ్చి చేరుతోంది. కానీ అందులో ఏది నిజమో? ఏది అబద్ధమో? చాలామంది ఆలోచించడం లేదు. తామే ముందు చెప్పాలన్న ఆరాటంలో..అవాస్తవాలు ప్రచారం అవుతున్నాయి. రెండు రోజులుగా వైరల్ అవుతున్న వీడియోలు అలాంటివే! రెండు ప్రముఖ బ్రాండ్‌లకు చెందిన గోధుమ పిండిలో ప్లాస్టిక్ ఉందని ఆరోపిస్తూ ఆ వీడియో.. సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతోంది. మీరు ఎంతో ఇష్టంగా తినే చపాతీలు, రోటీలకు వాడే గోధుమ పిండి.. కల్తీ అయిపోయిందంటూ..ఆ వీడియో ప్రజల్లో భయాందోళనలు పెంచింది.

మీ గోధుమ పిండిలో ప్లాస్టిక్ ఉందా?

వైరల్ అవుతున్న వీడియో.. అబద్ధమంటున్న నిపుణులు

ఒక ప్రముఖ బ్రాండ్‌కు చెందిన గోధుమ పిండిని ఓ పాత్రలో వేసిన మహిళ..దాన్ని నీటితో ముద్దగా చేసింది. తర్వాత ఆ గోధుమ పిండి ముద్దను ట్యాప్ కింద ఉంచి.. నీటిని వదిలింది. అంతే..నీటి ధారకు గోధుమపిండి ముద్ద కరిగిపోతుంది. చివరకు కొంత ముద్ద మిగులుతుంది. అది రబ్బరులా సాగుతుంటుంది. అది ప్లాస్టిక్ ముద్ద అనీ..గోధుమ పిండిని కల్తీ చేయడంతో ఈ దారుణం చోటుచేసుకుందని..ఇలాంటి పిండితో చేసిన పూరీలు, చపాతీలు తింటే మీ ఆరోగ్యం ఏమౌతుందని ప్రశ్నిస్తూ వీడియో ముగుస్తుంది. అయితే ఇదంతా పచ్చి అబద్ధమనీ.. గోధుమల్లోని పీచు పదార్థం ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు.. కొన్ని గోధుమల్ని నోట్లో వేసుకుని అదే పనిగా నములుతూ..ఊరే ఊటను మింగేస్తూ.. పిండి పదార్థాన్ని నములుతూ ఉంటే..కాసేపటికి బబుల్‌గమ్ మాదిరిగా కొంత పదార్థం మిగులుతుంది. ఎంతసేపు నమిలినా అది కరగదు. దాన్ని ట్యాపు కింద పెట్టి ఎంత ధారగా నీటిని పోసినా చెదరదు. గోధుమలకు సహజసిద్ధంగా ఉండే లక్షణాన్ని అర్థం చేసుకోకుండా.. అవగాహన లేమితో వీడియో తయారు చేయడం గందరగోళానికి దారితీసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వ్యాపార వైరం.. గందరగోళం

వ్యాపారం అన్నాక పోటీ ఉంటుంది. మార్కెట్లో ఎన్నో బ్రాండ్లు ఉన్నా..రెండు కంపెనీల గోధుమ పిండిని జనం ఎక్కువగా కొంటున్నారు. అయితే ఒకసారి ప్రజల మనసుల్లో అనుమానాలు తలెత్తితే..సదరు కంపెనీ ఎంత ప్రయత్నించినా జరిగిన నష్టాన్ని పూడ్చుకోలేదు. వ్యాపార వైరంతో తయారు చేసే ఇలాంటి వీడియోల వల్ల వినియోగదారుల్లో గందరగోళం ఏర్పడుతోందని మార్కెటింగ్ నిపుణులు చెబుతున్నారు. 'సందేహాల పేరుతో కొన్ని కంపెనీల బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడానికి ప్రయత్నించడం ఇటీవల ఓ అలవాటుగా మారింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారాలతో భయాందోళనలు కల్గుతున్నాయి' అని సీనియర్ మార్కెటింగ్ ఉద్యోగి ధీరజ్ వెల్లడించారు.



గ్లూటెన్ వల్లే గోధుమలో సాగే గుణం

గోధుమ పిండిలో ప్లాస్టిక్ ఉందంటూ వాట్సాప్, ఫేస్‌బుక్‌లో ఓ వీడియో వైరల్ అవుతోంది. రెండు కంపెనీలకు చెందిన గోధుమ పిండిలో ప్లాస్టిక్ కలిసిందని ఆ వీడియో సారాంశం! అయితే అది తప్పు! గోధుమ పిండిలో పిండి పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు ఉంటాయి. గోధుమ పిండిని రెండు రకాలుగా వర్గీకరిస్తారు. ఒకటి తెలుపు రకం, రెండోది గోధుమ రకం! గ్లూటెన్ తక్కువగా ఉన్న గోధుమ పిండిని వీక్ ఫ్లోర్ అంటారు. గ్లూటెన్ ఎక్కువ శాతం ఉన్న గోధుమ పిండిని స్ట్రాంగ్ ఫ్లోర్ అంటారు. గోధుమ పిండిలో ఉన్న గ్లూటెన్.. పిండి తడిసినప్పుడు ఆకృతి కోల్పోకుండా చేస్తుంది. దీంతో పిండికి సాగే గుణం వస్తుంది. గోధుమ పిండి ముద్దను చల్లని నీళ్లలో కడిగినప్పుడు అందులో ఉన్న పిండి పదార్థాలు (స్టార్చ్) బయటకు వెళ్లిపోతాయి. తర్వాతి క్రమంలో ఈస్ట్ కలిసినప్పుడు ఆక్సిరేషన్ ప్రక్రియలో బుడగలుగా వస్తుంది. ఈ రకం పిండిని బ్రెడ్ తయారీలో ఉపయోగిస్తారు. గ్లూటెన్ శాతం తక్కువగా ఉన్న పిండిని పేస్ట్రీస్ తయారీలో ఉపయోగిస్తారు. గోధుమ పిండిలో ఉండే మరో ముఖ్య పదార్థం పెక్టిన్ అనే పీచు పదార్థం! దీనిని సాధారణంగా జామ్‌లు, జెల్‌ల తయారీలో వాడతారు. గోధుమలో ఉండే పెక్టిన్ నెమ్మదిగా జీర్ణమై ఆకలిని నియంత్రించడంలో ఉపయోగపడుతుంది. కొలస్ట్రాల్‌ను కూడా నియంత్రిస్తుంది. గోధుమలో ఉండే గ్లూటెన్ వల్ల కొంతమందికి జీర్ణసంబంధ సమస్యలు రావొచ్చు! అంతేకానీ ఆ వీడియోలో ఉన్నట్టు గోధుమ పిండిలో ప్లాస్టిక్ ఉండదు. ఆ వీడియోను నమ్మాల్సిన అవసరం లేదు.

–భవానీ, పోషకాహార నిపుణురాలు



హౌరా..! బ్రిడ్జ్‌ను తినేస్తున్న పాన్!

కోల్‌కతా అనగానే ఠక్కున హౌరా బ్రిడ్జ్ గుర్తుకువస్తుంది. ఈ చారిత్రక వంతెన వజ్రోత్సవాలు జరుపుకొంటోంది.

1943, ఫిబ్రవరి 3న కోల్‌కతా-హౌరాలను కలుపుతూ హౌరా బ్రిడ్జ్ ప్రారంభమయింది. నిత్యం లక్షకుపైగా వాహనాలు, లక్షన్నర మంది పాదచారుల రాకపోకలకు ఉపయోగపడుతోంది. 1936లో మొదలైన నిర్మాణం ఆరేళ్లకు పూర్తయింది. హిందువులు, ముస్లింలు, సిక్కులు, నేపాలీలు, గూర్ఖాలు, పఠాన్‌లు ఇలా ఆనాడు కోల్‌కతా ప్రజలంతా ఈ వంతెన నిర్మాణంలో భాగస్వాములయ్యారు. అంతేకాదు.. హౌరాబ్రిడ్జ్‌పై అనేక భారతీయ సినిమాలను షూట్ చేశారు. సత్యజిత్‌రే, రిత్విక్ ఘటక్, మృణాల్‌సేన్, రాజ్ కపూర్, రోలాండ్ జోఫ్, మీరా నాయర్ తదితరులు హౌరా బ్రిడ్జ్‌పై ఔరా అనిపించే సినిమాలు తీశారు. హౌరా బ్రిడ్జ్ నిర్మాణానికి 26,500 టన్నుల స్టీల్ ఉపయోగిస్తే.. అందులో 23,500 టన్నుల స్టీల్‌ను టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ సరఫరా చేసింది. కానీ ఆ ఉక్కు కట్టడం కాలక్రమేణా తుప్పుపడుతోంది. మానవ తప్పిదాలకు ముప్పును ఎదుర్కొంటోంది.

స్టీల్ పిల్లర్లను తినేస్తున్న పాన్, గుట్కా మరకలు

ప్రమాదంలో హౌరా బ్రిడ్జ్!

కోల్‌కతాలోని హౌరా బ్రిడ్జ్ దేశానికే గర్వకారణం. సముద్ర తుఫానులు కూడా ఈ వంతెనను ఏమీ చేయలేకపోయాయి. వెయ్యి టన్నుల ఓడలు కూడా ఏనాడూ కదపలేకపోయాయి. కానీ 75 ఏళ్ల చరిత్ర ఉన్న హౌరా వంతెన ఇప్పుడు తమలపాకులకు వణికిపోతోంది. ప్రపంచంలోని ఇంజనీరింగ్ అద్భుతాల్లో ఒకటిగా నిలిచిన ఈ బ్రిడ్జ్‌కు గుట్కాలు, పాన్‌మరకలు సవాల్ విసురుతున్నాయి. హౌరాబ్రిడ్జ్ హ్యాంగర్లు, లోహ పిల్లర్లపై పాదచారులు ఉమ్మేతున్న గుట్కాలు, కిళ్లీలు వాటిని బలహీనంగా మారుస్తున్నాయి.

స్లో పాయిజన్‌లా మారిన గుట్కా, పాన్

గుట్కా, పాన్‌లకు అంత పవర్ ఉంటుందా? 26,500 టన్నుల స్టీల్ కట్టడం గుట్కా మరకలకు బలహీనపడుతుందా? అనే ఆశ్చర్యం కలుగక మానదు! పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఖచ్చితంగా ఉంటుందంటున్నారు నిపుణులు! 'వంతెనపై పాన్, గుట్కాలు ఉమ్మినప్పుడు రసాయన చర్య జరుగుతుంది. స్టీల్ మీద నికొటినమైట్ పడటంతోనే యాసిడ్ సామర్థ్యం పెరుగుతుంది. ఆ ప్రభావంతో లోహం బలహీనంగా మారు



తుంది. గుట్కా, పాన్ మరకలు వంతెనను స్లో పాయిజన్‌లా తినేస్తున్నాయి' అని కోల్‌కతాకు చెందిన రసాయనశాస్త్ర నిపుణులు మహ్మద్ షాహ్ ఆలమ్ వివరిస్తున్నారు. 2313 అడుగులు పొడవైన వంతెనపై అనేకచోట్ల బెంగాల్ ప్రభుత్వం బోర్డులు పెట్టింది. బ్రిడ్జ్‌మీద పాన్, గుట్కా ఉమ్మకూడదని చెబుతూనే ఉంది. అయినా జనం పట్టించుకోవడం లేదు. పక్షుల రెట్టల వల్ల కూడా బ్రిడ్జ్‌కు ముప్పు ఉందని ఇంజినీర్లు హెచ్చరిస్తున్నారు.

– సెంట్రల్ డెస్క్

కుటుంబ పెన్షన్.. కొన్ని వివాదాలు



ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణలో ఉండి కుటుంబ సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తాడనే ఉద్దేశంతో.. ఆ బాధ్యతలను తలకెత్తుకున్న ప్రభుత్వం.. కుటుంబ పెన్షన్‌ను, ఉద్యోగిపై ఆధారపడిన భార్యాబిడ్డలు, తల్లిదండ్రులకు వైద్యఖర్చులను చెల్లిస్తుంది. అయితే భార్యాలతో కోర్టులో కొట్లాట నడుస్తోందంటూ.. వారి వైద్యఖర్చుల చెల్లింపునకు 'డిక్లరేషన్' ఇవ్వడానికి నిరాకరించిన మగమహారాజును తూర్పారపట్టి, డిక్లరేషన్‌తో నిమిత్తం లేకుండా వైద్యఖర్చులు ప్రభుత్వం చెల్లించాలని ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు (ఈ జనవరి 17, మధు కేసు) ఉద్యోగి కుటుంబ సభ్యుల జీవించే హక్కు సాధనలో కొత్త ఒరవడిని ప్రదర్శించింది. ఉద్యోగి చేస్తున్న ప్రభుత్వ సేవకు ప్రతిఫలంగా కుటుంబ సంక్షేమానికీ హామీ ఇస్తున్న సర్కారు, ఈ నిధుల సక్రమ పంపిణీ కోసం రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో వివిధ నియమ నిబంధనలను రూపొందించింది. అయితే దాంపత్య కలహాలను బూచి చూపించి భార్యను పక్కన పెట్టడమో, వివాహేతర సంబంధాలతో వేరే మహిళను 'భార్య'గా సర్వీసు రికార్డుల్లో నమోదు చేసి భార్యకు మొండి చేయి చూపించడమో తరచూ జరిగే అనైతిక తతంగం. దీంతో భార్యాబిడ్డలు వీధిపాలై ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కుటుంబ పింఛను హక్కులను విశదీకరిస్తూ వివిధ కోర్టులు వెలువరించిన తీర్పుల సారాంశం చాలామందికి అవగాహన లేకపోవడంతో పరిస్థితి మరింత జటిలమవుతోంది. హిందూ వివాహ చట్టం పరిధిలో చెల్లుబాటు కాని పెళ్లి ద్వారా ఉద్యోగితో ఉంటున్న 'స్త్రీ'ని ఉద్యోగి 'భార్య'గా భావించరాదనీ ఆమెకు కుటుంబ పెన్షన్ వర్తించదని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు లక్ష్మీసూరి కేసు (నవంబర్ 2017)లో స్పష్టం చేసింది. గృహహింస చట్టం వర్తించినంత మాత్రాన సహజీవన భాగస్వామికి కుటుంబ పెన్షను సౌకర్యాన్ని కల్పించరాదని కోర్టు విపులీకరించింది. హిందూ వివాహ చట్టం 1956లో అమలులోకి రాగా, దీని ప్రకారం బహుభార్యత్వం నిషిద్ధం కాబట్టి 'రెండో భార్య' కుటుంబ పెన్షను పొందే అవకాశం లేదు. ఇలాంటి స్త్రీలకు భర్త మరణానంతరం కూడా పెన్షను, గ్రాట్యుటీ బకాయిలలో వాటా కోరే హక్కు లేదని రామేశ్వరీదేవి కేసు (సుప్రీంకోర్టు 2000) స్పష్టం చేసింది. పింఛన్ కుటుంబ శ్రేయస్సుకై ఉద్దేశించిన నిధి కాబట్టి ఉద్యోగి నామినేషన్ ద్వారా ఇతరులకు ఈ లాభాల్ని అందించే వీలులేదు. 'నామినీ'గా భార్యను, లేదా సంతానాన్ని మాత్రమే చూపాలి. ఉద్యోగి తన వీలునామా ద్వారా రిటైర్మెంటు బెనిఫిట్లనూ, కుటుంబ పెన్షన్‌నూ ఇతరులకు ఇవ్వడం చెల్లదని వయోలెట్ ఇసాక్ కేసు (1991)లో సుప్రీం ధర్మాసనం ప్రకటించింది. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ, ఇతరులను నామినీలుగా చూపి, ఉద్యోగి తన పెన్షను వగైరా సొమ్మును భార్యాబిడ్డలకు రాకుండా కట్టడి చేయడం అనైతికమని మద్రాసు హైకోర్టు సంధ్య కేసులో (2014) అభిప్రాయపడింది. పెన్షన్ వగైరా నిధులను ఉద్యోగి మరణానంతరం రాబట్టుకోవడానికై చట్టం గుర్తించిన భార్యకే సక్సెషన్ సర్టిఫికెట్టు మంజూరు చేయాలని విద్యాధరి కేసులో సుప్రీంకోర్టు, కింది కోర్టులను ఆదేశించింది. పెన్షన్ పొందడం ఉద్యోగి కుటుంబ హక్కు కానీ 'బాకీ' కాదనీ అందుచేత హక్కు నిర్ధారణకు అసలు సక్సెషన్ సర్టిఫికెటే అవసరం లేదనీ లలితాంబిక కేసులో కేరళ హైకోర్టు పేర్కొనడంతో అనవసర వివాదాలు, కాలయాపనకు ముగింపు పలికినట్లయింది. కేంద్ర కుటుంబ పెన్షన్ రూల్సు ప్రకారం విడాకులైన/అవివాహితయైన/ వితంతువైన కుమార్తె కూడా కుటుంబ పెన్షన్‌కు వయసుతో నిమిత్తం లేకుండా అర్హురాలే. గత జూలై 19న కేంద్ర ప్రభుత్వం ఒక ఉత్తర్వు జారీ చేసి.. విడాకుల కేసు దాఖలై విచారణలో ఉన్న సందర్భంలో కూడా కుమార్తెకు కుటుంబ పెన్షను పొందే వెసులుబాటు కల్పించటం విశేషం.



లా-లోచనం
Law lochanam

- వేదాంతం సీతారామావధాని, భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్, సెల్ : 70421 40099

హనుమాన్ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్న ముస్లిం



గుజరాత్‌లో హిందూ-ముస్లిం ఐకమత్యానికి ప్రతీక

పరమత సహనం ఈ మట్టి గొప్పతనం! మనిషితనమే నిజమైన మతమని ఈ దేశ ప్రజలు ఎప్పటికప్పుడు చాటుతూనే ఉన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన మొయిన్ మెమన్ మరోసారి ఈ విషయాన్ని నిరూపించారు. ముస్లిం అయినప్పటికీ.. మిర్జాపూర్ ప్రాంతంలోని 500 ఏళ్ల నాటి చారిత్రక హనుమాన్ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చు అంతా ఆయనే భరిస్తున్నారు. 'నేను రోజూ ఐదు సార్లు నమాజ్ చేస్తాను. ఈ ఆలయ వైభవాన్ని నా చిన్నతనంలో చూశా. ఇప్పుడు ఈ ఆలయం వైపు నుంచి వెళ్తుంటే బాధ కల్గుతుంది. అందుకే పూజారిని సంప్రదించి ఆధునీకరణ పనులు మొదలుపెట్టా' మెమన్ చెబుతున్నారు. ఆలయ గోడలకు కాషాయ రంగు టైల్స్ వేయిస్తున్నారు. హిందూ-ముస్లిం సోదర భావానికి, ఐకమత్యానికి ఈ హనుమాన్ ఆలయం నిదర్శనంగా నిలుస్తుంది అని గుజరాతీలు పొంగిపోతున్నారు.



ఊరంతా ఉద్యోగులే

48 కుటుంబాల్లో 40 మందికి సర్కారు కొలువులు


ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులకు కొదవ లేదు..

ఒకప్పుడు బడి, రోడ్డు, కరెంటు లేని గ్రామం నేడు ఆదర్శం

ఊర్లో ఒకరికి సర్కారు కొలువొస్తే.. ఊరి జనమంతా ఇంటికి వచ్చి అభినందిస్తారు. ఊరంతా గొప్పగా చెప్పుకొంటారు. ఫలానా వ్యక్తి.. ఫలానా ఉద్యోగం సంపాదించాడని తమ బంధుమిత్రులకు చెప్పుకొని మురిసిపోతారు. ఇప్పటికీ ప్రభుత్వోద్యోగానికి ఉన్న విలువ అది! అలాంటిది ఆ ఊర్లో దాదాపు ప్రతి ఇంట్లోనూ సర్కారు ఉద్యోగులే కనిపిస్తారు! గ్రామంలో 48 కుటుంబాలుంటే ఉంటే.. 40 మందికి ప్రభుత్వ ఉద్యోగాలున్నాయి. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని భక్తాళాపురం ఆవాసగ్రామమైన యర్రంశెట్టివారి గూడెం వాసుల గొప్పదనమిది! దాదాపుగా ప్రతి ఇంట్లోనూ ఒకరికి సర్కారు కొలువు ఎలా సాధ్యమైంది? అంటే.. దీని వెనుక ఆ గ్రామప్రజల దీక్ష, పట్టుదల కనిపిస్తాయి. ఒకప్పుడు ఆ గ్రామంలో ప్రాథమిక పాఠశాల కూడా లేదు. పోనీ.. పొరుగూరికి వెళ్లి చదువుకుందామా అంటే సరైన రోడ్డు వసతి కూడా ఉండేది కాదు. విద్యుత్తు సౌకర్యం అయితే సరేసరి! ఇదంతా దాదాపు 50 ఏళ్ల క్రితం మాట! కరెంట్, బడి, రోడ్డు అంటే తెలియని రోజుల్లోనే ఆ ఊరి ప్రజలు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. ఊర్లో బడి లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నేలమర్రి గ్రామంలోని పాఠశాలకు పిల్లలను పంపేవారు. పిల్లలు ఉదయం 4 గంటలకే లేచి, కాసేపు పొలం పనులు చూసుకొని బడికి సిద్ధమయ్యేవారు. రోడ్డు వసతి లేకపోవడంతో పొలం గట్ల వెంబడి నడుచుకుంటూ స్కూల్‌కు వెళ్లేవారు. సరైన తిండి కూడా ఉండేది కాదు. చాలామంది విద్యార్థులకు స్కూల్ నుంచి వచ్చేదాకా పొద్దున తిన్న చద్దన్నమే పొట్టకు ఆసరాగా ఉండేది. పిల్లలకు ట్యూషన్స్ చెప్పించేందుకు తల్లిదండ్రులు ఆ రోజుల్లోనే గ్రామానికి ప్రైవేటుగా టీచర్లను రప్పించేవారు. తల్లిదండ్రులు తమ కోసం పడుతున్న కష్టం.. ఆకలి బాధ వారిని కసిగా చదివేలా, జీవితంలో స్థిరపడేలా ప్రేరేపించాయి. యర్రంశెట్టివారి గూడెం గ్రామ జనాభా 300లోపే ఉంటుంది. అక్కడ ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులకూ కొదవ లేదు. 44 మంది ప్రైవేటు ఉద్యోగాలు చేస్తుండగా, 40 మంది వ్యాపారాలు చేసుకుంటున్నారు. గ్రామానికి చెందిన నలుగురు విదేశాల్లో స్థిరపడ్డారు. గ్రామం నుంచి 23 మంది ప్రభుత్వ టీచర్లుగా, 10మంది పోలీస్, ఎక్సైజ్, మిలటరీలో పనిచేస్తున్నారు. గ్రామం నుంచి ఐదుగురు డాక్టర్లుగా ఉన్నారు. ఇంకొందరు వ్యవసాయ, రెవెన్యూ శాఖల్లో, ఆర్టీసీ, సాఫ్ట్‌వేర్ కొలువుల్లో ఉన్నారు. గ్రామంలో ఉద్యోగ విరమణ చేస్తే అందరూ కలిసి సన్మానం చేస్తారు.

– పెన్‌పహాడ్

కసితోనే చదివాం



మేం అప్పట్లో కసిగా చదివే వాళ్లం. చీకట్లో దీపాలు పెట్టుకొని చదువుకునేవాళ్లం. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వస్తే.. ఆ స్ఫూర్తితో మిగతా వారూ చదివేవారు. చదువుకుంటే విజ్ఞానం వస్తుంది. విజ్ఞానం వల్ల సంపద కూడా వస్తుందని నమ్మి చదువుకున్నాం

- యర్రంశెట్టి సత్యం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

ప్రేరణగా గ్రామ వాతారణం



గ్రామ వాతావరణం స్ఫూర్తిదాయకంగా ఉండేది. కుటుంబంలో నలుగురు ఉంటే ఒకరు చదివేవారు. చదువు విలువ మా తల్లిదండ్రులకు తెలియడంతో కష్టపడి చదివించారు. ఒకరినిచూసి ఒకరు ప్రేరణ పొందేవాళ్లం. చదువుకునే వారు కూడా వ్యవసాయ పనుల్లో చురుకుగా పాల్గొనేవాళ్లు.

- యర్రంశెట్టి రవీందర్, సీఐ



మెదక్ ఏరియా ఆసుపత్రిలో రోగులను పలుకరిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి

వైద్య ఆరోగ్య శాఖలో 10వేల పోస్టులు

▸ 'కంటి వెలుగు'కు త్వరలో శ్రీకారం: మంత్రి లక్ష్మారెడి

మెదక్, ఫిబ్రవరి 7: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో పదివేల పోస్టులను మూడునెలల్లో భర్తీ చేయనున్నట్లు ఆ శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రకటించారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సిబ్బందిపై పెరిగిన అదనపు భారాన్ని తగ్గించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఉచిత కంటి పరీక్షలు, కంటి అద్దాల పంపిణీ కోసం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం 'కంటి వెలుగు' పథకానికి శ్రీకారం చుట్టనుందని, దీనికోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి, వైద్య రిపోర్టుల ఆధారంగా వారికి ఉచితంగా వైద్యం, మందులను అందించాలని ప్రభుత్వం యోచిస్తున్నదని తెలిపారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ పేరుతో ఉచితంగా పూర్తి వైద్య పరీక్షలు నిర్వహించాలని భావిస్తున్నామన్నారు. ఈ పరీక్షలతో కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలను గుర్తించి, బాధితులను కాపాడేందుకు కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● 'సివిల్ సప్లయిస్' సాంకేతిక పరిజ్ఞానం భేష్

▸ మా రాష్ట్రంలోనూ ఇదే విధానాన్ని అమలు చేస్తాం

▸ తమిళనాడు పౌరసరఫరాల శాఖ అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పౌరసరఫరాల శాఖలో వినియోగిస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానం భేషుగ్గా ఉందని తమిళనాడు పౌరసరఫరాల శాఖ అధికారులు కితాబునిచ్చారు. రాష్ట్రంలో చేపట్టిన సంస్కరణలపై అధ్యయనానికి తమిళనాడు సివిల్ సప్లయిస్ అధికారుల బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం హైదరాబాద్ చేరుకుంది. బుధవారం పౌరసరఫరాలశాఖ భవన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్, టీ రేషన్ యాప్, నగరంలోని పౌరసరఫరాలశాఖ గోదాముల్లో సీసీ కెమెరాల పనితీరు, రేషన్‌షాపులో ఈ పాస్ యంత్రాల పనితీరును పరిశీలించారు. అనంతరం పౌరసరఫరాల శాఖ భవనంలో కమిషనర్ సీవీ ఆనంద్‌తో భేటీ అయ్యారు. తమిళనాడులో 40 శాతం రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని, ఇక్కడి విధానాన్ని మా రాష్ట్రంలో అమలు చేస్తామని అధికారుల బృందం కమిషనర్ ఆనంద్‌తో అన్నారు. తమిళనాడు నుంచి వచ్చిన బృందంలో ఆ రాష్ట్ర పౌరసరఫరాల సీఐడీ, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ప్రదీప్ వీ ఫిలిప్, పౌరసరఫరాలశాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎం సుధా రాణి తదితరులు ఉన్నారు.

● 'ప్యాకేజీ'తో బడా కాంట్రాక్టర్లకే లాభం: బిల్డర్స్



మాట్లాడుతున్న హైదరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ కార్యదర్శి మదన్‌మోహన్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఈడబ్ల్యుఐడీసీ)లో ప్యాకేజ్ వర్కుల ద్వారా బడా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా కార్పొరేషన్ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారని హైదరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ ఆరోపించింది. ప్యాకేజీ పనులను తక్షణమే రద్దు చేసి సింగిల్ వర్కులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తే పనులు సకాలంలో పూర్తవుతాయని తెలిపింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణతో కలిసి అసోసియేషన్ కార్యదర్శి బి.మదన్ మోహన్, సభ్యులు మురళీకృష్ణ మాట్లాడారు. ప్రస్తుతం టీజీఈడబ్ల్యుఐడీసీలో రూ.1,179కోట్ల విలువ చేసే 90 పనులను ప్యాకేజీ రూపంలో టెండర్లు కోరు తూ నోటిఫికేషన్ జారీ చేశారని ఈ నెల 12 వరకు టెండర్లకు చివరి తేదీగా ప్రకటించారని తెలిపారు. గతంలో ఏ పనులను కూడా కార్పొరేషన్ ప్యాకేజీ వర్కులుగా కేటాయించలేదని బడా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే విధంగా ఈ ప్యాకేజీ వర్కులను రూపొందించారన్నారు. దీనివల్ల ప్రభుత్వం 10 నుంచి 15శాతం వరకు నష్టపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చిన్న, మధ్య తరగతి కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూరేలా జీవో 66ను విడుదల చేసిందని, కార్పొరేషన్ అధికారులు మాత్రం 15 మంది బడా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా ఈ ప్యాకేజీ వర్కుల టెండర్లను పిలుస్తున్నారని ఆరోపించారు. ప్యాకేజీ వర్కుల వలన జరిగే నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని సింగిల్ వర్కులకు టెండర్లను పిలవాలని, ప్యాకేజీ వర్కులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

● ఔషధ ప్రయోగాలపై ఆరా

▸ నాగంపేటలో బాధితులను కలిసిన హాలెండ్ దేశస్థులు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 7: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఔషధ ప్రయోగ బాధిత కుటుంబాలను హాలెండ్ దేశానికి చెందిన సామాజిక సంస్థ ప్రతినిధులు బుధవారం కలిశారు. బాధితుల నుంచి పూర్తి వివరాలు సేకరించి డాక్యుమెంటరీ చిత్రీకరించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం నాగంపేట గ్రామానికి చెందిన వంగర నాగరాజు ఔషధ ప్రయోగాల బారిన పడి గడిచిన ఏడాది జూన్ 2న మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఏ ఔషధ కంపెనీలో ఎన్నిసార్లు ప్రయోగం జరిపారు, పోస్టుమార్టం రిపోర్ట్ ఏం వచ్చింది, ఫార్మా కంపెనీ నుంచి ఇన్సూరెన్స్ డబ్బులు అందాయా, ప్రభుత్వం ఏమైనా సహాయం అందించిందా అని అడిగి తెలుసుకున్నారు. ఐఎఫ్ఎస్ఎల్ నివేదిక ఇంకా రాలేదని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. మానవ హక్కుల కమిషన్ ఆశ్రయించినట్లు చెప్పారు. మరో బాధితుడు అశోక్‌కుమార్‌ను కూడా హాలెండ్ ప్రతినిధులు జోస్, ఫ్రాంక్‌మోల్స్‌గర్ కలిసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఔషధ కంపెనీలు ప్రయోగాల కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం వెనుక ఆంతర్యం తెలుసుకోవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

● పేకాట ముఠా గుట్టురట్టు

▸ ఏపీ, తెలంగాణల్లో శిబిరాలు

▸ జగ్గయ్యపేటలో పోలీసుల దాడి... ఆరుగురు అరెస్టు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 7 : ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో పలు చోట్ల గుట్టుగా కోత ముక్క ఆడిస్తున్న ముఠా బాగోతాన్ని కృష్ణాజిల్లా పోలీసులు రట్టుచేశారు. పోలీసులు జరిపిన దాడిలో కీలక వ్యక్తులు తప్పించుకుపోగా ఆరుగురిని అరెస్టు చేశారు. కృష్ణాజిల్లా జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకర్ల సమావేశంలో నందిగామ డీఎస్పీ రాధేష్ మురళి వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నగర పంచాయతీ కౌన్సిలర్లు బెల్లంకొండ శ్రీను, పిట్టల రవిలతో పాటు, జగ్గయ్యపేట పట్టణం కాకానినగర్‌కు చెందిన గోనుగుంట్ల సీతారామ్ అలియాస్ చంటి, గార్లపాటి సాయిరామ్ అలియాస్ రామ్, జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేటకు చెందిన మార్తి లింగారావు ముఠాగా ఏర్పడి ఏపీ, తెలంగాణ సరిహద్దుల్లో జగ్గయ్యపేట, వీరులపాడు, చెవిటికల్లు, మధిర, అచ్చంపేట, కోదాడ ప్రాంతాల్లో ఏజెంట్ల ద్వారా రహస్య ప్రదేశాలను గుర్తించి కోత ముక్క ఆడిస్తున్నారని చెప్పారు. జగ్గయ్యపేట సమీపంలో గిన్నె చెరువు వద్ద రేకుల షెడ్డులో పేకాడుతున్నారన్న సమాచారం అందుకుని జగ్గయ్యపేట సీఐ జయశంకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీహరి, పోలీస్ సిబ్బంది దాడి చేశారని చెప్పారు ముఠాలో కీలక సూత్రధారులైన హుజూర్‌నగర్ కౌన్సిలర్లు పరారీలో ఉన్నారని, ముఠాలో నరేందర్ అనే వ్యక్తి ఫైనాన్స్ చేస్తున్నాడని విచారణలో వెల్లడైందని చెప్పారు.

మబ్బుపట్టిన తెలంగాణ

▸ రాష్ట్రంలో అక్కడక్కడా జల్లులు.. బంగాళాఖాతంలో అల్పపీడనం

▸ ఒకట్రెండు రోజుల పాటు తేలికపాటి వర్షాలు

▸ వెల్లడించిన వాతావరణ శాఖ అధికారులు

హైదరాబాద్, సిటీ, నిర్మల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉన్నట్టుండి ఆకాశం మబ్బుపట్టింది! మిట్టమధ్యాహ్నం మలిసంధ్యను తలపించింది! సాయంత్రం కొన్నిచోట్ల చిరుజల్లులు కూడా పడ్డాయి. బుధవారం రాష్ట్రంలో ఒక్కసారిగా మారిన వాతావరణ పరిస్థితి ఇది! ఇదంతా నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావ ఫలితమేనని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రభావం వల్ల రాష్ట్రంలో ఒకట్రెండు రోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డి వెల్లడించారు. నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు లోకేశ్వరం, భైంసా, ఖానాపూర్ తదితర ప్రాంతాల్లో చినుకులు పడ్డాయి. నిర్మల్‌లో వారంగా పగటి ఉష్ణోగ్రతలు 31 డిగ్రీలకు పైగా నమోదవుతుండగా.. బుధవారం గరిష్ఠంగా 25డిగ్రీలు, కనిష్ఠంగా 17 డిగ్రీలుగా నమోదయ్యాయి. కాగా ఖమ్మంలో బుధవారం సాధారణం కన్నా 6 డిగ్రీల మేర తక్కువ ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాచలంలో 4 డిగ్రీలు, మెదక్‌లో 3 డిగ్రీలు, హైదరాబాద్, హన్మకొండలో 2 డిగ్రీల మేరకు సాధారణం కంటే తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్పపీడన ప్రభావంతో చలి తీవ్రత మరింతగా తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావం తెలంగాణపై ఉండబోదని బేగంపేట వాతావరణ కేంద్రం అధికారి నాగరత్నం తెలిపారు.



ఆకాశంలో మార్పులు చోటుచేసుకోవడంతో హైదరాబాద్‌లో సాయంసంధ్యవేళ కనిపించిన దృశ్యం

పత్తి రైతు కంట్లో తడి!

(మొదటి పేజీ తరువాయి)

పత్తి బస్తాలను మార్కెట్ ఆవరణలో ఆరబెట్టుకోవాల్సి వస్తోంది. రైతులకు అవగాహన లేకపోవడం వల్ల నీళ్లు చల్లి పత్తిని బస్తాల్లో నింపుకొని వస్తున్నారని, దీని వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో అపార నష్టం సంభవిస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. రైతులు మాత్రం ఎప్పుడూ తెచ్చినట్లుగానే పత్తిని మార్కెట్‌కు తీసుకొస్తున్నామని అంటున్నారు. వాతావరణంలో అధిక తేమ ఉంటే తమ తప్పెలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా పత్తి రైతుకు తేమ రూపంలో మరో తిరకాసు ఎదురవుతోంది. వరంగల్ వ్యవసాయ మార్కెట్లో మూడు రోజులుగా పత్తిలో తేమ శాతం అధికంగా ఉన్న పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. తేమ 8 నుంచి 12 శాతం లోపే ఉండాలని వ్యాపారులు అంటున్నారు. 15 శాతం దాటితే పత్తిని కొనుగోలు చేసేది లేదని స్పష్టం చేశారు. కొత్త నిబంధనలు తెలియక మార్కెట్‌కు పత్తిని తెచ్చిన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. మార్కెట్ యార్డులో పత్తిని ఆరబెట్టుకొని మళ్లీ బస్తాల్లో తొక్కి అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

నీళ్లు ఎందుకు చల్లుతారంటే..

రైతులు పత్తిని బస్తాల్లో తొక్కేటప్పుడు పదును(నీళ్లు చల్లడం) సర్వ సాధారణ అంశం. ఒకే బస్తాలో ఎక్కువ పత్తిని నింపేందుకు రైతులు ఈ ప్రయత్నం చేస్తారు. లారీలు, ట్రాలీలు లాంటి వాహనాల్లో రవాణా చేసుకోవడానికి సులభంగా ఉంటుందని ఇలా చేస్తామని.. నీళ్లు చల్లి పత్తి బరువును పెంచి అదనంగా సంపాదించాలన్న ఆలోచన తమకు ఉండదని రైతులు చెబుతున్నారు. కారణాలేమైనప్పటికీ నీళ్లు చల్లడం వల్ల పత్తిలో తేమ ఎక్కువవుతోందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా పత్తిలో గింజలు ముర్రిగిపోతున్నాయని, దూది శాతం తగ్గి నష్టపోతున్నామని అంటున్నారు.

రూ.30 వేల జరిమానా



పత్తిలో అధిక తేమ వల్ల ఎగుమతులు లేక వ్యాపారులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లో 15శాతం కంటే అధికంగా తేమ ఉన్న పత్తిని వ్యాపారులు కొనుగోలు చేయకూడదని కాటన్ అసోసియేషన్ తీర్మానం చేసింది. దీన్ని అతిక్రమించి ఎవరైనా కొనుగోలు చేస్తే వారికి రూ.30 వేల జరిమానా విధిస్తాం. దీని వల్ల రైతులకు కూడా ఉపయోగమే. తేమ 15 శాతం దాటిన పత్తికి ధర నిర్ణయించడంలో మోసపోకుండా ఉంటారు.

-చింతపల్లి వీరారావు, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు

రైతుల మేలు కోసమే..



పత్తిలో నీళ్లు చల్లి అమ్మకానికి తీసుకురావద్దని గ్రామ గ్రామాన కరపత్రాలను పంపిణీ చేయించాం. రైతుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అడ్తీదారులపై ఉంది. నాణ్యతమైన పత్తిని అమ్మకానికి తీసుకురావడం వల్ల రైతుకు మంచి ధర వస్తుంది. కాబట్టి రైతులకు మేలు చేసేందుకే అడ్తీ, ఖరీదు దారులు చెప్పినట్లుగా తేమ 15శాతం దాటిన పత్తిని కొనుగోలు చేయడం లేదు.

-పోలెపాక నిర్మల, వరంగల్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి

కొత్త నిబంధనలతో ఇబ్బందులు



మార్కెట్లో కొత్త నిబంధనలు పెట్టిన సంగతి తెలియక 50 బస్తాల పత్తిని తీసుకొచ్చా. పత్తిలో తేమ అధికంగా ఉందని మంగళవారం కొనుగోలు చేయలేదు. దీంతో యార్డులోనే ఆరబోసుకున్నాం. ఇప్పుడు ఆ పత్తిని బస్తాల్లోకి తొక్కాలంటే ఒక్కో బస్తాకు రూ.50 అడుగుతున్నారు. అలాగే రోజంతా ఇక్కడే ఉండడం వల్ల రూ.500 ఖర్చయింది. కొత్త నిబంధనలు పెడితే రైతులకు తెలిసేలా ప్రచారం చేయాలి. మాకు మార్కెట్‌కు వచ్చేంత వరకు ఈ విషయం తెలియదు.

-మాలోతు వీరన్న, రైతు, మురిపిరాల

తేమ పత్తిని కొంటే జరిమానా

పత్తిలో తేమ శాతం 15 దాటితే ఈ నెల 5 నుంచి కొనుగోలు చేయబోమని, ఎవరైనా కొనుగోలు చేస్తే వారికి జరిమానా వేస్తామని వ్యాపారులు జిల్లా జాయింట్ కలెక్టర్, చాంబర్ ఆఫ్ కామర్స్, అడ్తి సెక్షన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులకు ముందే సమాచారం ఇచ్చారు. తేమ పత్తిని కొనుగోలు చేయబోమంటూ ఏకంగా మార్కెట్‌నే బంద్ చేస్తే అందరికీ అర్థమవుతుందని వ్యాపారులు ప్రతిపాదించగా.. జాయింట్ కలెక్టర్ అంగీకరించలేదు. తేమ శాతం 15 కంటే ఎక్కువ ఉన్న పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేసిన వ్యాపారికి రూ.30 వేలు, అమ్మించిన అడ్తీదారులకు రూ.11వేలు జరిమానా విధిస్తామని వ్యాపార వర్గాలు నిర్ణయించాయి. ఈ విషయాన్ని జేసీకి లిఖిత పూర్వకంగా తెలియజేశారు.

గోదావరి, కృష్ణా బోర్డులపై ఇక కేంద్రం జోక్యం

▸ అధికారాలు, బాధ్యతలపై దృష్టి

▸ ఈ నెల 9న ప్రత్యేక సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గోదావరి, కృష్ణా బోర్డుల పరిధి, వాటి అధికారాలు, బాధ్యతలను నిర్ణయించడం కోసం కేంద్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. జల వివాదాల పరిష్కారానికి బోర్డులు ఏర్పడి మూడున్నర ఏళ్ల గడుస్తున్నా.. ఇప్పటికీ వాటి అధికారాలు, బాధ్యత విషయంలో స్పష్టత లేదు. దీంతో పలు సందర్భాల్లో బోర్డులు తీసుకునే నిర్ణయాలు వివాదస్పదంగా మారుతున్నాయి. అలాగే కీలక విషయాల్లో బోర్డులు తగు నిర్ణయాలను తీసుకోలేకపోతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వాటి అధికారాలు, బాధ్యతలను ఖరారు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ఈ నెల 9న ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ సమావేశానికి హాజరై తమ తమ అభిప్రాయాలను చెప్పాల్సిందిగా ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సమాచారం అందించింది. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలను పరిష్కరించి, నీటి కోటాలను ఖరారు చేయడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం గోదావరి, కృష్ణాలకు ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ బోర్డులకు చైర్మన్లుగా కేంద్ర ప్రభుత్వం సీడబ్ల్యూసీ సభ్యులను నియమిస్తోంది. అలాగే సభ్యులుగా ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులను నియమించారు. ఈ బోర్డు అధికారాలు, బాధ్యతల విషయంలో ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. బోర్డులు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి ? అవి తీసుకునే నిర్ణయాలకు రాష్ట్రాలు కట్టుబడాలా ? లేదా ? అనే విషయంపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు. బోర్డులు తీసుకునే నిర్ణయాలను కొన్ని సందర్భాల్లో రాష్ట్రాలు అంగీకరించడం లేదు. తమకు అనుకూలంగా ఉంటే.. సరే లేదంటే.. బోర్డు నిర్ణయాలను రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. దీంతో కీలకమైన నిర్ణయాలపై బోర్డులు ఎలాంటి నిర్ణయాలను తీసుకోలేకపోతున్నాయి. అలాగే బోర్డుల పరిధిపై స్పష్టత లేకపోవడంతో అవి తీసుకునే నిర్ణయాలు ఒక రాష్ట్రానికే అనుకూలంగా ఉంటున్నాయనే ఆరోపణలు కూడా వస్తున్నాయి.

అచ్చంపేటలో లక్ష ఎకరాలకు సాగు నీరు

▸ ఉల్పర రిజర్వాయర్‌తో ఒక్క ఎకరమూ ముంపు కాదు

▸ అచ్చంపేట ప్రజాప్రతినిధులతో మంత్రి హరీశ్ సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట నియోజకవర్గానికి కల్వకుర్తి ప్రాజెక్టు నుంచి ఇప్పటికే 50 వేల ఎకరాలకు సాగు నీరందిస్తున్నామని, లక్ష ఎకరాలకు అందించే ప్రణాళికను అమలు చేస్తున్నామని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట అసెంబ్లీ నియోజకవరానికి చెందిన సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులతో మంత్రి బుధవారం జలసౌధలో సమీక్ష నిర్వహించారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉల్పర రిజర్వాయర్ నిర్మిస్తే దాసరాజుపల్లి గ్రామంలో ఒక్క ఇల్లు కూడా ముంపునకు గురి కాదన్నారు. అతి తక్కువ ముంపుతో రైతాంగానికి ఎక్కువ ప్రయోజనం కలిగే విధంగా ప్రాజెక్టులను సీఎం కేసీఆర్ రీ డిజైన్ చేశారన్నారు. 3 టీఎంసీలు లేదా ఒక టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్ కడుతున్నారనే ప్రచారాన్ని మంత్రి ఖండించారు. 0.25 టీఎంసీలతోనే నిర్మిస్తున్నామన్నారు. భూ నిర్వాసితులకు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లిస్తామన్నారు. రెవెన్యూ అధికారులతో కలిసి డిండి చీఫ్ ఇంజనీర్ సునీల్ క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితిని ఆంచనా వేస్తారన్నారు. ఉల్పర రిజర్వాయర్ కింద రెండు పంటలకు నీళ్లందుతాయని, మత్స్యకారులకు శాశ్వత ఉపాధి లభిస్తుందన్నారు. ప్రస్తుతం పంటలు వేసుకున్నందున దిగుబడి వచ్చే వరకు కాలువల తవ్వకం జరగదని హరీశ్‌రావు చెప్పారు. 2, 3 నెలల తర్వాత ఆర్డీవో ఆధ్వర్యంలో ప్రజల సమక్షంలో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కాలువల వెడల్పును తగ్గించి, భూ సేకరణ త గ్గించాలని రైతులు విజ్ఞప్తి చేయగా.. ప్రత్యామ్నాయాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సముద్రానికి 680 మీటర్ల ఎత్తులో ఉన్న ఆమ్రాబాద్, పదర మండలాలకు సాగు నీరు అందించాలని మంత్రికి అచ్చంపేట ఎమ్మెల్యే బాలరాజు విజ్ఞప్తి చేశారు.



నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజాప్రతినిధులతో మంత్రి హరీశ్‌రావు సమీక్ష

మార్చి 15న అంతర్జాతీయ అక్వా ఎగ్జిబిషన్

▸ మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేస్తాం: తలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లక్షలాది మత్స్యకారులను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా అంతర్జాతీయ ఆక్వా ఎగ్జిబిషన్‌ను హైదరాబాద్‌లో నిర్వహిస్తామని పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌ను సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ ఆక్వా కల్చర్ సంస్థ సహకారంతో హెచ్ఐసీసీలో మార్చి 15 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. బుధవారం సచివాలయంలో ఆక్వాక్స్ ఇండియా-2018ను మంత్రి ప్రారంభించారు. అంతర్జాతీయంగా అభివృద్ధి చేసిన సాంకేతిక విధానాలు, కొత్తజాతులు, వాటిని ఉత్పత్తిచేసే విధానాలు, మంచియంత్రాలు, నాణ్యమైన ఉత్పత్తులు, ఉత్తమ మార్కెటింగ్ పద్ధతులు, వినియోగదారులకు నాణ్యతపై అవగాహన కల్పించడం, మానవ వనరుల నైపుణ్య అభివృద్ధికి కృషి వంటి అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తామన్నారు. దక్షిణాసియాలోనే తొలిసారి నిర్వహించే ఈఎగ్జిబిషన్‌లో అన్నిరాష్ట్రాల చేపల పెంపకందారులు, 25 దేశాల నుంచి వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమీకృత మత్స్యాభివృద్ధి పథకం ద్వారా రూ.1000 కోట్లతో మత్స్య సంపద అభివృద్ధి, చేపల వేట పరికరాలు, మార్కెటింగ్ సదుపాయాలు, మౌళికసదుపాయాల అభివృద్ధి, శిక్షణ, క్షేత్ర స్థాయి సందర్శన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సారి 1.50 లక్షల రొయ్యలను పెంచుతామని మత్స్య శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు.



అక్వా ఎక్స్‌పో ఇండియా-2018ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని

పురుషోత్తం బంధువుల లాకర్లు తెరిచిన ఏసీబీ

▸ బినామీ సత్యనారాయణ ఇంట్లో సోదాలు

▸ విచారణ కోసం వియ్యంకుడికి నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సస్పెండైన హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ కె.పురుషోత్తం రెడ్డి బంధువులు నిపున్‌రెడ్డి, విదితారెడ్డిలకు చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు లాకర్లను బుధవారం వారి సమక్షంలోనే ఏసీబీ అధికారులు తెరిచారు. అయితే, పురుషోత్తం రెడ్డి ఆస్తులకు సంబంధించి వాటిలో అధికారులకు పెద్దగా సమాచారం లభించలేదని తెలిసింది. పురుషోత్తంరెడ్డి బినామీల్లో ఒకరు, మేడిపల్లిలో ఉంటున్న ఎర్రం సత్యనారాయణ ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి పరారీలో ఉన్న పురుషోత్తంరెడ్డి సమాచారం, ఆయన ఆస్తులకు సంబంధించిన అంశాలపై ఆరాతీశారు. ఈ కేసులో ఇప్పటి వరకు పురుషోత్తం రెడ్డి కుటుంబ సభ్యులతోపాటు డ్రైవర్, ఇతర పనివాళ్లను ప్రశ్నించారు. పురుషోత్తం రెడ్డి కోసం ఆయన కుటుంబ సభ్యులు, బినామీల ఇళ్లల్లో మరోసారి తనిఖీలు నిర్వహించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. కాగా, విచారణకు హాజరు కావాల్సిందిగా పురుషోత్తం రెడ్డి వియ్యంకుడు రాధాచరణ్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు ఏసీబీ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. మరోవైపు కేసు విచారణ పేరుతో దర్యాప్తు అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ పురుషోత్తం రెడ్డి బంధువులు నిపున్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఏసీబీ దర్యాప్తునకు సహకరించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

రాష్ట్రంలో 14 వెల్‌నెస్ కేంద్రాలు

▸ ఉద్యోగులు, జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలి

▸ ఈజేహెచ్ఎస్ సీఈవో డాక్టర్ కల్వకుంట్ల పద్మ

▸ సంగారెడ్డిలో నేడు మంత్రులచే వెల్‌నెస్ కేంద్రం ప్రారంభం



సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా 14 వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని ఎంప్లాయి, జర్నలిస్టు హెల్త్‌స్కీం (ఈజేహెచ్ఎస్) సీఈవో డాక్టర్ కల్వకుంట్ల పద్మ తెలిపారు. బుధవారం ఆమె సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రి ప్రాంగణంలో వెల్‌నెస్ కేంద్ర ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్రంలోని స్టాటిక్ బైస్కిల్‌ను తొక్కారు. ఖైరతాబాద్, వనస్థలిపురం, వరంగల్ జిల్లాలో వెల్‌నెస్ కేంద్రాలను ప్రారంభించామన్నారు. నాలుగో కేంద్రంగా సంగారెడ్డిలో గురువారం మంత్రులు డాక్టర్ లక్ష్మారెడ్డి, హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు.

వాట్సప్‌తో ఇంటికి మతి స్థిమితం లేని బాలుడు

సుజాతనగర్, ఫిబ్రవరి 7: తప్పిపోయిన మతిస్థిమితం లేని బాలుడు వాట్సప్ పుణ్యమాని తిరిగి ఇంటికి చేరాడు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో జరిగింది. మతిస్థిమితం లేకుండా రోడ్డుపై తిరుగుతున్న బాలుడిని మంగళవారం సుజాతనగర్ గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. ఎస్సై రతీష్ ఆ బాలుడి ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో పెట్టారు. చంద్రుగొండ పోలీసులు కూడా మరికొన్ని గ్రూపులకు ఫార్వర్డ్ చేయగా ఆ బాలుడిని చంద్రుగొండ మండలం రావికంపాడు గ్రామానికి చెందిన కాకటి రామకృష్ణగా గుర్తించారు. అతడిని నాయనమ్మ కాకటి పీరమ్మ, బాబాయి కాకటి రాఘవులుకు బుధవారం అప్పగించారు.



రామకృష్ణను ఇంటికి తీసుకెళ్తున్న నాయనమ్మ, బాబాయి

బీజేపీలోకి టీ.మాదిగ యూత్ జేఏసీ చైర్మన్



అంజిబాబుకు బీజేపీ సభ్యత్వం ఇస్తున్న కె.లక్ష్మణ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాదిగ స్టూడెంట్స్ అండ్ యూత్ జేఏసీ చైర్మన్ గద్దల అంజిబాబు తన అనుచరులతో కలిసి బుధవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి విద్యార్థులు, తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన కార్యకర్తలు, నాయకులతో కలిసి భారీ ర్యాలీగా బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. అంతకుముందు గద్దల అంజిబాబు విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ దళితులకు న్యాయం చేస్తుందని, కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నా రు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ప్రభు త్వం కట్టుబడిఉందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలు బలపరుస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు, బీజేపీ జాతీయ ప్రధా న కార్యదర్శి మురళీధర్‌రావు, రాష్ట్ర అధ్యక్షులు డా.కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ రాంచందర్‌రావుల సమక్షంలో బీజేపీలో చేరుతున్నానని చెప్పారు.

పన్నెండో త్రైమాసికంలోనూ స్పైస్‌జెట్ జోరు

ముంబై: ప్రైవేటు రంగ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి 240 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం (రూ.181.14 కోట్లు)తో పోల్చితే ఇది 32 శాతం అధికం. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం 27 శాతం వృద్ధి చెంది 1,642.41 కోట్ల రూపాయల నుంచి 2,081.95 కోట్ల రూపాయలకు చేరుకుంది. ప్రయాణికుల ద్వారా వచ్చిన రాబడి పెరగడం వల్ల కంపెనీ లాభాల బాటలో సాగుతోంది. వరుసగా 12వ త్రైమాసికంలోనూ స్పైస్‌జెట్ లాభాలను నమోదు చేసుకోవడం విశేషం.

ఇప్పటికింతే..

రెపో తగ్గింపునకు ఆర్‌బిఐ ససేమిరా
యథాతథ స్థితికి ఎంపిసిలో ఏకాభిప్రాయం



కీలక పాలసీ రేట్ల తగ్గింపుపై వివిధవర్గాల ఆశలపై నీళ్లు చల్లుతూ ఆర్‌బిఐ రేట్ల విషయంలో తటస్థ వైఖరికే మొగ్గుచూపింది. ద్రవ్యోల్బణం ఇప్పటికీ 6 శాతం వద్దనే కదలాడుతున్నందు వల్ల రెపో రేటు తగ్గించడం సాధ్యం కాదని తెగేసి చెప్పింది. రెపో రేటులో యథాతథ స్థితి కొనసాగింపునకు ద్రవ్యవిధాన కమిటీలోని ఆరుగురు సభ్యులూ ఏకగ్రీవంగా అంగీకరించారు. ఈ నిర్ణయంతో వివిధ రకాల రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు మృగ్యం అయ్యాయి.

ముంబై : రిజర్వు బ్యాంకు ఆరో ద్వైమాసిక ద్రవ్య విధాన సమీక్షలో స్వల్పకాలిక వడ్డీ రేట్లలో యథాతథ స్థితిని కొనసాగిస్తున్నట్టు ప్రకటించింది. దీంతో రెపో రేటు (ఆర్‌బిఐ నుంచి బ్యాంకులు తీసుకునే స్వల్పకాలిక రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు) 6 శాతం, రివర్స్ రెపో రేటు 5.75 శాతం, బ్యాంకు రేటు 6.25 శాతం వద్ద యథాతథంగా ఉన్నాయి. బుధ, గురువారాల్లో ముంబైలో సమావేశమైన ద్రవ్యవిధాన కమిటీ (ఎంపిసి) నిర్ణయాలను ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ గురువారం ప్రకటించారు. పలు అస్థిరతల కారణంగా ద్రవ్యోల్బణంపై అనిశ్చితి మేఘాలు ఆవరించి ఉన్నాయంటూ ఈ పరిస్థితిలో వడ్డీ రేట్ల విషయంలో తటస్థ వైఖరి అవలంబించడమే మంచిదని నిర్ణయించినట్టు ఆయన చెప్పారు. ఏడో వేతన సంఘం సవరణలు, గరిష్ఠ స్థాయిలకు చేరిన క్రూడాయిల్ ధరలు, కస్టమ్స్ సుంకాల పెంపు, విత్తలోటు 3.5 శాతానికి పెరిగే ముప్పువంటివి ఆర్థిక వ్యవస్థకు ఎదురుకానున్న ముప్పునకు సంకేతాలని ఆయన అన్నారు. మార్చి 31వ తేదీతో ముగియనున్న వర్తమాన ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు అంచనాను 6.6 శాతానికి కుదించింది. 2018-19లో 7.2 శాతానికి చేరే ఆస్కారం ఉన్నదని కూడా అంచనా ప్రకటించింది. అలాగే ద్రవ్యోల్బణం నాలుగో త్రైమాసికంలో 5.1 శాతం ఉండి 2018-19 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో 5.1 నుంచి 5.6 శాతానికి చేరి ద్వితీయార్ధంలో 4.5 శాతం నుంచి 4.6 శాతానికి తగ్గవచ్చునని తెలిపింది. అంతర్జాతీయ విపణిలో క్రూడాయిల్ ధరల పెరుగుదలకు దీటుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచకపోవడంతో ఈ రెండు ఇంధనాల ధరలు జనవరిలో భారీగా పెరిగాయని పేర్కొంది.

వివిధ అంశాలపై ఆర్‌బిఐ ప్రకటించిన అభిప్రాయాలు

ద్రవ్యోల్బణ భయాలు

క్రూడాయిల్ ధరల పెరుగుదల, ప్రభుత్వోద్యోగులకు వేతనాల పెంపు వంటి కారణాల వల్ల వర్తమాన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.1 శాతానికి పెరగవచ్చు. అలాగే 2018-19 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో కూడా అది 5.1 శాతం నుంచి 5.6 శాతం మధ్యన ఉండి ద్వితీయార్ధంలో 4.5 శాతం వరకు దిగి రావచ్చు. డిసెంబరు త్రైమాసికంలో ఆహారధాన్యాల ధరలు అసాధారణంగా పెరగడంతో ద్రవ్యోల్బణం 4.6 శాతానికి చేరింది. గత ఏడాది ఆగస్టు నుంచి అంతర్జాతీయ విపణిలో క్రూడాయిల్ ధరలు పెరుగుతూ ఉండడం, పారిశ్రామిక ముడిసరుకుల ధరల పెరుగుదల ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోసే అంశాలు.

వృద్ధి రేటు 6.6 శాతమే

వర్తమాన ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.6 శాతం ఉండవచ్చు. అయితే జిఎస్‌టి ఇక్కట్లు తొలగి స్థిరత్వం నెలకొనడం, రుణాలకు డిమాండు పెరగడం వంటి అంశాల ఊతంతో వచ్చే ఏడాది 7.2 శాతానికి పెరిగే ఆస్కారం ఉంది. స్థూల విలువ జోడింపు (జివిఎ) ఈ ఏడాది 6.6 శాతం ఉండి వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.7 శాతానికి పెరగవచ్చు.

రికవరీ బాట పట్టిన ఆర్థిక రంగం

ఆర్థిక రంగం రికవరీ బాట పట్టినట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రుణాల కోసం ముందుకు వచ్చే వారి సంఖ్య పెరగడం, ప్రైమరీ మార్కెట్ ద్వారా నిధుల సమీకరణ జోరందుకోవడం, యంత్రపరికరాలకు డిమాండు పెరగడం వంటివి పెట్టుబడి కార్యకలాపాల పునరుద్ధరణకు తొలి సంకేతాలు. ప్రభుత్వ రంగ బ్యాంకుల రీ క్యాపిటలైజేషన్, రుణాల పరంగా వత్తిడి ఎదుర్కొంటున్న కేసులను దివాలా చట్టం పరిధిలో పరిష్కరించడం వంటి చర్యల వల్ల కొత్త పెట్టుబడులకు డిమాండు పెరుగుతుంది. అంతర్జాతీయంగా వస్తుసేవల డిమాండు పెరగడం ఎగుమతులు కూడా పుంజుకునేందుకు దోహదపడే అంశం. దీని వల్ల దేశీయంగా పెట్టుబడులు పుంజుకుంటాయి.

ఆ 5 సుంకాలే పెద్ద ప్రతిబంధకం

ప్రస్తుతం అమలులో ఉన్న ఐదు సుంకాలు దేశంలో పొదుపు, పెట్టుబడులను ప్రభావితం చేస్తున్నాయని ఉర్జిత్ పటేల్ తెలిపారు. కంపెనీలపై కార్పొరేట్ పన్ను, 10 లక్షల రూపాయల పైబడిన డివిడెండ్లపై డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్, సెక్యూరిటీ లావాదేవీల పన్ను, క్యాపిటల్ గెయిన్స్ పన్ను వంటివి ఇప్పటికే ఆర్థిక వ్యవస్థలో ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇవే దేశంలో ప్రజల పెట్టుబడి, పొదుపు ధోరణులపై ప్రభావం చూపుతున్నాయని ఆయన చెప్పారు. ద్వైమాసిక పాలసీ ప్రకటన అనంతరం ఆర్‌బిఐ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జిడిపిలో పెట్టుబడుల వాటా చాలా తక్కువగా ఉండడానికి కారణాలేమిటన్న ప్రశ్నకు ఈ విధంగా స్పందించారు. "మన దేశంలో పెట్టుబడులపై పలు విభాగాల నుంచి పన్నులున్నాయి, ప్రతీదీ ఒక మోస్తరే అనుకున్నా అన్నీ కలిస్తే భారం పెద్దదే అవుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే సామర్థ్యాల వినియోగం పెరుగుతూ ఉండడం, రుణాల పోర్ట్‌ఫోలియోలో రెండంకెల వృద్ధి వంటివి ఈ శాతం పెరిగేందుకు దోహదపడే అంశాలని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వం విత్త లోటు లక్ష్యాలు చేరుకోవడం మరింత జాప్యం కావచ్చునని ఉర్జిత్ అన్నారు. వర్తమాన ఆర్థిక సంవత్సరానికి విత్తలోటు లక్ష్యాన్ని ఈ ఏడాదికి 3.2 శాతం నుంచి 3.5 శాతానికి, వచ్చే ఏడాదికి 3 శాతం నుంచి 3.2 శాతానికి పెంచిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఎంసిఎల్ఆర్‌తో బేస్ రేటు విలీనం

ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బేస్‌రేటును ఎంసిఎల్ఆర్‌తో విలీనం చేస్తున్నట్టు ఆర్‌బిఐ ప్రకటించింది. దీని వల్ల పాలసీ రేట్లలో తగ్గింపు త్వరితగతిన కస్టమర్లకు అందుతుందని పేర్కొంది. 2016 ఏప్రిల్ నుంచి అమలులోకి తెచ్చిన ఎంసిఎల్ఆర్ విధానంతో అంతకు ముందు బేస్‌రేటుతో ఉన్న రుణాలన్నీ ఎంసిఎల్ఆర్ విధానంలోకి మారతాయని అప్పట్లో ఆర్‌బిఐ భావించింది. ఇలా భారీ పరిమాణంలో రుణాలు బేస్‌రేటులోనే ఉండిపోవడం పట్ల గత విధాన సమీక్షల్లో ఆందోళన ప్రకటించినా పరిస్థితిలో మార్పు లేకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ ఎన్ఎస్ విశ్వనాథన్ చెప్పారు. ఈ చర్య ద్వారా తాము ఎంసిఎల్ఆర్‌ను బేస్‌రేటుతో సమానం చేయడంలేదని, కేవలం రేట్లను హేతుబద్ధీకరించామని ఆయన స్పష్టం చేశారు. వచ్చే వారాంతంనాటికి ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని ఆయన చెప్పారు. దీనివల్ల ఎంసిఎల్ఆర్ విధానం ప్రవేశపెట్టడానికి ముందు ఇంటిరుణాలు తీసుకున్న వారికి వడ్డీ రేట్లు తగ్గుతాయని విశ్లేషకులంటున్నారు.

ఎంఎస్ఎంఇలకు మరింత వెసులుబాటు


జిఎస్‌టి, డీమానిటైజేషన్‌తో ప్రభావితమై ఇబ్బందులు పడుతున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు బ్యాంకు రుణాల తిరిగి చెల్లింపునకు మరో 180 రోజుల గడువు ఇస్తున్నట్టు విశ్వనాథన్ ప్రకటించారు. ఆ రుణాలను ఎన్‌పిఎలుగా మారేందుకు అవకాశం ఉన్నవిగా వర్గీకరించకుండానే ఈ వెసులుబాటు కల్పిస్తున్నట్టు చెప్పారు. అలాగే సేవల రంగంలోకి వచ్చే ఎంఎస్ఎంఇలకు రుణపరిమితులు కూడా ఎత్తివేసింది. ప్రస్తుతం ప్రాధాన్యతా రంగం వర్గీకరణలోకి వచ్చే ఎంఎస్ఎంఇలకు 5, 10 కోట్ల రూపాయల రుణపరిమితి అమలులో ఉంది.

పాలసీ ముఖ్యాంశాలు

- రెపోరేటు 6 శాతం, రివర్స్ రెపో 5.75 శాతం, బ్యాంకు రేటు 6.25 శాతం
- క్యూ4లో రిటైల్ ద్రవ్యోల్బణం అంచనా 5.1 శాతం
- వచ్చే ఏడాది ప్రథమార్ధంలో 5.1-5.6 శాతం, ద్వితీయార్ధంలో 4.5-4.6 శాతం
- జివిఎ వృద్ధి అంచనా 2018లో 6.6 శాతం, 2019లో 7.2 శాతం
- స్థిరపడుతున్న జిఎస్‌టి, ఆర్థిక కార్యకలాపాలకు ఉత్తేజం
- పెట్టుబడుల్లో కదలిక తొలి సంకేతాలు
- ఎగుమతులు జోరందుకునే అవకాశం
- బడ్జెట్‌లో గ్రామీణ, మౌలిక వసతుల ప్రాధాన్యం హర్షణీయం
- తదుపరి ఎంపిసి సమావేశం ఏప్రిల్ 4, 5

ఆర్‌బిఐ ద్రవ్య పరపతి సమీక్ష ఊహించినట్టుగానే ఉందనీ పారిశ్రామిక రంగం అభిప్రాయపడింది. ద్రవ్యోల్బణ భయాలు, ద్రవ్యలోటు విస్తరించే అవకాశం ఉన్న కారణంగా రేట్ల విషయంలో ఆర్‌బిఐ యథాతథ స్థితి కొనసాగించాలని నిర్ణయించడం సరైన ఆలోచనే అని కొందరు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. మరికొందరు మాత్రం రేట్లు తగ్గిస్తే ప్రైవేట్ పెట్టుబడుల జోరు పెరిగేదని పేర్కొన్నారు. ఆర్‌బిఐ పాలసీ నిర్ణయంపై ఎవరేమన్నారంటే...

మంచి అవకాశాన్ని జారవిడుచుకున్నారు.



గత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బిఐ ఒకే ఒకసారి అది కూడా 0.25 శాతం మేర రెపో రేటు తగ్గించింది. ఇటీవల విడుదల చేసిన ఆర్థిక సర్వేలో 2017-18లో సగటు ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయిలో ఉందని స్పష్టంగా పేర్కొన్నారు. ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించడానికి అందివచ్చిన ఒక మంచి అవకాశాన్ని వదులుకుందనడంలో సందేహం లేదు. రేట్లు తగ్గిస్తే ప్రైవేట్ పెట్టుబడుల జోరు పెరిగి ఆర్థిక రంగం రాణించేది. దేశంలో ద్రవ్యోల్బణ భయాలు ప్రధానంగా వ్యవసాయోత్పత్తుల సప్లయ్‌లోని తేడాల కారణంగా తలెత్తుతున్నవే. మున్ముందు ఆర్‌బిఐ ఆర్థిక వృద్ధికి సంబంధించి ఆందోళనలను కూడా పట్టించుకుంటుందని ఆశిస్తున్నాం.

–రాశేష్ షా, ప్రెసిడెంట్, ఫిక్కీ

కరెక్ట్ నిర్ణయం



ఒక రకంగా చెప్పాలంటే ఆర్‌బిఐ నిర్ణయం పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ఊరట అని చెప్పవచ్చు (కొందరు ఎనలిస్టులు వడ్డీరేట్లు పెంచే అవకాశం ఉందని అంచనావేశారు). ద్రవ్యోల్బణం, గ్లోబల్ ముడి చమురు ధరల వంటి కొన్ని విషయాల్లో ఆర్‌బిఐ వ్యక్తం చేసిన ఆందోళనలు సహేతుకమైనవే. రైతులకు కనీస మద్దతు ధర పెంచాలన్న ప్రభుత్వ నిర్ణయం వల్ల రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది.

–సందీప్ జజోడియా, ప్రెసిడెంట్, అసోచామ్



ద్రవ్యోల్బణం, విత్తలోటు టార్గెట్ ప్రకారం ఉండకపోవచ్చన్న భయాల వల్ల ఈ సారి ద్రవ్య విధానం కఠినంగా ఉండొచ్చన్న భయాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఆర్‌బిఐ రేట్లను మార్చకుండా అలాగే ఉంచడం అభినందించదగిన విషయం. సప్లయ్‌లను పెంచేందుకు చేపడుతున్న చర్యల వల్ల ధరల అదుపులోకి వస్తే ఆర్‌బిఐ రేట్లను తగ్గించే విషయం పరిశీలించవచ్చు.

–అనిల్ ఖైతాన్, ప్రెసిడెంట్, పిహెచ్‌డి చాంబర్ ఆఫ్ కామర్స్

ఆటో ఎక్స్‌పోలో విద్యుత్ మెరుపుల్..

కొలువుదీరిన కొత్త మోడళ్లు .. ఎలక్ట్రిక్ వాహనాలదే హవా

కళ్లు చెదిరే కాన్సెప్ట్ వాహనాలు, అదిరిపోయే ఫీచర్లతో ఎలక్ట్రిక్ వాహనాలు, ఇప్పటికే మార్కెట్లో ఉన్న మోడళ్లకు కొత్త వెర్షన్లతో బుధవారం ఆటో ఎక్స్‌పో సందడి సందడిగా మారిపోయింది. కార్లు, టూవీలర్లు, వాణిజ్య వాహనాలను తయారు చేస్తున్న దేశ, విదేశీ కంపెనీలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి. కొన్ని కంపెనీలు తమ వాహనాల నమూనాలను ఆవిష్కరిస్తుంటే, మరికొన్ని కంపెనీలు కొత్త మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. తొలి రోజు 65 కొత్త వాహనాల ఆవిష్కరణలతోపాటు 14 వాహనాలను కంపెనీలు విడుదల చేశాయి. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఆటో ఎక్స్‌పో 14వ ఎడిషన్‌ను ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎసిఎంఎ), భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), భారత ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ సంఘం (సియామ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్నాయి. 9-14 వరకు సాధారణ ప్రజలు ఈ ఆటో ఎక్స్‌పోను సందర్శించవచ్చు.

2018 AUTO EXPO THE MOTOR SHOW 9 - 14 FEBRUARY 2018



హోండా నయా అమేజ్, సివిక్

జపాన్ ఆటో దిగ్గజం హోండా.. సరికొత్త అమేజ్, సిఆర్-వి, సివిక్ సెడాన్ మోడళ్లను ప్రదర్శించింది. ఈ మూడు కార్లు వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశీయ మార్కెట్లోకి రానున్నాయి. వచ్చే మూడేళ్లలో ఆరు కొత్త కార్లను మార్కెట్లోకి తీసుకురావాలన్నది కంపెనీ లక్ష్యం.

రెనో.. 2 ఎలక్ట్రిక్ వాహనాలు

ట్రెజార్, జోఇ ఇ-స్పోర్ట్ పేర్లతో రెండు ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ కార్లను ఫ్రెంచ్ కంపెనీ రెనో ప్రదర్శించింది. ఫార్ములా వన్ కారు ఆర్ఎస్ 17ను కూడా కంపెనీ ప్రదర్శించడం విశేషం. రెండు సీట్లు కలిగిన ట్రెజార్ 4.7 మీటర్ల పొడవు, 2.18 మీటర్ల వెడల్పు, 1.08 మీటర్ల ఎత్తు ఉంది. జోఇ ఇ-స్పోర్ట్ కాన్సెప్ట్‌కారును తక్కువ బరువు ఉన్న కార్బన్ ఫైబర్‌తో తయారు చేశారు. 3.2 సెకన్ల వ్యవధిలోనే ఇది 100 కిలో మీటర్ల వేగంతో దూసుకుపోతుంది.

కొత్త ఎలైట్ ఐ20.. ధర రూ.5.34 లక్షలు

కొరియా కంపెనీ హ్యుండయ్.. ప్రీమియం కాంపాక్ట్ హ్యాచ్‌బ్యాక్ ఎలైట్ ఐ20లో కొత్త వెర్షన్‌ను విడుదల చేసింది. దీని ధర 5.34 లక్షల రూపాయల నుంచి 9.15 లక్షల రూపాయల (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ) వరకు ఉంది. గ్లోబల్ ఎలక్ట్రిక్ వెహికిల్ అయోనిక్‌ను కూడా హ్యుండయ్ ఆవిష్కరించింది. దీపావళినాటికి సాంత్రో కొత్త మోడల్‌ను కంపెనీ తీసుకురానుంది.



భారత మార్కెట్ కోసం 'కియా' వాహనాలు

ఆంధ్రప్రదేశ్ ప్లాంట్ ఏర్పాటు చేసిన దక్షిణ కొరియా సంస్థ కియా మోటార్స్ దేశీయ మార్కెట్ కోసం రూపొందించి అభివృద్ధి చేసిన ఎస్‌పి కాన్సెప్ట్ ఎస్‌యువిని ఆవిష్కరించింది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ఈ ఎస్‌యువి దేశీయ మార్కెట్లోకి రానుంది. దీనిని ఎపి ప్లాంట్‌లో తయారుచేస్తారు. 2019 -2021 మధ్యకాలంలో దేశీ మార్కెట్లోకి కియా హ్యాచ్‌బ్యాక్‌ల నుంచి ఎస్‌యువిల వరకు పలు కొత్తవాహనాలను దేశీమార్కెట్లోకి తేనుంది. ఇందులో కాంపాక్ట్ ఎలక్ట్రిక్ వెహికిల్ కూడా ఉండబోతోంది. లేట్‌గా మార్కెట్లోకి వస్తున్నా లేటెస్ట్‌గా వస్తామని సంస్థ చెబుతోంది.

పియాజియో 'అప్రిలియా ఎస్ఆర్125'

ఇటలీకి చెందిన పియాజియో.. 125 సిసి బైక్ అప్రిలియా ఎస్ఆర్ 125 బైక్‌ను విడుదల చేసింది. దీని ధర 65,310 రూపాయలు (ఎక్స్‌షోరూమ్ పుణె). వెస్పా స్కూటర్ శ్రేణిలో భాగంగా వెస్పా జిటిఎస్, టునో 150, ఇ-స్కూటర్ ఎలెట్రికాలను కూడా కంపెనీ ప్రదర్శించింది.



మహీంద్రా 6 ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ వాహనాలు

'ఫ్యూచర్ ఆఫ్ మొబిలిటీ' వ్యూహంలో భాగంగా ఆరు సరికొత్త ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ వాహనాలు, మోడళ్లను మహీంద్రా అండ్ మహీంద్రా ఆవిష్కరించింది. దక్షిణ కొరియా అనుబంధ సంస్థ సాంగ్‌యాంగ్ జి4 రెక్స్‌టన్ ఎస్‌యువిని కంపెనీ ఆవిష్కరించింది. దీన్ని ఏడాది చివరినాటికి కంపెనీ విడుదల చేయనుంది. కాన్సెప్ట్ టియువి స్టింగర్‌ను కూడా కంపెనీ ఆవిష్కరించింది. యుడిఒ, కాన్సెప్ట్ టూసీటర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాడ్ అటామ్, ఇ-కెయువి 100, ఇ-కాస్మో ఎలక్ట్రిక్ బస్, ఇ20 నెక్స్ట్ వంటి వాహనాలను కంపెనీ ప్రదర్శించింది.

హోండా 160సిసి బైక్ 'ఎక్స్-బ్లేడ్'

హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) 160 సిసి బైక్ ఎక్స్-బ్లేడ్‌ను ఆవిష్కరించింది. వచ్చే నెలలో దీన్ని మార్కెట్లోకి విడుదల చేయనుంది. మరో 10 మోడళ్లను కూడా కంపెనీ ప్రదర్శించింది. వీటిలో యాక్టివా స్కూటర్ కొత్త వెర్షన్ కూడా ఉంది.

హీరో.. 200సిసి అడ్వెంచర్ బైక్, 2 స్కూటర్లు

హీరో మోటోకార్స్.. 200 సిసి అడ్వెంచర్ మోటార్ సైకిల్ ఎక్స్‌పల్స్‌తోపాటు రెండు 125 సిసి స్కూటర్లను ఆవిష్కరించింది. ఇవి ఈ ఏడాది చివరికల్లా మార్కెట్లోకి రానున్నాయి. ఎక్స్‌పల్స్ ద్వారా అధిక స్థాయి ఇంజన్ కెపాసిటీ మోటార్‌సైకిల్ విభాగంలో కంపెనీ తన వాటాను పెంచుకుంటోంది.

టీవీఎస్ మోటార్ 3 కాన్సెప్ట్ వాహనాలు

టీవీఎస్ మోటార్ కంపెనీ ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ స్కూటర్ 'క్రెయాన్'తో పాటు 220 సిసి సింగిల్ సిలిండర్ ఇంజన్ బైక్ 'జెప్పెలిన్', ఎథనాల్ పవర్డ్ మోటార్ సైకిల్ అపాచీ ఆర్‌టిఆర్ 200 ఎఫ్ఐ ఎథనాల్‌ను ఆవిష్కరించింది. క్రెయాన్ 60 నిమిషాల్లోనే 80 శాతం చార్జింగ్ అవుతుందని, 5.1 సెకన్ల వ్యవధిలో 0-60 కిలో మీటర్ల వేగాన్ని అందుకుంటుందని కంపెనీ చెబుతోంది.



బిఎండబ్ల్యు కారుతో సచిన్

యమహా వైజెడ్ఎఫ్-ఆర్15లో కొత్త వెర్షన్

ఇండియా యమహా మోటార్ తన స్పోర్ట్స్ బైక్ వైజడ్ఎఫ్-ఆర్15లో కొత్త వెర్షన్‌ను విడుదల చేసింది. దీని ధర 1.25 లక్షల రూపాయలు (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ). రెండు రంగుల్లో ఇది లభించనుంది.

టాటా మోటార్స్ 2 కాన్సెప్ట్, 6 ఎలక్ట్రిక్ వాహనాలు

టాటా మోటార్స్ లగ్జరీ ఎస్‌యువి విభాగంలో రెండు కాన్సెప్ట్ వాహనాలు, ఆరు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శించింది. స్మార్ట్ మొబిలిటీ, స్మార్ట్ సిటీస్ థీమ్‌తో వాహనాలను కంపెనీ ప్రదర్శించింది. హెచ్5ఎక్స్ కాన్సెప్ట్, 45ఎక్స్ కాన్సెప్ట్ వాహనాలను కంపెనీ ప్రదర్శించింది. 12ఎం ఎలక్ట్రిక్ బస్, మ్యాజిక్ ఇవి, ఐరిస్ ఇవి, టియాగో ఇవి, రేస్‌మో ఇవి వంటి వాహనాలను కూడా కంపెనీ ప్రదర్శిస్తోంది.

అశోక్‌లేలాండ్ ఎలక్ట్రిక్ బస్ 'సర్క్యూట్ ఎస్'

వాణిజ్యవాహనాల తయారీ కంపెనీ అశోక్‌లేలాండ్.. తొలి ఎలక్ట్రిక్ బస్ సర్క్యూట్ ఎస్‌ను ఆవిష్కరించింది. 25 నుంచి 35 సీట్ల వరకు ఉన్న ఈ వాహనం ప్రజా రవాణాకు బాగా ఉపయోగకరంగా ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఈ బస్సు వచ్చే 3 నుంచి 6 నెలల కాలంలో అందుబాటులోకి వస్తాయి.



మారుతి కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్

మారుతి సుజుకీ తన ఇగ్నిస్ కాన్సెప్ట్ కారును ఆవిష్కరించింది. దీంతోపాటు కాన్సెప్ట్ ఫ్యూచర్‌ఎస్ కారును కూడా ప్రదర్శనకు తెచ్చింది.

మెర్సిడెస్ బెంజ్ నుంచి మేబ్యాక్ ఎస్ 650

జర్మనీకి చెందిన మెర్సిడెస్ బెంజ్ తన మేబ్యాక్ ఎస్ 650 కారును విడుదల చేసింది. దీని ధర 2.73 కోట్ల రూపాయల నుంచి ప్రారంభం అవుతుంది. కాన్సెప్ట్ ఎలక్ట్రిక్ వెహికిల్ ఇక్యును కంపెనీ ప్రదర్శించింది. దీనితోపాటు ఇ-క్లాస్ ఆల్‌న్యూ టెర్రైన్ సెడాన్‌ను కూడా ప్రదర్శనకు తెచ్చింది. మెర్సిడెస్ ఎఎంజి పెట్రోనాస్ ఫార్ములా 1 సహా 13 కార్లను ఈ కంపెనీ ప్రదర్శిస్తోంది.



కాన్సెప్ట్ ఇక్యు కారు ఇదే


అరబిందో లాభం రూ.595 కోట్లు

»» ఒక్కో షేరుపై రూపాయి డివిడెండ్ ప్రకటన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఔషధ రంగ సంస్థ అరబిందో ఫార్మా ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరతో ముగిసిన మూడో త్రైమాసికం(క్యూ3)లో కంపెనీ లాభం రూ.595 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.578.6 కోట్లతో పోలిస్తే కేవలం 2 శాతం వృద్ధి చెందింది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అరబిందో క్యూ3 ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11 శాతం పెరిగి రూ.4,336 కోట్లకు పుంజుకుంది. డిసెంబర్ 2016తో ముగిసిన మూడు నెలలకాలానికి సంస్థ ఆదాయం రూ.3,906 కోట్లుగా నమోదైంది.

కీలక మార్కెట్లన్నింటిలోనూ సంస్థ మెరుగైన పనితీరు ప్రదర్శించిందని, మంచి వృద్ధి కనబర్చిందని అరబిందో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ గోవిందరాజన్ అన్నారు. అమెరికాలో కార్పొరేట్ పన్ను చట్టంలో మార్పు ఫలితంగా వన్‌టైం ట్యాక్స్ ఛార్జ్‌గా కేటాయించిన రూ.66.4 కోట్లను కూడా పరిగణనలోకి తీసుకుంటే గనుక సంస్థ లాభం అంచనాల మేరకే నమోదైందన్నారు. స్పెషాలిటీ, కాంప్లెక్స్ జనరిక్స్ ఉత్పత్తుల పరిధి పెంచుకునేందుకు ముున్ముందు మరిన్ని పెట్టుబడులు పెడతామని ఆయన తెలిపారు.

- గత ఏడాది అక్టోబర్-డిసెంబరు కాలానికి ఫార్ములేషన్స్ విక్రయాల ద్వారా సంస్థకు రూ.3,570.2 కోట్ల ఆదాయం సమకూరింది. వార్షిక ప్రాతిపదికన ఈ మొత్తం 14.1 శాతం అధికం. అంతేకాదు క్యూ3లో నమోదైన మొత్తం రెవెన్యూలో ఫార్ములేషన్స్ వాటానే 82 శాతం. మిగతా 18 శాతం (రూ.765.7 కోట్లు) ఆదాయాన్ని యాక్టివ్ ఫార్మాస్యూటికల్స్ ఇంగ్రిడియెంట్స్ (ఎపిఐ) విక్రయం ద్వారా ఆర్జించగలిగింది.
- సంస్థకు అత్యంత కీలకమైన అమెరికా మార్కెట్లో ఫార్ములేషన్ విక్రయాల ద్వారా సమకూరిన ఆదాయం వార్షిక ప్రాతిపదికన 9.4 శాతం పెరిగి రూ.1,909.6 కోట్లకు చేరుకుంది.
- యూరప్‌లో ఫార్ములేషన్స్ అమ్మకాల ద్వారా ఆదాయం 37 శాతం పెరిగి రూ.1,171.6 కోట్లకు చేరింది.
- మూడో త్రైమాసికంలో సంస్థ.. అమెరికా ఔషధ నియంత్రణ మండలి యుఎస్ఎఫ్‌డిఎ వద్ద 4 డ్రగ్ మాస్టర్ ఫైల్స్ (డిఎంఎఫ్) దాఖలు చేసింది. అలాగే 20 ఎఎన్‌డిఎ (అబ్రివియేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్)లకు తుది అనుమతులు, మరో 2 ఎఎన్‌డిఎలకు సూచనప్రాయ అంగీకారం లభించిందని సంస్థ తెలిపింది.
- రూ.1 ముఖ విలువ కలిగిన షేర్ ఒక్కింటికి రూపాయి డివిడెండ్ చెల్లించేందుకు సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది.



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిది రెండో మధ్యంతర డివిడెండ్. షేర్‌హోల్డర్లకు డివిడెండ్‌ను ఈనెలాఖరులోగా చెల్లించనున్నట్లు సంస్థ వెల్లడించింది.

ఎంఎస్ఎంఇల వర్గీకరణలో మార్పులు

»» ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ: లఘు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) వర్గీకరణ ప్రమాణాల్లో మార్పుల కోసం చట్టాన్ని సవరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు ప్లాంట్, యంత్రాలపై పెట్టుబడి ఆధారంగా ఈ రంగ కంపెనీలను వర్గీకరించేవారు. ఇకపై వార్షిక టర్నోవర్‌ను ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఇందుకోసం లఘు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి చట్టం(ఎంఎస్ఎంఇడి), 2016లో ప్రతిపాదించిన సవరణలకు ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం భేటీ అయిన కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి కేంద్రం.. ఇప్పటికే లోక్‌సభలో పెండింగ్‌లో ఉన్న సవరణ బిల్లును ఉపసంహరించుకొని కొత్త బిల్లును ప్రవేశపెట్టనుంది. ప్రతిపాదిత వర్గీకరణ ప్రమాణాల ప్రకారం.. రూ.5 కోట్ల కంటే తక్కువ వార్షిక టర్నోవర్ కలిగిన వాటిని లఘు పరిశ్రమలుగా, రూ.5 కోట్ల నుంచి రూ.75 కోట్ల వరకు చిన్న పరిశ్రమలుగా, రూ.75 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు మధ్యతరహా పరిశ్రమలుగా గుర్తించనున్నారు. తద్వారా వ్యాపార నిర్వహణలో అనుకూలత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.



60 ఆయిల్ అండ్ గ్యాస్ బ్లాక్‌ల వేలానికి ఓకే

ప్రభుత్వ రంగ ఇంధన సంస్థలైన ఓఎన్‌జిసి, ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఒఐఎల్)కు చెందిన 60 చమురు, సహజవాయువు క్షేత్రాలను వేలం వేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 22 ఓఎన్‌జిసికి చెందినవికాగా.. 5 ఆయిల్ ఇండియా డిస్కవర్ చేసినవి. మరో 12.. గతంలో నిర్వహించిన వేలంలో కొనుగోలు చేసి వదులుకున్నవి. మిగతా 21 క్షేత్రాలు గత ఏడాది జరిగిన వేలంలో స్పందనకు నోచుకోలేదు.

ఐబిసి సవరణలకు ఆమోదం

దివాలా స్మృతి చట్ట (ఐబిసి) సవరణలకు కేంద్ర కేబినెట్ ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో ఆమోదం తెలియజేసింది. దివాలా పరిష్కార చర్యల్లో భాగంగా కంపెనీల ఆస్తుల వేలంలో ఆ సంస్థల ప్రమోటర్లు పాల్గొనకుండా ఐబిసిలో ప్రభుత్వం తగిన మార్పులు చేసింది.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,240	31,000	31,280	30,900	30,330
క్రితం ముగింపు	31,570	31,150	31,540	---	30,570
22 క్యారెట్లు	28,920	28,800	28,800	28,610	28,890
క్రితం ముగింపు	29,230	28,800	29,010	---	29,110
వెండి (కిలో)	39,500	40,000	39,400	39,700	41,500
క్రితం ముగింపు	40,000	40,200	39,800	---	41,800

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	66.00	విజయవాడ	71.00
కరీంనగర్	68.00	గుంటూరు	71.00
వరంగల్	68.00	ఒంగోలు	73.00
మహబూబ్‌నగర్	66.00	చిత్తూరు	62.00
కర్నూలు	66.00	నెల్లూరు	70.00
విశాఖపట్నం	67.00	అనంతపురం	67.00
గోదావరి	70.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	345.00	చిత్తూరు	373.00
వరంగల్	347.00	చెన్నై	380.00
విజయవాడ	335.00	నమక్కల్	365.00
గోదావరి	335.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	340.00	ముంబై	390.00


ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.29	67.58
పౌండ్	81.37	94.38
యూరో	72.20	83.73
ఆస్ట్రేలియా డాలర్	45.95	53.16
బహ్రెయిన్ దినార్	157.84	180.89
కువైట్ దినార్	176.72	220.00
ఒమని రియాల్	154.57	176.84
సౌదీ రియాల్	15.49	18.37
సింగపూర్ డాలర్	44.22	52.39
యుఎఇ దిరమ్	15.86	18.54

నష్టాల్లోనే..

»» సెన్సెక్స్ మరో 113 పాయింట్లు డౌన్
»» నిరుత్సాహపరిచిన ఆర్‌బిఐ పాలసీ రేటు
»» బ్యాంకింగ్ షేర్లలో మిశ్రమ స్పందన
»» పుంజుకుంటున్న స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లు

ముంబై : మార్కెట్లు నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. కొత్తగా ఉత్సాహాన్నిచ్చే పరిణామాలు ఏమీ లేకపోగా, ఆర్‌బిఐ వడ్డీరేట్లలో మార్పు చేయకపోవడం, వృద్ధి రేటు అంచనాలను తగ్గించడం మార్కెట్‌ను మరింత నిరాశలో ముంచింది. తీవ్రమైన ఆటుపోట్ల మధ్య సెన్సెక్స్ 113 పాయింట్ల నష్టంతో 34082 పాయింట్ల వద్ద, నిఫ్టీ 21 పాయింట్ల నష్టంతో 10476 వద్ద ముగిసాయి. ఆర్‌బిఐ రెపోరేటును 6 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించడంతోపాటు ఈ ఏడాది వృద్ధి రేటు అంచనాలను 6.7 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. పైగా ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలున్నాయనీ, విత్తలోటూ విస్తరించే అవకాశం ఉందని అంచనా వేసింది. వాస్తవానికి మార్కెట్ ప్రారంభం పాజిటివ్‌గా ఉంది. అమెరికా స్టాక్ మార్కెట్ స్థిమితపడటంతో సెన్సెక్స్ ఉదయం ట్రేడ్‌లో 470 పాయింట్ల లాభంతో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపట్లోనే పడిపోవడం మొదలైంది. ఇంట్రాడేలో 34008 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకి ఆఖరులో మళ్లీ కోలుకుంది. గత ఏడు సెషన్స్‌లో సెన్సెక్స్ నికరంగా 2200 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ ఇంట్రాడేలో 10614 -10446 పాయింట్ల మధ్య ఆటుపోట్లను చవిచూసింది. అంతర్జాతీయ మార్కెట్లు కూడా రెండు రోజుల భారీ పతనంతో బుధవారం నాడు కుదుటపడ్డాయి.



- నష్టాలతో ముగిసినప్పటికీ మార్కెట్‌లో మళ్లీ బలం కనిపిస్తోంది. బిఎస్ఇలోమొత్తం 1988 షేర్లు లాభాలతో ముగియగా కేవలం 786 షేర్లు నష్టాలతో ముగిశాయి.
- పూర్తి నిరాశలో ఉన్న మార్కెట్లో రేట్ సెన్సిటివ్ స్టాక్స్ కారణంగా కొంత సందడి కనిపించింది. ఆటో, రియల్టీ షేర్లలో స్వల్పంగా పెరుగుదల ఉంది.
- బ్యాంక్ ఇండెక్స్ 0.4శాతం పడిపోయింది. అయితే షేర్లలో మిశ్రమ ధోరణి ఉంది. పిఎన్‌బి, యస్‌బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బిఒబి దాదాపు 2.18 శాతం నష్టాన్ని చవిచూశాయి.ఐసిఐసిఐ బ్యాంక్, ఎస్‌బిఐ, ఫెడరల్ బ్యాంక్ మాత్రం లాభాలతో ముగిశాయి.
- కీలక షేర్లలో ఎల్ అండ్ టి, మారుతి, టాటా స్టీల్, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, విప్రో, నష్టాలతో ముగిశాయి. స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ సూచీలు పుంజుకున్నాయి.
- క్యూ3 ఫలితాలు ఇచ్చిన ఉత్సాహంతో స్పైస్‌జెట్ షేరు ధర 4 శాతం లాభపడింది. సిప్లా కూడా ఇదే కారణంతో లాభాల్లో ముగిసింది. హీరో మోటోకార్ప్, ఐషర్ మోటార్స్ షేర్లకు కూడా క్యూ3 ఫలితాల కిక్కు లభించింది.

కొమ్ములు తిరిగిన ఇన్వెస్టర్లూ ఖంగుతిన్నారు

స్టాక్ మార్కెట్ పతనంతో కొమ్ములు తిరిగిన ఇన్వెస్టర్లు కూడా ఖిన్నులయ్యారు. గతేడాది స్టాక్ మార్కెట్ బూమ్ కారణంగా తలపండిన ఇన్వెస్టర్ల పెట్టుబడులు అనేక రెట్లు పెరిగాయి. దాంతో పాటే వారి పేరూ మార్కెట్లో మోగిపోయింది. గత వారం రోజులుగా మార్కెట్ బేరిష్ ధోరణిలో ఉండటంతో సదరు ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువ గణనీయంగా తగ్గింది. దేశంలో పేరుమోసిన స్టాక్ మార్కెట్ ట్రేడర్లు, రాకేష్ ఝున్‌ఝున్‌వాలా, డాలీ ఖన్నా, ఆశీష్ కచోలియా...వంటి ఇన్వెస్టర్ల ఈక్విటీ పోర్ట్‌ఫోలియో విలువ కూడా గత వారంరోజుల్లోనే 33-34 శాతం వరకు తగ్గినట్టు మార్కెట్‌వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏస్ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టిన షేర్లను మార్కెట్ నిపుణులు చాలా నిశితంగా గమనిస్తూ ఉంటారు. మార్కెట్, ఈ ఏడాది జనవరి నుంచి మూటగట్టుకున్న లాభాలన్నీ గత వారం రోజుల పతనంతో తుడిచిపెట్టుకుపోయాయి. రాకేష్ ఝున్‌ఝున్‌వాలా పెట్టుబడులు పెట్టిన ఆప్టెక్, ప్రోజోన్ ఇంటూ, జియోజిత్ బిఎస్ఇ, ఫైనాన్షియల్, ఎంసిఎక్స్ స్టాక్స్ దాదాపు 25 శాతం వరకు పడిపోయాయి. డాలీ ఖన్నా అభిమాన షేర్లలో స్టెర్లింగ్ టూల్స్, ద్వారికేష్ షుగర్, ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, రుచిరా పేపర్... 20-21 శాతం వరకు పడిపోయాయి.

కీలక స్థాయి దిగువకు..

టెక్ వ్యూ

నిఫ్టీ 100 పాయింట్ల రికవరీతో ప్రారంభమై 10600 వరకు వెళ్లినా నిలదొక్కుకోలేకపోయింది. ఇంట్రాడేలో మానసిక అవధి 10500 వద్ద కరెక్షన్, సుదీర్ఘ కన్సాలిడేషన్ ధోరణి ప్రదర్శించి చివరికి స్వల్పనష్టంతో ఈ మద్దతు స్థాయి కన్నా దిగువన క్లోజయింది. ప్రస్తుతం మార్కెట్ 50 డిఎంఏ కన్నా స్వల్పంగా దిగువన, 100 డిఎంఏ కన్నా స్వల్పంగా పైన ఉంది. అందుకే ఈ కీలక స్థాయిలో ఆటుపోట్లు అధికంగా ఉన్నాయి.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 10600 **మద్దతు :** 10400

- ప్రధాన మద్దతు స్థాయి 10400 కన్నా దిగువకు వస్తే మరింత బలహీనతను సూచిస్తుంది. ట్రెండ్ ఇప్పటికీ బలహీనంగా ఉన్నందు వల్ల ప్రస్తుత స్థాయిల్లో నిలదొక్కుకోవడం అవసరం.
- స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశించాలంటే 10500 కన్నా పైన బౌన్స్ బ్యాక్ అయి కన్సాలిడేట్ కావాలి. ప్రధాన నిరోధం 10600. ఆ పైన మాత్రమే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది.
- బ్యాంక్ నిఫ్టీ 25500 కన్నా స్వల్పంగా పైన ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడ రికవరీ తప్పనిసరి.

■ వి.సుందర్ రాజా

ఆటుపోట్లకు ఆస్కారం

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ బహుళ నవమి **నక్షత్రం :** విశాఖ, అనూరాధ

అశ్విని, మఖ, మూల (ఉదయం), భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10476.70 (-21.55)

ట్రెండ్ మార్పు వేళలు : 12.47, 2.18

ధోరణి : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 9.45 నుంచి 11.25 మధ్యన నిస్తేజంగా ట్రేడయి 11.30 నుంచి 1.15 మధ్యలో మెరుగ్గా మారవచ్చు. 1.15 నుంచి చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 11.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 11.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ఒంటి గంటకు క్లోజ్ చేసుకోవచ్చు. 1.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే తిరిగి షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10515, 10550

మద్దతు స్థాయిలు : 10435, 10400

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinancialastrologer.blogspot.in

రేపటి నుంచి హైదరాబాద్‌లో

అగ్రిటెక్ సౌత్ 2018

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మరో ప్రతిష్ఠాత్మక సదస్సుకు హైదరాబాద్ వేదికకానుంది. భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పిజెటిఎస్ఎయు)లో ఈనెల 9 నుంచి 11 వరకు 'అగ్రి టెక్ సౌత్ 2018' సదస్సు జరగనుంది.

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు సంబంధించి మూడు రోజుల ఎగ్జిబిషన్‌తోపాటు మొదటి రెండ్రోజులు వ్యవసాయ రంగ అవకాశాలు, సవాళ్లపై సమావేశాలు జరగనున్నాయి. సదస్సు ప్రారంభ కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి టి హరీశ్ రావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు అగ్రి టెక్ సౌత్ 2018 చైర్మన్ అనిల్ కుమార్ వి ఏపూర్ తెలిపారు. ఇందులో వంద వరకు స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు, మూడు రోజుల్లో 15 వేల మంది రైతులు ఈ షోను సందర్శించే అవకాశం ఉందన్నారు.

రైతు ఆదాయం రెట్టింపునకు విధానపరమైన నిర్దేశం

అగ్రి సదస్సులో ఈ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, సవాళ్లపై చర్చించడం జరుగుతుందని ఎజెటిఎస్ఎయు వైస్ చాన్స్‌లర్ వి ప్రవీణ్ రావు తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన రోడ్‌మ్యాప్ రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని, రైతు ఆదాయం రెట్టింపు విషయంలోనూ ప్రభుత్వానికి విధానపరమైన మార్గనిర్దేశం చేస్తామన్నారు.

భారత ఫార్మా పెట్టుబడులపై ఐర్లాండ్ ఆసక్తి

»» బయో ఆసియా సదస్సులో భాగస్వామ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : తెలంగాణతో సహా భారత్ నుంచి ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఐర్లాండ్ మరిన్ని పెట్టుబడులు ఆశిస్తోంది. ఇందుకోసం త్వరలో హైదరాబాద్‌లో జరిగే బయోఆసియా, 2018 అంతర్జాతీయ సదస్సుకు భాగస్వామ్య దేశంగా వ్యవహరిస్తోంది. యూరోపియన్ యూనియన్ దేశాలతో వాణిజ్య సంబంధాలు నెరిపే భారత ఫార్మా కంపెనీలకు ఐర్లాండ్ వాణిజ్య ముఖ ద్వారంలో పని చేస్తుందని భారత్‌లోని ఐడిఎ ఐర్లాండ్ డైరెక్టర్ తనాజ్ బుహరివాలా విలేకరులతో చెప్పారు. బయోకాన్, రిలయన్స్ లైఫ్‌సైన్సెస్, వొకార్డ్ వంటి భారత ఫార్మా కంపెనీలు ఇప్పటికే ఐర్లాండ్ నుంచి పని చేస్తున్నట్టు తెలిపారు. 'ఐర్లాండ్‌లో తమ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన మూడు కంపెనీలు కూడా ఆసక్తితో ఉన్నాయి. మరో ఆరు నెలల్లో దీనిపై స్పష్టత వస్తుందని ఆశిస్తున్నాం' అన్నారు. బ్రిటన్ ఇయు నుంచి తప్పుకున్నా, ఐర్లాండ్ ఇయులో సభ్య దేశంగా కొనసాగనుంది. దీంతో తమ దేశంలో యూనిట్లు ఏర్పాటు చేసే ఫార్మా కంపెనీలకు ఇయు మార్కెట్ అంతా అందుబాటులో ఉంటుందన్నారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఫార్మా కంపెనీల్లో టాప్ - 10 కంపెనీల ప్రధాన కార్యాలయాలు ఐర్లాండ్‌లోనే ఉన్నట్టు బుహరివాలా చెప్పారు. ఇతర పశ్చిమ దేశాలతో పోలిస్తే తమ దేశంలో ఉత్పత్తి వ్యయాలూ తక్కువన్నారు. పోటీ పెరిగి లాభాలు పడిపోవడం, అమెరికా ఎఫ్‌డిఎ నుంచి సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో భారత ఫార్మా కంపెనీలకు ఐర్లాండ్ చక్కటి వేదికలా పని చేస్తుందన్నారు. భారత్ నుంచి ఏటా 1600 కోట్ల డాలర్ల ఫార్మా ఎగుమతులు ఉంటే, ఐర్లాండ్ నుంచి 6,500 కోట్ల డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నట్టు ఐడిఎ ఐర్లాండ్ డైరెక్టర్ చెప్పారు. దీన్ని బట్టి ఫార్మా రంగంలో ఐర్లాండ్ ఎంతగా అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చన్నారు.

అఫర్డబుల్ ఇళ్లపై జిఎస్‌టి వద్దు

»» బిల్డర్లను కోరిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: అందుబాటు ధరల్లో లభించే గృహాల(అఫర్డబుల్ హోమ్స్)ను కొనుగోలు చేసేవారి నుంచి జిఎస్‌టి వసూలు చేయవద్దని బిల్డర్లను కేంద్రం కోరింది. 'అందుబాటు' గృహ ప్రాజెక్టులపై నికరంగా చెల్లించాల్సిన జిఎస్‌టి 8 శాతమే కాబట్టి ఇన్‌పుట్ క్రెడిట్‌లో సర్దుబాటు చేసుకోవచ్చని ప్రభుత్వం పేర్కొంది. ట్యాక్స్ రిఫండ్ క్లెయిమ్ ద్వారా పొందిన ఇన్‌పుట్ క్రెడిట్‌కు సమానంగా అపార్ట్‌మెంట్ ధరను తగ్గించిన పక్షంలో బిల్డర్లు జిఎస్‌టి వసూలు చేయవచ్చని కేంద్రం తెలిపింది. గతనెల 18న సమావేశమైన జిఎస్‌టి మండలి.. క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీమ్(సిఎల్ఎస్ఎస్)లో భాగంగా నిర్మించే గృహాలపై పన్నురేటు రాయితీ (12 శాతానికి తగ్గింపు) కాలపరిమితిని పొడిగించింది. అయితే, గతనెల 25 నుంచి ఈ పన్నెండు శాతం పన్నులోనూ భూమి ఖరీదు కింద మూడింట ఒకవంతు పన్ను మినహాయింపు కల్పించారు. దాంతో నికరంగా చెల్లించాల్సిన పన్ను 8 శాతమే.

అమ్యూజ్‌మెంట్ పార్క్ సందర్శకులకు ఊరట

వినోద ఉద్యానవనాల (అమ్యూజ్‌మెంట్ పార్క్‌లు) సందర్శకులకు కేంద్రం కొంత ఊరట కల్పించింది. ఈ పార్క్‌ల టికెట్ చార్జీలపై జిఎస్‌టి రేటును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించినట్లు బుధవారం ఆర్థిక శాఖ ప్రకటించింది. ఈ తరహా పార్క్‌లపై స్థానిక పన్నులను పెంచకుండా చూడాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. థీమ్ పార్క్‌లు, వాటర్ పార్క్‌లు, మెర్రీ గో రౌండ్స్ కూడా అమ్యూజ్‌మెంట్ పార్క్‌ల పరిధిలోకే వస్తాయి.

పెద్ద చేపల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

»» బ్యాంకు మోసగాళ్లపై చర్యలు ప్రారంభం

న్యూఢిల్లీ : బ్యాంకు రుణాల సొమ్ముతో మజా చేసే మాయగాళ్లకు కష్టాలు ప్రారంభయ్యాయి. ఇలాంటి మోసగాళ్లని ఇక ఏ మాత్రం ఉపేక్షించ వద్దని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గత నెల 24న బ్యాంకులను ఆదేశించింది. ఈ ఆదేశాలతో మోసపూరిత విధానాల ద్వారా బ్యాంకు రుణాలు పొంది, అప్పులు చెల్లించకుండా కుషీ చేస్తున్న కేటుగాళ్లపై బ్యాంకులు కేసులకు సిద్ధమవుతున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) ఇప్పటికే ఇందుకు సంబంధించి నిరవ్ మోదీ అనే నగల వ్యాపారిపై సిబిఐకి ఫిర్యాదు చేసింది. దీంతో సిబిఐ ఇప్పటికే ఈ ఘరానా వ్యాపారితో సహ మరో ముగ్గురిపై కేసులు నమోదు చేసింది. వీరంతా మోసపూరిత విధానాల ద్వారా పిఎన్‌బి నుంచి రూ.280.70 కోట్ల రుణాలు తీసుకుని ఎగవేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి మరింత మంది కేటుగాళ్లపై చర్యలకు బ్యాంకులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. దీంతో ఇప్పటి వరకు బ్యాంకుల రుణాలతో మజా చేస్తున్న మాయగాళ్లలో వణుకు ప్రారంభమైందని సమాచారం. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కూడా ఈ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని బ్యాంకులను ఆదేశించింది. మోసపూరితంగా రుణాలు పొందిన వారికి సహకరించిన బ్యాంకుల సిబ్బందినీ వదలొద్దని ఆర్థిక మంత్రిత్వ శాఖ కోరింది. దీంతో అక్రమార్కులతో కుమ్మక్కైన బ్యాంకింగ్ ఉద్యోగుల్లోనూ ఆందోళన ప్రారంభమైంది.



పర్యవేక్షణ షురూ

అక్రమార్కుల నుంచి రుణాలు కక్కించడంతో పాటు పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్న పెద్ద మనుషులు ఆ రుణాలను ఎలా ఖర్చు చేస్తున్నారనే విషయం మీదా ఒక కన్నేసి ఉంచాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంకులు కోరింది. ఆయా బ్యాంకుల డైరెక్టర్ల బోర్డుల ఆదేశాలకు లోబడి ఇలాంటి కంపెనీల నుంచి రుణాల వసూలు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కూడా స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలనీ సూచించింది. రుణ వసూళ్లలో కఠినంగా ఉంటూనే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీ(ఎంఎస్ఎంఇ)లకు అవసరమైన రుణాలు అందించే విషయంలో సానుకూలంగా ఉండాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంకులను కోరింది.

మరింత పక్కాగా ఆస్తుల అమ్మకం

దివాలా చట్టం కింద అమ్మే కంపెనీల ఆస్తుల విలువ లెక్కించడాన్నీ ప్రభుత్వం కఠినం చేసింది. ఇందుకు సంబంధించిన నిబంధనలు సవరిస్తూ ది ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ బోర్డు ఆఫ్ ఇండియా (ఐబిబిఐ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిబంధనల ప్రకారం ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ (ఐఆర్‌పి) అమ్మే ఆస్తుల విలువను కనీసం 15 రోజుల ముందుగా రుణదాతల కమిటీ ఆమోదించిన విచారణాధికారికి సమర్పించాలి. ఇందుకోసం ఐఆర్‌పి అమ్మే కంపెనీ ఆస్తుల న్యాయమైన ధర, ఎంతకు అమ్మొచ్చనే విషయాన్ని ఇద్దరు రిజిస్టర్డ్ విలువ మదింపుదార్ల సహాయంతో మదింపు చేయాలని సవరించిన నిబంధనల్లో పేర్కొన్నారు. దివాల చట్టం పరిధిలోకి వచ్చిన కంపెనీల ఆస్తులను కారు చౌకగా అమ్మేయకుండా ఈ నిబంధనలు తీసుకొచ్చినట్టు భావిస్తున్నారు.

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 5.94(6.25)1
ADITYA SPIN. 8.4(8.11)1000
AGRO TECH FO 634.55(631.55)1994
AISHWARYA TE 7.78(7.51)5722
ALPHAGEO (I) 881.2(853.6)2035
ALU FLUORIDE 117.9(112.6)11787
AMAR RAJA BA 790.45(762.3)29172
ANDHRA BANK 46.35(46.9)436101
ANDHRA CEMEN 11.58(11.39)32164
ANDHRA PETRO 65.75(64.2)137211
ANJANI PORTL 209.9(207.6)695
ASTRA MICRO 105.1(103.95)58804
AUROB.PHARMA 616.75(596.25)256643
AVANTEL LTD 517(481.65)8197
AVANTI FEEDS 2423.55(2225.15)39619
B.N.RATHI SE 39.95(38.45)3106
BALAJI AMINE 616.25(590.4)9530
BAMBINO AGRO 244.9(237.25)608
BARTRONICSIN 13.23(12.77)23279
BHAGIRA.CHEM 283.5(277.7)2227
BHAGYA INL 40.1(38.7)13197
BHARATFIN 1004.6(1009.75)44308
BNR UDYOG 34.35(33.45)674
CAMBRIDGE 78.5(78.55)4989
CCHHL 15.05(14.6)51235
CCL PRODUCTS 297.1(290.4)14557
CELESTIAL 16.3(15.9)27141
CIL SECURITS 30.7(32.05)963
COROM INTER 542.75(544.55)26082
CUBEX TUBING 23.6(23.9)3037
CYBERMATE 3.16(3.15)86904
CYIENT 605.55(601.35)8851
DANLAW TECH. 77.3(80)25559
DECAN CEMENT 546.9(544)924
DHAN ROTO SP 37(36.55)914
DIAMONPOWER 16.9(16.25)35354
DIVI'S LAB. 1011.8(1002.95)13353
DIVYA.GRANIT 107.3(110)306
DQ ENT 16.4(15.75)11647
DR.REDDY'S 2111.7(2095.05)38202
EMPEE SUGARS 4.3(4.4)12424
EVEREST ORG. 135.3(135.05)1170
FACOR ALLOYS 3.33(3.27)160987
FIRSTOBJ 15.3(15.35)5050
GATI LTD. 119.8(114.45)148746
GAYATRI BIO 9(9.95)738
GAYATRI PROJ 195.2(192.05)29348
GENNEX LAB 4.34(4.16)310136
GMR INFRASTR 19.1(19.35)6023512
GODAVARI DRU 34.9(34.75)2527
GOLDST INFRA 189.4(182.55)44748
GOLDSTONE EN 13.9(13.45)7932
GRANULES (I) 119.2(115.05)173997
GVK POWERINF 18.75(18.6)2012419
HBL P SYS 55.85(52.95)193739
HERITGFOOD 717(694.65)2896
HIND.FLUROCA 14.5(15.24)420
I.C.S.A. IND 4.12(4.08)9346
IKF TECHNO 1.04(1.09)88389
INCAP LTD. 99.6(95)3428
IPAPPM 309.35(299.8)9209
IVRCL LTD 4.91(4.69)246864
KAKATIYA CEM 306(292.1)21079
KALLAM SPG. 23(22.1)10916
KAVERI SEED 470.85(457)130463
KCP LTD 132.45(126.95)24296
KERNEX MICRO 44.8(44.6)89763
KNR CONST 306.95(302.5)10843
KREBS BIOCHM 137(136.95)690
LANCO INFRA 1.41(1.35)2675544
LOKESH MACH 61.45(59.6)14708
LOTUS CHOC 49.85(50.9)5523
MADHUCON PRJ 28.6(27)48397
MOLD-TEK TEC 62.65(62.75)1185
MOSCHIP SEMI 35.45(34.15)76816
MSR INDIA 37.9(36.9)7435
N C L IND. 244.05(230.9)6528
NACLIND 45.5(43.4)56212
NATCO PHARM 831.45(904.3)145220
NCC 110.45(110.2)415311
NEHA INTER. 7.61(6.92)38422
NETTLINX LTD 83.45(82.75)20208
NEULAND LAB. 697.65(709.2)6300
NIHAR INFO 13.2(12.6)742
NILE LTD. 849.8(794)4364
NTL 4.1(4.05)11000
OIL COUNTRY 45.6(41.3)31473
PADMALAYA TE 4.89(4.79)28156
PALRED 93.7(84.9)12632
PANYAM CEMEN 52.7(52.5)30566
PENNAR STEEL 59.4(55.75)112510
PFL INFOTECH 9.12(9.59)1652
PHYTOCHEM I. 64.3(61.65)2780
PITTI LAMIN. 79.25(74.5)15257
POKARNA LTD 201.8(200.55)6304
PRAJAY ENGS. 14.15(13.95)45202
PREMIER EXPL 415.45(403.3)2464
PRISM CEMENT 121.9(122.15)64358
RAIN 362.2(330.6)938924
RAJ PACKAGIN 38.15(37.3)674
RAJVIR IND 45.6(42.1)21
REG.CERAMIC 5.95(6.24)1002
RESTILE CER. 8(7.25)6351
SAGAR CEM. 901.1(905)2917
SAMKRG PIST. 297.05(293.1)8814
SAMPRE NUTRI 62(61.15)5994
SANGHI IND. 117.35(112.2)70884
SATVAH.ISPAT 23.55(22.3)4375
SAVEN TECHNO 20.7(19)6355
SMPL 1.4(1.39)6489
SMS PHARMACE 91.1(88)12375
SREE RAYALA 183.6(168.85)2636
STEEL EXCH 30.05(28.65)15611
SUJANA INDUS .97(1.02)77832
SURANATP 5.5(5.31)9195
SURYACHAKRA 1.43(1.5)91736
SURYAVA SPIN 8.55(8.16)1
SURYLAK.COTT 81.15(79.2)2281
SUVEN LIFE S 192(193.65)88134
TAJ GVK HOTL 172.55(163.8)24190
TANLA 31.35(29.8)68349
TRANSCORP IN 39.25(38.95)41645
TRANSGENE BI 2.17(2.28)2710
TRANSPORT CO 266.4(263.7)1889
USHER AGRO 7.75(7.84)4620
VICEROY HOTE 15.95(15.2)73844
VIJAY TEXTIL 51(51.05)3453
VIMTA LABS 190.55(189.9)13789
VIRAT CRANE 44.9(43)3287
VIRINCHI 116.2(114.45)113678
VISAKA IND. 655.7(632.2)12554
VISTA PHARMA 40.25(38.95)15734
VIVIMED LABS 83.95(75.65)239596
VST INDUS. 3199.95(3140.05)26
WATERBASE 354.05(322.95)562652
XLENERGY 3.27(3.44)7354
YBRANTDIGI 5.75(5.68)200470
ZEN TECH 118.4(106.55)51225
ZENOTECH 44.2(44.05)9002

తెలంగాణకు 6 పీజీ వైద్య సీట్లు

ఎంసీఐ ఆమోదముద్ర.. గాంధీకి 3.. నిజామాబాద్ కళాశాలకు 3



హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యలో తెలంగాణ రాష్ట్రానికి కొత్తగా ఆరు పీజీ సీట్లు దక్కాయి. ఆస్పత్రి పరిపాలన, ఫార్మాకాలజీ విభాగాలకు మూడేసి చొప్పున మొత్తం ఆరు పీజీ సీట్లకు భారత వైద్య మండలి(ఎంసీఐ) ఆమోదముద్ర వేసింది. అనుమతి లేఖను బుధవారం రాష్ట్రానికి పంపింది. దేశవ్యాప్తంగా 63 వైద్య కళాశాలల్లోని వివిధ విభాగాల్లో కొత్తగా పీజీ సీట్లను కేటాయించింది. రాష్ట్రంలోని గాంధీ వైద్య కళాశాలకు ఆస్పత్రి పరిపాలనా విభాగంలో 3 పీజీ సీట్లు, నిజామాబాద్ వైద్య కళాశాలకు ఫార్మాకాలజీలో 3 పీజీ సీట్లకు అనుమతిచ్చింది. నిజామాబాద్ కళాశాలకు తొలిసారిగా పీజీ సీట్లను కేటాయించగా.. రాష్ట్రంలో ఒక ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆస్పత్రి పాలనా విభాగంలో పీజీ సీట్లు రావడం ఇదే తొలిసారి.

ఆస్పత్రి పాలన పీజీ సీట్లతో లాభాలివే..

ప్రభుత్వ ఆస్పత్రులు ఇంతగా భ్రష్టుపట్టిపోవడానికి ప్రధాన కారణం సరైన పాలనాయంత్రాంగం లేకపోవడమే. సాధారణంగా వైద్యులకు పాలనపై పట్టు ఉండదు. ఈ క్రమంలో పరిపాలనా విభాగం బలహీనంగా ఉండటంతో ఆస్పత్రుల్లో దారుణమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుతం అన్ని ఆస్పత్రుల్లోని సూపరింటెండెంట్లంతా వైద్యులే. తాజాగా ఆస్పత్రి పాలనలో పీజీ సీట్లు రావడంతో ఏటా ముగ్గురు విద్యార్థులకు అవకాశం లభిస్తుంది. ఇది మూడేళ్ల కోర్సు. నీట్ పీజీలో వచ్చిన ర్యాంకు ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. 2018-19 విద్యా సంవత్సరం నుంచి కోర్సు అందుబాటులోకి రానుంది.

ఫార్మాకాలజీ పీజీతో ఉపయోగమిదే..

ఫార్మాకాలజీ పీజీలో ఏ జబ్బుకు ఎంత మందు సిఫారసు చేయాలి? రసాయన సూత్రం కాంబినేషన్, రోగాలు.. వాటి ప్రభావం గురించి ఉంటుంది. ఈ కోర్సు కాల వ్యవధి మూడేళ్లు. నీట్ పీజీలో వచ్చిన ర్యాంకు ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. ఈ కోర్సు చేసిన వారికి మంచి డిమాండ్ ఉంది. ప్రధానంగా ఫార్మా కంపెనీలు ఫార్మాకాలజీ చేసిన విద్యార్థులకు అత్యధిక ప్రాధాన్యమిస్తాయి.



శ్రీరాం భద్రయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, చందూలాల్

మాజీ ఎమ్మెల్యే శ్రీరాం భద్రయ్య టీఆర్ఎస్‌లోకి

మహబూబాబాద్/హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శ్రీరాం భద్రయ్య టీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లో బుధవారం మంత్రులు హరీశ్‌రావు, చందూలాల్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకున్నారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన శ్రీరాం భద్రయ్య నెల్లికుదురు జెడ్పీటీసీగా , ఉమ్మడి వరంగల్ జెడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. 1999లో టీడీపీ మిత్రపక్షాల అభ్యర్థిగా మహబూబాబాద్ శాసనసభ స్థానం నుంచి గెలుపొందారు. ఆ తర్వాత కొన్నాళ్లు స్తబ్ధుగా ఉండి.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక టీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు. అప్పట్లో జరిగిన ఎన్నికల్లో ఆయన కుమారుడు శ్రీరాం భరత్ కాంగ్రెస్ తరపున నెల్లికుదురు జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. సీఎం కేసీఆర్ సూచనల మేరకే తాను టీఆర్ఎస్‌లో చేరినట్లు శ్రీరాం భద్రయ్య తెలిపారు. మరోవైపు భద్రయ్య కుమారుడు భరత్ జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేశారు.

రాష్ట్రంలో కరెంట్ లేని ఇళ్లు.. 3.83 లక్షలు!

▸ దేశంలో 3.93కోట్ల నివాసాలు చీకట్లోనే.. కేంద్ర విద్యుత్ శాఖ వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కరెంట్ లేని ఇళ్ల సంఖ్య.. 3,83,680. ఈ విషయాన్ని రాజ్యసభలో కేంద్ర విద్యుత్ శాఖ వెల్లడించింది. సభ్యులు అడిన ప్రశ్నలకు సమాధానంగా ఆ శాఖ వివరాలు సమర్పించింది. గ్రామీణ ప్రాంతాల్లో 3,93,89,324 నివాసాలకు కరెంట్ లేదని తెలిపింది. అయితే ఇప్పటికే ప్రధానమంత్రి సహజ్ బిజ్లీ హర్ ఘర్ యోజన (సౌభాగ్య) కింద ఈ ఇళ్లకు కరెంట్ ఇవ్వాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ.16,320 కోట్లు ఖర్చుకానుండగా.. కేంద్రం ఇచ్చే సాయం రూ.12,300 కోట్లు. తెలంగాణలో అన్ని గ్రామాలకు కరెంట్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే తండాలు, అటవీ ప్రాంతాల్లో ఆదివాసీలు నివాసం ఉండే గూడేలకు మాత్రం కరెంట్ లేదు. ఈ తండాలు, గూడేల్లోని నివాసాల సంఖ్య 3.83 లక్షలు. వీరికి ఉచితంగానే కరెంట్ కనెక్షన్ అందనుంది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలను పంపింది.

విపక్ష నేతల అష్టదిగ్బంధనం!

కీలక నాయకులే లక్ష్యం ..నియోజకవర్గాలు దాటకుండా కట్టడి!?

▸ వ్యూహాత్మక అడుగులు.. వలసలకు ప్రోత్సాహం

▸ మంత్రులకు బాధ్యతలు!.. ఎప్పటికప్పుడు అధినేత ఆరా

▸ పావులు కదుపుతున్న టీఆర్ఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిపక్షాలకు చెందిన ముఖ్య నేతలే లక్ష్యంగా అధికార టీఆర్ఎస్ పార్టీ పావులు కదుపుతోంది! ఆయా పార్టీలకు చెందిన కీలక నేతలు వారి సొంత నియోజకవర్గాలను దాటి బయటికొచ్చే పరిస్థితి లేకుండా చేసేందుకు పథకాలు రచిస్తోంది! ప్రస్తుతం ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్న కొందరు విపక్ష నేతలను కట్టడి చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది! వారు పునాదిగా భావించే నియోజకవర్గాల్లో పట్టు కోల్పోతామనే ఆందోళన కలిగించటంపై 'గులాబీ' దళం దృష్టి సారిస్తోంది. రాబోయే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దిగే ఆలోచనలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం, ఇతర పార్టీల రాష్ట్ర నాయకులంతా వారి సొంత జిల్లాలు సంగతి అటుంచి.. నియోజకవర్గాల నుంచి కూడా కాలు బయటపెట్టడానికి




ఆలోచించే పరిస్థితి తీసుకురాబోతున్నామని టీఆర్ఎస్ ముఖ్యులు అంతర్గత సంభాషణల్లో చెబుతున్నారు. ఇప్పటికే నాయకత్వ సమస్యతో సతమతమవుతున్న విపక్ష పార్టీలకు ఎన్నికల నాటికి మార్గం చూపేవారే లేకుండా చేస్తామని, ముఖ్య నేతలెవరూ ఇతర అభ్యర్థుల కోసం సమయం కేటాయించలేని వాతావరణం సృష్టిస్తామని టీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం సాధారణ ఎన్నికలు వచ్చే ఏడాది ఏప్రిల్-మేలో ఉన్నప్పటికీ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలా మంది నేతలు తమ నియోజకవర్గాలకు ఎక్కువ సమయం కేటాయిస్తూ వస్తున్నారు. కొద్దిమంది నేతలు మాత్రమే రాష్ట్రం నలుమూలలా పర్యటిస్తున్నారు. అందులో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత కె.జానారెడ్డి, శాసన మండలిలో కాంగ్రెస్ పక్ష నేత షబ్బీర్‌అలీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, బీజేఎల్పీ నేత జి.కిషన్‌రెడ్డి, టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, నల్గొండ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు చాడ వెంకట్‌రెడ్డి, తమ్మినేని వీరభద్రం తదితరులు ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న విపక్ష నేతలే కాకుండా, గత ఎన్నికల్లో ఓడిపోయిన ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలను కూడా నియోజకవర్గాలు దాటి బయటికి రాకుండా చేయటానికి అధికార టీఆర్ఎస్ పావులు కదుపుతోంది. ఇందుకోసం ఆయా నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున వలసలు ప్రోత్సహించటానికి సన్నాహాలు చేస్తోంది. విపక్ష పార్టీలకు చెందిన ముఖ్య నేతల నియోజకవర్గాల బాధ్యతలను ప్రత్యేకంగా మంత్రులకు అప్పగించి ఎప్పటికప్పుడు అక్కడి పరిస్థితులను టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా తెలుసుకుంటారని 'గులాబీ' బాధ్యులు చెబుతున్నారు. విపక్ష నేతల ముఖ్య అనుచరులు అనుకున్న వారి మెడలోనూ గులాబీ కండువాలు కప్పటానికి రంగం సిద్ధంచేస్తున్నారు. ఇతర పార్టీల్లోని నేతల్లో ఎక్కువ శాతం వాళ్లంతట వాళ్లే టీఆర్ఎస్‌లో చేరటానికి ఆసక్తి చూపుతున్నారని చెబుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లాల్లో టీఆర్ఎస్‌లో చేరికలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నాయని అంటున్నారు. టీఆర్ఎస్ అధిష్ఠానం ప్రత్యేక శ్రద్ధ చూపే అవకాశం ఉన్న నేతల్లో కాంగ్రెస్ నుంచి కేఆర్ సురేశ్‌రెడ్డి(ఆర్మూర్), పి.సుదర్శన్‌రెడ్డి(బోధన్), షబ్బీర్‌అలీ(కామారెడ్డి), టి.జీవన్‌రెడ్డి(జగిత్యాల), డి.శ్రీధర్‌బాబు(మంథని), విజయశాంతి(మెదక్), సునీతాలక్ష్మారెడ్డి (నర్సాపూర్), జె.గీతారెడ్డి(జహీరాబాద్), జగ్గారెడ్డి(సంగారెడ్డి), డీకే అరుణ(గద్వాల), రేవంత్‌రెడ్డి(కొడంగల్), కె.జానారెడ్డి(నాగార్జునసాగర్), ఉత్తమ్‌కుమార్‌రెడ్డి(హుజూర్‌నగర్), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (నల్గొండ), పొన్నాల లక్ష్మయ్య(జనగామ), గండ్ర వెంకటరమణారెడ్డి(భూపాలపల్లి), టీడీపీ నుంచి ఒంటేరు ప్రతాప్‌రెడ్డి(గజ్వేల్), ఎల్.రమణ(జగిత్యాల), రేవూరి ప్రకాష్‌రెడ్డి(నర్సంపేట), బీజేపీ నుంచి కె.లక్ష్మణ్(ముషీరాబాద్), జి.కిషన్‌రెడ్డి(అంబర్‌పేట), లోక్‌సభ స్థానాలకు సంబంధించి కాంగ్రెస్ నుంచి పొన్నం ప్రభాకర్(కరీంనగర్), మధుయాష్కీ(నిజామాబాద్), ఎస్.జైపాల్‌రెడ్డి (మహబూబ్‌నగర్), బీజేపీకి చెందిన సికింద్రాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ ఉన్నట్లు టీఆర్ఎస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయా నియోజకవర్గాల్లో వ్యూహాత్మకంగా టీఆర్ఎస్ నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల నాటికి కేసీఆర్ వారిలో ఎవరికి టికెట్ ఖరారు చేసినా.. మిగిలిన వారంతా మద్దతు ఇచ్చేలా చూస్తామని అంటున్నారు. దీంతో అక్కడ విపక్షాలకు ఓట్లు తగ్గిపోతాయని అంచనా వేస్తున్నారు. ఈ రకంగా విపక్షాల ముఖ్య నేతలు ఎన్నికల నాటికి తమ సొంత నియోజకవర్గాలను దాటకుండా అష్టదిగ్బంధనం చేయటానికి కసరత్తు చేస్తున్నామని టీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు.



తైవాన్‌లో ఆరుగురు మృతి

▸ భారీ భూకంపం.. 88 మంది గల్లంతు

హువాలిన్, ఫిబ్రవరి 7: తైవాన్‌లోని ప్రముఖ పర్యాటక నగరం హువాలిన్‌ను మంగళవారం రాత్రి భారీ భూకంపం వణికించింది. దీని ధాటికి పలు భవనాలు, షాపింగ్ మాల్స్ పేకమేడల్లా కూలిపోయాయి. శిథిలాల కింద నలిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. 88 మంది గల్లంతయ్యారు. 256 మంది గాయపడ్డారు. సహాయ చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.4గా నమోదైంది. మార్షల్ హోటల్, బ్యూటీ లైఫ్ హోటల్, యుమెన్ క్యూటీ బిల్డింగ్ వంటి బహుళ అంతస్థుల సముదాయాలు నేలకొరిగాయి.



మార్స్ సమీపంలోకి కారు!

▸ శక్తిమంతమైన రాకెట్‌ను ప్రయోగించిన స్పేస్ ఎక్స్

కేప్‌కనవెరాల్, ఫిబ్రవరి 7: ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన రాకెట్ ప్రయోగాన్ని అమెరికాకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్ ఎక్స్ విజయవంతంగా పూర్తి చేసింది. 27 ఇంజన్లను మండించడం ద్వారా పునర్వినియోగ వాహక నౌక ఫాల్కన్ హెవీని ప్రయోగించారు. ఇది స్పేస్ ఎక్స్ కంపెనీ సీఈవో ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా కారును అంగారకుడి సమీప కక్ష్యలోకి చేర్చనుంది. ఈ కారుకు కెమెరాలను అమర్చడంతో పాటు, డ్రైవింగ్ సీటులో స్పేస్ సూట్‌తో డ్రైవర్ నమూనాను ఉంచారు. అంగారకుడి వైపునకు వెళ్తున్న ఈ కారు తీసిన ఓ వీడియోను ఎలన్ మస్క్ ట్వీట్ చేశారు.




ఎల్ఈడీ లైట్ల వెలుగుల్లో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్

దక్షిణ మధ్య రైల్వే.. ఎల్ఈడీ జిగేల్

▸ దేశంలోనే తొట్ట తొలి జోన్‌గా ఖ్యాతి. 2.7 కోట్లు ఆదా


హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్).. మరో రికార్డు సృష్టించింది. దేశంలోని అన్ని జోన్లకంటే ఆదాయపరంగా ముందువరుసలో ఉన్న ఎస్సీఆర్.. ఇప్పుడు తన పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్లలో ఎల్ఈడీ బల్బులను అమర్చిన తొలి జోన్‌గా రికార్డులకెక్కింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల్లో విస్తరించి ఉన్న ఎస్సీఆర్‌లోని 733 స్టేషన్లలో సాధారణ బల్బులకు తావులేకుండా మొత్తం ఎల్ఈడీ లైట్లను బిగించారు. జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో ఈ ఘనత సాధించగలిగామని రైల్వే వర్గాలు తెలిపాయి. ఎల్ఈడీ బల్బులు అమర్చేక్రమంలో వివిధ వోల్టేజీలున్న 75,681 ఇతర బల్బులను తొలగించారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని 162, హైదరాబాద్ డివిజన్‌లోని 100 స్టేషన్లలో ఇప్పుడు ఎల్ఈడీ వెలుగులు జిగేల్ మంటున్నాయి. ఈ ప్రయత్నం వల్ల దక్షిణ మధ్య రైల్వేలో ఏటా 32 లక్షల యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని, తద్వారా రూ. 2.70 కోట్ల మేరకు అనవసర వ్యయం తగ్గుతుందని రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలోనే ఏటా రూ. 1.04 కోట్ల మేరకు ఖర్చు ఆదా అవుతుందన్నారు.

ఆకాశం నుంచి నేలరాలుతున్న వైరస్‌లు



టొరంటో, ఫిబ్రవరి 7: జన్యుపరంగా ఒకే రకమైన వైరస్‌లు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఎందుకు ఉంటున్నాయో పరిశోధకులు గుర్తించారు. భూవాతావరణంలో ఉండే వైరస్‌లు ట్రోపోస్పియర్‌కు తరలివెళుతున్నాయని, అనంతరం వేల కిలోమీటర్లు ప్రయాణించి భూమిపై పడుతున్నాయని పరిశోధనలో తేలింది. ప్రతిరోజు భూవాతావరణానికి ఆవల ఒక చదరపు మీటరుకు 80 కోట్ల వైరస్‌లు చేరుతున్నాయని కొలంబియాలోని యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిషు కొలంబియా శాస్త్రవేత్తలు చెప్పారు. ఇలా వెళ్లిన వైరస్, బ్యాక్టీరియాలే వర్షాల వల్ల వివిధ ప్రాంతాల్లో పడుతున్నాయని అన్నారు.

విద్యుత్ ప్రకంపనలతో జ్ఞాపకశక్తి మెరుగు



వాషింగ్టన్, ఫిబ్రవరి 7: మెదడుకు ఎడమ వైపున ఎలక్ట్రికల్ స్టిమ్యులేషన్ చేస్తే జ్ఞాపకశక్తి మెరుగవుతుందని పరిశోధనలో తేలింది. మెదడు పనితీరును పరిశీలించేందుకు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాకు చెందిన పరిశోధకులు ప్రత్యేక వ్యవస్థను అభివృద్ధి చేశారు. దీని ద్వారా విద్యుత్ ప్రకంపనలను పంపిస్తే మెదడు పనితీరు 15శాతం పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి పెరిగినట్లు గుర్తించారు. 25 మంది న్యూరోసర్జికల్ రోగులపై పరిశోధనలు జరిపి ఈ విషయాన్ని ధ్రువీకరించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మోదీ భార్యకు గాయాలు





జైపూర్, ఫిబ్రవరి 7: ప్రధాని మోదీ భార్య యశోదాబెన్‌కు తృటిలో ముప్పు తప్పింది. రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమెకు స్వల్పగాయాలయ్యాయి. ఆమె బంధువు మరణించగా... కమెండో సహా నలుగురు గాయపడ్డారు. రాజస్థాన్‌లో కోట-చిత్తోర్ హైవేపై చిత్తోర్‌గఢ్‌కు 55 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న ట్రక్కు సడన్ బ్రేక్ వేయడంతో దాని కిందకు యశోదాబెన్ బృందం ప్రయాణిస్తున్న కారు దూసుకుపోయింది. గాయపడిన యశోదాబెన్‌ను చిత్తోర్‌గఢ్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన ఆమె బంధువు బసంత్ భాయ్ మోదీ(67) ఆస్పత్రిలో మృతిచెందారు.

కాంగ్రెస్.. థర్డ్ గ్రేడ్ లోఫర్ పార్టీ



ఐటీ వరల్డ్ కాంగ్రెస్ ఏర్పాట్లపై మంత్రి కేటీఆర్‌తో సమీక్షించిన నాస్కాం ప్రతినిధులు

(మొదటిపేజీ తరువాయి)

అసంతృప్తితో ఉన్నారని అన్నారు. బుధవారం విలేకరులతో కేటీఆర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కేంద్ర బడ్జెట్, రాష్ట్ర, జాతీయ రాజకీయాలు, దావోస్ పర్యటన తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆ వివరాలు..

శిఖండి రాజకీయం ఎందుకు?:

▸ ఇంకా 20-25 ఏళ్లు ఉన్న నా రాజకీయ జీవితాన్ని పణంగా పెట్టి మరీ చేసిన సవాల్‌కు నేను ఇప్పటికీ కట్టుబడి ఉన్నా. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దానిని స్వీకరించకుండా తాను, తన భార్య కూడా రాజీనామా చేస్తామంటూ కుటుంబాల వెనుక దాక్కుని శిఖండి రాజకీయం చేయడం ఎందుకు? దమ్ముంటే నా సవాల్‌ను స్వీకరించాలి.

▸ ప్రభుత్వం పథకాల ఫలితాలు ఇప్పుడిప్పుడే ప్రజలకు అందుతున్నాయి. సీఎం కేసీఆర్ నాయకత్వానికి ప్రజలు జైకొట్టడం ఖాయం. కాంగ్రెస్‌ను గట్టిగా దెబ్బకొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. టీఆర్ఎస్ ఒంటరిగానే బరిలో నిలుస్తుంది.

రాహుల్ పప్పు.. దద్దమ్మ:

▸ అసమర్థులైన కాంగ్రెస్ నేతల చేతిలో నుంచి తెలంగాణకు విముక్తి కలిగించిన మొనగాడు కేసీఆర్. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కంటే పెద్ద దద్దమ్మ, పెద్ద పప్పు ఈ దేశంలో ఎవరూ లేరు. గూగుల్ శోధనలో కూడా ఈ విషయం స్పష్టమవుతుంది. అలాంటి నాయకుడి కింద పనిచేస్తున్న ఉత్తమ్‌ను ఎంత దద్దమ్మ అనుకోవాలి? నన్ను బచ్చా అంటున్నారు. నాకన్నా రాహుల్ పెద్దవాడేం కాదు. ఆయన కూడా బచ్చానే. నాకు పెళ్లయింది. రాహుల్‌కు ఇంకా పెళ్లి కూడా కాలేదు. ఖుంటియా.. తొంటియా వచ్చి ఏది పడితే అది మాట్లాడకూడదు. ఉత్తమ్‌కు మెదడు ఉంటే కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఎన్ని ఉద్యోగాలిచ్చారో చెప్పాలి.

▸ గుజరాత్‌లో అన్నిరకాల గిమ్మిక్కులు చేసి, గుళ్లకు పరుగెత్తి, యువనేతల ముందు మోకరిల్లినా కాంగ్రెస్‌ను రాహుల్ అధికారంలోకి తీసుకురాలేకపోయారు. కేడర్‌ను సంతోషపరిచేందుకు 70 సీట్లు సాధిస్తామని ఉత్తమ్ చెబుతున్నారు. అవన్నీ తాడు బొంగరం లేని మాటలే. సీఎం కేసీఆర్‌తో పోల్చుకునే అర్హత ఉత్తమ్‌కు లేదు.

నరహంతక కాంగ్రెస్:

▸ అధికారం కోసం సొంత పార్టీ నాయకులను హత్యలు చేయించి, మతకల్లోలాలు సృష్టించిన నీచ చరిత్ర నరహంతక కాంగ్రెస్‌ది. స్థానికంగా జరిగిన హత్యపై రాద్ధాంతం చేస్తున్న థర్డ్‌గ్రేడ్ లోఫర్ పార్టీ కాంగ్రెస్. మా పార్టీలో చేరేందుకు ఎన్నోసార్లు ప్రయత్నించిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా మాట్లాడుతున్నారు.

▸ ఎమర్జెన్సీని విధించిన కాంగ్రెస్ పార్టీ నేతలు.. ప్రజాస్వామ్యం గురించి, హక్కుల గురించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ నేతలు లోఫర్‌గాళ్లు, దౌర్భాగ్యులు. నెహ్రూ హయాం నుంచి తెలంగాణను కాంగ్రెస్ మోసం చేస్తూనే ఉంది. ఎందరో విద్యార్థుల మరణానికి కాంగ్రెస్ కారణమనే విషయాన్ని ప్రజలు అంత త్వరగా మరిచిపోరు.

ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు:

▸ కోదండరాం, జస్టిస్ చంద్రకుమార్, చెరుకు సుధాకర్, పవన్‌కల్యాణ్.. ఎవరైనా సరే పార్టీలు పెట్టుకోవచ్చు. ప్రజల్లోకి వచ్చేందుకు కోదండరాం సిద్ధమయ్యారు.. ప్రజల్లోనే తేల్చుకోవాలి. గడచిన మూడు దశాబ్దాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటై నిలదొక్కుకున్న పార్టీల్లో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ, కేసీఆర్ ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ మాత్రమే ఉన్నాయి. వైసీపీ కొన్ని సీట్లు మాత్రమే సాధించింది.

సిరిసిల్లను వీడాల్సిన అవసమేంటి?:

▸ సిరిసిల్లను వదులుకుని మరో చోట పోటీ చేయాల్సిన అవసరం ఏముంది? సీఎం కేసీఆర్ వయసు 65 ఏళ్లు మాత్రమే. ఇంకా 15 ఏళ్లు పార్టీని, ప్రభుత్వాన్ని నడిపేంత ఆరోగ్యంగా ఆయన ఉన్నారు. ఆయన రాజకీయ వారసుడెవరనే ప్రశ్నే అనవసరం.

▸ ఎన్నికలెప్పుడొచ్చినా టీఆర్ఎస్ సిద్ధంగా ఉంది. అసెంబ్లీ నియోజకవర్గాలు పెరిగినా, పెరగకపోయినా టీఆర్ఎస్‌కు వచ్చే నష్టం, లాభం ఏదీ లేదు. పార్టీ బలంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎన్ని సీట్లు గెలుస్తుందో చెప్పేందుకు నాకు జ్యోతిష్యం తెలియదు. అధికారంలోకి రావడం మాత్రం తథ్యం.

వారంతా చేతులెత్తేయాల్సిందే:

▸ దేశంలో జాతీయ పార్టీలనేవి లేవు. దక్షిణాదిలో బీజేపీ ఉనికే లేదు. ఉత్తరాదిలో అక్కడక్కడా ఉన్న ఆ పార్టీ జాతీయ పార్టీ ఎలా అవుతుంది? దేశంలో ఉన్నవన్నీ ప్రాంతీయ పార్టీలే. మా ఎమ్మెల్యేలవి చిన్న చిన్న పొరపాట్లు ఉన్నా టీఆర్ఎస్ విజయం సాధిస్తుంది. నలుగురు కమ్యూనిస్టులు, లెఫ్టిస్టులు కలిస్తే అయ్యేదేం లేదు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఒక అఖిలపక్షం, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మరో అఖిలపక్షం ఏర్పాటు చేసి ఐదుగురు లీడర్లు చేతులెత్తి అభివాదాలు చేస్తున్నారు.

▸ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ముషీరాబాద్‌కు, బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి అంబర్‌పేటకే పరిమితమయ్యారు. కేంద్రమంత్రిగా ఉన్న దత్తాత్రేయనూ తొలగించారు.

రాజకీయాలను వదిలేద్దామనుకున్నా:

● టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తారనే ప్రచారం జరిగినప్పుడు రాజకీయాలను వదిలేద్దామనుకున్నాను. చిన్నప్పటినుంచీ కాంగ్రెస్ వ్యతిరేక వాతావరణంలో పెరిగాను.

▸ కేబినెట్ విస్తరణ అంశం నా పరిధిలో లేనిది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లపై ఆరోపణలు సహజం. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

▸ దావోస్‌కు వెళ్లడం నాకు మొదటిసారి. ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు పద్నాలుగోసారి. పోలీసు భద్రత అంతగా లేకుండా తెలంగాణలో పర్యటించే నాకు విదేశాల్లో భద్రత కల్పించేసరికి వింతగా అనిపించింది.

హైదరాబాద్‌లో రెండు అంతర్జాతీయ సదస్సులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరం త్వరలో మరో రెండు అంతర్జాతీయ సదస్సులకు వేదిక కానుంది. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు మైనింగ్‌పై అంతర్జాతీయ సదస్సు, 19 నుంచి 21వ తేదీ వరకు ఐటీ వరల్డ్ కాంగ్రెస్‌ను విజయవంతం చేసేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. హైటెక్స్‌లో మైనింగ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఫిక్కీ కలిసి నిర్వహించే 'మైనింగ్ టుడే' సదస్సు, ఎగ్జిబిషన్‌లో ప్రధానంగా ఖనిజాల అన్వేషణ, సాంకేతిక పరిజ్ఞాన మార్పులపై చర్చిస్తారు. విద్యుత్, సిమెంటు, ఏరోస్పేస్, రక్షణ, చమురు, గ్యాస్ వంటి రంగాలను ప్రభావితం చేసే అంశాలపైనా చర్చిస్తారు. మైనింగ్ పాలసీలు, వాతావరణం, మైనింగ్ రంగంలో అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ వంటి అంశాలపైనా చర్చించి కొత్త ఉత్పత్తులపై ఆవిష్కరణలు చేస్తారు. రాష్ట్రంలో మైనింగ్, అనుబంధ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలపై నిర్వహించే చర్చలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఆసియా, ఆఫ్రికా దేశాల ప్రతినిధులు పాల్గొంటారు. కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయి. సదస్సును ప్రారంభించాల్సిందిగా గవర్నర్ నరసింహన్, కేంద్ర మైనింగ్ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌లను మంత్రి కేటీఆర్ కోరారు. మరోవైపు ఐటీ వరల్డ్ కాంగ్రెస్ ఏర్పాట్లపై మంత్రి బుధవారం బేగంపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో నాస్కాం ప్రతినిధి బృందం, వివిధ శాఖలు, సంస్థల అధికారులతో చర్చించారు. ప్రపంచ స్థాయి ఐటీ ప్రముఖులు పాల్గొనే వరల్డ్ కాంగ్రెస్ ప్రారంభోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొనాల్సిందిగా ప్రధాని మోదీని ఆహ్వానించానని తెలిపారు. శ్రీలంక ప్రధాని విక్రమసింఘే, కేంద్ర ఐటీ మంత్రి రవిశంకర ప్రసాద్, సీఎం కేసీఆర్‌తో పాటు కెనడా, చైనా, ఆర్మేనియా, నైజీరియా, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సదస్సుకు రాష్ట్రపతి కోవింద్‌ను ఆహ్వానించేందుకు మంత్రి కేటీఆర్ గురువారం ఢిల్లీ వెళ్తారు. కాగా, గనుల శాఖాధికారుల డైరీని మంత్రి కేటీఆర్ బేగంపేట క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు.

కేంద్ర బడ్జెట్ దారుణం

▸ తెలంగాణకు అన్నివిధాలా మొండిచేయి

▸ ప్రతి కార్యక్రమానికీ కేంద్ర మంత్రులను ఆహ్వానిస్తున్నాం..

▸ ఇవ్వాల్సిన దాని కన్నా ఎక్కువ మర్యాదే ఇస్తున్నాం

▸ పథకాలను పొగిడిపోవడమే తప్ప నిధులు లేవు

▸ మోదీ 'ప్రేమ'ను తిరిగిచ్చేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధం: కేటీఆర్

కేంద్రం ప్రవేశపెట్టింది ఎవరికీ అర్థంకాని బడ్జెట్ అని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇంత దారుణమైన బడ్జెట్‌ను ఇంతవరకూ చూడలేదన్నారు. రూ.40 వేల కోట్ల ప్రతిపాదనలు పంపితే బాహుబలి సినిమాకు వచ్చిన కలెక్షన్లన్ని నిధులు కూడా రాష్ట్రానికి కేటాయించలేదని పేర్కొన్నారు. బీజేపీ ఎంపీలే అసంతృప్తిగా ఉన్నారని, ఎవరికీ చెప్పుకోలేక మదనపడిపోతున్నారని, మిత్రపక్షాలు కూడా అసంతృప్తితో ఉన్నాయని అన్నారు. తెలంగాణ ప్రాజెక్టులు, పథకాలు ఆదర్శంగా ఉన్నాయని పొగిడి పోవడం తప్ప వాటికి కేంద్రం నిధులను కేటాయించడంలేదని ఆక్షేపించారు. టీడీపీ ఎన్డీయేలో ఉందో? లేదో? అనేలా పరిస్థితి ఉందని, మిత్రపక్షంగా ఉండీ.. వాళ్లనే కేంద్రం పట్టించుకోకపోతే మేమెవరికి చెప్పుకోవాలని వాపోయారు. నిధులు కేటాయించాలని ఎంత అడుగుతున్నా మాది అరణ్యరోదనే అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీ పర్యటనకు వెళ్తునట్లు, రాష్ట్రంలో నిర్వహించనున్న పలు సదస్సులకు సంబంధించి కేంద్ర మంత్రులను ఆహ్వానించడంతో పాటు పలు పథకాలకు నిధులు కోరనున్నట్లు కేటీఆర్ తెలిపారు. ప్రతి కార్యక్రమానికీ కేంద్ర మంత్రులను ఆహ్వానిస్తున్నామని, ఇవ్వాల్సిన దానికన్నా ఎక్కువ మర్యాదనే ఇస్తున్నామని, అయినా కేంద్రం అన్ని విధాలా రాష్ట్రానికి మొండిచేయి చూపుతోందని అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణపై మోదీ చూపిన ప్రేమను ఆయనకే తిరిగి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లుగా కేంద్రం ముందు తెలంగాణ పరిస్థితి ఉందన్నారు. ఇక రిజర్వేషన్లను పెంచాలని అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాలను కేంద్రం పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై చివరి నిమిషంలో అఖిలపక్షం అపాయింట్‌మెంట్‌ను రద్దు చేయించారని, కనీసం మెట్రోరైలు ప్రారంభోత్సవానికి వచ్చిన సమయంలో కూడా ప్రధాని అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు.

మాల్యాకు తమ్ముడు.. మాయదారి జెనా!





(మొదటి పేజీ తరువాయి)

కింగ్ విజయ్‌మాల్యాను మించిన జీవనశైలి! శంషాబాద్ మండలంలోని కొత్వాల్‌గూడను తాకట్టుపెట్టిన సౌమిత్ రంజన్ జెనా దంపతుల వైభోగమిది. జెనాతో పోలిస్తే మాల్యానే నయం. సొంత ఆస్తులను బ్యాంకులకు తాకట్టు పెట్టాడు. జెనా మంది సొమ్మును తాకట్టు పెట్టి మహారాజ విలాసాలను అనుభవిస్తున్నాడు. ఢిల్లీ ఐఐటీ పట్టభద్రుడైన జెనా.. 2009 నవంబరులో రూ.లక్ష పెట్టుబడితో మైనింగ్, లాజిస్టిక్స్, స్టీల్ మాన్యుఫాక్చరింగ్, ట్రేడింగ్ వ్యాపారాలు మొదలు పెట్టి, మోసాలే పెట్టుబడిగా సంస్థను నడిపి.. పట్టుమని పదేళ్లయినా కాకముందే వందల కోట్లకు పడగలెత్తాడు.

కర్ణాటకలో కేసులు..

సౌమిత్ రంజన్ జెనాపై గతంలో పలు చోట్ల ఆర్థిక నేరాల కేసులు నమోదయ్యాయి. ఉదాహరణకు.. కర్ణాటకలో అతడిపై నమోదైన ఆర్థిక నేరం కేసులో కొంతకాలం జైలు జీవితం కూడా గడిపాడు. అతగాడి అక్రమాలపై కర్ణాటక సిట్ విచారణ కూడా జరిపింది. ఢిల్లీలో కూడా ఇతడిపై ఆర్థిక నేరాల కేసులు ఉన్నట్టు సమాచారం. ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఉండడంతో జెనా ఇన్ని అక్రమాలకు పాల్పడినా బయట తిరగగలుగుతున్నాడు.

> మాకు భూములే ఆధారం. భూమి లేకుంటే మేం బతకలేం. మా ఊరును అమ్ముకోవడం అన్యాయం. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. ఇప్పుడు మా ఊరుకు సమస్య వచ్చింది. మేం భూములు ఇవ్వం. బలవంతంగా గుంజుకుంటే.. అందరం కలసి హిమాయత్ సాగర్‌లో పడి చస్తాం.
> -గుర్రంపల్లి మల్లమ్మ, గ్రామస్థురాలు

ఊరుకునే ప్రసక్తి లేదు..

రుణం కోసం ఊరునే తాకట్టు పెట్టిన విషయం వెలుగులోకి రావడంతో రంగారెడ్డి జిల్లా కొత్వాల్‌గూడ గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. 'ఈ ఊరును అమ్ముకుంటాం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో మంగళవారం ప్రచురితమైన కథనం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఏకంగా తమ ఊరు మొత్తాన్నీ సంబంధం లేని వాళ్లెవరో తాకట్టు పెట్టేశారని ఆ కథనం ద్వారా తెలుసుకున్న గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. మరికొందరు ఆవేశంతో ఊగిపోయారు. గ్రామాన్ని తాకట్టు పెట్టిన వారిని వెంటనే పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మోసానికి పాల్పడిన ప్రవీణ్‌కుమార్, శ్యామ్‌లాల్, రాథోడ్, శంతన్ శర్మ, సౌమిత్ రంజన్, ప్రీతిజెనాను.. గ్రామాన్ని తాకట్టు పెట్టడానికి సహకరించిన ఎం.శివభూషణ్‌ను.. వారికి అమ్ముడుపోయి రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ రమేష్‌చంద్రారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, సీబీఐతో విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

హిమాయత్‌సాగర్‌లో పడి చస్తాం







లగ్జరీ కార్లతోనూ, గుర్రాల మీద జెనా విలాస జీవితం



'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని చదివి విస్తుపోతున్న గ్రామస్తులు

హసన్ నుంచి 1965లో కొన్నాం



సయ్యద్ మహ్మద్ హసన్ నుంచి మేం భూములను 1965లో కొన్నాం. మా వద్ద అన్ని రికార్డులూ ఉన్నాయి. 1975 టెనెంట్ యాక్ట్ ప్రకారం 38ఈ సర్టిఫికెట్స్ ఇచ్చారు. మాకు భూములను అమ్మిన హసన్ చనిపోయాడు. అతని కుమారుడు పాకిస్తాన్‌కు వెళ్లిపోయాడు. మా భూములను తాకట్టు పెట్టి కుంభకోణానికి పాల్పడిన వారిని వదలొద్దు. **కరణం కృష్ణ, మాజీ సర్పంచ్, కొత్వాల్‌గూడ**

ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది



పెద్ద మొత్తంలో కుంభకోణం జరుగుతుంటే.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కొత్వాల్‌గూడలో జరిగిన కుంభకోణం ప్రభుత్వ నిదర్శనానికి పరాకాష్ట. దీనికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
-పి.కార్తీక్‌రెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల లోక్‌సభనియోజకవర్గ ఇన్‌చార్జ్

మా ఊరిని కాపాడుకుంటాం..



ప్రాణాలకు తెగించైనా సరే మా గ్రామాన్ని కాపాడుకుంటాం. గ్రామ సర్పంచ్‌గా ఆ బాధ్యత నాపై ఉంది. మా ఊరును తాకట్టుపెట్టి రూ.332 కోట్లు రుణం తీసుకున్న వారిని వెంటనే పట్టుకుని ప్రభుత్వానికి అప్పగించాలి.
- ప్రసన్న లింగం, గ్రామ సర్పంచ్

వాట్సప్‌లో వాయించేద్దాం!

- పోలీసుల్లో అధికారులపై రగులుతున్న అసంతృప్తి
- వ్యక్తీకరణ మార్గంగా వాట్సప్ గ్రూపులు
- ఆడియో, వీడియో, ఫొటోలు పంచుకుంటూ వ్యాఖ్యలు
- సెలవులు, పదోన్నతులు ఇవ్వకున్నా ఇక్కడే దాడి
- ముప్పును గుర్తించిన్న పోలీసు ఉన్నతాధికారులు
- 300 మంది సిబ్బందికి నోటీసులు, కౌన్సెలింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సీనియర్ అధికారిపై పీకల్లోతు కోపం ఉంటే ఎవరైనా ఏం చేయగలరు? మహా అంటే ఇంట్లో వాళ్ల దగ్గరో, లేక బాగా సన్నిహిత స్నేహితుడి వద్దో ఆ కోపాన్ని వెళ్లగక్కి ఓదార్పు కోరుకుంటారు. అదే పోలీసు శాఖలో అయితే... ఎవరి అంతరంగం వారిదే. అంతా గుసగుసలే. గప్‌చుప్. పెదవి దాటి విషయం బయటకొస్తే టెర్రరే. అయితే, ఇదంతా గతం. ఇప్పుడంతా వాట్సప్ గ్రూపే. యూనిఫామ్ సర్వీసులోని భయం...బెరుకుపోయి.. అంతా కడుపుమంటను పంచుకోవడంగా మారింది. ఏ అధికారిపై అయినా ఓ ముగ్గురికి కోపం ఉంటే వెంటనే వాట్సప్ గ్రూప్ వెలుస్తుంది. అధికారిపై ఉండే కోపం, పగ, ద్వేషం.. ఒకటేమిటి...అన్ని విషయాలపై గ్రూప్‌ల్లో ఆగ్రహం వ్యక్తం చేయడం, దానికి ఆడియో, వీడియో, ఫొటోలను జోడించడం ఇప్పుడు కొత్త ట్రెండ్‌గా మారింది. సోషల్ ఆగ్రహం బయటకొచ్చి ఆధారాలతో దొరికితే చర్యలు ఉంటాయని తెలుసు. దొరికితే బ్లాక్‌మెయిల్ రూటు ఎలాగూ ఉంటుంది కదా అన్న ధీమాతో కొందరు పోలీసులు ఖాకీ గుట్టును వాట్సప్‌ల్లోకి డంప్ చేస్తున్నారు. పోలీసు శాఖలో అంతర్గతంగా విజిల్ బ్లోయర్ విధానం లేకపోవడం, పెద్దల తప్పులు మాఫీలయి.. కిందిస్థాయి అధికారుల తప్పులనే పరిగణించి క్రమశిక్షణా చర్యలు చేపట్టడం వంటివి వాట్సప్ గ్రూపుల్లో దాడికి తీవ్రంగా ప్రేరేపిస్తున్నాయి. వాట్సప్ గ్రూపుల్లో దాడికి అధికారి హోదా, స్థాయితో సంబంధం ఉండటం లేదు. డీజీపీ నుంచి ఎస్ఐ వరకు ఎవ్వరినీ వదిలిపెట్టడం లేదు. నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత పోలీసు శాఖలోని ముగ్గురు అత్యున్నత అధికారులతో పాటు ఆరుగురు ఎస్పీలు, 15 మంది ఏఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 12 మంది సీఐలు, స్పెషల్ ఆపరేషన్‌లలో పాల్గొనే ఆరుగురు అధికారుల గురించి వాట్సప్ గ్రూపుల్లో కథనాలు పుంఖానుపుంఖాలుగా వదిలారు. అందులోనే అనేక చిత్రాలు, గణాంకాలు, సపోర్టింగ్ అంశాలు ఉండటంతో అన్నీ నిజమేనేమో అన్న భ్రమను కలిగించేలా ఉన్నాయి. తర్వాత అప్పటి డీజీపీ పదోన్నతులు ఇవ్వడం లేదని, నిజాయితీపరులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా తెగ సతాయిస్తున్నారంటూ వాట్సప్ మెసేజ్‌లు కుమ్మరించారు. కొందరు ఇంకో అడుగు ముందుకేసి ఓ పోలీసు ఉన్నతాధికారి ఢిల్లీలో ఎంజాయ్ చేస్తున్నారంటూ కొన్ని ఫోటోలను తెర మీదకు తీసుకొచ్చి కలకలం సృష్టించారు. ఈ అంశాలపై ఏ ఉన్నతాధికారి స్పందించే సాహసం చేయలేదు. ఇటీవలి కాలంలో ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. కేవలం అధికారులను టార్గెట్ చేసుకొని దొంగ నెంబర్లతో సోషల్ గ్రూపులు నిర్వహించే 300 మంది దిగువ స్థాయి సిబ్బందిని కనిపెట్టారు. కొందరిని గుర్తించి సీరియస్‌గా వార్నింగ్‌లు ఇవ్వడమేకాదు.. నోటీసులు, మెమోలు కూడా జారీ చేశారు. కొందరికి పోలీసు తరహాలోనే డార్క్‌రూమ్ కౌన్సిలింగ్ కూడా ఇచ్చినట్లు తెలిసింది. కానిస్టేబుల్ సోషల్ మీడియా పోస్టింగ్‌తో పోలీసు ఉన్నతాధికారులకు ముచ్చెమటలు పట్టించిన ఘటన ఇటీవల చోటుచేసుకుంది. మొదటి బెటాలియన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ తమ పైఅధికారుల తీరును నిరసిస్తూ సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడిద్దామని పిలుపునిస్తూ వాట్సాప్‌లో పోస్టింగ్ పెట్టారు. నలుగురు స్నేహితులతో కలిసి ఇందిరాపార్కు వద్ద చర్చలు జరుపుతున్న క్రమంలో ఉన్నతాధికారులు విషయం తెలుసుకొని వారిని పట్టుకున్నారు. కౌన్సిలింగ్ నిర్వహించారు. ముఖ్యమంత్రి సొంత నిజియోకవర్గ పర్యటన సందర్భంలో ఓ కానిస్టేబుల్ వాట్సప్ కలకలం రేపారు. ఉన్నతాధికారుల్ని టార్గెట్ చేస్తూ వివాదాస్పద పోస్టులు పెట్టాడు. విషయం తెలుసుకున్న అధికారులు సీఎం పర్యటన ముగిసేంత వరకు ఆ కానిస్టేబుల్‌తో పాటు, అతని స్నేహితుడ్ని కట్టడి చేశారు. ఇటీవల జరిగిన మేడారం జాతరలో ఓ కానిస్టేబుల్ అత్యుత్సాహంగా ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టింగ్ వల్ల పోలీసులు, మీడియాకు మధ్య వివాదం చోటు చేసుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ఈ విషయమై స్పందించాల్సి వచ్చింది.



ఎందుకిలా? ఏమిటి పరిష్కారం?

ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను పంచుకునేందుకు సామాజిక మాధ్యమాలను వాడుకుంటున్నారు. అయితే మంచికన్నా చెడుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండటంతో సమస్యలొస్తున్నాయి. పోలీసు శాఖలో కింది స్థాయి సిబ్బందికి అధికారులతో సఖ్యత ఉండటం లేదు. పైస్థాయి వారు చేసే తప్పులను ఎవరూ ఎత్తిచూపే పరిస్థితి లేదు. అదే కిందిస్థాయి అధికారులు తప్పులు చేస్తే చార్జ్ మెమోలు, సస్పెన్షన్‌లు ఉంటున్నాయి. దీంతో కొందరు అసహనంతో బ్లాక్‌మెయిల్ చేస్తుంటే.. మరి కొందరు పైవారి గుట్టురట్టుచేసి అప్రదిష్టకు గురిచేయాలన్న తలంపుతో సోషల్ దాడికి దిగుతున్నారు. దీంతో మరింత అంతరం పెరిగిపోతోంది. చివరకు ఒక రోజు సెలవు ఇవ్వకున్నా... సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టేదాకా పరిస్థితులు వేగంగా పరిగెడుతున్నాయి. ఇదిలా కొనసాగితే పోలీసు శాఖ క్రమశిక్షణ, యూనిఫామ్ సర్వీసు గౌరవం మంటగలుస్తాయన్న ఆవేదన వ్యక్తమవుతోంది. ఏపీలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. పోలీస్ అధికారులు, సిబ్బంది వాట్సాప్ గ్రూపుల నిర్వహణపై ఉన్నతాధికారులు ఆంక్షలు విధించారు. తెలంగాణలో ఈ తరహా ఆంక్షలు విధిస్తే సమస్య మరింత జటిలం అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కిందిస్థాయి, పై స్థాయి అధికారుల నడుమ సఖ్యత కుదిర్చేలా శాఖాపరమైన సంస్కరణలు, పాలసీ విధానాలు తీసుకుంటేనే మేలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కలెక్టర్లకే మైనింగ్ ఎన్‌వోసీ జారీ అధికారం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మైనింగ్ తవ్వకాలకు సంబంధించి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇకపై కలెక్టర్లే జారీ చేయనున్నారు. ఈ మేరకు సాధ్యాసాధ్యాలపై నివేదిక తయారు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. గతంలో పట్టా భూముల్లో విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఎంత భూమిలోనైనా మైనింగ్, క్వారీకి తహసీల్దార్ ఎన్‌వోసీ ఇవ్వొచ్చు. అయితే ఈ అధికారం దుర్వినియోగం అవుతుందని కలెక్టర్లు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ల అధికారాలన్నీ రద్దు చేయడానికి వీలుగా కసరత్తు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ/పట్టా భూముల్లోని క్వారీలు, మైనింగ్‌కు అనుమతి ఇచ్చే అధికారం విస్తీర్ణం ఆధారంగా ఇచ్చారు. ఆర్డీవో (సబ్ కలెక్టర్, జేసీలకు ఉన్న అధికారాలు కూడా తొలగించి, కలెక్టర్‌కే సంపూర్ణ అధికారం ఇవ్వనున్నారు. నిబంధనల ప్రకారం పట్టా/ప్రభుత్వ భూముల్లో మైనింగ్ చేయాలన్నా, క్వారీల్లో తవ్వకాలు జరపాలన్నా.. తొలుత మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)కి దరఖాస్తు చేసుకోవాలి. ఆయన ఆ దరఖాస్తును కలెక్టర్‌కు పంపుతారు. మైనింగ్ శాఖ నుంచి లేఖ వచ్చిన 30 రోజుల్లోగా కలెక్టర్ సిఫారసులతో తహసీల్దార్ నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. లేకుంటే అనుమతి ఇచ్చినట్లు లెక్కలోకి తీసుకుంటారు. అంటే.. దరఖాస్తుల స్వీకరణ మొదలు.. పరిశీలన, నివేదిక, ఎన్‌వోసీ జారీ తదితరాలను అన్నీ కలెక్టర్ మంజూరు చేయాల్సి ఉంటుంది.

తాజాగా మైనింగ్ ఎన్‌వోసీ అధికారాలు కలెక్టర్‌కే దఖలు పడనున్నాయి. ఇక జీవో 4 ప్రకారం..

విస్తీర్ణం (ప్రభుత్వ భూములు)	ఇప్పటిదాకా ఎన్‌వోసీ ఇచ్చే అధికారి	ఇక ముందు
15 హెక్టార్లలోపు (37 ఎకరాలు)	తహసీల్దార్	కలెక్టర్
30 హెక్టార్లలోపు (74 ఎకరాలు)	ఆర్డీవో/సబ్ కలెక్టర్	కలెక్టర్
30 హెక్టార్లపైన	జాయింట్ కలెక్టర్	కలెక్టర్
పట్టాభూములు విస్తీర్ణం ఎంతైనా	తహసీల్దార్	కలెక్టర్

'ప్రవాసీయుల వద్దకు ఎంబసీ'

- గల్ఫ్‌లో ఉన్న భారతీయులంతా దేశ రాయబారులే
- సౌదీలో విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్



ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి : భారతీయ దౌత్య కార్యాలయాలకు ప్రవాసీయులు రాకుండా ఎంబసీ అధికారులే వారి వద్దకు వెళ్లే విధంగా సరికొత్త విధానాన్ని అవలంభిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ తెలిపారు. సౌదీ పర్యటనలో భాగంగా ఆమె మంగళవారం రాత్రి రియాద్‌లో ప్రవాసీయులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలకు భిన్నంగా తాము ప్రజలకు దగ్గరగా ఉండి పరిపాలన సాగిస్తున్నామన్నారు. ఈ మేరకు గల్ఫ్ ప్రాంతాల్లో తరుచూ పర్యటనలు జరపాలని భారతీయ దౌత్యవేత్తలకు సూచించామని సుష్మా తెలిపారు. గల్ఫ్‌దేశాల్లో ఉంటున్న ప్రవాసీయులంతా భారతజాతి సంపదన్నారు. కష్టాల్లో ఉన్న తోటి భారతీయులను ఆదుకోవడానికి ఇతరులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సౌదీలో ఉంటున్న 32 మంది లక్షల మంది భారతీయులందరూ దేశ రాయబారులేనని వ్యాఖ్యానించారు. విదేశాంగశాఖకు అందే ఫిర్యాదుల్లో అధికభాగం సౌదీ నుంచే వస్తున్నాయని, వాటికి మూడు నిమిషాల్లో భారత రాయబార కార్యాలయం స్పందిస్తున్నట్లు సుష్మా వివరించారు. సౌదీలో భారతదేశ రాయబారిగా పనిచేస్తున్న రిటైర్డ్ పోలీస్ అధికారి అహ్మద్‌జావెద్ సేవలను ఆమె కొనియాడారు. జనద్రియాలో భారత్ భాగస్వామ్యం కావడం మోదీ గొప్పతనమని సుష్మ అన్నారు.

తెలంగాణలో తొలి ప్రైవేటు కరెంట్ లైను!

- అదనంగా 1000 మెగావాట్లు పొందే అవకాశం
- 'స్టెరిలైట్ పవర్' చేతికి అంతరాష్ట్ర లైను

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కారుచౌకగా దొరికే కరెంట్‌ను చేరవేసే అంతర్రాష్ట్ర లైను ఒకటి తెలంగాణలో అందుబాటులోకి వచ్చింది. 'వన్ గ్రిడ్-వన్ నేషన్'లో భాగంగా రాష్ట్రంలో నిజామాబాద్-శంకర్‌పల్లి దాకా, ఆ తర్వాత మహేశ్వరం-మహబూబ్‌నగర్ దాకా 400 కేవీ లైన్లను ప్రైవేట్ సంస్థ 'స్టెరిలైట్ పవర్' నిర్మించింది. రాష్ట్రంలో తొలి ప్రైవేటు లైను ఇదే. ఈ లైనుతో తెలంగాణ ట్రాన్స్‌కో ఇతర రాష్ట్రాల నుంచి అదనంగా 1000 మెగావాట్ల కరెంట్‌ను పొందే అవకాశం ఉంది. రూ.440 కోట్ల వ్యయంతో స్టెరిలైట్ పవర్ ఈ లైన్లను నిర్మించింది. గత డిసెంబరులోనే ఈ లైను పూర్తవగా 45 రోజుల కమర్షియల్ ఆపరేషన్(సీవోడీ) అనంతరం ప్రారంభించారు. వాస్తవానికి 2018 ఆగస్టుకల్లా ఈ లైను పూర్తిచేయాల్సి ఉండగా 9 నెలల ముందే పూర్తవడం విశేషం. పూర్తి ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ)తో బీవోటీ విధానంలో చేపట్టారు. 35ఏళ్ల పాటు ఈ లైను నిర్వహణ స్టెరిలైట్ పవర్‌దే. ఈ లైను వాడుకున్నందుకు గాను ఏటా ప్రభుత్వం నిర్ణీత చార్జీలను చెల్లించాల్సి ఉంటుంది.



మాట్లాడుతున్న తెలంగాణ పింఛన్‌దారుల జేఏసీ చైర్మన్ జి.నర్సయ్య

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి: జేఏసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పింఛన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ పింఛన్‌దారుల జేఏసీ డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ జి. నర్సయ్య, సెక్రెటరీ జనరల్ నాగభూషణం మాట్లాడారు. 70ఏళ్లు నిండిన పెన్షనర్లకు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ ఇవ్వాలని పే కమిషన్ గతంలో నిర్ణయించిందని తెలిపారు. దాన్ని కేబినెట్ ఆమోదించినప్పటికీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. పింఛన్‌దారులకు తెలంగాణ ఇన్సెంటివ్ మంజూరు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసిన వారికి హెల్త్‌కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, దేవాలయాల్లో పనిచేసిన వారికి, జలమండలి, గ్రంథాలయం, వ్యవసాయ మార్కెట్లు, డీసీసీబీ సంస్థలలో పనిచేసి రిటైర్ అయిన పెన్షనర్లకు హెల్త్ కార్డులు ఇవ్వలేదని తెలిపారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా రాష్ట్రంలోని పెన్షనర్లకు ఆర్టీసీ బస్సుల్లో 25శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే మార్చిలో జరిగే ఏజేసీ కార్యవర్గ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు.

ఎరువుల ధరలు పెంచితే చర్యలు తీసుకోండి

- డీఏఓలకు వ్యవసాయశాఖ కమిషనర్ జగన్మోహన్ లేఖ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన ధరలకు ఎరువులను విక్రయిస్తే ప్రైవేటు డీలర్లపై చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులకు (డీఏఓలు) ఆ శాఖ కమిషనర్ జగన్మోహన్ లేఖలు రాశారు. ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఎరువుల కంపెనీలు ఇటీవల డీఏపీ, పలు కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచిన సంగతి తెలిసిందే. దీనిని సాకుగా చూపి కొత్త ధరలతో రైతులకు అంటగడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన వ్యవసాయశాఖ కమిషనర్ జగన్మోహన్ స్టాక్ ఉన్న ఎరువులను పాత ఎమ్మార్పీకే విక్రయించేలా చర్యలు తీసుకోవాలంటూ డీఏవోలను ఆదేశించారు. సోమవారం డీఏవోలతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ పాత ఎరువులను కొత్త ధరలకు అమ్మితే చర్యలు తీసుకోవాలంటూ సూచించారు. ఎరువుల కొనుగోలు చేసే సమయంలో బస్తాలపై ఉన్న ఎమ్మార్పీ ధరలకే రైతులు కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో ఎక్కడా కొత్త స్టాకు పంపిణీ జరగలేదని, జరిగినా అది నామమాత్రంగానే ఉందని వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ప్రస్తుతం మార్కెట్లో పాత ఎరువుల స్టాకే ఉందని, వాటికి పాత ధరలే వర్తిస్తాయన్నారు.

● 16న విద్యార్థులతో ప్రధాని ముఖాముఖి

హైదరాబాద్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): 'పరీక్షల ఒత్తిడి' అనే అంశంపై పాఠశాల, కళాశాలల విద్యార్థులతో ఈ నెల 16న ప్రధాని మోదీ ముఖాముఖి నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దూరదర్శన్‌లో ప్రసారమయ్యే ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో టీవీలు ఏర్పాటు చేయాలని డీఈవోలు, ఎంఈవోలను పాఠశాల విద్యా కమిషనర్ జి.కిషన్ ఆదేశించారు.

● 9న డీఐసీ జీఎంల సదస్సు: అహ్మద్ నదీం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రోత్సాహకాలు, రాయితీ పథకాల అమలు ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలుపై శుక్రవారం వివిధ జిల్లాల జనరల్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించనున్నారు. పరిశ్రమల శాఖ కమిషనర్ అహ్మద్ నదీం ఆధ్వర్యంలో జరిగే ఈ సమీక్షలో మండల, జిల్లా కేంద్రాల్లోపారిశ్రామిక పార్కుల స్థాపన, అందుబాటులో ఉన్న స్థలాల ఖరారు విషయం కూడా సదస్సులో చర్చించనున్నారు.

● 17, 18న కొత్త ఆర్ఎస్సైలు రిపోర్టు చేయాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్సై కొలువులకు ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 17, 18 తేదీల్లో అంబర్‌పేటలోని ఎస్ఏఆర్ సెంట్రల్ పోలీస్ లైన్ క్యాంపు కార్యాలయంలో రిపోర్టు చేయాలని వెస్ట్‌జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు.

● 16న 'ఎక్సైజ్ కానిస్టేబుల్' అభ్యర్థులకు పీఈటీ

హైదరాబాద్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఫిజికల్ క్వాలిఫైడ్ టెస్టు(పీక్యూటీ)లో పాసైన ఎక్సైజ్ కానిస్టేబుల్(మహిళా) అభ్యర్థులకు ఫిజికల్ ఎఫిసియెన్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. 1 నెల 16, 17న బండ్లగూడ ఎక్సైజ్ అకాడమీలో నిర్వహించే పరీక్షకు ఉదయం 5గంటలకు హాజరు కావాలని టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ వాణీప్రసాద్ తెలిపారు.

● రేపటి నుంచి 'ఓపెన్ స్కూల్' దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పది, ఇంటర్ వార్షిక పరీక్షలకు ఈ నెల 9 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ వెంకటేశ్వర శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వరకు రూ.25 ఆలస్య రుసుముతో , మార్చి 6 వరకు రూ.50 ఆలస్య రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

● ఎస్సీ స్టడీ సర్కిల్ గౌరవ డైరెక్టర్‌గా ప్రవీణ్

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ స్టడీసర్కిల్ గౌరవ డైరెక్టర్‌గా ఎస్సీ గురుకులాల సొసైటీ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డైరెక్టర్‌గా కొనసాగుతున్న హనుమంత్ నాయక్‌ను రిలీవ్ చేసినందున ప్రవీణ్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● భూ రిజిస్ట్రేషన్లపై తహసీల్దార్లకు శిక్షణ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): భూ రిజిస్ట్రేషన్లలో అవకతవకలకు తావు లేకుండా చర్యలు చేపట్టినట్లు ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తెలిపారు. మండల, జిల్లాల్లో తహసీల్దార్లకు శిక్షణ ఇస్తున్నట్లు బుధవారం సచివాలయంలో తెలిపారు. పాస్‌పుస్తకాల్లో ఎలాంటి లోపాలు జరగకుండా చూస్తున్నామని డూప్లికేట్‌లకు తావు లేదన్నారు.

'సారథి'లోకి మరో 1200 మంది కళాకారులు

- ప్రభుత్వానికి సాంస్కృతిక శాఖ ప్రతిపాదన

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ప్రజల్లో చైతన్యం నింపిన మరికొంతమంది కళాకారులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాంస్కృతిక శాఖ ప్రతిపాదన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మరో 1200 మందిని 'తెలంగాణ సాంస్కృతిక కళా సారిథి'లోకి తీసుకోవాలని యోచిస్తోంది.

వైద్య కళాశాలల్లో సమస్యలపై ఆరా

- ప్రిన్సిపాళ్లతో వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైద్య కళాశాలల పనితీరు, మౌలిక వసతుల సమస్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శాంతకుమారి సమీక్షించారు. వైద్య కళాశాలల్లో సౌకర్యాలు, అధ్యాపకుల కొరత, భారత వైద్య మండలి(ఎంసీఐ) నిబంధనల మేరకు నడుస్తున్నాయా? అనే అంశాలపై ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లతో తొలిసారిగా ఆమె బుధవారం సచివాలయంలో సమావేశమయ్యారు. వైద్య కళాశాలల భవనాలు, ఫర్నిచర్ సమస్యలపై శాంతకుమారి ఆరా తీశారు.

● 'టీ-హబ్'కు కేంద్ర ప్రభుత్వం ప్రశంస

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ట్రిపుల్ ఐటీలో నెలకొల్పిన టీ-హబ్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు దక్కాయి. మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్‌ప్రభు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలు అమలు చేస్తున్న 95 అత్యుత్తమ పథకాలు, విధానాలతో కూడిన పుస్తకాన్ని సురేష్ ప్రభు ఆవిష్కరించారు.



మంధాన, కోహ్లీ

భారత క్రికెట్‌లో ఇది అరుదైన సందర్భం..! క్రికెట్ అభిమానులు ఎప్పటికీ గుర్తుంచుకునే మధుర జ్ఞాపకం..! సౌతాఫ్రికాలో ఒకేసారి భారత పురుషుల, మహిళల జట్లు అద్భుత ప్రదర్శన కనబర్చాయి.! అసాధారణ ఆటతీరుతో సఫారీలను వారి గడ్డపై వేటాడాయి..! తొలుత మిథాలీరాజ్‌సేన రెండో వన్డేలో 178 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా అమ్మాయిలను మట్టికరిపించి 2-0తో సిరీస్‌ను ఖాతాలో వేసుకుంది..! తర్వాత కోహ్లీసేన కూడా సఫారీ జట్టును చిత్తు చేసి ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో 3-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది..! ఈ రెండు మ్యాచ్‌ల ఫలితాలతో పాటు అమ్మాయిల, అబ్బాయిల ఆటలో పలు సారూప్యతలు కనిపించాయి..! రెండు జట్లూ టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేశాయి..! ఇరు జట్లూ దాదాపు సమాన పరుగులు చేశాయి..! అలాగే, అటు స్మృతి మంధాన శతక్కొడితే.. ఇటు విరాట్ కోహ్లీ అజేయ సెంచరీతో విజృంభించాడు..! వీరిద్దరి జెర్సీ నెంబర్లు 18 కావడం యాదృచ్ఛికం.



స్మృతి మంధాన (135)

అటు 18.. ఇటు 18

సఫారీలు బలి

• చెలరేగిన కోహ్లీ • మెరిసిన ధవన్ • రాణించిన బౌలర్లు
• మూడో వన్డేలో కోహ్లీసేన జయభేరీ • 3-0తో సిరీస్‌లో ఆధిక్యం

విరాట్ విహారం

పరుగుల యంత్రుడు విరాట్ మళ్లీ పంజా విసిరాడు...! శతకాల రుచి మరిగిన సింహంలా మరోసారి జూలు విదిల్చాడు..! పుస్తకాల్లో పేజీలను తిరగేసినంత సులభంగా కెరీర్‌లో 34వ సెంచరీ కొట్టేశాడు..! సఫారీలను వేటాడుతూ.. వారి గడ్డపై అత్యధిక స్కోరు చేసిన భారత క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు..! కేప్‌టౌన్ మ్యాచ్‌లో తన కెరీర్‌లో గుర్తుండిపోయే సెంచరీ కొట్టాడు విరాట్..!

ధవన్ ధనాధన్ మెరుపులతో కలిసి పునాది వేసిన అతను.. మిడిల్, లోయర్ ఆర్డర్ తడబడినా.. ప్రత్యర్థి బౌలర్లు సవాల్ విసిరినా.. కడదాకా క్రీజులో నిలిచి తనలోని మరో కోణాన్ని చూపించాడు..! తగ్గాల్సిన చోట తగ్గుతూ.. అవకాశం వచ్చిన వెంటనే జూలు విదిలిస్తూ.. వేగం.. తేజం కలిసిన ఆటతో.. పూర్తి నియంత్రణతో కూడిన బ్యాటింగ్‌తో.. కళాత్మక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు...!

విరాట్ జోరుతో భారీ స్కోరు చేసిన భారత్.. తర్వాత మణికట్టు మాంత్రికులు చాహల్, కుల్దీప్ కనికట్టుతో సఫారీలను చుట్టేసి వారి గడ్డపై తొలిసారి మూడు వన్డేలు నెగ్గి చరిత్ర సృష్టించింది..! హ్యాట్రిక్ విజయంతో 3-0తో నిలిచిన కోహ్లీసేన సౌతాఫ్రికా గడ్డపై సిరీస్ నెగ్గిన తొలి భారత జట్టుగా సగర్వంగా నిలిచేందుకు కావాల్సింది మరొక్క గెలుపే..! ఆరు వన్డేల ఈ సిరీస్‌పై ఆశలు కోల్పోయిన సౌతాఫ్రికా ఇక పోరాడాల్సింది డ్రా కోసమే..!



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్
విరాట్ కోహ్లీ
(160 నాటౌట్)

కేప్‌టౌన్: టెస్టు సిరీస్ కోల్పోయినా పరిమిత ఓవర్లలో భారత్ చెలరేగిపోతోంది. కెప్టెన్ విరాట్ కోహ్లీ (159 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లతో 160 నాటౌట్) భారీ శతకం, ఓపెనర్ శిఖర్ ధవన్ (63 బంతుల్లో 12 ఫోర్లతో 76) మెరుపులకు తోడు బౌలర్ల సమష్టి ప్రదర్శనతో బుధవారం జరిగిన మూడో మ్యాచ్‌లో భారత్ 124 పరుగుల తేడాతో సఫారీలపై ఘన విజయం సాధించింది. తొలుత కోహ్లీ, ధవన్ బ్యాటింగ్ జోరుతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 303 పరుగులు చేసింది. ఛేదనలో ఆతిథ్య జట్టు 40 ఓవర్లలో 179 పరుగులకే కుప్పకూలి చిత్తుగా ఓడిపోయింది. డుమిని (51) మినహా మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. భారత బౌలర్లలో కుల్దీప్ (4/23), చాహల్ (4/46)తో పాటు బుమ్రా (2/32) సత్తా చాటారు. నాలుగో వన్డే ఈ నెల 10న జరగనుంది.

మణికట్టు బౌలర్ల మాయ: భారీ ఛేదనలో రెండో ఓవర్లోనే ఓపెనర్ ఆమ్లా (1)ను ఎల్బీగా అవుట్ చేసిన బుమ్రా భారత్‌కు మంచి ఆరంభం ఇచ్చాడు. అయితే, కెప్టెన్ మార్క్రమ్, వన్‌డౌన్‌లో వచ్చిన డుమిని స్వేచ్ఛగా ఆడుతూ ఇన్నింగ్స్ నిర్మించారు. రెండో వికెట్‌కు ఇద్దరూ 78 పరుగులు జోడించారు. కానీ, భారత స్పిన్ ద్వయం చాహల్, కుల్దీప్ వెంటవెంటనే మూడు వికెట్లు తీయడంతో పరిస్థితి తారుమారైంది. తొలుత ఊరించే బంతితో మార్క్రమ్‌ను కుల్దీప్ స్టంపౌట్ చేశాడు. ఆ తర్వాత అరంగేట్రం ఆటగాడు క్లాసెన్ (6)తో పాటు హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న డుమినిని చాహల్ ఎల్బీగా అవుట్ చేయడంతో ఆతిథ్య జట్టు 95/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో జోండో (17)తో కలిసి డేవిడ్ మిల్లర్ (25) పోరాడే ప్రయత్నం చేశాడు. కానీ, రెండో స్పెల్ బౌలింగ్‌కు వచ్చిన బుమ్రా.. అతణ్ణి అవుట్ చేసి సఫారీల ఆశలపై నీళ్లు చల్లాడు. కాసేపటికే వరుస ఓవర్లలో మోరిస్ (14)ను కుల్దీప్, జోండోను చాహల్ పెవిలియన్ చేర్చడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు.

ధవన్ ధనాధన్.. కోహ్లీ కమాల్: భారత బ్యాటింగ్‌లో వందకు వంద మార్కులు కెప్టెన్ విరాట్ కోహ్లీవే. తొలుత టాస్ ఓడిన సఫారీలు బౌలింగ్ ఎంచుకోగా.. ఆరో బంతికే రోహిత్ శర్మ (0)ను డకౌట్ చేసిన రబాడ భారత్‌కు షాకిచ్చాడు. తన తర్వాతి ఓవర్లోనే కెప్టెన్ కోహ్లీని ఎల్బీగా అవుట్ చేసినా డీఆర్‌ఎస్‌లో నాటౌట్‌గా తేలాడు. అదే ఓవర్ చివరి బంతిని బౌండ్రీకి చేర్చిన విరాట్ ఖాతా తెరిచాడు. ఎంగిడి వేసిన తర్వాతి ఓవర్లో రెండు ఫోర్లతో ధవన్ జోరు పెంచాడు. తర్వాత ఇద్దరూ ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ధవన్ తన మార్కు దూకుడైన ఆటతో చెలరేగిపోగా.. మరో ఎండ్‌లో విరాట్ సొగసైన షాట్లతో అలరించాడు. ముఖ్యంగా శిఖర్ ప్రత్యర్థి బౌలర్లు కోలుకునే అవకాశమే ఇవ్వలేదు. 13వ ఓవర్ తర్వాత కోహ్లీ స్ట్రయిక్ రొటేట్ చేసే బాధ్యత తీసుకోగా.. శిఖర్ పదునైన షాట్లతో బౌండ్రీలు రాబడుతూ 42 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కొద్దిసేపటికే విరాట్ కూడా ఈ మార్కు చేరుకున్నాడు. అప్పటికి 23 ఓవర్లలో జట్టు స్కోరు 140/1.

మిడిల్ ఢమాల్: ధవన్ ఫుల్ జోష్‌లో ఉండగా.. కోహ్లీ కూడా ధాటిగా ఆడుతుండడంతో భారత్ సులువుగా 350 స్కోరు చేసేలా కనిపించింది. కానీ, ఈ దశలో సఫారీ బౌలర్లు అద్భుతంగా పుంజుకున్నారు తక్కువ వ్యవధిలోనే మూడు వికెట్లు పడగొట్టడంతో పాటు పరుగులు నియంత్రించి భారత్‌ను కట్టడి చేశారు. తొలుత సెంచరీ దిశగా దూసుకెళ్తున్న ధవన్‌ను 24వ ఓవర్లో పార్ట్ టైమర్ డుమిని అవుట్ చేసి ఈ జోడీని విడదీశాడు. అతని బౌలింగ్‌లోనే చెత్త షాట్ ఆడిన రహానె (11) ఫెలుక్వాయోకు చిక్కాడు. హార్దిక్ పాండ్యా (14) ను మోరిస్ అవుట్ చేశాడు. స్పిన్నర్లు డుమిని, తాహిర్‌తో పాటు రబాడ, మోరిస్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. మాజీ సారథి ధోనీ (22 బంతుల్లో 10) అతి జాగ్రత్తగా ఆడాడు. అయినా.. పోరాటం కొనసాగించిన కోహ్లీ 119 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే, ధోనీని తాహిర్, కేదార్ జాదవ్ (1)ను ఫెహ్లుక్వాయో అవుట్ చేసి భారత్‌ను మరోసారి దెబ్బకొట్టారు. అప్పటికి 43 ఓవర్లలో జట్టు స్కోరు 236/6. అయితే, ఒకవైపు వికెట్లు పడుతున్నా కోహ్లీ మాత్రం వెనక్కుతగ్గలేదు. చివర్లో భువనేశ్వర్ (16 నాటౌట్) సహకారం అందించగా అతను మళ్లీ చెలరేగి ఆడాడు. మోరిస్ వేసిన 49వ ఓవర్లో సిక్సర్ బాదిన విరాట్ ఇన్నింగ్స్ చివరి రెండు బంతులను 6, 4 గా మలిచి జట్టు స్కోరు 300 దాటించాడు. తానెదుర్కొన్న చివరి 40 బంతుల్లో విరాట్ 60 పరుగులు చేయడం విశేషం.

12
కెప్టెన్‌గా కోహ్లీ చేసిన సెంచరీలు. అత్యధిక సెంచరీలు చేసిన భారత సారథిగా గంగూలీ (11)ని దాటాడు.

ధోనీ @ 400
వన్డేల్లో 400 అవుట్లు చేసిన నాలుగో వికెట్ కీపర్‌గా ధోనీ రికార్డుకెక్కాడు. మార్క్రమ్‌ను స్టంపౌట్ చేయడం ద్వారా అతను ఈ మైలురాయిని చేరాడు. ఈ జాబితాలో సంగక్కర (482), గిల్‌క్రిస్ట్ (472), బౌచర్ (424) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

2
ఈ మ్యాచ్‌లో కోహ్లీ చేసిన 160 పరుగులు వన్డేల్లో సౌతాఫ్రికాపై భారత బ్యాట్స్‌మన్‌కు రెండో అత్యుత్తమం. 2010లో సచిన్ గ్వాలియర్‌లో ఆ జట్టుపై డబుల్ సెంచరీ చేశాడు.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) క్లాసెన్ (బి) రబాడ 0, ధవన్ (సి) మార్క్రమ్ (బి) డుమిని 76, కోహ్లీ (నాటౌట్) 160, రహానె (సి) ఫెలుక్వాయో (బి) డుమిని 11, హార్దిక్ (సి) క్లాసెన్ (బి) మోరిస్ 14, ధోనీ (సి) ఎంగిడి (బి) తాహిర్ 10, కేదార్ (సి) క్లాసెన్ (బి) ఫెలుక్వాయో 1, భువనేశ్వర్ (నాటౌట్) 16; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 50 ఓవర్లలో 303/6; వికెట్ల పతనం:** 1-0, 2-140, 3-160, 4-188, 5-228, 6-236; **బౌలింగ్:** రబాడ 10-1-54-1, ఎంగిడి 6-0-47-0, మోరిస్ 9-0-45-1, ఫెలుక్వాయో 6-0-42-1, తాహిర్ 9-0-52-1, డుమిని 10-0-60-2.

సౌతాఫ్రికా: ఆమ్లా (ఎల్బీ) బుమ్రా 1, మార్క్రమ్ (స్టంప్డ్) ధోనీ (బి) కుల్దీప్ 32, డుమిని (ఎల్బీ) చాహల్ 51, క్లాసెన్ (ఎల్బీ) చాహల్ 6, మిల్లర్ (సి) ధోనీ (బి) బుమ్రా 25, జోండో (సి-సబ్) మనీష్ (బి) చాహల్ 17, మోరిస్ (ఎల్బీ) కుల్దీప్ 14, ఫెలుక్వాయో (సి) కోహ్లీ (బి) కుల్దీప్ 3, రబాడ (నాటౌట్) 12, తాహిర్ (సి) కోహ్లీ (బి) చాహల్ 8, ఎంగిడి (ఎల్బీ) కుల్దీప్ 6; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 40 ఓవర్లలో 179 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-1, 2-79, 3-88, 4-95, 5-129, 6-150, 7-150, 8-158, 9-167; **బౌలింగ్:** భువనేశ్వర్ 7-0-41-0, బుమ్రా 7-0-32-2, హార్దిక్ 8-0-35-0, చాహల్ 9-0-46-4, కుల్దీప్ 9-1-23-4.

ఆమ్లాను దాటిన విరాట్

మంచినీళ్ల ప్రాయంలా శతకాలు బాదేస్తున్న భారత సారథి విరాట్ టెస్టులు, వన్డేల్లో కలిపి అత్యధిక శతకాలు చేసిన వీరుల జాబితాలో ఐదో స్థానానికి ఎగబాకాడు. వన్డేల్లో 34వ సెంచరీ చేసిన విరాట్.. (టెస్టుల్లో 21) మొత్తంగా తన శతకాల సంఖ్యను 55కు పెంచుకున్నాడు. చెరో 54 శతకాలతో ఉన్న ఆమ్లా, మహేల జయవర్ధనెలను కోహ్లీ వెనక్కునెట్టాడు. ఈ జాబితాలో వంద సెంచరీలతో సచిన్ (51+49) టాప్ ప్లేస్‌లో ఉండగా ఉండగా..పాంటింగ్ (71), సంగక్కర (63), జాక్వస్ కలిస్ (62) తర్వాతి స్థానంలో ఉన్నారు. ఇక, వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన సచిన్ (49)ను అందుకునేందుకు భారత సారథి మరో అడుగు ముందుకేశాడు.

శతక మంధానం

మిథాలీసేన ఘన విజయం.. వన్డే సిరీస్ కైవసం

కింబర్లీ: దక్షిణాఫ్రికా పర్యటనలో మిథాలీసేన అదరగొడుతోంది. ఐసీసీ చాంపియన్‌షిప్‌లో భాగంగా సౌతాఫ్రికాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో చేజిక్కించుకుంది. బుధవారం ఇక్కడ జరిగిన రెండో వన్డేలో 178 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్..ఓపెనర్ స్మృతి మంధాన అద్భుత శతకానికి (129 బంతుల్లో 14 ఫోర్లు, సిక్సర్‌తో 135)తోడు హర్మన్‌ప్రీత్ కౌర్ (69 బంతుల్లో 55 నాటౌట్), వేద కృష్ణమూర్తి (33 బంతుల్లో 51 నాటౌట్) అర్థ సెంచరీలతో సత్తా చాటడంతో నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్లకు 302 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం భారత స్పిన్నర్ల దెబ్బకు దక్షిణాఫ్రికా 30.5 ఓవర్లలో 124 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ లీ (75 బంతుల్లో 73) మినహా అంతా విఫలమయ్యారు. కాప్ (17 నాటౌట్) మాత్రమే సౌతాఫ్రికా జట్టులో రెండంకెల స్కోరు చేసిన రెండో బ్యాట్స్‌ఉమన్. భారత బౌలర్లలో పూనమ్ యాదవ్ (4/24), రాజేశ్వరీ గైక్వాడ్ (2/14), డీబీ శర్మ (2/34) సత్తా చాటారు. ఆఖరి వన్డే శనివారం పాచెఫ్‌స్ట్రూమ్‌లో జరగనుంది.

స్మృతి జోరు..

తొలి వన్డేలో 84 పరుగులతో సత్తా చాటిన స్మృతి రెండో మ్యాచ్‌లోనూ అదే జోరు ప్రదర్శించింది. దక్షిణాఫ్రికా బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మూడు కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన ఆమె జట్టు భారీ స్కోరుకు బాటలు వేసింది. తొలి వికెట్‌కు రౌత్ (20)తో కలిసి 56 పరుగులు అనంతరం మిథాలీ రాజ్ (20) జతగా రెండో వికెట్‌కు మరో 51 పరుగులు జత చేసిన ఆమె..మూడో వికెట్‌కు కౌర్‌తో కలిసి ఏకంగా 134 పరుగులు జోడించింది. మంధానాకు సౌతాఫ్రికాపై రెండో వన్డే సెంచరీ కావడం గమనార్హం.



200 వికెట్ల జులన్

భారత వెటరన్ పేసర్ జులన్ గోస్వామి కీర్తికిరీటంలో మరో కలికి తురాయి చేరింది. రెండో వన్డేలో దక్షిణాఫ్రికా ఓపెనర్ వోల్వార్ట్‌ను కీపర్ సుష్మ వర్మ క్యాచ్ ద్వారా అవుట్ చేసిన 35 ఏళ్ల జులన్..తన కెరీర్‌లో 166వ మ్యాచ్‌లో 200 వికెట్ చేజిక్కించుకుంది. తద్వారా మహిళా క్రికెట్‌లో ఈ అరుదైన ఘనత సాధించిన తొలి బౌలర్‌గా రికార్డుల్లో మరోసారి చోటు సంపాదించింది. గత మేలో దక్షిణాఫ్రికాలో జరిగిన నాలుగు దేశాల టోర్నీ సందర్భంగా 181వ వికెట్ కైవసం చేసుకున్న గోస్వామి.. మహిళల వన్డేల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన రికార్డు సొంతం చేసుకుంది. కాగా పురుషుల వన్డేల్లో కూడా 200 వికెట్లు సాధించిన మొదటి బౌలర్ భారత్‌కే చెందిన కపిల్‌దేవ్ కావడం విశేషం.

మాక్స్‌వెల్ ఆల్‌రౌండ్ షో

• ఇంగ్లండ్‌పై ఆసీస్ గెలుపు



మాక్స్‌వెల్

హోబర్ట్ (ఆస్ట్రేలియా): విధ్వంసకర బ్యాట్స్‌మన్ గ్లెన్ మాక్స్‌వెల్ (58 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లతో 103 నాటౌట్) మెరుపు శతకంతో పాటు బంతితోనూ చెలరేగడంతో ముక్కోణపు టీ-20 టోర్నీలో ఆతిథ్య ఆస్ట్రేలియా వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఇంగ్లండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేసింది. మలాన్ (50) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఆసీస్ బౌలర్లలో మాక్స్‌వెల్ (3/10) మూడు, ఆస్టన్ అగర్ (2/15) రెండు వికెట్లు తీశారు. అనంతరం మాక్సీ సెంచరీతో ఆసీస్ 18.3 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది.

'ఫెడ్ కప్'లో భారత్ పరాజయం

న్యూఢిల్లీ : ఫెడరేషన్ కప్ ఆసియా-ఓషియానియా గ్రూప్-1 టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో బుధవారం భారత మహిళల జట్టు చైనా చేతిలో ఓటమి చవిచూసింది. యువ క్రీడాకారిణి అంకిత రైనా సింగిల్స్ మినహా తక్కిన రెండు మ్యాచ్‌లలో భారత్ ఓడిపోవడంతో చైనా 2-1 తేడాతో విజయాన్ని దక్కించుకుంది. అంకిత తనకంటే మెరుగైన క్రీడాకారిణి లిన్ ఝును 6-3, 6-2 స్కోరుతో ఓడించింది. తొలి సింగిల్స్‌లో కర్మన్ కౌర్ థండి 2-6, 2-6 స్కోరుతో యఫాన్ వాంగ్ చేతిలో ఓడిపోయింది. అంకిత తన గెలుపుతో స్కోరును 1-1గా సమం చేసింది. అనంతరం జరిగిన డబుల్స్‌లో అంకిత-ప్రార్థన మాంబ్రె జోడీ యఫాన్ వాంగ్-జాక్సన్ యాంగ్ చేతిలో 2-6, 6-7(1-7) స్కోరుతో ఓడిపోవడంతో చైనా ముందంజ వేసింది. భారత జట్టు తమ తదుపరి మ్యాచ్‌లో బలీయమైన కజకిస్థాన్‌ను ఢీకొంటుంది.

ముంబై మెంటార్‌గా మలింగ



ముంబై: ఐపీఎల్ టీమ్ ముంబై ఇండియన్స్‌కు శ్రీలంక ప్లేయర్ లసిత్ మలింగ బౌలింగ్ మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. దశాబ్దంపాటు ఆటగాడిగా ఐపీఎల్ టీమ్ ముంబై ఇండియన్స్‌కు మలింగ ప్రాతినిధ్యం వహించాడు. అయితే ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో మలింగను ఎవరూ ఖరీదు చేయలేదు. ముంబై ఇండియన్స్ తరపున మలింగ 110 మ్యాచ్‌లు ఆడాడు.

టెస్టులకు కనీస జీతాలుండాలి..!

• శ్రీలంక దిగ్గజం సంగక్కర



హాంకాంగ్: కాసులు కురిపించే టీ-20 లీగ్‌ల కోసం యువ క్రికెటర్లు టెస్టు ఫార్మాట్‌ను నిర్లక్ష్యం చేయడంపై శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర ఆందోళన వ్యక్తం చేశాడు. యువత టెస్టు క్రికెట్ వైపు ఆకర్షితులు కావాలంటే టెస్టుల్లో కనీస జీతాలు ఉండాలనే సూచన చేశాడు. అయితే టీ-20 క్రికెట్.. కొత్త మార్కెట్‌కు కారణమైందన్నాడు. టెస్టు ఫార్మాట్‌లో మార్పులు చేయకపోతే యువతను ఆకర్షించడం కష్టమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. అమెరికా, చైనా లాంటి దేశాలకు క్రికెట్‌ను పరిచయం చేయాలంటే పొట్టి ఫార్మాట్ అన్ని విధాలా అనుకూలమైనదని అన్నాడు.

అంధుల క్రికెట్‌ను గుర్తించండి..!

• బీసీసీఐకి సచిన్ సూచన



న్యూఢిల్లీ: అంధుల క్రికెట్ సంఘానికి (సీఏబీఐ) గుర్తింపు ఇవ్వాలని బ్యాటింగ్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ బీసీసీఐ కోరాడు. వారినికూడా బోర్డు పెన్షన్ పథకం పరిధిలోకి తీసుకురావాలని సూచించాడు. ఈ మేరకు బోర్డు సీఓఏ చైర్మన్ వినోద్ రాయ్‌కు ఒక లేఖ రాస్తూ ఇటీవలి ప్రపంచకప్ ఫైనల్లో పాక్‌ను ఓడించి విజేతగా నిలిచిన అంధుల జట్టు ప్రతిభకు గుర్తింపుగా భారత అంధుల క్రికెట్ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని కోరాడు. విజయమే లక్ష్యంగా అంధుల జట్టు దేశ కీర్తి పతాకను ఎగురవేసిందని, మానవ మేథస్సుకు పరిమితి లేదన్న విషయాన్ని వారి విజయం రుజువు చేసిందన్నాడు. అంధుల క్రికెట్‌కు బోర్డు గుర్తింపు ఇస్తే అది మరింతమందికి స్ఫూర్తిదాయకమవుతుందని సచిన్ తెలిపాడు.

భారత్ దెబ్బకు మాల్దీవులు విలవిల

• 5-0తో గెలుపు.. ఆసియా బ్యాడ్మింటన్



సాయిప్రణీత్

అలోర్ సెటార్ (మలేసియా) : ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు రెండో విజయం నమోదు చేసింది. బుధవారం జరిగిన పోరులో కిడాంబి శ్రీకాంత్ సారథ్యంలోని భారత్ 5-0తో పసికూన మాల్దీవులను చిత్తుచేసింది. తొలి సింగిల్స్‌లో శ్రీకాంత్ 21-15, 21-6 స్కోరుతో షహీద్ హుస్సేన్ జాయన్‌పై సునాయాసంగా గెలుపొందాడు. రెండో సింగిల్స్‌లో సాయిప్రణీత్ కేవలం 17 నిమిషాల్లో 21-10, 21-4 స్కోరుతో అహ్మద్ నిబాల్‌ను ఓడించాడు. మూడో మ్యాచ్‌లో సమీర్ వర్మ 21-5, 21-1తో అర్సలాన్‌పై నెగ్గడంతో భారత్ 3-0 ఆధిక్యం ప్రదర్శించింది. డబుల్స్ మొదటి మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి 21-8, 21-8 స్కోరుతో హుస్సేన్ జాయన్, హసన్ అఫ్షీమ్‌పై నెగ్గగా..అర్జున్, రామచంద్రన్ జోడీ 21-2, 21-5 స్కోరుతో మహ్మద్ అర్సలాన్ అలీ, అహ్మద్ నిబాల్‌లను చిత్తుచేశారు.

మహామస్తకాభిషేక ప్రక్రియ మొదలు

ప్రారంభించిన రాష్ట్రపతి.. బాహుబలికి పుష్పాభిషేకం

బెంగళూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):కర్ణాటకలోని హాసన్ జిల్లా శ్రావణబెళగొళలో వింధ్యపర్వతాలపై కొలువుదీరిన బాహుబలి గోమటేశ్వరుడి 88వ మహామస్తకాభిషేకాలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. చావుండరాయ సభామంటపంలో ప్రతిష్ఠించిన బాహుబలి పంచలోహ విగ్రహాన్ని తొలుత ఆవిష్కరించిన ఆయన పుష్పాభిషేకం ద్వారా 12 ఏళ్లకోసారి జరిగే మహామస్తకాభిషేకాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం రాష్ట్రపతి ప్రసంగించారు. శ్రావణబెళగొళ పుణ్యక్షేత్రానికి వేల సంవత్సరాల చరిత్ర ఉందని ఆయన అన్నారు. 1,300 సంవత్సరాల క్రితమే ఉత్తర భారతదేశపు భద్రబాబు, చంద్రగుప్తమౌర్యలు తమ సామ్రాజ్యాలను త్యాగం చేసి అత్యంత సాధారణ స్థాయిలో మునులుగా జీవితాలు గడిపారని చరిత్ర చెబుతోందన్నారు. కన్నడ భాషలో 'సహోదర, సహోదరియరిగె ఎల్లరిగూ నన్న ప్రీతిభరిత నమస్కారగళు'(సోదర సోదరీమణులందరికీ నమస్కారం) అంటూ రాష్ట్రపతి ప్రసంగాన్ని ప్రారంభించారు. అంతకుముందు శ్రావణబెళగొళ పీఠాధిపతి చారుకీర్తి భట్టారక స్వామిజీ రాష్ట్రపతికి సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. కార్యక్రమానికి హాజరైన వందల మంది దిగంబర జైనమునుల ఆశీర్వాదాలను రాష్ట్రపతి అందుకున్నారు. మహామస్తకాభిషేకాల ప్రధాన కార్యక్రమం ఫిబ్రవరి 17న ప్రారంభమై 25 వరకు కొనసాగనుంది.


జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలు ప్రారంభిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

ప్రపంచానికి అమెరికా సైన్యం సవాల్!

సంప్రదాయానికి విరుద్ధంగా సైనిక కవాతు.. పెంటగాన్ సన్నాహాలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 7: అగ్రరాజ్యం అమెరికా.. ప్రపంచ దేశాలకు తమ సైనిక సత్తాను చూపించాలనుకుంటోంది. ఇందుకోసం అమెరికా సంప్రదాయంలో లేనివిధంగా సైనిక కవాతు నిర్వహించనుంది. దేశాధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు పెంటగాన్ ఇందుకు సన్నాహాలు చేస్తోంది. భారత్, చైనా, ఫ్రాన్స్ వంటి దేశాల్లో ఏటా మిలిటరీ పరేడ్ జరుగుతుండగా.. అమెరికాలో ఇప్పటివరకు ఈ సంప్రదాయం లేదు. కానీ, ట్రంప్ ఈ ఏడాది కవాతు నిర్వహించాలని నిర్ణయించారు. నిరుడు ఫ్రాన్స్ బ్యాస్టిల్ డే వేడుకలకు హాజరైన ట్రంప్.. వారి సైన్యం పరేడ్‌ను చూసి ముచ్చటపడినట్లు, అప్పుడే తమ సైన్యంతోనూ నిర్వహించాలని నిర్ణయించినట్లు వైట్‌హౌస్ వర్గాలు పేర్కొన్నాయి. 'దేశం కోసం తమ ప్రాణాలను పణంగా పెడుతున్న సైనికుల పట్ల ట్రంప్‌కు ఎంతో గౌరవం ఉంది. ఆయనతోపాటు దేశ ప్రజలందరూ వారి పట్ల తమ కృతజ్ఞతలు చాటుకునేలా గొప్ప వేడుక నిర్వహించాలని కోరారు' అని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి సారా శాండర్స్ తెలిపారు.

జవాబు చెప్పండి!

రాఫెల్, రైతులు, నిరుద్యోగంపై ప్రజల ప్రశ్నలకు మోదీ బదులివ్వాలి: రాహుల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: 'రాఫెల్ ఒప్పందం, రైతులు, నిరుద్యోగంపై దేశ ప్రజలు ప్రధానికి మూడు ప్రశ్నలు సంధించారు. వాటికి సమాధానం చెప్పాల్సిన ఆయన ప్రతిపక్ష నేతలా పార్లమెంటు వేదికగా ఆరోపణలు చేయడం సరికాదు.' అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ తాను ఈ దేశానికి ప్రధాని అన్న విషయాన్ని మర్చిపోయి, ప్రతిపక్ష నేతలా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై బుధవారం ప్రధాని మాట్లాడారు. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే కాంగ్రెస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. పార్లమెంటు వెలుపల రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రజలు అడిగే ప్రశ్నలకు పార్లమెంటు వేదికగా సమాధానాలు చెప్పాల్సిన ప్రధాని, ప్రతిగా దేశ ప్రజలను తన ప్రశ్నలతో అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. 'ప్రధానికి కాంగ్రెస్ గురించి మాట్లాడే హక్కు.. విమర్శించే హక్కు ఉంది. అయితే పార్లమెంటు దానికి సరైన వేదిక కాదు. కాంగ్రెస్‌ను విమర్శించదలచుకుంటే బహిరంగ సభలను దానికి వేదికగా చేసుకోవచ్చు.' అని రాహుల్ సూచించారు. రాఫెల్ ఒప్పందంలో అవినీతికి పాల్పడిన వారిని మోదీ రక్షిస్తున్నారని, తన ప్రసంగంలో రాఫెల్ ఒప్పందంపై దేశ ప్రజల అనుమానాలను నివృత్తి చేసే ఒక్క మాట కూడా ప్రధాని మాట్లాడక పోవడం విచారకరమన్నారు. 'రాఫెల్ ఒప్పందంలో మార్పులు జరిగాయా? రాఫెల్ జెట్‌ల కోసం అధిక మొత్తం చెల్లించారా? దీనికి నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతి తీసుకున్నారా? ఈ మూడు ప్రశ్నలకు ప్రధాని సమాధానం చెప్పాలి.' అని రాహుల్ నిలదీశారు. రైతులకు సరైన మద్దతు ధర కల్పించడంతోపాటు వారి రుణాలను రద్దు చేయాల్సింది పోయి, వెదురు, తేనెపెంపకం గురించి ప్రధాని మాట్లాడటం చిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రధాని ప్రసంగంలో ఎలాంటి కొత్తదనం లేదని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ విమర్శించారు. ప్రధాని మంచి వక్త అనడంలో సందేహం లేదని, అయితే ఆయన ప్రసంగం మొత్తం అర్ధసత్యాలు, తప్పుడు సమాచారంతో నిండిపోయిందని కాంగ్రెస్ నేత శశిథరూర్ విమర్శించారు. అటు రాజ్యసభలోనూ మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ విరుచుకుపడింది. ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే విధంగా మోదీ సర్కార్ వ్యవహరిస్తోందని దుయ్యబట్టింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ మాట్లాడుతూ.. మోదీ సర్కార్ అసహనంతో, దురహంకారంతో వ్యవహరిస్తోందన్నారు. రాఫెల్ ఒప్పందంలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ప్రధాని ప్రసంగం ఆసాంతం కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేస్తుండగా, వామపక్ష సభ్యులు వెల్‌లోకి వెళ్లి ప్లకార్డులు ప్రదర్శించారు. రాఫెల్ ఒప్పందంపై వివరణ ఇవ్వడంతోపాటు ఏపీకి ప్రత్యేక రైల్వే జోన్, పోలవరానికి నిధులు వంటి అంశాలపై మోదీ సమాధానం ఇవ్వాలని నినదించారు.

విభజన హామీలు ఏమయ్యాయి?: ఖర్గే

లోక్‌సభలో ప్రధాని ప్రసంగం నిరుత్సాహపూరితంగా ఉందని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. బుధవారం పార్లమెంటు వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణకు న్యాయం చేస్తానని, ఆంధ్రప్రదేశ్‌కు ప్యాకేజీ ఇస్తానన్న మోదీ తన హామీలను నిలబెట్టుకోలేదని ఖర్గే విమర్శించారు.

రాఫెల్ టెక్నాలజీ బదిలీ కోరలేదు: నిర్మల

ఫ్రాన్స్ నుంచి 36 రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకునేటప్పుడు.. వాటి టెక్నాలజీ బదిలీని తాము కోరలేదని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. టెక్నాలజీ బదిలీ గానీ, మాన్యుఫ్యాక్చరింగ్ లైసెన్స్.. లాభదాయకం కానందునే కోరలేదని బుధవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు. యూపీఏ హయాంలో 126 రాఫెల్ విమానాల కోసం కుదుర్చుకున్న ఒప్పందాన్ని 2015 జూన్‌లో ఉపసంహరించుకున్నామని తెలిపారు. ఒప్పంద విలువపై చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడడమే దీనికి కారణమన్నారు.

మీ దోపిడీ సాక్ష్యాలు నా దగ్గరున్నాయ్



- కాంగ్రెస్-ముక్త్ భారత్‌ను గాంధీ కోరుకున్నారు
- మీరు నాటిన విషమే ప్రజల్ని పీడిస్తోంది
- కాంగ్రెస్ తప్పులకు దేశం శిక్ష అనుభవిస్తోంది
- ప్రత్యర్థిపై దుమ్మెత్తి పోసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ పార్టీ ఓ విషబీజం లాంటిది, ఆ పార్టీ నాటిన విషమే నేటికీ దేశాన్ని పట్టిపీడిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో దుమ్మెత్తిపోశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులకు యావద్దేశం శిక్ష అనుభవిస్తోందని ఆయన అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై పార్లమెంట్ ఉభయసభల్లో జరిగిన చర్చకు బుధవారంనాడు బదులిచ్చిన ప్రధాని- తన ప్రసంగంలో అనేక అంశాలను స్పృశించారు. "కాంగ్రెస్ పార్టీ దేశాన్ని ఎలా దోచుకుందో , అక్రమంగా అనైతికంగా సంపద వెనకేసిందో తెలియజెప్పే సాక్ష్యాలు నా దగ్గరున్నాయి. చేసిన పాపాలకు వారు శిక్ష అనుభవించక తప్పదు. ఈ దేశ ప్రజలకు వారు జవాబుదారీ కావాల్సిన, సమాధానం చెప్పాల్సిన సమయం దగ్గర పడింది" అని ఆయన హెచ్చరికగా అన్నారు. దాదాపు ఓ ఇరవైసార్లు ప్రధాని ప్రత్యక్షంగానో లేక పరోక్షంగానో కాంగ్రెస్‌ను విమర్శించారు. ఆయన ప్రసంగం సాగుతున్నంత సేపూ కాంగ్రెస్ సహా విపక్ష సభ్యులు నినాదాలు, కేకలతో హోరెత్తించారు. నేను చెప్పేది వినడానికి మీకు ధైర్యం ఉందా అని ఆయన ప్రశ్నించారు. "1947లో స్వార్థ రాజకీయ కారణాలతో దేశాన్ని విభజించారు. మీరు అనుసరించిన తప్పుడు విధానాల ఫలితమే దేశ విభజన. స్వాతంత్య్రం వచ్చిన 70 ఏళ్ల తరువాత కూడా మీ పాపాలకు 125 కోట్ల మంది శిక్ష అనుభవిస్తున్నారు. వారు బాధపడని రోజంటూ లేదు. కశ్మీర్ ఇప్పటికీ ఓ ఆరని చిచ్చుగా మారడానికి కారకులెవ్వరు? కాంగ్రెస్ కాదా? ఆనాడు సర్దార్ పటేల్ ప్రధాని అయి ఉండుంటే కశ్మీర్ మొత్తం భారత్‌లో అంతర్భాగమై ఉండేది. ప్రజాస్వామ్యం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుణ్యమేనని కాంగ్రెస్ వాదులంటున్నారు. 1947 నుంచి కాదు, 2500 ఏళ్లుగా భారతావనిలో ప్రజాస్వామ్యం వేళ్లూనుకుంది. అది మన సంస్కృతిలో ఓ భాగం. దశాబ్దాల పాటు కాంగ్రెస్ నేతలు ఒకే కుటుంబానికి ఊడిగం చేశారు. విధేయత, అనువంశిక పాలనకు జై కొట్టడం మాత్రమే వారికి తెలుసు. కేరళ, పంజాబ్, తమిళనాడు.. ఇలా ఏ రాష్ట్రం చూసినా కాంగ్రెస్ పాపాలు కనిపిస్తాయి. ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలను మీ ఇష్టానుసారం డిస్మిస్ చేయలేదు? మీరా మాకు ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పేది?" అని తీవ్ర పదజాలంతో చెరిగారు మోదీ.

> మీరు నన్ను విమర్శించండి.. నా పథకాల్ని విమర్శించండి. అంతేగానీ ఓబీసీ బిల్లును, తక్షణ తలాక్ బిల్లును అడ్డుకోకండి. అంతేకాదు, ఆయుష్మాన్ భారత్ అనేది ఓ సమున్నతమైన పథకం. ఏ పార్టీ అధికారంలో ఉన్నా వ్యాధుల నిర్మూలన అనేది ప్రాధాన్యాంశంగా తీసుకోవలసినదే కదా.. అంచేత ఆరోగ్య పథకానికి నిర్మాణాత్మక సలహాలివ్వండి.
>
> - పార్లమెంట్‌లో మోదీ

సీఎంలు జైలుపాలవుతున్నారు..

"పెద్ద పనులు చేయాలంటే పెద్ద హృదయం కావాలి. మేం అవినీతిని, నల్లధనాన్ని రూపుమాపాలనుకున్నాం. అందుకే నోట్ల రద్దు లాంటి నిర్దిష్ట చర్యలు తీసుకున్నాం. ఇలాంటివి ఖాళీగా కూర్చున్న, అక్రమాలకు అలవాటుపడ్డ కొందరికి ఇబ్బంది కలిగిస్తున్నాయని తెలుసు. ఒకప్పుడు ముఖ్యమంత్రులుగా చేసినవారు ఇపుడు జైళ్లలో ఉన్నారు. ఎంతటివారైనా సరే, అవినీతికి పాల్పడితే చర్య తప్పదు. మధ్యతరగతి ప్రజానీకం సులభతర జీవనాన్ని కోరుకుంటున్నారు. అందుకే జీఎస్టీలాంటి చర్యలు తీసుకున్నాం. దీనిని అర్థం చేసుకోలేని కాంగ్రెస్ మా నిర్ణయాలను హేళన చేసింది. అవినీతిపరులు, దళారుల ఏ పనీ లేకుండా ఉంటే కాంగ్రెస్‌కు అసంతృప్తిగానే ఉంటుంది. నిరర్థక ఆస్తుల పాపం కాంగ్రెస్‌దే. నేను అధికారంలోకొచ్చాక ఒక్క ఎన్‌పీఏ కేసూ నమోదుకాలేదు. ఆధార్ కార్డులు తమ చలవే అని కాంగ్రెస్ గొప్పలు పోతోంది. కానీ ఆధార్‌కు తొలిబీజం నాటినది మాజీ ఉపప్రధాని అద్వానీ. 1998 జులై 7న ఆయన పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంలో ఇది ఉంది' అన్నారు మోదీ.

కాంగ్రెస్-ముక్త్ భారత్

"కాంగ్రెస్ పార్టీ చేతుల నుంచి దేశాన్ని విముక్తం చేయాలని మహాత్మా గాంధీ కోరుకున్నారు. బీజేపీ దానినే అనుసరిస్తోంది. 'కాంగ్రెస్-ముక్త్ భారత్' అన్నది నా నినాదం కాదు.. గాంధీజీది. కాంగ్రెస్ ఇప్పటికీ ఆ పాత భారతావనినే కోరుకొంటోంది. ఎమర్జెన్సీ, బోఫోర్స్, అగస్టా లాంటి కుంభకోణాలు, సిక్కులపై దాడులు, హింస.. ఇవే ఆ పార్టీకి కావాలి. మేం మాత్రం నవ భారతాన్ని వాంఛిస్తున్నాం" అని పేర్కొన్నారు.

జెఆర్‌డీ టాటా ఏమన్నారంటే..

"మాజీ రాష్ట్రపతి ఆర్ వెంకట్రామన్ తన స్వీయచరిత్రలో ఏం రాశారు? బోఫోర్స్ స్కాంలో ముడుపులు లేవని తాను భావించలేనని అన్నారు. అంతేకాదు.. వెంకట్రామన్ ఓ సారి ప్రముఖ పారిశ్రామికవేత్త జేఆర్‌డీ టాటాను కలిశారు. "1980 తరువాత కాంగ్రెస్ పార్టీ పారిశ్రామికవేత్తల నుంచి ఎన్నికల విరాళాలు అడగడం ఆపేసింది..ఎందుకంటే రక్షణ ఒప్పందాల నుంచి వచ్చిన కమిషన్లతో ఆ పార్టీ నడుస్తోంది" అని టాటా ఆయనతో అన్నారు. దీన్ని బట్టి తెలుస్తోందేంటి..? ముడుపులనేవి కాంగ్రెస్ సంస్కృతి" అని మోదీ నిశితంగా విమర్శించారు. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందంలో ముడుపులు చేతులు మారాయని, మోదీయే ఈ స్కాం వెనుక ఉన్నారని రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలకు మోదీ పరోక్షంగా ఇలా బదులిచ్చారు.

అంతరిక్షంలో ఆడేద్దామా!


అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రమే(ఐఎస్ఎస్) ఆటస్థలమైంది.. వ్యోమగాములే క్రీడాకారులయ్యారు.. సరదాగా కొంతసేపు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. మొన్నటికి మొన్న తొలి రోదసి సెల్ఫీ దిగి వార్తలకెక్కిన ఐఎస్ఎస్ వ్యోమగాములు తొలిసారిగా నింగిలో బ్యాడ్మింటన్ ఆడి రికార్డు సృష్టించారు. ఐఎస్ఎస్‌లో ఉన్న రష్యా, జపాన్, అమెరికా వ్యోమగాములు ఎంతో ఉత్సాహంగా ఈ క్రీడలో పాలుపంచుకున్నారు.

తలుపులు మూసి విభజించారు

(మొదటి పేజీ తరువాయి)

విభజన చేశారు. నాలుగేళ్ల తర్వాత కూడా ఇంకా ఇన్ని సమస్యలకు కారణమదే" అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఆయన మాట్లాడటం మొదలుపెట్టగానే... 'ఆంధ్రకు న్యాయం చేయాలి. ఏపీకి ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. మోసాలు ఆపాలి. నాటకాలు కట్టిపెట్టాలి' అంటూ కాంగ్రెస్ సభ్యులు పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. ఆగకుండా నినదిస్తూనే ఉన్నారు. దీంతో... 'ఏపీకి అన్యాయం చేసింది ఎవరు? ప్రజాస్వామ్యం గురించి మీరా మాకు పాఠాలు చెప్పేది" అంటూ వ్యూహాత్మకంగా రాష్ట్ర విభజన జరిగిన తీరును, తెలుగు ప్రముఖులకు జరిగిన అవమానాలను గుర్తుచేస్తూ మోదీ భావోద్వేగం పండించారు. ఆంధ్రులను అవమానించిన ఆగ్రహాగ్ని నుంచే తెలుగుదేశం పార్టీ పుట్టిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "రాజీవ్‌గాంధీ హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు.. ఎయిర్‌పోర్టులో ఒక దళిత ముఖ్యమంత్రిని బహిరంగంగా అవమానించారు. ఎన్నికైన ముఖ్యమంత్రి టి.అంజయ్యను అవమానించిన మీరా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడేది. ఆ అవమానాగ్ని నుంచే ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. టి.అంజయ్యకు జరిగిన అవమానం నేపథ్యంలో ఆత్మగౌరవ నినాదంతో ఎన్టీ రామారావు సినిమాలను వదిలిపెట్టి ఆంధ్ర ప్రజలకు సేవ చేసేందుకు ఎన్నికల బరిలో దిగాల్సి వచ్చింది" అన్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ తన సొంత అభ్యర్థినే ఓడించిందని, అదికూడా తెలుగువాడైన నీలం సంజీవరెడ్డికి వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. పీవీ నరసింహారావుకు కాంగ్రెస్ పార్టీ అసలు మర్యాదే ఇవ్వలేదన్నారు. నేటి రాష్ట్ర విభజన నేపథ్యాన్ని ప్రధాని నాటి దేశ విభజనతో పోల్చారు. "మీరు రాజకీయ స్వార్థంతో ఏపీని విభజించారు. అప్పుడు దేశ విభజన చేశారు. 70 ఏళ్ల తర్వాత కూడా దాని ఫలితాన్ని ప్రజలు అనుభవిస్తున్నారు" అని కాంగ్రెస్‌ను విమర్శించారు. టీడీపీ సభ్యులు తీవ్ర గందరగోళం సృష్టించే పరిస్థితి తలెత్తడానికి నాలుగు సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ స్వార్థంతో తీసుకున్న నిర్ణయమే కారణమని మోదీ విమర్శించారు. తాము తెలంగాణ ఏర్పాటుకు మద్దతిచ్చామని... తెలంగాణ అభివృద్ధినీ ఆశిస్తున్నామని తెలిపారు. అయితే, ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం అన్యాయం జరిగిందని మోదీ అంగీకరించారు. టీడీపీ నిరసనల గురించి నేరుగా ప్రస్తావించకుండా... 'నిరసనలు తెలిపే హక్కు ఉంది. కానీ... సభను అడ్డుకునే హక్కు ఏ పార్టీకీ లేదు' అని మోదీ స్పష్టం చేశారు.

యూజీసీ-నెట్‌లో ఇక 2 పేపర్లే!

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఆధ్వర్యంలో జరిగే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) విధానం మారుతోంది. ఇప్పటి వరకు ఈ పరీక్ష మూడు పేపర్లలో నిర్వహిస్తుండగా.. ఇకపై 2 పేపర్లలోనే జరుగనుంది. ఆబ్జెక్టివ్ టైపులో ప్రశ్నలు ఇస్తారు. 2 పేపర్లలోనూ తప్పనిసరి ప్రశ్నలే ఉంటాయి. ఎటువంటి చాయిస్ లేదు. అన్ని ప్రశ్నలకు మార్కులు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు కేటాయించారు. పేపర్-1లో 50 తప్పనిసరి ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 తప్పనిసరి ప్రశ్నలకు 200 మార్కులు ఉంటాయి. పేపర్-1కి గంట, పేపర్-2కి రెండు గంటల కాలవ్యవధి ఉంటుంది. దీర్ఘకాలంగా పేపర్-1 అందరికీ బోధన మరియు పరిశోధనపైన, పేపర్-2, 3 సంబంధిత సబ్జెక్టుల్లో ఉండేది. పేపర్-3ని వ్యాసరూప ప్రశ్నలతో నిర్వహిస్తున్నారు. కానీ నాలుగైదేళ్ల నుంచి పేపర్-3ని కూడా ఆబ్జెక్టివ్ టైపులో నిర్వహిస్తున్నారు. అందువల్ల పేపర్-2, పేపర్-3కి ఒకే సిలబస్‌పై మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో పరీక్ష నిర్వహించవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో నెట్‌ను ఇకపై 3 పేపర్లలో కాకుండా 2 పేపర్లలో మాత్రమే నిర్వహించాలని నిర్ణయించింది. ఇదిలా ఉండగా..జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)కు గతంలో గరిష్ఠ వయో పరిమితి 28 ఏళ్లు ఉండగా.. దాన్ని 30 ఏళ్లకు పెంచారు. ఇలాంటి మార్పులతో యూజీసీ - నెట్‌కు ఈ ఏడాది జూలై 8న జరగనుంది.

ఐఐఎం లఖ్‌నవ్‌లో వందశాతం ప్లేస్‌మెంట్స్

లఖ్‌నవ్, ఫిబ్రవరి 7: వందశాతం ప్లేస్‌మెంట్స్‌తో లఖ్‌నవ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) రికార్డు బద్దలు కొట్టింది. 2016-18 బ్యాచ్ పీజీ విద్యార్థులందరికీ ప్లేస్‌మెంట్స్ లభించడం విశేషం. 445 మంది పీజీ విద్యార్థులు ఉండగా.. 143 మంది రిక్రూటర్ల నుంచి 454 ఆఫర్లు వచ్చాయి. ఆదిత్యబిర్లా గ్రూప్, అమెజాన్, యాక్సెంచర్, సిటీ బ్యాంక్, డెలాయిట్, ఎవరెస్ట్ గ్రూప్, ఫ్లిప్‌కార్ట్, హిందూజా, కేపీఎంజీ, పేటీఎం, ఎస్ బ్యాంక్ వంటి ప్రముఖ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించి 445 మందికి కొలువులు కల్పించాయని ప్లేస్‌మెంట్ విభాగం చైర్మన్ ప్రొఫెసర్ నిశాంత్ ఉప్పల్ వివరించారు.

రష్యా వర్సిటీల్లో భారతీయులకు ఉపకారవేతనాలు

చెన్నై, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): న్యూక్లియర్ టెక్నాలజీ పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందే భారతీయ విద్యార్థులకు రష్యన్ యూనివర్సిటీలు నూటికి నూరు శాతం ఉపకారవేతనాలు అందిస్తాయని చెన్నైలోని ఆ దేశపు రాయబారి ప్రకటించారు. అణ్వాయుధ రంగాల్లో రష్యా-భారత్ మైత్రి త్రిదశ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఈ సదవకాశం కల్పిస్తున్నట్లు దక్షిణ భారత రష్యన్ వైస్ కాన్సుల్ జనరల్ మిఖాయిల్ గోర్బచేవ్ తెలిపారు. అటానిక్ ఫిజిక్స్ పాఠ్యాంశంలో 100 శాతం మార్కులు పొందిన సైన్స్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ ఉపకార వేతనాలు పొందడానికి అర్హులని పేర్కొన్నారు. అంతేకాకుండా, గ్రాడ్యుయేషన్‌లో అత్యుత్తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన అభ్యర్థులకు హాస్టల్ ఫీజులను కూడా పూర్తిగా మినహాయింపు ఇస్తారని తెలిపారు. ఈ ఉపకారవేతనాలను మాస్కోలోని నేషనల్ రీసెర్చ్ న్యూక్లియర్ యూనివర్సిటీ అందజేస్తుందని ఆయన వివరించారు.

రామాయణంలో రేణుక ఎవరు?

ఫక్కుమన్న ఆమె నవ్వుకు తెలివిగా మోదీ కౌంటర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రామాయణంలో కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ఏ పాత్రతో సరిపోతారు? ఇదేం ప్రశ్న అని అనుకుంటున్నారా! ఆమెను ఏ పాత్రతో పోల్చారో స్పష్టత ఇవ్వకుండా ప్రధాని మోదీ విమర్శించారు. బుధవారం రాజ్యసభలో ప్రధాని మాట్లాడుతూ వాజ్‌పేయి హయాంలో ఆధార్ కార్డుకు బీజం పడిందని ఓ సందర్భంలో అన్నారు. అంతే... ఎవరో గట్టిగా నవ్వుతున్న శబ్దం సభలో వినిపించింది. సభలో ఉన్నవారంతా అటువైపే చూశారు. ఘొల్లుమని నవ్వింది కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి. దాంతో ఒక్కసారిగా చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క నిమిషం ప్రసంగాన్ని ఆపమని ప్రధానికి సూచించారు. ప్రధాని ప్రసంగం ఆపగానే "ఏమైంది మీకు? ఇలాంటి ప్రవర్తన సరికాదు" అని వెంకయ్య ఆమెకు హితవు పలికారు. ఈ సందర్భంలో ప్రధాని జోక్యం చేసుకొని "సభాపతీజీ... రేణుకను అడ్డుకోకండి... రామాయణం సీరియల్ తర్వాత అంతటి నవ్వును వినే భాగ్యం మనకు ఈ రోజే దక్కింద"ని ఆమెకు కౌంటర్ ఇచ్చారు. ప్రధాని ప్రసంగం ముగిసిన తర్వాత ఆయన రామాయణంలో ఏ పాత్రతో రేణుకను పోల్చారా అని పార్లమెంటులో ఆసక్తికర చర్చ జరిగింది. దీనికి రేణుక 'ప్రధాని మాటపై నేను స్పందించదల్చుకోలేదు.. ఎందుకంటే ఆయన ఓ మహిళ ఔన్నత్యాన్ని దిగజార్చిన వ్యక్తి' అని వ్యాఖ్యానించారు.

మీరంటే మాకెంతో గౌరవం

వెంకయ్యతో భేటీలో విపక్షాల నేతలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు పట్ల తాము వ్యవహరించిన తీరుపై విపక్షాల నేతలు విచారం వ్యక్తం చేసినట్లు సమాచారం. 'మా చర్యలు వెంకయ్యను బాధించి ఉంటే.. విచారం వ్యక్తం చేస్తున్నామ'ని ఆయా పార్టీల సభాపక్ష నేతలు ముక్తకంఠంతో అన్నట్లు తెలిసింది. బుధవారం ఉదయం వెంకయ్య నేతృత్వంలో జరిగిన సమావేశంలో వారు ఈ వ్యాఖ్యలు చేశారు. గత రెండు రోజుల నుంచి సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేయడంపై వెంకయ్య తీరును విపక్షనేతలు మంగళవారం తప్పుబట్టారు. అంతేకాకుండా, సభను బహిష్కరించి బయటికి వెళ్లి బాహాటంగా తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారంనాటి సమావేశంలో ముందుగా గులాం నబీ ఆజాద్ ఈ అంశాన్ని లేవనెత్తి నిబంధనల ప్రకారం నడుచుకుందామని అన్నట్లు సమాచారం. "నిన్న జరిగింది అక్కడే వదిలేద్దాము. చైర్మన్ పట్ల మాకు అత్యంత గౌరవం, విశ్వాసం ఉంది. ఆయన మనస్సు గాయపడినట్లయితే విచారం వ్యక్తం చేస్తున్నాము" అని విపక్ష నేతలు అన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తర్వాత బడ్జెట్‌పై చర్చకు సభ్యులకు సరిపడా సమయం ఇస్తానని వెంకయ్య హామీ ఇచ్చారు.

తృణమూల్ ఎంపీ ప్రసంగం 'సెన్సార్'

రాజ్యసభ టీవీచానల్‌లో ప్రసారం నిలిపివేత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: పార్లమెంటులో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ చేసిన ప్రసంగం ప్రసారాన్ని ప్రభుత్వానికి చెందిన రాజ్యసభ టీవీ చానల్‌లో నిలిపివేయడంపై ప్రతిపక్షాలు విచారణకు డిమాండ్ చేశాయి. ఓబ్రియన్ బుధవారం ఎగువసభలో ఈ అంశాన్ని లేవనెత్తారు. 'ఈ రోజు ఉదయం నేను ప్రధాని మోదీ, బీజేపీల తీరుపై ప్రసంగించాను. నేనూ ఈ సభలో సభ్యుడినే. మా హక్కులను మీరు పరిరక్షించండి' అని సభాధ్యక్ష స్థానంలో ఉన్న బీజేపీ నేత సత్యనారాయణ జటియాను కోరారు. విచారణ జరిపి, కారణాలు తెలియజేస్తామని జటియా సమాధానమిచ్చారు.

తీర్పు వెనక్కి తీసుకున్న మాల్దీవుల సుప్రీంకోర్టు

మాలె, ఫిబ్రవరి 2: మాల్దీవుల్లో తిరిగి శాంతియుత పరిస్థితులు నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి. అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ రాజకీయ ప్రత్యర్థులను విడుదల చేస్తూ ఇచ్చిన ఆదేశాలను అక్కడి సుప్రీంకోర్టు వెనక్కితీసుకుంది. వారితో పాటు మాజీ అధ్యక్షుడు, యమీన్ రాజకీయ ప్రత్యర్థి అయిన నౌషీద్ - దోషి కాదంటూ ఇచ్చిన తీర్పును కూడా మార్చేయాలని నిర్ణయించుకుంది. "అధ్యక్షుడి ఆందోళన దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు" వెల్లడించింది. ఈ నిర్ణయాన్ని యమీన్ స్వాగతించారు. అయితే ఎమర్జెన్సీని తక్షణం ఎత్తేసే సూచనల్లేవు. తనపై జరిగిన కుట్ర మూలాలను ఛేదిస్తానని యమీన్ చెబుతున్నారు. సుప్రీంకోర్టు తొలుత ఇచ్చిన తీర్పు ఈ చిన్న దీవుల్లో పెను సంక్షోభాన్ని సృష్టించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 8 ఫిబ్రవరి 2018

శ్రీ శక్తి



'సూర్యరశ్మిని శాస్త్రీయంగా ఉపయోగిస్తూ... దుమ్ము, ధూళి దరిచేరనీయకుండా... రసాయనాల జాడ లేకుండా... పోషకాలు వృథాగా పోనీయకుండా ఆహారోత్పత్తులను తయారుచేయడం మా ప్రత్యేకత' అంటారు శ్యామలా దేవి. రాగిమాల్ట్ తయారీతో మొదలై ఇప్పుడు 30కి పైగా ఆహారోత్పత్తులు ఆ జాబితాలోకి వచ్చి చేరాయి. "మిగతా పనులతో పోలిస్తే మేం చేస్తున్న పని భిన్నమైనది. అందుకే మార్కెట్‌లోకి వెల్లువలా కాకుండా నెమ్మది నెమ్మదిగా వస్తున్నాం" అంటారీ ఔత్సాహిక పారిశ్రామికవేత్త. విజయవంతంగా ఆమె నడుపుతున్న 'సన్ ప్లే' సంస్థ గురించి, ఆమె విజయప్రస్థానం గురించి ఆమె మాటల్లోనే...

సూర్యుడే 'బ్రాండ్' అంబాసిడర్!

సోలార్ ఒవెన్, డ్రయ్యర్లు ఉపయోగిస్తూ ఆహారోత్పత్తులు తయారుచేస్తున్న మా ప్రయాణం కాస్త భిన్నంగా మొదలైందనే చెప్పొచ్చు. నా భర్త శ్రీనివాస చక్రవర్తి న్యూక్లియర్ సైంటిస్టు. వాళ్లది ముంబయి కావడంతో పెళ్లి కాగానే అక్కడికి వెళ్లిపోయాం. ఆ తరువాత జర్మనీ, ఇంగ్లాండ్, కెనడాల్లో పదేళ్లు ఉన్నాం. తిరిగి మన దేశానికి వచ్చేశాం. ఇక్కడికొచ్చాక సొంతంగా ఏదైనా చేస్తే బాగుంటుందనే ఆలోచనతో 'సోలార్ ప్రాజెక్టు' మొదలుపెట్టారాయన. సోలార్‌కు సంబంధించి కాన్‌సన్‌ట్రేటర్స్, సోలార్ బాక్స్ కుక్కర్స్, డీహైడ్రేటర్స్, సోలార్ ఒవెన్, డ్రయ్యర్‌ల వంటివి తయారు చేసేవారు. కానీ వాటిని అమ్మడం కష్టమైపోయింది. ఏడాదికి ఒకటో, రెండో అమ్ముడుపోయేవి. ఆదాయం రాకపోగా, ఖర్చు ఎక్కువైపోయింది. సరిగ్గా ఆ సమయంలో నా మదిలో ఒక ఆలోచన వెలిగింది. సోలార్ పరికరాలు ఎలాగూ మన దగ్గర ఉన్నాయి. వాటిని ఉపయోగించి మనమే ఆహారోత్పత్తులు ఎందుకు తయారుచేయకూడదు? అనిపించింది. అలా 2013లో 'సన్‌ప్లే' పేరిట సొంత సంస్థను ప్రారంభించాం.

రాగితో మొదలైంది ...

రాగి మాల్ట్ 'సన్‌ప్లే' నుంచి వచ్చిన మొదటి ప్రొడక్ట్. మొదట్లో అందరికీ శాంపిల్స్ ఇచ్చాం. మంచి స్పందన వచ్చింది. తెలియని వాళ్లు రాగి పిండే కదా ఇందులో తేడా ఏముంది అనేవాళ్లు. అయితే అదెలా తయారవుతుందో అర్థమయ్యేలా వివరించేవాళ్లం. ఐదు నుంచి పది శాతం మినహా మిగతా అందరూ చాలా సానుకూలంగా స్పందించారు. చేత్తో పొట్టు తీసి ప్రాసెసింగ్‌కు చాలా కష్టపడాలి. కష్టానిదేముంది కానీ మా ప్రొడక్ట్ రుచి చూసిన వాళ్లు 'మీ ప్రొడక్ట్‌కి, బయటి ప్రొడక్ట్‌కి తేడా ఉంది' అని చెప్పే మాటలు మాలో ఉత్సాహాన్ని నింపేవి. ఉత్పత్తి బాగుంటే మార్కెట్ రావడం పెద్ద కష్టమేమీ కాదు కదా. అలా క్వాలిటీని బ్రాండ్‌గా చేసుకుని ముందుకెళ్తూ ఇప్పుడు దేశవ్యాప్తంగా పేరుతెచ్చుకున్నాం. సోలార్ పరికరాలు సిద్ధంగా ఉండడం వల్ల ప్రారంభంలో రాగులు కొనేందుకు మాకు అయిన ఖర్చు రెండు మూడు వేల రూపాయలు మాత్రమే. అలా మా స్టార్టప్ రాగి మాల్ట్‌తో మొదలై ఇప్పుడు దాదాపు 30కి పైగా ప్రొడక్ట్‌లు తయారుచేసే దశకు చేరుకుంది. వాటిలో చిరుధాన్యాలతో రవ్వ, జొన్నలతో దొడ్డు, సన్న రవ్వలు, మొలకెత్తిన గోధుమ గింజల రవ్వ, పచ్చి అరటి పిండి, సజ్జ, రాగి, గోధుమ మొలకలతో పిండి, గెనుసుగెడ్డ (చిలగడదుంప) పిండి ఉన్నాయి. స్నాక్స్- రెడీ టు కుక్ ఉత్పత్తుల్లో సూర్యకాంతిలో ప్రాసెస్ చేసిన రాగి మాల్ట్, టోస్ట్ చేసిన పల్లిగింజలు ఉన్నాయి. హెల్త్ సప్లిమెంట్స్‌లో మునగాకు పొడి, గోధుమ గడ్డి పొడి ఉన్నాయి. డీహైడ్రేటెడ్ హెర్బ్స్ - బాదం, మునగాకు



పొడికి చాలా డిమాండ్ ఉంది. మార్కెట్‌లో దొరికే మునగాకు పొడి కాస్త పసుపు రంగులో ఉంటుంది. కానీ మేం తయారు చేసిన పొడికి మాత్రం ఆకుపచ్చటి రంగు పోకుండా అలానే ఉంటుంది. ఇదంతా కూడా సూర్యరశ్మిని సరిగ్గా వినియోగించుకోవడం వల్లనే సాధ్యమవుతుంది.

నాణ్యతే లక్ష్యంగా ...

రాగి, జొన్న, సజ్జ, గోధుమల వంటివన్నీ తెలుగు రాష్ట్రాల్లో, తమిళనాడులో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసే రైతుల నుంచి తెప్పించుకుంటాం. చిరుధాన్యాల్లో దోషాలు పోగొట్టేందుకు వాటిని నానబెట్టి ప్రాసెస్ చేస్తాం. ఇలా చేయడం వల్ల ముఖ్యంగా ఫైటైట్స్ పోతాయి. ప్రాసెస్ చేసిన ఈ గింజలు తింటే పచ్చిజొన్నల్లా, రుచిగా ఉంటాయి. తరువాత వాటిని మొలకెత్తించడం వల్ల విటమిన్లు, ఎంజైమ్స్, ప్రొటీన్లు వృద్ధిచెందుతాయి. మొలకెత్తిన వాటిని మాల్టింగ్ చేస్తాం. ఇలా ఒక పద్ధతి ప్రకారం చేయడం వల్ల తీసుకున్న ఆహారం సులువుగా జీర్ణమవుతుంది. మేం తయారుచేసిన ఉత్పత్తులను ఆర్గానిక్ స్టోర్స్, ఎగ్జిబిషన్లలో పెడుతున్నాం. ప్రతీ వారం కొత్త స్టాక్ తయారుచేయాల్సిందే. స్టాక్ నిల్వ ఉండడం అనేది ఉండదు. ఎప్పుడు తయారుచేసింది అప్పుడే అమ్ముడవుతుంది. వేసవిలో పని చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ పనిలో కష్టమంతా నాది, నా భర్తదే. ఎప్పుడో కాని బయటి వాళ్ల సాయం తీసుకోం. వర్షాకాలం వస్తుందంటే అప్పుడు



చేయాల్సిన పనిని ముందుగానే చేసి పెట్టుకుంటాం. వర్షాకాలంలో మరీ అవసరమనుకుంటే ఎలక్ట్రిక్ డీహైడ్రేటర్స్, ఒవెన్స్ ఉపయోగిస్తాం.

వాటిని దృష్టిలో పెట్టుకుని...

ప్యాకింగ్ విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. ఒక్కో ఉత్పత్తికి ఒక్కో రకమైన ప్యాకింగ్ ఉంటుంది. పదార్థాల తాజాదనం, రంగు, రుచుల్లో తేడా రాకుండా చేయాల్సి ఉంటుంది. ప్యాకెట్ మీద మేము ఇచ్చే సమాచారం కూడా భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు రాగి అంటే ఏమిటి? దానిలో ఏమేం పోషకాలు ఉంటాయి. ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా వాడుతున్నారు వంటి సమాచారాన్ని ఇస్తాం. అలాగే వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుంటాం. ఉదాహరణకు జొన్న రొట్టె చేయడం అందరికీ రాదు. అందుకని సులభంగా తయారుచేసుకోగలిగే జొన్న బియ్యం తయారుచేశాం. లక్ష్యం చేరుకోవడానికి చాలా దూరం ప్రయాణించాలి. ఒక యంత్రంలో పెట్టి బయటకు తీయడం లేదు. ఎంతో కష్టపడి చేస్తున్నాం. అయితే వచ్చే ఫలితం చాలా ఆనందాన్నిస్తోంది. సొంతంగా ఏదైనా చేయాలనుకుంటే ముందు మనమేం చేయాలనే విషయం మీద స్పష్టమైన అవగాహన ఉండాలి. పెట్టుబడి గురించి తరువాత ఆలోచించాలి. అలా ఆలోచించి మాకున్న పరిజ్ఞానం, వనరులను దృష్టిలో పెట్టుకుని పయనిస్తున్నాం. నలుగురికీ మెరుగైన ఆహారోత్పత్తులను అందుబాటు ధరలో అందించగలుగుతున్నాం.



మాది కృష్ణాజిల్లా ముదునూరు గ్రామం. పదోతరగతి వరకు అక్కడే చదువుకున్నా. ఆ తరువాత విజయవాడ వచ్చాం. ఎం.కామ్ చదువుకున్నాను. ఆ తర్వాత పెళ్లయ్యింది. మొదట్లో ఇంట్లో పనికే టైం సరిపోయేది. దాంతో వేరే పని చేయాలన్న ఆలోచన ఉండేది కాదు. ఇలా నాదంటూ సొంత పని చేస్తానని అనుకోలేదు. మాకిద్దరు అబ్బాయిలు. పెద్దబ్బాయి ఇంజనీరింగ్, చిన్నవాడు పదో తరగతి చదువుతున్నారు. మా అబ్బాయిలిద్దరికీ 'కోల్డ్ ప్లే' మ్యూజిక్ బ్యాండ్ అంటే చాలా ఇష్టం. సూర్యుడితో పనిచేస్తున్నాం కాబట్టి 'సన్' వచ్చేలా పేరు పెడితే బాగుంటుందని నాకనిపించింది. అలా మా పిల్లల ఇష్టం, నా ఇష్టం కలిసి సన్‌కి 'కోల్డ్‌ప్లే'లో ప్లే కలిపి 'సన్‌ప్లే' పేరును ఖరారు చేశాం.



ఆ ఇబ్బందులే ఉండవు!

సూర్యరశ్మిలో డ్రై చేస్తున్నప్పుడు 40 నిమిషాలకు ఒకసారి సూర్య కిరణాలకు తగ్గట్టుగా పదార్థాలను సరిచేసుకుంటుండాలి. పల్లీలను డ్రై చేయాలంటే మూడు గంటలు, బియ్యం, పప్పులు అయితే దాదాపు రెండున్నర గంటల సమయం పడుతుంది. పచ్చి అరటి డ్రయింగ్‌కు ఒక రోజు పడుతుంది. ఆకుకూరల్లో కొన్ని త్వరగా డ్రై అవుతాయి. కొన్నింటికి మాత్రం టైం పడుతుంది. అలాగే గింజలు కూడా... అవి ఉన్న సైజ్, మందం బట్టి డ్రై అయ్యే సమయం పెరుగుతుంది. ఆకు కూరలకు ప్రీ ప్రాసెసింగ్ ఉంటుంది. రసాయనాలు వాడకుండా వాటికి ట్రీట్‌మెంట్ ఇవ్వాలి. ఆ తరువాత సోలార్ డ్రయ్యర్‌లో ఉంచాలి. నూనె వేసి తిరగమోత వేయడం ఒక్కటే కుదరదు కానీ బేకింగ్, స్టీమింగ్, బాయిలింగ్ అన్నీ చేసేయొచ్చు సోలార్ పరికరాల్లో. మామూలుగా మనం ఎండలో ఏదైనా ఆరపెడితే దుమ్ము పడుతుంది, పక్షులు రెట్టలు వేస్తాయన్న బాధ ఉంటుంది. వీటిలో అయితే ఆ ఇబ్బందులేమీ ఉండవు.



• కిరణ్మయి

ఫోటోలు: రామినేని రాజ్‌కుమార్

పేరెంటచ్

పిల్లలు ఫంక్షన్‌కు వెళితే...

పార్టీలూ, ఫంక్షన్లు పిల్లలకు వినోదాన్నిస్తాయనడంలో సందేహం లేదు, కానీ, ఒక పద్ధతిగా, పకడ్బందీగా ఏర్పాటు చేయని పార్టీలు ఒక్కోసారి అపశృతికీ, విపత్తుకూ దారి తీసే ప్రమాదం కూడా ఉంది. ముఖ్యంగా పెద్దవాళ్ల పర్యవేక్షణలో జర గని పార్టీలు పెడమార్గం పట్టే అవకాశం కూడా ఉంది. అందుకే ఈ విషయంలో తల్లిదండ్రులు కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

- అన్నింటికన్నా ముందు అసలు పార్టీ లొకేషన్ ఎక్కడో స్పష్టంగా తెలుసుకోవాలి. దానికి తోడు ఆ ఫంక్షన్ హాల్ లేదా ఆ లొకేషన్ ఫోన్ నంబర్ తెలుసుకోవాలి. ఏ కారణంగానైనా హఠాత్తుగా లొకేషన్ మారితే... అడ్రస్, దాని ఫోన్ నంబర్ వెంటనే మెసేజ్ పెట్టమని పిల్లలకు ముందే చెప్పాలి.
- పార్టీ ఇస్తున్న తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆ సందర్భమేమిటో తెలుసుకోవాలి. అదే సమయంలో అవసరమైతే మా సహకారం అందిస్తామనే భరోసా వారికి ఇవ్వాలి. ఆ పార్టీ జరుగుతున్న లొకేషన్‌లో నిర్వాహకులైన తల్లిదండ్రులు (హోస్టు) కచ్చితంగా ఉండేలా చూడాలి. మద్యం, మాదక ద్రవ్యాల వంటి వాటికి ఎంత మాత్రం అనుమతించకూడదు.
- పార్టీ అయిపోయాక పిల్లల్ని సురక్షితంగా ఇంటికి చేరవేసే స్నేహితులో, బంధువులో, డ్రైవరో ఉండేలా చూడాలి. అయితే ఆ డ్రైవర్ మద్యం సేవించి ఉండకూడదు. ఎవరి ఒత్తిడికో లొంగి కారును ఎక్కువ వేగంగా నడిపే పరిస్థితి లేకుండా జాగ్రత్త పడాలి.
- ఒకవేళ ఫంక్షన్ అయిపోయాక సదరు ఫ్రెండ్ ఇంట్లోనే ఉంటానంటే ఆ వివరాల్ని ఆ అబ్బాయి తల్లిదండ్రులనుంచి తెలుసు



కోవాలి. అదే నిజమైతే మరుసటి రోజు ఉదయాన్నే ఇంటికి వచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు ఉండేలా చూడాలి. ఒక వేళ ఫంక్షన్ రోజున తల్లిదండ్రులు లోకల్‌గా లేకపోతే, మరెవరినైనా పర్యవేక్షణలో ఉంచాలి. పిల్లలు ఒక్కోసారి తల్లిదండ్రులు స్థానికంగా లేనప్పుడే ఫంక్షన్లు ఏర్పాటు చేసుకుంటారు. ఒకవేళ అదే జరిగితే మరోసారి అలా జరగడానికి వీళ్లేదని హెచ్చరించాలి.
- క్లాస్‌మేట్లే కాకుండా స్కూల్‌మేట్స్‌ను కూడా ఫంక్షన్‌కు ఆహ్వానించవచ్చు. అలాగని ప్రతి ఫంక్షన్‌కూ హాజరవ్వాలనుకుంటే వారానికి ఒక రోజు వాటితోనే సరిపోతుంది. అందుకే అతి ముఖ్యమైన వాటికే హాజరవ్వాలని పిల్లలకు చెబుతూ ఉండాలి.

బ్యూటీ కేర్

వారెవ్వా... వాల్‌నట్స్



చర్మ సంరక్షణకు వాల్‌నట్స్ అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి చర్మగ్రంథులను శుభ్రం చేస్తాయి. వాల్‌నట్స్‌లో పొటాషియం, ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని మృదువుగా ఉంచడమేగాక, సాగే గుణాన్ని తగ్గిస్తాయి. అంతేకాదు చర్మం ముడతలు పడకుండా మరింత యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. వాల్‌నట్స్‌ను తినడమే కాకుండా, వాటిని తేనెతో కలిపి ఫేస్‌ప్యాక్ కూడా తయారుచేసుకోవచ్చు.

నగధగ



నగల 'దశావతారాలు'

పూర్తి బంగారంతో తయారైన నగల ఆకర్షణ ఎంతో ప్రత్యేకం! పెళ్లిళ్లలాంటి శుభకార్యాల్లో బంగారు నగల ధగధగలే వేడకకు నిండుదనాన్ని తెచ్చి పెడతాయి. మరి అన్నింట్లోకి పెళ్లి కూతురు ధరించే నగలు మరింత ప్రత్యేకంగా కనిపించాలంటే 'దశావతారం' ఆభరణాలు ధరించాల్సిందే! గుళ్లో కొలువై ఉండే దేవుళ్లందరూ నగల్లో ఒదిగిపోవడం వీటి ప్రత్యేకత.

సంప్రదాయ నగలకు కాలం చెల్లదు. అయినా వాటిలోనూ కొత్త పోకడలు వస్తూనే ఉంటాయి. తాజాగా 'దశావతారం' నగలు అతివల మనసులను దోచుకుంటున్నాయి. దేవాలయాలు, దేవుళ్లను స్ఫూర్తిగా తీసుకుని తయారవుతున్న ఈ రకం నగలు నక్షి డిజైన్లతో చూడముచ్చటగా ఉంటున్నాయి. వాటిలో 'దశావతారం' నెక్లెస్, 'కృష్ణలీల' చోకర్లకు ఆదరణ, ఆకర్షణ ఎక్కువ. ఈ రకం వడ్డాణాలు తక్కువేం కాదు. నక్షి చేయటానికి కావలసినంత చోటుండటంతో కళ్లు చెదిరిపోయే డిజైన్లను వాటిపై సృష్టిస్తున్నారు. అయితే ఈ నగలు కొనేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

తరుగు ఎక్కువే!: దశావతారం నగల తయారీ ఎంతో క్లిష్టమైనది. కాబట్టి తయాలో అనుసరించే నక్షినిబట్టి తరుగు సాధారణ నగలకు రెట్టింపు ఉంటుంది. ఈ నగలు కొంటున్నప్పుడు తరుగు గురించి తెలిసి వెనకడుగు వేస్తాం! కానీ పెళ్లి కోసం ఒకేసారి కొనే నగలు కాబట్టి, డిజైన్ నచ్చితే తరుగును



పట్టించుకోకూడదు.

జాతి రాళ్ల జాడలు: దశావతారం నగల్లో రాళ్లు పొదిగినవి కూడా ఉంటాయి. అయితే వాటి ధర, రకం, పొదిగిన తీరును గమనించాలి. బంగారంతోపాటు పొదిగిన రాళ్లకు ఎంత ధర జోడించి అమ్ముతున్నారో వివరంగా అడిగి తెలుసుకోవాలి. వాటి మెరుగు ఎలా ఉంది? రాళ్లను పట్టి ఉంచే కొక్కేలు, లింకులు బలంగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి. వాడకంలో దెబ్బతింటే తిరిగి సరి చేయించుకునే వీలుందో లేదో నగ కొనేటప్పుడే అడిగి తెలుసుకోవాలి.

వడ్డాణాల్లో వయ్యారాలు: 200 నుంచి 230 గ్రాముల్లో తయారయ్యే దశావతారం వడ్డాణం



ప్రత్యేకించి పెళ్లి కూతుళ్ల కోసమే! వీటిలో కుందన్, అన్‌కట్, డైమండ్ రకాలుంటాయి. పూర్తి బంగారంతో తయారయినవైతే 150 గ్రాముల్లో తయారవుతాయి. వీటికి పెండెంట్, జూకాలు తగిలించుకుని లేదా విడిగా కూడా ధరించే వీలుంటుంది. ఆయా చీరలకు తగ్గట్టుగా, భారీగా లేదా సింపుల్‌గా కనిపించే వీలు ఈ రకం వడ్డాణాల్లో ఉంటుంది.



మంజులా రావు,
మంజుల జ్యువెల్స్
9493977847

బీ కేర్‌ఫుల్

ప్యాకెట్ ఫుడ్స్ తింటున్నారా?

చిప్స్, చాక్లెట్స్ అంటే చిన్నపిల్లలకే కాదు, అందరికీ ఇష్టమే. ప్యాకెట్లతో లభ్యమయ్యే వీటిని టేస్ట్ బాగుంటుందని తెగ తింటూ ఉంటారు. బిర్యానీ, ఫ్రైడ్‌రైస్, పిజ్జా, బర్గర్, మిల్క్ షేక్స్ ఇలా ఏవైనా కావచ్చు. వీటిలో అసలు వాటికి అంత టేస్ట్ ఎందుకు వస్తుందనేగా మీ సందేహం? దానికి కారణం ఎమ్మెస్జీ. అంటే మోనోసోడియం గ్లటమేట్. అది తీపి వాటికి



కావచ్చు, లేదా ఉప్పు కావచ్చు. ప్యాక్డ్ ఫుడ్ ఐటమ్స్‌లో వీటిని విరివిరిగా వాడుతూ ఉంటారు. ఎమ్మెస్జీకి ఆకలి పెంచే స్వభావం ఉంటుంది. ప్యాక్డ్ ఫుడ్ ఐటమ్స్‌లో ఎమ్మెస్జీ అధికంగా ఉంటోంది. వీటిని తరచూ తినడం అలవాటైతే భవిష్యత్తులో ఊబకాయం వంటి సమస్యలు ఎదురు కావచ్చని న్యూట్రిషనిస్టులు హెచ్చరిస్తున్నారు.

ఎకో టూరిజం

దేశంలో ఇప్పుడిప్పుడే పర్యావరణ స్పృహ పెరుగుతోంది. పర్యాటకులు కూడా కాలుష్యానికి దూరంగా, ప్రకృతి ఒడిలో సేదతీరాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో, సందర్శకులకు దివ్యమైన అనుభూతిని అందించే జీవ వైవిధ్యానికి మన దేశంలో కొదవ లేదు. పచ్చటి చెట్లు, పర్వతాలు, ఎడారులు, గుహలు, వన్యప్రాణులు... కాస్త దృష్టి పెట్టాలే కాని అద్భుతాలెన్నో మన చుట్టూ కనిపిస్తాయి. అలాంటి కొన్ని గమ్యాలు ఇవిగో...



కాలుష్యానికి దూరంగా... ప్రకృతికి దగ్గరగా...!

మావల్యానాంగ్



తెన్మల (కేరళ)



మాథేరాన్



కూర్గ్ (కొడగు)





ట్రై చేయండి

అంతా ఆహ్లాదమే!

రకరకాల ప్రదేశాలు చుట్టేయాలన్న కోరిక చాలా మందికి ఉంటుంది. కానీ అక్కడ వాతావరణానికి కొంత మంది అడ్జెస్ట్ కాలేరు. ముఖ్యమైన కారణం అక్కడి పరిసరాలు. అక్కడి కృత్రిమ వాతావరణం! కారులోకి ఎక్కారంటే కొంత మందికి ఏసీల వాసన పడదు. త్వరగా వారు అనారోగ్యానికి గురవుతారు. ఇక హోటల్ గదుల్లో వాడే రూమ్ ఫ్రెషనర్‌ల పరిస్థితీ ఇంతే. ఇక విమానంలో ప్రయాణించే వారికి జెట్‌లాగ్ వల్ల అలసట గురి కావడం సహజం. ... ఇందులో సహజంగా తయారుచేసిన నూనెల వల్ల మీ చుట్టూ ఉండే గాలి ఆహ్లాదంగా మారుతుంది. ఈ నూనెలు ఏ మాత్రం అనారోగ్యం కలిగించేవి కావు. ఈ కిట్ ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటుంది.

కర్నాటక- గోవా టూర్

భారత్ దర్శన్ యాత్ర పేరిట ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు ఐఆర్‌సిటిసి ప్రత్యేక రైళ్ళు నడుపుతోంది. ఈ నెలలో ప్రధానంగా కర్నాటకలోని వివిధ ప్రదేశాల్లో, గోవాలో ఈ యాత్ర సాగుతుంది. వివరాలివిగో.

సమాచారం

ఎప్పుడు: ఈ నెల పన్నెండు నుంచి ఇరవై వరకూ

ఎక్కడినుంచి?: విజయవాడలో బయలుదేరుతుంది. తెలుగు రాష్ట్రాల్లోని ఖమ్మం, వరంగల్, కాచిగూడ, మహబూబ్‌నగర్, కర్నూలు, గుంతకల్లు మీదుగా సాగుతుంది.

సందర్శించే ప్రదేశాలు: హంపి, గోవా, గోకర్ణం, మురుడేశ్వర్, ...

నవ్య సకల

డాక్యుమెంటరీ సీడీ ఆవిష్కరిస్తున్న తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం, రామ్మోహన్ నాయుడు, దర్శకుడు నర్సింగరావు, పైడి జైరాజ్ మనుమడు రాజన్ షాహి, కుమార్తె దీపా షాహి, విజయేంద్ర ప్రసాద్, శ్రీలేఖ, రవి, పొన్నం రవీందర్, మామిడి హరికృష్ణ తదితరులు



మనకు గర్వకారకుడు పైడి జైరాజ్!

- సినీ దిగ్గజం పైడి జైరాజ్‌పై డాక్యుమెంటరీ ఆవిష్కరణ, ప్రదర్శన
- హాజరైన కుమార్తె దీపా షాహి, మనవడు రాజన్ షాహి

- దర్శకుడు బి. నర్సింగరావు

కరీంనగర్‌లో పుట్టి, హిందీ చిత్రసీమకు వెళ్ళి, బొంబాయిలో ఒక వెలుగు వెలిగిన తెలుగు బిడ్డ స్వర్గీయ పైడి జైరాజ్ యావత్ తెలంగాణకే గర్వకారణమని ప్రముఖ దర్శకుడు బి. నర్సింగరావు అన్నారు. మూకీల కాలంలో మొదలుపెట్టి టాకీల నుంచి బ్లాక్ వైట్, కలర్ సినిమాల దాకా ఏడు దశాబ్దాల పాటు నిర్విరామంగా హిందీ తదితర ఉత్తరాది భాషా సినిమాల్లో నటించిన ఏకైక తెలుగు నటుడు జైరాజ్ అని ఆయన ...

డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి పైడి జైరాజ్ కుమార్తె దీపా షాహి, మనువడు రాజన్ షాహి, బి. నర్సింగరావులతో పాటు ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం, ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్ర ప్రసాద్, సంగీత దర్శకురాలు ఎం.ఎం.శ్రీలేఖ, సీనియర్ పాత్రికేయుడు పల్లె రవి, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, వారాల ఆనంద్, పి. రామ్మోహన్ నాయుడు తదితరులు హాజరై, డాక్యుమెంటరీ సీడీని ఆవిష్కరించారు. ఎన్నో నెలలు శ్రమించి, జైరాజ్ కుటుంబ సభ్యులతో పాటు ...

జైరాజ్ కర్మయోగి

- రాజన్ షాహి (పైడి జైరాజ్ మనుమడు)



ఈ ప్రేమతో ఆనందంగా ఉంది

- దీపా షాహి (పైడి జైరాజ్ కుమార్తె)

కౌన్సెలింగ్

ఈ శబ్దాలంటే నాకు ఎందుకింత భయం



... గానీ, జంతువులను గానీ చూసినప్పుడు, లేదా కొన్ని రకాల శబ్దాలకూ, ప్రవాహానికీ దగ్గరగా వెళ్లినప్పుడు కూడా కొందరిలో భయం, ఆందోళనలు మొదలవుతాయి. భయానక సంఘటనలకే కాదు, వాటి జ్ఞాపకాలతో కూడా వీరు వణికిపోతారు. తమకు భయం కలిగించేవి ఎక్కడ ...

... తప్పకుండా తగ్గుతుంది.

డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చింతపంటి, కన్సల్టెంట్ సైకాలజిస్టు
ట్రాక్విల్ క్లినిక్, హైదరాబాద్



ట్రావెల్ యాప్

క్లిక్ చేస్తే చాలు!

ఏథెన్స్‌కు ఫిదా!

‘సఖి’ సినిమాతో తెలుగువారికి సుపరిచితుడైన హీరో మాధవన్. తమిళంతోపాటు హిందీలోనూ విలక్షణ చిత్రాల నటుడిగా ఖ్యాతి పొందిన అతను రెండేళ్ళ కిందట విడుదలైన ‘సాలా ఖడూస్’ హిందీ చిత్రం, కిందటేడాది ‘విక్రమ్ వేదా’ తమిళ సినిమాలతో మళ్ళీ వార్తల్లో నిలిచాడు. తాజాగా ‘బ్రీత్’ అనే క్రైమ్ వెబ్ సిరీస్‌తో బిజీగా ఉన్నాడు. ‘సవ్యసాచి’తో టాలీవుడ్‌లో పునరాగమనం చేస్తున్నాడు. ‘పర్యటనలంటే ఎంతో ఇష్టం’ అంటున్న మాధవన్ మనసు దోచిన విహార గమ్యాలు

నచ్చిన ప్రదేశాలు: గ్రీస్ దేశాన్ని బాగా ఎంజాయ్ చేస్తాను. ముఖ్యంగా ఏథెన్స్ అంటే బాగా ఇష్టం. అలాగే మధ్యధరా ప్రాంతంలోని దీవుల్లో ప్రయాణం గొప్ప అనుభవం. అది జ్ఞాపకాల్లో నిలిచిపోయే అందమైన చోటు.

మరచిపోలేని జ్ఞాపకం: కెనడాలోని పర్వత ...

... ఆడుతున్నాం. నా ‘గోల్ఫ్ కార్ట్’ (గోల్ఫ్ సరంజామా పెట్టుకొనే బండి) మీద ఒక తాచు పాము కనిపించింది. దాన్ని ఎలా తరిమెయ్యాలో అర్థం కాలేదు. అన్ని వదిలేసి వెనక్కి వచ్చేశాం. అది తలుచుకుంటే ఇప్పటికీ భయం వేస్తుంది.

చిన్న సలహా: టూర్లకు వెళ్ళేటప్పుడు ...

స్టార్ వెకేషన్



మీకు తెలుసా?



అద్భుత వనం!

ప్రపంచంలో అతి పెద్ద పూల తోట ఎక్కడుందో తెలుసా? దుబాయ్‌లో. దానిపేరు మిరాకిల్ గార్డెన్. ఎడారి నేల మీద దీన్ని నిర్మించారు. ప్రపంచంలో సహజమైన పుష్పాలతో నిండిన అతి పెద్ద తోటగా ఖ్యాతి పొంది, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న ఈ గార్డెన్ 42 వేల చదరపు మీటర్లలో విస్తరించి ఉంది. దాదాపు ఆరుకోట్ల పువ్వులు ఈ తోటకు ప్రధాన ఆకర్షణ. పువ్వులతో తీర్చి దిద్దిన ఆకృతుల్ని సీజన్‌ను బట్టి మార్చేస్తూ ఉంటారు. దీంతో ప్రతిసారీ సందర్శకులకు ఒక కొత్త అనుభూతి కలుగుతూ ఉంటుంది. 2013 ఫిబ్రవరి 14న, వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రారంభమైన ఈ తోటను ఏడాదికి పదిహేను లక్షలమంది వరకూ సందర్శిస్తూ ఉంటారు.

వహ్... తాజ్!

ప్రపంచ అద్భుతాల్లో ఒకటైన తాజ్‌మహల్‌కు ప్రతి సంవత్సరం అరుదెంచే ఘనమైన పర్వం తాజ్ మహోత్సవ్. ఒక పక్క పాలరాతి తాజ్ సౌందర్యం, మరోవైపు మిరుమిట్లు గొలిపే వివిధ రంగాల కళాకారుల కౌశలం, నైపుణ్యం. సందర్శించిన ప్రతి ఒక్కరికీ వారి అభిరుచికి తగినవి అందించే ఈ పది రోజుల ఉత్సవం... సందర్శకులకు చిరకాలం గుర్తుండే అనుభూతుల సమ్మేళనం.

తాజ్ మహోత్సవ్

ఎక్కడ?: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలోని తాజ్ మహల్ దగ్గర

ఎప్పుడు?: ఈనెల 18 నుంచి 27 వరకూ

ట్రావెల్ గైడ్



మీకు మీరే డాక్టర్

మందార మహిమ

- నెల రోజుల పాటు రోజూ మూడు పూటలా మందార పూలను తలపై రుద్దుతూ ఉంటే పేను కొరుకుడు సమస్య తొలగిపోతుంది.
- మందార చెట్టు వేరును నూరి, నువ్వుల నూనె కలిపి సేవిస్తే, స్త్రీలలోని అధిక రక్తస్రావ సమస్య తొలగిపోతుంది. లేదా మూడు పూలను కొద్దిగా నేతిలో వేయించి తీసుకున్నా రక్తస్రావం తగ్గుతుంది.
- పూల రసానికి సమానంగా చక్కెర కలిపి పానకంలా వండి, మూడు స్పూన్‌ల చొప్పున రోజుకు మూడు సార్లు తాగితే మూత్ర విసర్జనలో ఇబ్బంది తొలగిపోతుంది. , మంట, చురుకు తగ్గిపోతాయి.
- పరగడుపున, రోజూ నాలుగు పూల చొప్పున 2 ఏళ్ల పాటు నమిలి మింగుతూ ఉంటే తెల్ల మచ్చలు తగ్గుతాయి.
- మందార ఆకులకు సమానంగా నువ్వుల నూనె కలిపి తైలం తయారు చేసుకుని తలకు రాస్తూ ఉంటే చుండ్రు సమస్య ఉండదు.
- ఒక స్పూను ఎండించిన పూలచూర్ణాన్ని పాలల్లో కలిపి రెండు పూటలా తీసుకుంటే బలహీనత తొలగి రక్తపుష్టి కలుగుతుంది.
- ఆకుల కషాయంతో సిఫిలిస్ పుండ్లను కడుగుతూ ఉంటే క్రమంగా అవి మానిపోతాయి.



డైలీ సుడోకు - 100

	3			6				
8			7		2	6		
	9	5					7	
9		4			1	8		
		8	6			3		9
	2					4	8	
		6	4		5			7
				8			1	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 99 సమాధానం

[illegible]


ఎన్టీఆర్

ఫాల్గుణంలోనా... చైత్ర మాసంలోనా?

హీరో ఎన్టీఆర్ లుక్కు... దర్శకుడు త్రివిక్రమ్ స్క్రిప్టు... నిర్మాత రాధాకృష్ణ సంతకాలతో చెక్ బుక్కు... సిద్ధంగా ఉన్నాయ్! వచ్చే నెలలో చిత్రీకరణ ప్రారంభించడమే తరువాయి! ఎన్టీఆర్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మించనున్న చిత్రానికి మూడు నెలల క్రితం అక్టోబర్‌లో పూజ చేసిన సంగతి తెలిసిందే. వచ్చే నెల మార్చిలో చిత్రీకరణ ప్రారంభించడానికి చిత్రబృందం సిద్ధమవుతోంది. తెలుగు మాసాల ప్రకారం... మార్చి 17 వరకూ ఫాల్గుణము. 18న ఉగాదితో చైత్ర మాసం మొదలవుతుంది. మరి, త్రివిక్రమ్ ఫాల్గుణ మాసంలో చిత్రీకరణ ప్రారంభిస్తారో? చైత్ర మాసం ప్రారంభిస్తారో? చూడాలి. ఉగాది రోజున అయితే కొత్త తెలుగు సంవత్సరాది, మంచి ముహూర్తం కూడానూ! ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరికొత్త లుక్‌లో, స్లిమ్‌గా కనిపించనున్నారు. అందుకోసం కొన్ని నెలలుగా విదేశీ ట్రయినర్ పర్యవేక్షణలో వర్కవుట్స్ చేస్తున్నారు. ఇక, ఎన్టీఆర్ సరసన కథానాయికగా ఎవరు నటించనున్నారు? అనేది చిత్రబృందం ఇంకా వెల్లడించలేదు. ప్రస్తుతానికి అనూ ఇమ్మాన్యుయేల్, పూజా హెగ్డే, శ్రద్ధా కపూర్ పేర్లు వినిపిస్తున్నాయి.

'సింగారాల' స్వరాల.. 'అయ్యాసామి'!



ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం - కె.జె.ఏసుదాస్..! వీరిద్దరి పేర్లు వింటేనే చాలు... సంగీత ప్రియుల హృదయాల్లో పండగ వాతావరణం సందడి చేస్తుంది. అలాంటిది ఇద్దరూ కలిసి ఒకే పాట కోసం గొంతు శ్రుతిచేసుకుంటే..! ఇంకేముందీ.. అటు దీపావళి.. ఇటు సంక్రాంతి కలిసి ఒకేసారి వచ్చినట్టే మరి. అప్పుడెప్పుడో 27 ఏళ్ల క్రితం 'దళపతి' చిత్రంలో 'సింగారాల..' పాటను పాడిన ఈ గానగంధర్వులు ఇరువురు కలిసి తాజాగా 'అయ్యా సామి' అనే పాటను ఆలపించారు. ఈ భూమి ఒకటే, ఆ నింగి ఒకటే... ప్రకృతికి జాతిమత భేదం లేదని, సమానత్వాన్ని, ఆయా ప్రాంతాల సంస్కృతులను చాటి చెప్పే పాట ఇది. ఇటు మెరీనా, అటు మలబారు.. ఇరు రాష్ట్రాల సాంప్రదాయాలకు విజువల్స్ పరంగానూ ప్రాధాన్యతనిచ్చారు. శ్వేతవస్త్రధారణతో కె.జె.ఏసుదాస్, కలర్‌ఫుల్ షర్ట్‌తో ఎస్.పి.బి... ఇద్దరూ మైకుల ముందు హుషారుగా ఆలపించిన దృశ్యాలను కూడా ఇందులో జతపరిచారు. పాటలో తమిళనాడుకు చెందిన రజనీకాంత్, కమల్ బొమ్మలు, కేరళకు చెందిన మోహన్‌లాల్, మమ్ముట్టు బొమ్మలు కూడా కనిపిస్తున్నాయి. ఇంతకీ అందరి దృష్టిని ఇంతగా ఆకట్టుకుంటోన్న ఈ 'అయ్యాసామి' పాట తమిళ్, మలయాళంలో తెరకెక్కే 'కినర్ - కేణి' అనే సినిమాలోనిది. ఈ చిత్రంలో జయప్రద, రేవతి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జయప్రద గృహిణిగా, రేవతి తిరునెల్వేలి జిల్లా కలెక్టర్‌గా నటించారు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. కేరళ - తమిళనాడు సరిహద్దుల్లోని నీటి సమస్య నేపథ్యంలో నిషాద్ తెరకెక్కిస్తున్నారు.

అయ్యో... నా పెళ్లి కాదు!

\- శ్రియ



ప్రేమలో పడిందన్నప్పుడూ.... ఎవరో క్రికెటర్‌తో డేటింగ్ చేస్తుందన్నప్పుడూ... శ్రియ స్పందించలేదు. ఈసారి లవ్వు, డేటింగు దాటి ఏకంగా పెళ్లని వార్తలు వచ్చాయి. 'ఎవరో రష్యన్ యువకుడితో ఎప్పట్నుంచో శ్రియ ప్రేమలో ఉంది. ఇప్పుడు రష్యాలోనే ఉంది. కాబోయే అత్త మామలను కనవడానికి వెళ్లింది. ఇండియాకు తిరిగి రాగానే త్వరలో రాజస్థాన్‌లో ఏడడుగులు వేయనుంద'ని శ్రియ సన్నిహితుల నుంచి లీకులు వచ్చాయి. దాంతో శ్రియతో పాటు ఆమె తల్లి కూడా స్పందించక తప్పలేదు. "అయ్యో... అది నా పెళ్లి కాదు. నా స్నేహితురాలి పెళ్లి. నేను పెళ్లి చేసుకోవడం లేదు. నా పెళ్లని వచ్చిన వార్తలన్నీ అబద్ధమే" అని శ్రియ పేర్కొన్నారు. "మార్చిలో మా బంధువుల పెళ్లితో పాటు శ్రియ స్నేహితురాలి పెళ్లీ జరగనుంది. అందుకని, డిజైనర్ దుస్తులు, నగలు కావాలని ఆర్డర్ ఇచ్చింది. అవన్నీ మా అమ్మాయి పెళ్లి కోసమేనని అనుకున్నట్టున్నారు. అందువల్లే, ఈ వార్తలు వచ్చినట్టున్నాయి" అని శ్రియ తల్లి నీర్జా తెలిపారు. అదండీ సంగతి! ఇప్పట్లో శ్రియ పెళ్లి లేనట్లే!



సినిమా అంటే టెన్షన్.. బాధ్యత!

\- వి.వి.వినాయక్

"పెద్ద హీరోతో సినిమా చేస్తున్నామా? చిన్న హీరోతో చేస్తున్నామా? అనే టెన్షన్ నాలో ఎప్పుడూ ఉండదు. నా దృష్టిలో సినిమా అంటేనే టెన్షన్. అది ఒక పెద్ద బాధ్యత. సినిమా షూటింగ్‌లో ఉండగానే హిట్టా, ఫ్లాపా అని ఎవరూ చెప్పలేరు. ఒకవేళ ఎవరైనా చెప్పగలమని అంటే వాళ్లు నా దృష్టిలో బ్రహ్మలే. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ తాము పనిచేస్తున్న సినిమా హిట్ కావాలనే కాంక్ష బలంగా ఉంటుంది" అని దర్శకుడు వి.వి.వినాయక్ అన్నారు. సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా సి.కల్యాణ్ దర్శకత్వంలో రూపొందిన 'ఇంటిలిజెంట్' చిత్రానికి వినాయక్ దర్శకత్వం వహించారు. శుక్రవారం విడుదల కానున్న ఈ సినిమా గురించి వినాయక్ మాట్లాడుతూ "మంచి కామెడీ, యాక్షన్, మైండ్ గేమ్ ఉన్న చిత్రమిది. తనను చేరదీసిన కుటుంబానికి అన్యాయం జరిగినప్పుడు ఓ యువకుడు ఎలా స్పందించాడనేది ఈ చిత్ర కథ. తమన్ మంచి సంగీతాన్నిచ్చారు. మా హీరో, హీరోయిన్ల చేత జానీ, శేఖర్ మాస్టర్ బాగా స్టెప్పులు వేయించారు. చిరంజీవిగారు స్టెప్పులు వేసిన 'చమ్మక్కు చమ్మక్కు' పాటంటే నాకు చాలా ఇష్టం. అందుకే ఈ సినిమాలో రీమిక్స్ చేశాం. మా నిర్మాత సి.కల్యాణ్‌గారు ఇళయరాజాగారి దగ్గర పర్మిషన్ కూడా తీసుకున్నారు. మామూలుగా నా టీమ్ అందరినీ నేను గాజుబొమ్మల్లా చూసుకుంటాను. అయితే మా నిర్మాత నన్ను గాజుబొమ్మలా చూసుకున్నారు. సి.కల్యాణ్ నిజంగా ఇంటలిజెంట్" అని అన్నారు. సొంత కథలతో సినిమా చేయడం గురించి మాట్లాడుతూ "అప్పుడప్పుడూ బయటి కథలతో కూడా సినిమా చేస్తుండాలని రాఘవేంద్రరావుగారు అన్నారు. అది పాటించడం వల్లనే నాలోని కామెడీ యాంగిల్ బయటపడింది. ఎక్కువగా బయటి కథలు వింటుండటం వల్ల సొంతంగా కథలు చేసుకునే తీరిక ఉండటం లేదు. మన కథల మీద అనాది నుంచే ఇతర భాషా చిత్రాల ప్రభావం ఏదో ఒక రకంగా ఉంటూనే ఉంటుంది. కాకపోతే ఇప్పుడు సోషల్ మీడియా వల్ల అది మరింత ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తోంది. నేను రివ్యూలు చదవను. ఎవరు ఏం రాసినా స్పందించను. రాజకీయాల్లోకి వస్తానని ఇప్పటికే చాలా సార్లు రాశారు. నాకు అలాంటి ఉద్దేశాలు లేవు. అసలు డైరక్టర్‌ని కావాలని ఎప్పుడూ అనుకోలేదు. అలాంటిది అయ్యాను. అలాగే పాలిటిక్స్ గురించి కూడా ఎప్పుడూ ఆలోచించలేదు. ఒకవేళ విధిరాత అలా ఉంటే నేనేం చేయలేను" అని చెప్పారు. " ప్రతి చిత్రానికీ గాల్లో జీపులు ఎగరాలనుకుంటే సాధ్యం కాదు. కొత్తగా ఏదైనా చేద్దామనుకున్న ప్రతిసారీ విఫలమయ్యాను" అని ఆయన తెలిపారు.




అందులో నుంచి బయటపడటం కష్టమే!

\- రాశీ ఖన్నా

"తొలిప్రేమ అనేది అందరి జీవితాల్లోనూ ఒకే రకంగా ఉంటుంది. ఒక రకమైన ఉద్వేగం, కడుపులో సీతాకోక చిలుకలు గిలిగింతలు పెట్టిన ఫీలింగ్, ఎప్పుడూ ఊహల్లో విహరించడం.. ఇలాంటివన్నీ తొలిప్రేమకున్న లక్షణాలు. అవి ఎలా ఉంటాయో నాకు తెలుసు. అలాంటి సన్నివేశాల్లో నటించాల్సి వచ్చినప్పుడు పర్సనల్ లైఫ్ తప్పకుండా గుర్తుకొస్తుంది. ఆ ఊసుల్లోనుంచి మనసును వాస్తవంలోకి తీసుకురావడానికి కాస్త సమయం పడుతుంది. ఆ విషయం నాకు 'తొలిప్రేమ' చిత్రం షూటింగ్‌లో ఇంకోసారి బోధపడింది" అని అంటున్నారు రాశీఖన్నా. వరుణ్‌తేజ్ సరసన ఆమె హీరోయిన్‌గా నటించిన చిత్రం 'తొలిప్రేమ'. వెంకీ అట్లూరి దర్శకుడు. శనివారం విడుదల కానున్న ఈ సినిమా గురించి రాశీ ఖన్నా బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆ విశేషాలు..

"తొలిప్రేమ'లో నా పాత్ర పేరు వర్ష. నేను మూడు గెటప్పుల్లో కనిపిస్తాను. ఒకమ్మాయి, ఒకబ్బాయి జీవితంలో సాగిన ఏడేళ్ల జర్నీ ఈ చిత్రం. మూడు గెటప్పుల మధ్య వేరియేషన్ చూపించడానికి దాదాపు ఐదు కిలోల బరువు తగ్గాను. ప్రతి గెటప్ స్పెషల్‌గా ఉంటుంది. యాక్టింగ్‌కి స్కోప్ ఉన్న చిత్రమిది. ఎమోషనల్ సన్నివేశాలు చాలా ఉన్నాయి. సినిమా చూసే ప్రతి ఒక్కరికీ తమ తొలి ప్రేమ గుర్తుకొస్తుంది. నాక్కూడా నా స్కూల్‌డేస్‌లో ప్రేమ గుర్తొచ్చింది. నా సీనియర్ నాకు ప్రపోజ్ చేసిన విషయం కళ్లముందు మెదిలింది. 'తొలిప్రేమ'లో నేను కళ్లజోడు పెట్టుకున్న ఫొటోను ట్యాగ్ చేసి 'హ్యారీపోటర్ సిస్టర్' అని చాలా మంది సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు. ఈ సినిమా కోసం నేను, వరుణ్ కలిసి 15 రోజులు డైటింగ్ చేశాం. క్రాష్ డైట్ మీద నాకు ఇంట్రస్ట్ లేదు. అంతకుముందు రోజుకు గంట పాటు జిమ్ చేస్తే, ఈ సినిమా కోసం ప్రతి రోజూ రెండు గంటల్ని జిమ్‌లో గడిపాను. ఈ చిత్రంలో కారులో ఓ రొమాంటిక్ సీన్ ఉంటుంది. అదే నా ఫేవరేట్ సన్నివేశం. దర్శకుడు వెంకీ అట్లూరి చాలా ప్రేమతో ఈ స్క్రిప్ట్ చేశారు. నేను డబ్బింగ్ కూడా చెప్పుకోవాలనుకున్నా. కానీ అదే సమయంలో తమిళ సినిమాతో బిజీగా ఉండటం వల్ల కుదరలేదు" అని అన్నారు. పవన్‌కల్యాణ్ నటించిన 'తొలిప్రేమ' తనకు బాగా ఇష్టమనీ, అందులో హీరోయిన్ ఇంట్రడక్షన్ సన్నివేశం చాలా బావుంటుందనీ, తను ఇప్పటిదాకా నటించిన చిత్రాల్లో 'జిల్' ఇంట్రడక్షన్ సీన్ అంటే ఎంతో ఇష్టమనీ ఆమె తెలిపారు.

'మణికర్ణిక'కూ వివాదాల సెగ!


కంగనా రనౌత్


చారిత్రక నేపథ్యంలో సినిమాలు నిర్మించడం ఒకరకంగా కత్తి మీద సామే. చరిత్రను వక్రీకరిస్తే విమర్శలు తప్పవు, అలాగని యథాతథంగా తీస్తే డాక్యుమెంటరీ అని ప్రేక్షకులు సినిమాకు దూరమయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ రెండు విషయాలను దృష్టిలో పెట్టుకొని చిత్రం తీస్తేనే అది అన్ని వర్గాలవారి మన్ననలు పొందుతుంది. 'పద్మావత్' విషయంలో అదే జరిగింది. సినిమా చూడకుండానే అందులో ఏదేదో ఉందనీ, తమ రాణి పద్మినిని అవమానకరంగా చూపిస్తున్నారనీ రాజ్‌పుత్ర కర్ణిసేన సృష్టించిన అల్లరి అంతా ఇంతా కాదు. నిరసనల జోరు పెరగడంతో కొన్ని రాష్ట్రాలు ముందుగా జాగ్రత్త పడి, ఆ సినిమాను నిషేధించాయి. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ఎట్టకేలకు సినిమా విడుదలైంది. ఘనవిజయం సాధించింది. వసూళ్లపరంగా సరికొత్త రికార్డులు సృష్టించింది. సినిమా విడుదల ముందు ఎంతో గొడవ చేసిన కర్ణిసేన చివరకు సినిమా చూసి 'అబ్బే.. ఇందులో ఇబ్బందికర అంశాలు ఏమీ లేవు' అని చెప్పడం కొసమెరుపు. ఆ వివాదం అలా సద్దుమణిగిందో లేదో.. మరో కొత్త వివాదం మొదలైంది. ఈ సారి విమర్శకులు తమ అస్త్రాన్ని కంగనా రనౌత్ నటిస్తున్న 'మణికర్ణిక' మీద ఎక్కుపెట్టారు. తొమ్మిదో శతాబ్దానికి చెందిన రాణి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితకథ ఆధారంగా రూపుదిద్దుకొంటున్న ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు. సర్వబ్రాహ్మణ్ మహా సభ అధ్యక్షుడు సురేశ్ మిశ్రా సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి గురించి సినిమాలో అసత్యాలు చూపిస్తే సహి ంచేది లేదని యూనిట్ సభ్యుల్ని హెచ్చరించారు. ఓ విదేశీయుడు రాసిన పుస్తకం ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందనీ, ఝాన్సీ రాణి ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయనీ ఆయన ఆరోపించారు. ఝాన్సీ లక్ష్మీబాయి బ్రాహ్మణ యువతి అనీ, ఈ చిత్రంతో బ్రాహ్మణుల సెంటిమెంట్స్, ఎమోషన్స్ దెబ్బతినకూండా చూడాల్సిన బాధ్యత దర్శకనిర్మాతల మీద ఉందనీ మిశ్రా వారికి రాసిన ఉత్తరంలో వెల్లడించారు. ఓ విదేశీయుడితో ఆమెకు సంబంధం ఉందన్న వార్త కూడా సత్యదూరమనీ కూడా ఆయన వెల్లడించారు. ఈ విషయమై దర్శకనిర్మాతలు ఇంతవరకూ స్పందించలేదు. ఏప్రిల్ 27న ఈ సినిమా విడుదలవుతుందని దర్శకనిర్మాతలు మొదట ప్రకటించినా వీఎఫ్ఎక్స్ పనులు పూర్తి కానందువల్ల ఆగస్ట్ 3న విడుదల చేస్తారని తెలుస్తోంది.

అందమైన కథ కాదు



అనుష్కాశర్మ అందంగా ఉంటుంది. అందమైన ప్రేమకథా చిత్రాల్లో అందంగా నటిస్తుంది. 'ఫిల్లౌరీ'లో దెయ్యంగా నటించినా అందంగానే కనిపించింది. 'ఫిల్లౌరీ' తర్వాత అనుష్క దెయ్యంగా నటిస్తున్న చిత్రం 'పరి'. నాట్ ఏ ఫెయిరీటేల్... అనేది ఉపశీర్షిక. 'అందమైన కథ కాదు' అని అర్థం. ఈ కథలో దెయ్యం అంతకు ముందు 'ఫిల్లౌరీ'లో దెయ్యంలా కాదు. ఒక రేంజ్‌లో భయపెడుతుంది. కావాలంటే... బుధవారం విడుదలైన టీజర్ చూడండి. ముఖమంతా రక్తపు మరకలతో థియేటర్లలో భయపెట్టేలా ఉన్నారు. దానికి తోడు 'ఈ హోలీకి జాగ్రత్తగా ఉండండి. దెయ్యం వచ్చేస్తుంది' అని టీజర్‌లో ఉన్న క్యాప్షన్ సినిమాపై ఆసక్తి పెంచుతోంది. అనుష్కా శర్మ ముఖ్యతారగా నటిస్తూ, నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 2న విడుదల కానుంది.

నేడే చూడండి MASSive Hit...



సంధ్య

35 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్

11.15,2.15,6.00,9.00 (ADVANCE BOOKING NON STOP)

అర్జున్ - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
కోణార్క్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
మల్లికార్జున - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30
ప్రశాంత్ - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00

PRASADS 10.15,11.00,1.15,4.15,5.00,7.15,10.15	Cinepolis 10.30,1.30,4.30,7.30,10.30	ASIAN 10.40,1.35,4.30,7.25,10.20
PVR 10.10,1.15,4.20,5.00,7.25,10.30	Cinepolis 10.30,1.45,4.55,7.55,10.55	ASIAN RADHIKA 10.35,1.30,4.25,7.50,10.30
PVR బంజరాహిల్స్ 1.20,7.55,11.05	Cinepolis 10.35,1.40,4.50,7.55,11.00	ASIAN 11.00,2.00,6.00,9.00
PVR కూకట్‌పల్లి 10.00,10.30,1.05 4.10,4.50,7.15,7.55,10.20,11.00	TIVOLI 11.00,1.40,4.40,10.40	Cinetown మియాపూర్ 11.15,6.15
	Cine Planet 10.15,1.35,4.10,7.35,9.55	MULTIPLEX ఎల్.బి.నగర్ 11.00,1.45,7.45
PVR 10.05,1.10,4.20,7.45,10.30	11.00,1.15,4.00,7.30,10.00	ASIAN 11.00,2.30,6.15,9.15
INOX 10.00,1.00,4.00,5.05,7.05,10.10	ఎ/సి - 11.15,2.15,6.15,9.15	ASIAN 10.30,1.30,4.25,7.20,7.45,10.15
INOX 10.10,1.10,4.10,7.15,10.10	CINEPRIDE 11.00,11.15,2.15,6.00,6.15,9.15,9.45	GEETHA ASIAN 10.40,1.35,4.20,4.30,4.50,7.25,10.20
Cinemas AMEERPET 10.40,1.40,4.40,7.40,10.40	ASIAN 10.40,1.25,4.45,7.30,10.30	SVC ప్రతిమ ఎ/సి - కరీంనగర్
Cinemas SHAMEERPET శామీర్‌పేట్ 1.20,4.20,10.40	ASIAN 10.30,1.30,4.30,7.30,10.30	ఎస్2 సినిమాస్ - వరంగల్

సత్యం - అమీర్‌పేట 11.30,2.30,6.30,9.30
వైజయంతి - నాచారం 11.00,2.00,6.00,9.00
అలంకార్ ప్రతాప్ - లంగర్‌హౌజ్ 11.00,2.00,6.00,9.00
స్వప్న కాంప్లెక్స్ - కాటేదాన్ 11.00,2.15,6.00,9.00
రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.00,2.00,6.00,9.00
విమల్ - బాలానగర్ 11.15,2.15,6.15,9.15
విజేత - బోరబండ 11.00,2.00,6.00,9.00
ముక్తా ఎ2 రామకృష్ణ 35 - ఆబిడ్స్ 11.30,2.30,6.00,9.15
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.00,2.00,6.00,9.00
విష్ణు - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15
అంబ - మెహిదీపట్నం 11.30,2.30,6.30,9.30
శ్రీదేవి - ఆర్సీపురం 11.15,2.15,6.15,9.15
SVC సంగీత - ఆర్సీపురం 11.30,2.30,6.30,9.30
శ్రీరాములు - మూసాపేట 11.30,2.30,6.30,9.30
రంగ - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
శ్రీదేవి - చిలకలగూడ 11.30,2.30,6.30,9.30
BR హైటెక్ - మాదాపూర్ 11.00,2.00,6.00,9.00
సాయిరంగ - మియాపూర్ 11.00,2.00,6.00,9.00
SVC మహాలక్ష్మి - కొత్తపేట 11.00,2.00,6.00,9.00
శారద - కాప్రా 11.00,2.00,6.00,9.00

శ్రీప్రేమ - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00
రాజ్యలక్ష్మి - ఉప్పల్ 11.30,2.30,6.30,9.30
గెలాక్సీ - టోలిచౌకి 11.00,2.00,6.00,9.00
నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
సూపర్ - బాలాపూర్ 11.15,2.15,6.15,9.15
సెన్సేషన్ (సన్‌షైన్) - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00
సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.15,2.15,6.00,9.00
మెట్రో - బహదూర్‌పుర 11.30,2.30,6.00,9.00
కళ్యాణి - బోయిన్‌పల్లి 11.00,2.00,6.00,9.00
శ్రీలక్ష్మి కెఎం - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
సాయిపూజ - సూరారం 11.00,2.00,6.00,9.00
రుక్మిణి - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
యాదగిరి - సంతోష్‌నగర్ 11.30,2.30,6.30,9.30
జ్యోతి - ఐడిఏ బొల్లారం 11.00,2.00,6.00,9.00
శివరంజని - ఇస్నాపూర్ 11.00,2.00,6.00,9.00
జగదాంబ - ఘట్‌కేసర్ 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ - ఆలియాబాద్ 11.00,2.00,6.00,9.00
సెలెక్ట్ - మచ్చబొల్లారం 12.00,3.00,7.00,10.00
వెంకటసాయి - కీసర 11.00,2.00,6.00,9.00
మహేశ్వరి - మహేశ్వరం 11.00,2.00,6.00,9.00

వరంగల్
జెమిని కాంప్లెక్స్ - వరంగల్
వెంకట్రామ - వరంగల్
ఏషియన్ విజయ - హన్మకొండ
భవాని ఎ/సి - ఖాజీపేట్
అరవింద్ కళామందిర్ - నర్సంపేట
శ్రీనివాస - మహబూబాబాద్
ఆనంద్ - భూపాలపల్లి
కాకతీయ ఎ/సి - పరకాల
స్వర్ణ కళామందిర్ - జనగాం
రామకృష్ణ ఎ/సి - తొర్రూర్
శాంతి 70 ఎ/సి - మరిపెడ
తిరుమల ఎ/సి - ములుగు
అన్నపూర్ణ - చేల్పూర్
మోహన్ ఎ/సి - కేసముద్రం
సూర్య కెఎం - నెక్కొండ
బాలాజి - చేర్యాల
లక్ష్మి 70 - డోర్నకల్
తిరుమల - పాలకుర్తి
నారాయణ - హసన్‌పర్తి
లక్ష్మీశ్రీనివాస - లింగాలఘన్‌పూర్

ఖమ్మం
శ్రీనివాస 70 - ఖమ్మం
పరమేశ్వరి - కొత్తగూడెం
శాంతి 70 - పాల్వంచ
విజయ్‌భాస్కర్ - భద్రాచలం
బాలాజీ ఎ/సి - సత్తుపల్లి
సీతారామ - ఇల్లందు
వెంకటదుర్గ - అశ్వరావుపేట
లక్ష్మీశ్రీనివాస - మధిర
సత్యభాస్కర్ - మణుగూరు
వాసవి 70 ఎ/సి - వైర
నర్సింహ ఎ/సి - ఏన్కూర్
రఘు పిక్చర్‌ప్యాలెస్ - చర్ల

బాలాజి ఎ/సి - దమ్మపేట
శివం 70 ఎ/సి - సారపాక
సాయిబాలాజి - నేలకొండపల్లి
జగదాంబ - వెంకటాపురం

కరీంనగర్
శివ 70 ఎ/సి - కరీంనగర్
వెంకటేశ్వర - కరీంనగర్
దుర్గ ఎ/సి - జగిత్యాల
ఊర్వశి ఎ/సి - గోదావరిఖని
నటరాజ్ ఎ/సి - సిరిసిల్ల
సాయికృష్ణ - మెట్‌పల్లి
అన్నపూర్ణ - జమ్మికుంట
శ్రీనివాస ఎ/సి - పెద్దపల్లి
శివరామకృష్ణ - వేములవాడ
కిన్నెర 70 ఎ/సి - కోరుట్ల
నటరాజ్ - హుజూరాబాద్
మహేశ్వరి - రాయ్‌కల్
వెంకటేశ్వర - హుస్నాబాద్
అన్నపూర్ణ - ముల్కనూరు
శ్రీనివాస - చొప్పదండి
సారథి కళామందిర్ - కమలాపూర్

నిజామాబాద్
నటరాజ్ - నిజామాబాద్
ప్రియా 70 - కామారెడ్డి
లక్ష్మి 70 ఎంఎం - ఎల్లారెడ్డి
వెంకటేశ్వర ఎ/సి - పిట్లం
వెంకటేశ్వర ఎ/సి - దర్పల్లి
క్రిష్ణ 70 - నందిపేట్
పరమేశ్వర - బిచ్‌కుంద
వెంకటేశ్వర - కమాన్‌పూర్
రాంప్రతాప్ - నాగిరెడ్డిపేట
బృందావన్ - ఆర్మూర్
శ్రీనివాస - భీంగల్

బృందవన్ - ఆర్మూర్
వెంకటేశ్వర - బోధన్
శ్రీనివాస - భీంగల్
వెంకటేశ్వర - బాన్సువాడ

మహబూబ్‌నగర్
వెంకటేశ్వర - మహబూబ్‌నగర్
సాయిరాజా - షాద్‌నగర్
శ్రీనివాస ఎ/సి - వనపర్తి
సత్యలక్ష్మి ఎ/సి - అచ్చంపేట
మనోహర్ - నారాయణపేట
శ్రీదేవి ఎ/సి - కొత్తకోట
వెంకటరమణ - జడ్చర్ల
వెంకటేశ్వర - ఆమన్‌గల్
సత్యసాయి - కొల్లాపూర్
పార్థసారధి - కల్వకుర్తి
లక్ష్మి 70 ఎ/సి - కోస్గి
వెంకటేశ్వర - పెబ్బేరు
హైటెక్ ఎ/సి - ఆత్మకూర్
రాఘవేంద్ర - దేవరకద్ర
శ్రీనివాస - కడ్తాల్
సన్ సినిమా - రాయన్‌కమలాపూర్
సత్యనారాయణ - మద్దూర్
శ్రీరమణ - నాగర్‌కర్నూల్
వెంకటరమణ - మక్తాల్
శ్రీ మధవ్ ఎ/సి - ఐజ
వెంకటేశ్వర - గద్వాల్

నల్గొండ
తిరుమల ఎ/సి - నల్గొండ
రాఘవ ఎ/సి - మిర్యాలగూడ
శ్రీనివాస ఎ/సి - కోదాడ
కెజేఆర్ - భువనగిరి
నవ్య 70 ఎ/సి - సూర్యాపేట
మనోజ్ - దేవరకొండ

రామకృష్ణ ఎ/సి - నకిరేకల్
సాయిబాబా - హుజూర్‌నగర్
అంజిరెడ్డి ఎ/సి - చౌటుప్పల్
అచ్చిరెడ్డి - హాలియా
సుజన ఎ/సి - చిట్యాల
వెంకటేశ్వర - తిరుమలగిరి
లక్ష్మి 70 - యాదగిరిగుట్ట
లక్ష్మి 70 ఎంఎం - మాల్
వెంకటరమణ - నేరేడుచర్ల
వెంకటేశ్వర - వలిగొండ
సత్యనారాయణ - చండూర్
దుర్గ కెఎం - బోనకల్
ఆనంద్ రాయల్ - దిండి
సాయిరాం - పోచంపల్లి
తారా ఎ/సి - మోత్కూర్

ఆదిలాబాద్
నటరాజ్ 70 - ఆదిలాబాద్
వెంకటేశ్వర - మంచిర్యాల
రామకృష్ణ 70 - బెల్లంపల్లి
తిరుమల ఎ/సి - నిర్మల్
కమల 70 ఎ/సి - భైంసా
వెంకటరమణ - సిరిపూర్‌కాఘజ్‌నగర్
తిరుమల కాంప్లెక్స్ - సిసిసి శ్రీరామ్‌పూర్
లక్ష్మి 70 - ఖానాపూర్

మెదక్
సాగర్ డీలక్స్ ఎ/సి - మెదక్
మోహన్ - జహీరాబాద్
వెంకటేశ్వర 70 - సిద్దిపేట
సితారా ఎ/సి - సంగారెడ్డి
శ్రీనివాస 70 - నర్సాపూర్

మహేశ్వరి - సదాశివపేట
యాదగిరి ఎ/సి - గజ్వేల్
వెంకటేశ్వర - నారాయణఖేడ్
వెంకటేశ్వర - జోగిపేట్
సంతోష్ - రామాయంపేట్
శ్రీనివాస ఎ/సి - దుబ్బాక
వెంకటేశ్వర - తూప్రాన్
పావని 70 - వెల్దుర్తి
లక్ష్మి - శంకరంపేట

రంగారెడ్డి
శైలజ - వికారాబాద్
శంతమహల్ - తాండూరు
సాయికృష్ణ ఎ/సి - పరిగి
సాయిబాబా - శంకర్‌పల్లి
మణికంఠ - చేవెళ్ల

రాయచూర్
చంద్రహాస్ - గంగావతి
ఎస్ఎన్‌టి - రాయచూర్
మాన్వి 70 - అపర్ణ
సింధనూర్ - కుడల్‌సంగం
లక్ష్మి 70 ఎ/సి - కర్టగి
భారత్ 70 - దేవ్‌దుర్గ
మంజునాథ - హంచినాల్‌క్యాంప్
లక్ష్మి 70 ఎ/సి - కొప్పల్
మారుతి 70 - కుస్టిగి
హిమాయల - కుకునూర్
ఎస్ఏ 70 - పొట్నాల్
సవిత - దేశాయ్‌క్యాంప్
శివమాత - సిర్‌వార్
విజయ 70 - మస్కి
రాధిక 70 - కనకగిరి

GLOBAL CINEMAS RELEASE

ఈ నెల 10న బ్రహ్మాండమైన విడుదల



దేవి

70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్

Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System

SVC మహాలక్ష్మి కాంప్లెక్స్ ఎ/సి - కొత్తపేట
SVC ఈశ్వర్ 70 ఎంఎం ఎ/సి - అత్తాపూర్
SVC సంగీత 70 ఎ/సి - ఆర్.సి.పురం
శ్రీలక్ష్మి 70 ఎంఎం ఎ/సి - కర్మన్‌ఘాట్

PRASADS మల్టీప్లెక్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్	Cinepolis మంజీరా మాల్ - కూకట్‌పల్లి	ASIAN ఎంక్యూబ్ ఎ/సి - అత్తాపూర్
PVR ఇన్ ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	Cinepolis CCPL ఎ/సి - మల్కాజ్‌గిరి	ASIAN RADHIKA రాధిక ఎ/సి - కాప్రా
PVR ఆర్.కె. కాంప్లెక్స్ - బంజారాహిల్స్	Cinepolis మంత్రామాల్ - అత్తాపూర్	ASIAN శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
PVR సెంట్రల్ మాల్ - పంజాగుట్ట	TIVOLI కాంప్లెక్స్ ఎ/సి - సికింద్రాబాద్	Cinetown సినీటౌన్ ఎ/సి - మియాపూర్
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	Cine Planet మల్టీప్లెక్స్ ఎ/సి - కొంపల్లి	MULTIPLEX విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
INOX జి.వి.కె. మాల్ - బంజారాహిల్స్	మీరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్	ASIAN షా షహెన్‌షా ఎ/సి చింతల్
INOX ఎం.పి మాల్ - కాచిగూడ	ఎ/సి - ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్	ASIAN శ్రీదేవిమాల్ - హన్మకొండ
Cinemas AMEERPET బిగ్‌సినిమాస్ - అమీర్‌పేట్	ASIAN సినీస్క్వేర్ ఎ/సి - ఉప్పల్	GEETHA ASIAN ఉషాప్రసాద్ - నిజామాబాద్
Cinemas SHAMEERPET లియోనియో - శామీర్‌పేట్	CINEPRIDE లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట్	ఎస్2 సినిమాస్ - వరంగల్
	ASIAN జిపిఆర్ ఎ/సి - కూకట్‌పల్లి	

మల్లికార్జున 70 ఎ/సి - కూకట్‌పల్లి
మంజు 70 ఎంఎం ఎ/సి - సికింద్రాబాద్
శ్రీరాములు 70 ఎ/సి - మూసాపేట్
శ్రీసాయి రామ్ ఎ/సి - మల్కాజ్‌గిరి
SVR శివశక్తి 70 ఎ/సి - కాప్రా
గోకుల్ 70 ఎంఎం ఎ/సి - ఎర్రగడ్డ
శ్రీనివాస 70 ఎ/సి - ఉప్పల్
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట
సాయిరంగ 70 - మియాపూర్

స్వప్న కాంప్లెక్స్ ఎ/సి - కాటేదాన్
యాదగిరి 70 - సంతోష్‌నగర్
సెన్సేషన్ ఇన్సోమ్నియా - ఖైరతాబాద్
నర్తకి 70 ఎంఎం ఎ/సి - అల్వాల్
గెలాక్సీ 70 ఎంఎం ఎ/సి - టోలిచౌకి
BR హైటెక్ 70 ఎ/సి - మాదాపూర్
కళ్యాణి మూవీమ్యాక్స్ ఎ/సి - బోయిన్‌పల్లి
SV సినీస్క్వేర్ 70 ఎ/సి - పటాన్‌చెరు
శ్రీప్రేమ 70 ఎంఎం ఎ/సి - తుక్కుగూడ

కృష్ణ సినిమా 70 ఎ/సి - నాగారం
సంతోష్ 70 ఎ/సి - ఇబ్రహీంపట్నం
భుజంగ 70 ఎంఎం ఎ/సి - జీడిమెట్ల
సుష్మ 70 ఎంఎం ఎ/సి - వనస్థలిపురం
వైజయంతి 70 ఎ/సి - నాచారం
జగదాంబ 70 ఎ/సి - ఘట్‌కేసర్
జ్యోతి 70 ఎ/సి - ఐ.డి.ఎ బొల్లారం
గణేష్ 70 ఎంఎం ఎ/సి - శంషాబాద్
వెంకటేశ్వర 70 ఎ/సి - మేడ్చల్

SVC ప్రతిమ 70 ఎంఎం ఎ/సి - కరీంనగర్
SVC దేవి 70 ఎంఎం ఎ/సి - జనగాం
SVC రామకృష్ణ 70 ఎంఎం ఎ/సి - షాద్‌నగర్
SVC నటరాజ్ 70 ఎంఎం ఎ/సి - నల్గొండ

వరంగల్
రాధిక 70 ఎ/సి - వరంగల్
అమృత ఎ/సి - హన్మకొండ
లక్ష్మి - మహబూబాబాద్
భవాని ఎ/సి - ఖాజీపేట్
జయశ్రీ ఎ/సి - నర్సంపేట
ఊర్వశి ఎ/సి - భూపాలపల్లి
జయా డీలక్స్ - పరకాల
వెంకటేశ్వర - తొర్రూర్
లక్ష్మి ఎ/సి - మరిపెడ
సన్ సినిమా - కమలాపురం

ఖమ్మం
వినోద 70 - ఖమ్మం
దుర్గ 70 - కొత్తగూడెం
ఉదయభాస్కర్ - భద్రాచలం
సాయి బాలాజీ - సత్తుపల్లి
వెంకటేశ్వర - పాల్వంచ
సీతారామ - మణుగూరు
కళాంజలి ఎ/సి - ఇల్లందు
శాంతి - మధిర
సాయిసుమన్ - అశ్వరావుపేట

కరీంనగర్
తిరందాజ్ - కరీంనగర్
న్యూఅశోక - గోదావరిఖని
బాలాజీ ఎ/సి - జగిత్యాల
విమల్ 70 ఎ/సి - సిరిసిల్ల
సంగీత 70 ఎ/సి - పెద్దపల్లి
లక్ష్మి 70 ఎ/సి - మెట్‌పల్లి
లక్ష్మి 70 ఎ/సి - కోరుట్ల
అన్నపూర్ణ - హుజూరాబాద్
మురళీ డీలక్స్ - జమ్మికుంట
శ్రీ రాజరాజేశ్వరి - వేములవాడ

నిజామాబాద్
విజయ - నిజామాబాద్
ప్రియా 35 - కామారెడ్డి
వెంకటేశ్వర ఎ/సి - బోధన్
మహేశ్వరి - బాన్సువాడ
వెంకటేశ్వర ఎ/సి - ఆర్మూర్
సుదర్శన్ ఎ/సి - భీమ్‌గల్

మహబూబ్‌నగర్
తిరుమల కాంప్లెక్స్ - మహబూబ్‌నగర్
శ్రీనివాస ఎ/సి - వనపర్తి
శ్రీనివాస ఎ/సి - గద్వాల్
బాబా 70 - నారాయణపేట
శ్రీనివాస 70 ఎంఎం - జడ్చర్ల
శ్రీసాయిరాం - అచ్చంపేట
రవి ఎ/సి - నాగర్‌కర్నూలు
నేషనల్ ఎ/సి - కల్వకుర్తి
శివసాయి 70 - ఐజ
వెంకటేశ్వర - కొల్లాపూర్
పరమేశ్వరి - కొత్తకోట


నల్గొండ
వెంకటేశ్వర - మిర్యాలగూడ
కిషోర్ ఎ/సి - సూర్యాపేట
రంగ ఎ/సి - కోదాడ
వసుంధర - భువనగిరి
వెంకటేశ్వర ఎ/సి - నకిరేకల్
శ్రీనివాస - హుజూర్‌నగర్
వెంకటేశ్వర - దేవరకొండ
శ్రీనివాస ఎ/సి - చౌటుప్పల్
మల్లీశ్వరి - తిరుమలగిరి

ఆదిలాబాద్
మహేశ్వరి - ఆదిలాబాద్
శ్రీనివాస ఎ/సి - మంచిర్యాల
నారాయణ 70 - నిర్మల్
బాలాజీ 70 - బెల్లంపల్లి
వెంకటరమణ - కాగజ్‌నగర్
లక్ష్మి 70 ఎంఎం - ఖానాపూర్
తిరుమల - సిసిసి శ్రీరామ్‌పూర్

మెదక్
సినీమాక్స్ 70 ఎ/సి - మెదక్
సీతారామ - సిద్దిపేట
రుక్మిణి ఎ/సి - సంగారెడ్డి
జ్యోతి ఎ/సి - సదాశివపేట
మహేశ్వరి - జహీరాబాద్
సంతోష్ 70 ఎ/సి - గజ్వేల్
సాయిరామ్ - రామాయంపేట
సాయి డీలక్స్ - నర్సాపూర్
సువర్ణ 70 - నారాయణఖేడ్

రంగారెడ్డి
సినీమాక్స్ - వికారాబాద్
చంద్ర ఎ/సి - తాండూర్
భవాని 70 ఎ/సి - పరిగి
లక్ష్మి 70 ఎ/సి - శంకర్‌పల్లి
వెంకటేశ్వర 70 - చేవెళ్ల

రాయచూర్
పద్మనాభ - రాయచూర్
కనకదుర్గ - గంగావతి
కూడలిసంఘమేశ్వర - సింధనూర్
అపర్ణ ఎ/సి - మాన్వి



సెకండ్ కిక్... డెవిల్ ఈజ్ బ్యాక్!

బీటౌన్ భాయ్ సల్మాన్ ప్రేక్షకులకు సెకండ్ కిక్ ఇవ్వడానికి రెడీ అవుతున్నారు. తెలుగులో రవితేజ నటించిన 'కిక్'ను అదే పేరుతో హిందీలో రీమేక్ చేశారీ హీరో. ఆ సినిమాతో నిర్మాత సాజిద్ నడియావాలా దర్శకుడిగా పరిచయమయ్యారు. అంతే కాదు... దర్శకుడిగా పరిచయమైన సినిమాతో 200కోట్ల క్లబ్‌లో చేరిన వ్యక్తిగా అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. 2014లో హిందీ 'కిక్' విడుదలైంది. మూడేళ్ల తర్వాత దర్శక, నిర్మాత సాజిద్ సీక్వెల్ 'కిక్-2' ప్రకటించారు. 'కిక్'లో దేవీలాల్ సింగ్ అలియాస్ డెవిల్‌గా కనిపించారు సల్మాన్‌ఖాన్. సెకండ్ కిక్‌లోనూ డెవిల్‌గా సందడి చేయనున్నారు. త్వరలో చిత్రీకరణ ప్రారంభించనున్నారు. 2019 కిస్మస్ సందర్భంగా చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు చిత్రీకరణ ప్రారంభానికి ముందే ప్రకటించారు.